# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 34** **సంచిక 2**

**ఫిబ్రవరి - 2023**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI
Since 1946

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

**Hyderabad - 500 020.**

Ph: 040 - 27612436, 27645538.

Editor: **Ph: 949 121 6363**

(11.00 am to 4.00 pm)

**<u>చందా వివరాలు:</u>**

₹ 600/- (సంవత్సర చందా),

₹ 1200/- (రెండు సంవత్సరాలకు),

₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : వి. ఆశారాణి

సెల్: **994 951 6567**

040 - 27645536

**Scan QR to Pay**

**Misimi Publication**

LIBRARY OF CONGRESS

**LCCN 91-903060**

**UGC Care**

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

**ISSN 2454-4329**

**misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## ఫిబ్రవరి నెల సూచికలు...


వేదిక - గువ్వలచెన్న శతకం అల్లసానిదా? : గార రంగనాథం... 5

సత్యానికి సాక్షి - సారనాథ్ : కిల్లాడ సత్యనారాయణ... 7

అనర్ఘ రత్నాలు : ఆచార్య పప్పు వేణుగోపాల రావు... 17

చారిత్రక నవల : డా. రమేష్‌ప్రసాద్ రావెల్ల... 19

విద్య యొక్క లక్ష్యం : ఆచార్య కోదాటి వియ్యన్నరావు... 26

స్వాతంత్రోద్యమం : నాటకాలు : దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు... 30

సూడాన్ : డా. నిమ్మగడ్డ శేషగిరిరావు... 35

మండలి బుద్ధప్రసాద్‌తో మాటామంతీ : అశ్వినీకుమార్... 43

చిత్రగీతాలు: జావళీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 54

వీధి చిత్రకారుడు - బాంక్సీ : టి.వి. ప్రసాద్... 59

కబీర్ దాస్ - 10 : ప్రొ. లక్ష్మీ అయ్యర్... 63

మూఢనమ్మకాలను వీడండి : మామిడిపూడి కృష్ణమూర్తి... 68

నవంబర్ 2022 ***మిసిమి*** : కోడూరు పుల్లారెడ్డి... 72

చదవండి... : ***మిసిమి*** ... 80




సారనాథ్ స్థూపం



అల్లసాని పెద్దన





గర్ల్ విత్ ఎ బెలూన్

### అట్టమీది బొమ్మలు



**ప్రకృతి ఫలాలు**

*చిత్రకారుడు: Georgius Jacobus Johannes van Os 1782-1861*



**గడ్డిపూలు**

*చిత్రకారుడు: Gregory Frank Harris*



**పూలదొడ్డి**

*చిత్రకారుడు: Arthur Drummond*



**ప్రతిబింబాలు**

*చిత్రకారుడు: Willem Kalf*

# గువ్వలచెన్న శతకం అల్లసానిదా?

***మిసిమి*** సారస్వత మాసపత్రిక సంపాదకులకు నమస్కారాలు.

ఆర్యా!

ఆచార్య పప్పు వేణుగోపాలరావుగారి వ్యాసంలో నాకు తోచిన తేడాలను ఇందులో రాసి పంపిస్తున్నాను. దయతో పరిశీలించగలరు.

ఈ 2023 జనవరి నెల ***మిసిమి*** లో ఆచార్య పప్పు వేణుగోపాలరావు గారి 'అనర్ఘ రత్నాలు' అనే వ్యాసం చదివాను. అందులో 'గుడికూలును నుయి పూడును' అనే పద్యం చాటువుగా అల్లసాని పెద్దన చెప్పాడని రాశారు. అయితే అది 'గువ్వలచెన్న' శతకంలోనిదని నేటి సాహిత్యవేత్తల నుండి చాలమంది సామాన్యులు కూడా నమ్ముతున్న నిజం. ఇదే విషయాన్ని గువ్వలచెన్నడు అనే వ్యక్తిగాని, గువ్వలచెన్నడిని సంబోధిస్తూ మరొక కవిగాని ఆంగ్లేయులు అధికారంలోకి వచ్చిన రోజుల్లో రాసి ఉంటారని, 113 పద్యాల ఆ శతకాన్ని 1928లో ముద్రించిన వావిళ్ళవారు తమ ముందు మాటలో అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఇక అల్లసాని గూర్చి రాసిన సందర్భంలో సమగ్ర ఆంధ్రసాహిత్యంలో ఆరుద్రగాని, కవి జీవితములలో గురజాడ శ్రీరామమూర్తిగాని. ఆంధ్రకవుల చరిత్రములో వీరేశలింగం పంతులుగాని ఈపద్యాన్ని పేర్కొనలేదు. ఈ కథనూ ఉటంకించలేదు. అంటే వారి దృష్టిలో ఈ పద్యంగాని, ఈ కథగాని పెద్దనది కాదనేకదా!

అయితే గువ్వలచెన్నుడి కొఱకు అల్లసాని పెద్దన ఈ పద్యంతోపాటే అయిదు కందపద్యాలు రాసినట్టు 1700 ప్రాంతంవరకూ చెప్పుకుంటున్నారని, ఇదే విషయం చాటుపద్య మణిమంజరిలో ఉందని బ్రౌనుదొర గారి పండితులు అభిప్రాయపడినట్టు ఆరుద్ర రాస్తూ, 'ఈ పద్యాలను ప్రకటించిన వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఎందు చేతనో మరి ఈ వివరణను ప్రచురించలేదు' అని కూడా రాశారు. అంతిమంగా ఈ పద్యాన్ని 1600 ప్రాంతంలో పట్టాభిరామ కవి రాశాడని చెప్పారు. - స.ఆ.సా ఆరవ సంపుటం 316,317,318 పుటలు. ఈ ఐదుపద్యాలూ అల్లసానివిగ ప్రచారంలో ఉన్నాయన్న బ్రౌను పండితుల అభిప్రాయం తరువాత అవి చాటుపద్యాలుగా గుర్తింపును తొలగించుకొని, గువ్వలచెన్న శతకపద్యాలుగానే ప్రసిద్ధి పొందాయి. ఇవి గువ్వల చెన్న శతక పద్యాలని స్పష్టపడుతున్న నేటి రోజుల్లో ఆచార్యులవారు అల్లసాని కథను ఎందుకు ఎత్తుకున్నారు? చరిత్ర వక్రీకరణకు గురైంది కదా!

అలాగే ఈవ్యాసంలో వేణుగోపాలరావుగారు సంస్కృతాంధ్రభాషలను బేరీజువేస్తూ, సంస్కృత భాగవతం కంటే పోతన తెలుగు భాగవతం తనకు నచ్చిందన్నారు. అంతకు ముందుగానే తెలుగు చాలా మధురమైన భాష, దాని మాధుర్యాన్ని మనం ఎందుకు గుర్తించం అన్నారు. ఈ సందర్భంగా భర్తృహరి సుభాషితానికి ఏనుగు లక్ష్మణకవి అనువాదం 'విద్యచే భూషితుండై వెలయుచున్న' పద్యాన్ని ఉదాహరించారు. ఆ పద్యాన్ని తిరిగి సంస్కృతీకరించాల్సినంత గొప్పదన్నారు. "ఏనుగు లక్ష్మణ కవి ఎంత సౌందర్యంగా చెప్పాడో చూడండి. 'చారుమాణిక్య భూషిత శస్త మస్తకంబు' అన్నారు. అదీ తెలుగు సౌందర్యం" అని పప్పువారు రాశారు. ఐతే 'చారుమాణిక్య భూషిత శస్త మస్తకంబు' సంస్కృత సమాసం కదా? మరి తెలుగు సౌందర్యంగా ఎందుకు పేర్కొన్నారు? ఈ విషయం తెలియని చదువరులు గందరగోళానికి గురౌతారు కదా!

వ్యాసంలోని అచ్చుతప్పులతోపాటు ఆపద్యంలో 'శస్తమస్తకంబు గల పన్నగము' అని రాశారు. వాస్తవంగా 'శస్తమస్తకంబైన పన్నగము' అన్నది మూలం.

ఇంకొక్కమాట. శ్రీ.శ్రీ. ప్రశ్నకు ఆచార్యులవారు ఏమని సమాధానం చెప్పారో వివరిస్తే బాగుండేది. పాఠకుల అవగాహన కోసమే ఈ నాలుగు వాక్యాలు. వేణుగోపాలరావు గారిని కించపరచడానికి మాత్రం కాదు.

---

గార రంగనాథం - రాజాం (విజయనగరం జిల్లా) ఫోన్: 988 575 8123.

# బేచిరాగు

నాటి కాలంలో (1820) రైతు అధికార వర్గానికి ఒక కట్టు బానిస. రైతు నుండి వీలైనంత మొత్తం సర్కారు రఖం పేరుతో గుంజేవారు. రైతు పండించిన పంట రైతు చెల్లించవలసిన సర్కారు రఖం కంటే తక్కువైతే అతని పశువులు, వ్యవసాయ పనిముట్లు, గృహోపకరణాలు జప్తు చేయబడేవి, ఇవి కూడా సరిపడని సందర్భంలో రైతు తలపై లేదా అతణ్ణి వంగబెట్టి వీపు మీద పెద్ద బండరాయిని ఉంచేవారు.

రైతు ముక్కు, చెవులకు సూది లేదా దబ్బడంతో వెనువెంటనే కుచ్చేవారు. పశువును కట్టివేసినట్లు రైతు చేతులను, కాళ్లను కట్టివేసేవారు. తొండలను అతని పంచె/దోతీలో వదిలేవారు. కొంత గుప్త ధనం (నగదు లేదా బంగారు నగల రూపంలో) రైతు దగ్గర ఉన్నప్పటికీ పంట పండలేదన్న కారణంతో రైతు సర్కారు రఖం ఎగ్గొట్టడానికి ప్రయత్నిస్తున్నాడని అధికారులు భావించిన సందర్భంలో ఆ రైతు వేళ్లకు నూలు గుడ్డలను చుట్టి ఆముదం వంటి నూనెలతో తడిపి అగ్గి ముట్టించేవారు. ఈ అఘాయిత్యాల నుండి భూమిని కలిగి ఉన్న ఏ రైతు తప్పించుకునేవాడు కాదు.

రైతు ఇంట పెళ్లి జరిగినా, పండుగ జరిగినా, ఇల్లు కట్టినా, వాటికి సరిపడా ధనం ఎక్కడ నుండి వచ్చిందని ఆరా తీసేవారు.

రైతు మంచి బట్టలు ధరించినా, అతని భార్య మెడలో చిన్నచిన్న బంగారు నగలు ధరింపజేసినా త్వరలోనే అతనిపై మంత్రాలు చేశాడనో, దొంగతనం చేశాడనో లేదా ఇంకేదైనా నేరారోపణ చేసి దండుగ రూపంలో ఆ సంపదను పన్ను వసూలుదారులు చేజిక్కించుకునేవారు. ఇలాంటి పరిస్థితులు 1853లో ఘనత వహించిన సాలార్ జంగ్, దివాను పదవి చేపట్టడానికి ముందు కాలం వరకు గ్రామాలలో నిత్యకృత్యంగా జరిగేవి.

క్రీ.శ. 1820 నాటికి తుమ్మలసూగురు ఘనపూర్ సర్కార్, అవాంచ పరగణ పరిధిలో ఉండేది. చందూలాల్ దివాన్‌గా ఉన్న కాలంలో మన ప్రాంతంలో తాండూరు దేశ్‌ముఖ్ రామారెడ్డి 32 గ్రామాలకు అధిపతిగా ఉండేవాడు.

ఈ 32 గ్రామాలలో తుమ్మలసూగురు గ్రామం ఒకటి. తాడూరు దేశ్‌ముఖ్ రామారెడ్డి బంగారుతో చేసిన చెప్పులు తొడిగేవాడని, పూణే పట్టణము నుండి తెచ్చిన తేయాకు పొడితో టీ తాగేవాడని, ఒక మహారాజు అనుభవించే భోగాలన్నీ అనుభవించేవాడని, అత్యంత ఆధునికమైన అన్ని సౌకర్యాలున్న కోటలాంటి బంగ్లాలో 5 మంది భార్యలతో కలసి నివసించేవాడని అతని వారసులు ఒక వెబ్ పేజ్‌లో పేర్కొన్నారు.

ఈ విలాసాలన్నీ అతనికి రైతులు చెల్లించిన (పీడనపూర్వకమైన) భూమి శిస్తు వల్లనే లభించాయని మనం భావించాలి.

✧✧✧

**బేచిరాగు** *(నిర్జన గ్రామం)*

*– కందూరు లింగారెడ్డి*

*పేజీలు: 100, వెల: ₹ 100/-*

*ప్రతులకు: కందూరు లింగారెడ్డి,*

*ఫోన్: 9951 990 672.*



# సత్యానికి సాక్షి సారనాథ్

– కిల్లాడ సత్యనారాయణ



సారనాథ్

అది
ఏ ప్రేమామృతం తాగి
భూగర్భం నుండి అవతరించిందో
అది
ఏ తృష్ణను త్యజించి
ఆకాశాన్నంటే ఎత్తుకెదిగిందో
సత్యానికి సాక్షిగా
ధీటుగా నిలబడింది
కాలపు పెను తుఫాన్లు తట్టుకుంటూ
తరతరాల మేధస్సులను దాటుకుంటూ

సారనాథ్ స్థూపాన్ని చూస్తూ చూస్తూ.... నా మనసుకు తట్టిన కవిత ఇది. దాని ఆకారం నా కళ్ళలో పట్టడంలేదు. దాని ఎత్తును కొలవడానికి నా మెడ సరిపోవడంలేదు. దాని నిర్మాణ నైపుణ్యం నా చిన్న మెదడుకు అంతుపట్టడం లేదు.

కాలానికీ, జిజ్ఞాసకూ పుట్టిన బిడ్డ అది. తరుణం తారుణ్యం కలిసినప్పుడే అది సాధ్యం.

దానివైపు చూస్తూ ఆలోచనల్లోకి వెళ్ళిపోయాను. బుద్ధుడు నదులూ, పర్వతాలను దాటి అంత ఎత్తుకు ఎలా ఎదిగాడో! సాంప్రదాయపు గోడలు కూల్చి జనం మదిలో ఎలా నిలిచిపోయాడో! ఆనందమయ జీవితానికి ఇంత చక్కటి రహదారి ఎలా వేసాడో! కర్మలతో, క్రతువులతో అప్పటి సమాజం సంక్లిష్టమైపోయింది. బలులూ, బహుమతులతో అప్పటి మతం మసక బాసింది. దేవుడూ మతం సామాన్యుడికి అందని ద్రాక్షగా మిగిలిపోయాయి. మనిషికీ దేవుడికీ మధ్య నిలుచున్న మూఢాచారాలను ప్రశ్నించే వ్యక్తి కావాలి. మనిషిని ఆనందం వైపు నడిపించే శక్తి కావాలి. అది ఎవరు?

మనిషిని వెలుగువైపు నడిపించే ఆ వెలుగు ఎవరు?

అది గౌతముడు. అది మహావీరుడు. అది చార్వాకుడు. వీళ్లకు ముందు కూడా ప్రశ్నించేవాళ్ళున్నారు. వెలుగు చూపించింది మాత్రం వీళ్ళే. వీళ్లలో బుద్ధుడి బాట జనానికి బాసటగా నిలిచింది.

జ్ఞానాన్ని వెదుక్కుంటూ గౌతముడు బయల్దేరాడు. హిమాలయాల వైపు కాదు. మనుషుల మధ్యలోకి.

గౌతముడు తెలుసుకున్నాడు. వేదన నుండో, వేతన నుండో ఉదయం రాదని. పద్ధతి నుండో, ప్రక్రియల నుండో జ్ఞానం రాదని. గౌతముడు తొలగించాడు. ఆనందానికి అడ్డుగా నిలుస్తున్న ముళ్లను. గౌతముడు కనుగొన్నాడు. మనిషిని ఆనందంలో ముంచే జ్ఞానాన్ని – జ్ఞానోదయం పొందాడు. అతడు బుద్ధుడు అయ్యాడు. పుట్టినూరికి 260 మైళ్ల దూరంలో. గయలో.

ఉదయానికి జ్ఞానం అడ్డురాకుంటే జ్ఞానోదయం.

జ్ఞానోదయం పొందినవాళ్ళు హిమగిరి వైపు చూస్తారు. మరి బుద్ధుడు మనుషుల వైపు ఎందుకు చూశాడు? గయలో ఎందుకు బోధించలేదు? సారనాథ్ ఎందుకు వచ్చాడు?

జ్ఞానోదయం పొందిన ఎనిమిదో వారంలో జ్ఞానాన్ని పంచాలని నలువైపులా చూశాడు. ఎటుచూసినా కోరికలతో దహించుకుపోతున్న జనం. దుఖంలో కూరుకుపోయిన జీవితాలు. వీరికి తన బోధ అర్థమవుతుందా? బుద్ధుడు సంశయంలో పడ్డాడు.

బ్రహ్మ సహంపతి బుద్ధుణ్ని బోధించమన్నాడు.

"ఓ తథాగతా! ధమ్మాని బోధించు. కంట్లో తక్కువ ధూళి ఉన్నవాళ్ళున్నారు. ధమ్మాన్ని వినకుండా వాళ్ళ

జీవితాలు వ్యర్ధమవుతున్నాయి. వాళ్ళు ధమ్మాన్ని అర్థం చేసుకోగలరు.”

బుద్ధుడు ధ్యానశక్తితో చూశాడు. పంచవర్గీయ భిక్షువులు స్ఫురించారు. వాళ్లకు బోధించాలి. వాళ్లెక్కడ? తనను వైశాలిలో విడిచిపెట్టారు. రుషిపటానకు వెళ్ళిపోయారు. బోధగయ నుండి 250 కి.మీ. నడిచాడు. రుషి పటాన చేరుకున్నాడు. అది ఋషులు నివసిస్తున్న ప్రదేశం.

సారనాథ్‌ను సింహపురి, మృగదవ, మిగదయ, ఋషిపట్టణ, ఇసిపటన అని పిలుస్తారు. “ఇసిపటన” అనేది పాలీ సాహిత్యంలో ఉపయోగించిన పేరు. ఋషిపట్టణ అంటే పవిత్ర పురుషులు (సంస్కృతం: ఋషి>పాళీ:isi) దిగిన ప్రదేశం. 500 మంది ఋషులు లేదా ప్రత్యేక బుద్ధులు బుద్ధుడికి ముందు ఇక్కడ నివసించి, నిర్వాణం పొందారని బౌద్ధ గ్రంథం మహావస్తు ద్వారా తెలుస్తుంది.

ఏ గురువూ లేకుండా, బుద్ధత్వాన్ని స్వయంగా పొందినవాళ్లను ప్రత్యేక బుద్ధులంటారు. వీరికి బౌద్ధ సంఘంతో సంబంధం ఉండదు. ఈ ప్రత్యేక బుద్ధుల సాంప్రదాయం శ్రీలంకలో ఎక్కువ.

వారణాసికి రుషిపటాన 12 కి.మీ. దూరంలో ఉంది. ఒకచోట అయిదుగురు భిక్షువుల్ని చూశాడు. వాళ్ల దగ్గరకు వెళ్ళాడు. వాళ్ళు అన్న కొండన్న, అస్సాజి, భద్దియ, దశబాల కస్సప, మహానామ కులియ. వాళ్ళు కొంత సంశయంతోనే బుద్ధుణ్ణి స్వీకరించారు.

బుద్ధుడు ఈ అయిదుగురు భిక్షువులను కలిసిన ప్రదేశంలో ‘చౌఖండి స్థూపం’ ఉంది. ఈ అయిదుగురూ బుద్ధుడి ధమ్మాన్ని వినడానికి సంసిద్ధమైన స్థలం ఇది. దీనిని గుప్తుల కాలంలో నిర్మించారు. క్రీ.శ. 12వ శతాబ్దంలో భక్తియార్ ఖిల్జీ దీనిని కూల్చివేశాడు.

చౌఖండీ స్తూపాన్ని సీతార సోయి, లోరీ కీ కుదాన్ అని కూడా పిలుస్తారు. రామునితో సీతాదేవి అరణ్యవాసానికి వెళ్లేప్పుడు సీతాదేవి ఇక్కడ వంట చేసిందని చెబుతారు. అందుకే దీనిని సీతారసోయి అన్నారు. ఆవుల కాపరి లోరీ ఈ స్తూపం నుండి దూకి ప్రాణాలు అర్పించాడట. అప్పటి నుండి దీన్ని లోరీ కీ కుదాన్ అని పిలుస్తారు.


చౌఖండీ స్తూపం

ఈ స్తూపం గురించి ఫాహియాన్, హుయాన్ సాంగ్‌లు కూడా పేర్కొన్నారు. మూడు పైకప్పుల మీద ఈ స్థూపాన్ని నిర్మించారు. దానిపై బోర్లించిన భిక్షాపాత్రలా డోమ్ ఉందని హుయాన్ సాంగ్ పేర్కొన్నారు. ఇక్కడ గుప్తుల కాలంనాటి బుద్ధవిగ్రహం దొరికింది.

గుప్తుల కాలం సారనాథ్ శిల్పకళకు స్వర్ణ యుగం అయింది. సారనాథ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ వికసించింది. అప్పటి శిల్ప కళాఖండాలను సంగ్రహాలయంలో భద్రపరిచారు.

దీని శిథిలాలపై 84 అడుగుల అష్టభుజాకార స్తూపాన్ని అక్బర్ నిర్మించాడు. తన తండ్రి హుమాయూన్ ఒక రోజు ఇక్కడున్నందుకు గుర్తుగా దీనిని నిర్మించినట్లు ఇక్కడ శిలాశాసనం (క్రీ.శ. 1588) తెలుపుతోంది. ప్రముఖ హిందీ కవి జయశంకర్ ప్రసాద్ ‘మమత’ కథలో దీని గురించి రాశారు. ‘షేర్షా సూరి చేతిలో ఓడిపోయిన హుమాయూన్ సారనాథ్ వస్తాడు. ఇక్కడ ఒక మహిళ మొఘల్ చక్రవర్తికి తన గుడిసెలో ఒకరోజు శరణు ఇచ్చిందని’ ఆ కథలో వర్ణించాడు.

‘అక్బర్ కట్టడంవల్ల ఇటుకల దొంగలు దీన్ని నేలమట్టం చేయలేదని ‘ఓర్ టెల్? అభిప్రాయపడ్డారు. ధర్మరాజిక స్తూపాన్ని ఇటుకల కోసం పూర్తిగా నాశనం చేసారు.

మూడు ధర్మాల (హిందు, బౌద్ధ, ముస్లింలకు) పవిత్ర ప్రదేశం చౌఖండీ స్తూపం.

ఈ స్థూపానికి దగ్గరలో మంకర్దీ మందిరం ఉంది. కొత్తగా పెళ్లయిన జంటలు ఇక్కడకు ఎక్కువగా వస్తుంటారు. చౌఖండి పక్కన థాయ్ విహార ఉంది. దీనిలో 80 అడుగుల ఎత్తు బుద్ధవిగ్రహం ఉంది. దీని చుట్టుపక్కల ఉద్యానవనం ఉంది. ఈ ప్రాంగణంలో థాయ్ శైలిలో నిర్మించిన బౌద్ధ మందిరం ఉంది. అక్కడ నుండి నడిచి సారనాథ్ సంగ్రహాలయానికి వెళ్లాం. దీనిని 1905లో ఓర్ టెల్ ఒక గదిలో ప్రారంభించారు. 1910 నాటికి ఐదు గేలరీలు, రెండు పెద్ద

వరండాలతో సంగ్రహాలయం తయారయ్యింది. దీనిలో ముఖ్యమైన హాలు శాక్య సింహ. ఈ హాలులో అశోకుడి సింహ రాజధాని (లయన్ కాపిటల్), ఎర్ర ఇసుకరాయితో చేసిన పెద్ద బోధిసత్వ విగ్రహం, కుషానుల కాలంనాటి సిద్ధార్థుడి విగ్రహం ఉన్నాయి. ఈ హాలులో మూలన ఒక పెద్ద రాతి గొడుగు ఉంటుంది. ఈ హాలుకి ఎదురుగా ఉన్న గోడను ఆనుకొని ధర్మ ఉపదేశ ముద్రలో పెద్ద బుద్ధ విగ్రహం ఉంది. ఇది గుప్తుల కాలంనాటిది.

త్రిరత్న గేలరీలోకి వెళ్ళాం. శుంగుల కాలంనాటి బోధిసత్వ విగ్రహాలు, గుప్తుల కాలంనాటి బుద్ధ విగ్రహాలు, బుద్ధుడి జీవిత అంశాల్ని చిత్రిస్తూ రాతి పేనల్స్ (రిలీఫ్) ఉన్నాయి.

తర్వాత తథాగత గేలరి వచ్చింది. దీనిలో 22 బుద్ధ, బోధిసత్వ విగ్రహాలు ఉన్నాయి. ఇవన్నీ విభిన్న ముద్రలలో ఉన్నాయి.

త్రిమూర్తి గేలరీలోకి వెళ్ళాం. దీనిలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, మరీచి విగ్రహాలున్నాయి. దీనిలో కొన్ని శాసనాలు, కుండ పాత్రలు, గృహ పాత్రలున్నాయి. అలాగే అశుతోష్ గేలరీలో విష్ణువు, గణేషుడు, కార్తికేయ, అగ్ని, పార్వతి, అంధకాసుర వధ విగ్రహాలున్నాయి.

ఆ తర్వాత వస్తుమందన, శిల్పరత్న గేలరీలున్నాయి. ఇవి రెండు వరండాలలో ఉన్నాయి. వీటిలో సారనాథ్ తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు, వస్తుసామగ్రి ఉన్నాయి.

ఇవన్నీ మౌర్యులు, శుంగులు, కుషానులు, గుప్తులు, మధ్యయుగం నాటివి. శిల్పకళ చరిత్రపై అధ్యయనం చేసేవారు ఇక్కడకు తరచూ వస్తుంటారు.

ఈ సంగరాహాలయానికి ముందు రోడ్డు మీద చిన్న చిన్న సంచులు, భిన్నభిన్న బుద్ధ ప్రతిమలు అమ్ముతున్నారు.

సంగ్రహాలయానికి ముందు రోడ్డుపై చిన్న-చిన్న దుకాణాలు ఉన్నాయి. అక్కడ రకరకాల బుద్ధ ప్రతిమలు, చెక్కతో చేసిన అశోకస్తంభ నమూనాలు, సారనాథ్ సంచులు అమ్ముతున్నారు. అక్కడ వ్యాపారి నన్ను విగ్రహాలు తయారుచేస్తున్న వాళ్ల కర్మాగారానికి తీసుకెళ్ళాడు. చునార్ రాతితో బుద్ధవిగ్రహాలు చేస్తున్నారు. వారణాసికి 60 కి.మీ. దూరంలో చునార్ ఉంది.

"ఇప్పుడు మేం చేస్తున్న బుద్ధవిగ్రహాలు బుద్ధుడివి కావు. ఇవి భవిష్యత్ బుద్ధుడు మైత్రేయుడివి. ఇతడు బ్రాహ్మణ వంశస్తుడు. అందుకే మెడలో జంధ్యం కూడా ఉంటుంది. క్రీ.శ. 16వ శతాబ్ది నుండి మైత్రేయ బుద్ధుడి విగ్రహాలే ఎక్కువగా పూజింపబడుతున్నాయి - అని విభిన్న ముద్రలలో ఉన్న మైత్రేయ విగ్రహాల్ని చూపిస్తూ ఆయన నాకు వివరించారు.

సంగ్రహాలయానికి కొంచెం ముందుకు వెళ్ళగా ఒక పెద్ద గేటు. లోపలికి వెళ్లాం. కుడివైపు ఒక పెద్ద విహార కనిపించింది. అది పురాతత్త్వ తవ్వకాల్లో లభ్యమైన కిట్టో విహార.

5వ నంబరు విహారాను కిట్టోవిహారగా పిలుస్తారు. మేజర్ కిట్టో తవ్వకంలో ఇది బయటపడింది. దీనిలో భిక్షువులకు 28 గదులుండేవి. మధ్యలో బావి. అగ్నిప్రమాదానికి గురై, ఇది శిధిలమయిందని తవ్వకాల ద్వారా తెలుస్తుంది. దీన్ని కుషానుల కాలంలో నిర్మించారని వారి అభిప్రాయం.

200' ఎత్తు పైకప్పుగల విహారం ఇక్కడుండేదని సంఘ్రామ విహార శాసనంలో పేర్కొన్నట్లు హుయాన్ సాంగ్ రాస్తారు. ఈ విహార మధ్యలో బుద్ధుడి విగ్రహం ధర్మచక్రంతో ఉండేదని రాశారు.

1835లో అలగ్జాండర్ కానింగ్ హామ్, మేజర్ మర్ఖమ్ కిట్టోలు సారనాథ్‌లో చాలా తవ్వకాలు నిర్వహించారు. ఆ తర్వాత ఎఫ్. హోల్, ఈ. థామస్ లు ఈ తవ్వకాలను కొనసాగించారు. ఫలితంగా సారనాథ్ ఘనచరిత్ర వెలుగులోకి వచ్చింది.

ఈ తవ్వకాలలో ఏడు విహారాలు బయటపడ్డాయి.

క్రీ.పూ. 2వ శతాబ్దిలో ఇసిపటానలో చాలామంది బౌద్ధ భిక్షువులు నివసించినట్లు మహావంశ గ్రంథం చెబుతోంది. ఇక్కడ 30 విహారాలలో 3000 మంది భిక్షువులు ఉన్నట్లు హుయాన్ సాంగ్ రాస్తారు.

కొంచెం ముందుకు నడిచాం. వాయువ్యంలో శిధిలావస్థలో ఒక స్తూపం కనిపించింది. అది ధర్మరాజిక స్తూపం. మొదట దీన్ని అశోకుడు 49' వైశాల్యంతో నిర్మించాడు. బుద్ధుడి అవశేషాలపై అశోకుడు నిర్మించిన స్తూపాల్లో ఇది ఒకటి. ఇక్కడి ఇటుకలు, నునుపునుబట్టి దీన్ని మౌర్యకాలపు కట్టడంగా దయారాం సాహ్ని నిర్ధారించారు. ఇది క్రీ.శ. 11వ శతాబ్దంలో ఎనిమిదోసారి నిర్మించబడింది. ఇక్కడ తవ్వకాల్లో బుద్ధవిగ్రహం

దొరికింది. కాశీరాజు చేతసింగ్ దివాను బాబూ జగత్ సింగ్ ఇటుకల కోసం 1794లో ఈ స్థూపాన్ని కూలగొట్టాడు. ఇక్కడ ఇటుకలతో 'జగత్ గంజ్' కాలనీని నిర్మించాడు. అతనికి ఒక ఆకుపచ్చ చలువరాతి పెట్టెలో ముత్యాలు, రత్నాలు, బుద్ధుడి ఎముకలు దొరికినట్టు తెలుస్తోంది. వాటిని అతడు గంగానదిలో విడిచిపెట్టాడు.

వరుణ నదిపై వంతెన కోసం రెండుసార్లు సారనాథ్‌లో కట్టడాల్ని కూల్చి ఇటుకలు, కొన్ని విగ్రహాల్ని తీసుకెళ్ళి, నదిలో వేసినట్లు తెలుస్తోంది.

ఈ స్థూపానికి ఉత్తరాన ముఖ్య మందిరం ఉంది. ఈ మందిరంలో దక్షిణాన అభయ ముద్రలో ఉన్న బుద్ధవిగ్రహం (శిరస్సు లేకుండా) దొరికింది. ఈ మందిరం గుప్తుల కాలం నాటిదని తెలుస్తుంది.

తర్వాత కాలంలో ఈ మందిరానికి కొంచెం దూరంలో మరొక మందిరం ఉండేది. తవ్వకాలలో దీనిలో రెండు బుద్ధ విగ్రహాలు బయటపడ్డాయి.

ముఖ్య మందిరానికి తూర్పున సభాగారం ఉంది. ఇక్కడ ఓటివ్ స్థూపాలు చాలా దొరికాయి. ఇక్కడ ఏకశిలా పిట్టగోడ (మోనోలిథిక్ రైలింగ్) దొరికింది. "ఇది మౌర్యశిల్పకళ ఉన్నత దశకు చెందినదని, ఇది ధర్మరాజిక స్తూపం యొక్క హార్మికలో భాగమని" మజుందార్ అభిప్రాయపడ్డారు. అదే కాలానికి చెందిన రెండు అయగపట్టాలు దొరికాయి. ఒకటి త్రిరత్న చిహ్నాలతో, మరొకటి వజ్ర, స్వస్తిక గుర్తులతో ఉన్నాయి.

అశోక స్తంభాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది ఓర్ టెల్. 1904లో ముఖ్య మందిరపు పశ్చిమగోడ వద్ద ఈయన జరిపిన తవ్వకాల్లో ఇది బయటపడింది. మొత్తం 50 అడుగుల ఎత్తు. ఏకశిలా స్తంభం. చునార్ రాతితో నిర్మించారు. ఈ స్తంభంపైన 7 అ. ఎత్తుతో లయన్ కేపిటల్, 2'9' వైశాల్యంతో ధర్మచక్రం ఉన్నాయి. ఇవి చాలా నునుపుగా ఉన్నాయి. ఈ స్తంభం మీద అశోకుడి శాసనం ఉంది. సంఘ నియమాల్ని ఉల్లంఘించవద్దని అశోకుడు భిక్షువులను హెచ్చరిస్తున్నాడు. ఉల్లంఘించినవారిని తెల్లబట్టలు వేసి సంఘ నుండి బహిష్కరిస్తామని ఈ శాసనంలో పేర్కొన్నారు. ఆ సమయంలో బౌద్ధధర్మం క్షీణదశలో ఉంది. అశోక స్తంభం గురించి హుయాన్ సాంగ్ కూడా రాసారు.

ఈ శిధిలాల్లో 'కుమారదేవి విహార' కూడా బయటపడింది. దీనిని కన్నోజు రాజు గోవిందచంద్ర భార్య కుమారదేవి క్రీ.శ. 12వ శతాబ్దంలో నిర్మించారు. దీనికి తూర్పున మూడవ నంబరు విహార ఉంది. దీనికి దగ్గరలో ధర్మచక్రజీన విహార ఉంది. దీనిలో రెండు దేవతల విగ్రహాలు దొరికాయి. దీనికి పశ్చిమంగా రెండవ నంబరు విహార ఉంది.

జాన్ మార్షల్ 1907లో జరిపిన తవ్వకాల్లో నాలుగవ నంబరు విహార బయటపడింది. దీనిలో శివుడి విగ్రహం కూడా దొరికింది. క్రీ.శ. 12వ శతాబ్దినాటి ఈ విగ్రహం ఇప్పుడు సంగ్రహాలయంలో ఉంది.

ధమేక స్తూపాకు దగ్గరలో మేజర్ కిట్టో జరిపిన తవ్వకాల్లో 6వ నంబరు విహార బయటపడింది.

పురాతత్త్వ పరిశోధనల ఫలితంగా ఏడు విహారాలు, ధర్మరాజిక స్తూపం, ధమేకస్తూపం, అశోక స్తంభం, ముఖ్య మందిరం, చంకమ పంచాయతన మందిరం, ఏకశిలా పిట్టగోడలు, వోటివ్ స్తూపాలు, చాలా విగ్రహాలు, శాసనాలు, పురాతన వస్తువులు వెలుగులోకి వచ్చాయి. ఇవన్నీ క్రీ.పూ. 3వ శతాబ్ది నుండి క్రీ.శ. 12వ శతాబ్ది మధ్యకాలంనాటివి.

ధమేక స్తూపాకు చుట్టూ పచ్చని మైదానం. పచ్చని తివాచీ పరచినట్టుంది. ఆ మైదానంలో ఎత్తైన సింహాసనం మీద కూర్చున్న మహారాజులా ఒక పెద్ద స్తూపం. దాని ఆకారం నవ్వుతూన్న బుద్ధుడి (లాఫింగ్ బుద్ధ) విగ్రహంలా ఉంది.

సారనాథ్‌లో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ధమేకస్తూపం అదే. ధమేక పదం సంస్కృతంలోని 'ధర్మేక్ష' నుండి వచ్చింది. అంటే ధర్మం పట్ల ఆసక్తి. ఇక్కడే బుద్ధుడు తన అయిదుగురు శిష్యులకు మొదటి ఉపదేశాన్ని ఇచ్చినట్లు తెలుస్తోంది. అలగ్జాండర్ కనింగ్ హామ్ ఇక్కడ తవ్వకాలు చేశారు.

ఈ స్థూపం భూమి నుండి 128' ఎత్తు. అడ్డుకొలత 93'. పైభాగం ఇటుకలతో నిర్మించారు. కింది భాగంలో పద్మాలతో నగిషీ చెక్కారు. కొన్ని పక్షులు, జంతువులను కూడా దీనిపై చెక్కారు. వీటిని గుప్తుల కాలంలో చేసి ఉండొచ్చని ముజుందార్ అభిప్రాయపడ్డారు. పద్మాసనంలో కూర్చున్న మూడు బుద్ధ విగ్రహాలు ఇక్కడ దొరికాయి.

ఇవి ధర్మచక్రప్రవర్తన సందేశాన్ని సూచిస్తున్నాయి. దీని తొలి నిర్మాణం అశోకుడి కాలంలో జరిగినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఆ తర్వాత కాలాల్లో దీని విస్తీర్ణం, ఎత్తు పెరిగాయని అభిప్రాయపడ్డారు.

బుద్ధుడు తన మొదటి ఉపదేశాన్ని ఐదుగురు భిక్షువులకు అందించిన ప్రదేశం అది. వారికి బుద్ధుడు ఇలా బోధించాడు.

"ఇల్లు విడిచి వచ్చిన భిక్షువులు ఆ రెండు విపరీత ధోరణుల్ని అనుసరించకూడదు.'' (''ద్వేవమే, భిక్కవే, అంత పబ్బజితేన న సేవితబ్బ"). అని బోధించాడు బుద్ధుడు. ఏ రెండు విపరీత ధోరణులు?


వజ్రాయన ఇన్‌స్టిట్యూట్‌లో రచయిత

ఒకవైపు ఇంద్రియ సుఖాల నుండి లభిస్తున్న సంతోష ధోరణి. రెండోవైపు శరీరేంద్రియాలను చిత్ర హింసలకు గురిచేసే మోక్ష ధోరణి. ఈ రెండింటికీ మధ్య సత్యం ఉంది. అదే బుద్ధుడు చెప్పిన 'మధ్య మార్గం.'

బుద్ధుడు నాలుగు పరమ సత్యాలు బోధించాడు. నాలుగవదైన దుఃఖ విమోచనా మార్గం అష్టాంగ మార్గం. ఆరంభ కాలపు బౌద్ధ గ్రంథాలలో (నాలుగు నికాయలలో) అష్టాంగ మార్గం సామాన్యులకు బోధించేవారు కారు.

అష్టాంగ మార్గం మూడు భాగాలుగా విభజింపబడింది. శీలము (భౌతికమైన చర్యలు), సమాధి (మనస్సును లగ్నం చేయుట, ధ్యానము), ప్రజ్ఞ (అన్నింటినీ తాత్విక దృష్టితో పరిశీలించడం).

✧ మాటల ద్వారా, చేతల ద్వారా కీడు చేయకుండా జీవించడం శీలం.
✧ మనసును అదుపులో ఉంచుకొని, స్వచ్ఛమైన మనసుతో విషయాలను చూస్తూ, రాగద్వేషాలకు అతీతంగా సత్యాన్వేషణ చేయడం సమాధి.
✧ ఉన్నది ఉన్నట్లుగా చూస్తూ, సరైన సంకల్పాన్ని కలిగి ఉండడం ప్రజ్ఞ.

పంచుకునేందుకు అర్హులు కావాలి. జీవితానికైనా, జ్ఞానానికైనా. లేకుంటే, జీవితం నరకమవుతుంది. జ్ఞానం నవ్వుల పాలవుతుంది. బుద్ధుడు కూడా అర్హులను వెదుక్కున్నాడు. కొండన్న భిక్షువులు అతని జ్ఞానాన్ని గ్రహించారు. అర్హంతలయ్యారు. ఈ శిష్యులతో సంఘం ఏర్పడింది.

బుద్ధుడు జింకల వనం (మిగదాయ)లో తొలి ఉపదేశం చేశాడు. ఆ ఉపదేశం 'ధర్మ చక్ర ప్రవర్తన సూత్రం'. ఆ ప్రదేశంలో ఇప్పుడు 'ధమేక స్థూపం' ఉంది.

తరువాత బెనారస్ వ్యాపారి యశకు, అతని స్నేహితులకూ బోధించాడు. అలా సారనాథ్‌లో అరవైమంది శిష్యులతో బౌద్ధసంఘం వృద్ధి చెందింది. ఈ సంఘాన్ని ఉద్దేశించి బుద్ధుడు ఇలా అంటాడు.

"నేను మానవ, దైవ బంధనాలు నుండి పూర్తిగా ముక్తి పొందాను. మీరు కూడా ముక్తి పొందారు. మీరు ప్రపంచం నలుమూలలా తిరగండి. దాన్ని కరుణతో నింపండి."

బుద్ధుడు సారనాథ్‌లో ఐదు వర్ష ఋతువులు ఉన్నట్లు వినయ పీటక చెబుతోంది. ఈ వ్యవధిలో పంచ సుత్త, రధాకర సుత్త, పాస సుత్త, సమయ సుత్త, కటువీయ సుత్త బోధించాడు. బుద్ధుడున్న ఈ స్థలం పేరు మూలగంధ కుటి విహార.

సారవంతమైన నేలలో పడితేనే విత్తు మొలకెత్తుతుంది. అర్థం చేసుకునే జనం దొరికితేనే జ్ఞానం పరిమళిస్తుంది.

ధమేక స్థూపానికి దగ్గరలో సింహపురిలో జైన మందిరం ఉంది. 11వ తీర్థంకరుడు శ్రేయాన్సనాథుడి జన్మస్థలం ఇది. ఈయన జీవితంలోని అయిదు పవిత్ర సంఘటనల్లో నాలుగు ఇక్కడే జరిగాయి. ఈయన బుద్ధుడికి చాలా ముందు తరంవాడు. ప్రస్తుతం ఉన్న ఈ మందిరాన్ని క్రీ.శ. 19వ శతాబ్దిలో నిర్మించినట్లు తెలుస్తోంది.

జైన మందిరానికి ఎదురుగా టంకా ఆర్ట్ గేలరీ ఉంది. అక్కడకు వెళ్ళాను. దీని యజమాని పశుపతి కలిశారు. ఆయన స్వయంగా కళాకారుడు. టంకా ఆర్ట్

వజ్రయాన టిబెటన్ ఆర్ట్ అని చెప్పారు. ఇప్పుడు దీన్ని నేపాల్‌లో విరివిగా వేస్తున్నారన్నారు. గత ఇరవై ఏళ్ల నుండీ తాను సారనాథ్ వస్తున్నాడు. శీతాకాలంలో సారనాథ్‌లో, వేసవిలో నేపాల్‌లో వ్యాపారం చేస్తున్నట్టు చెప్పారు.

అక్కడకు పదడుగుల్లో మూలగంధకుటి విహార ఉంది. మూలగంధ కుటీ స్థానంలో బుద్ధుడు ధ్యానంలో కూర్చునేవాడని బౌద్ధ గ్రంథాల ద్వారా తెలుస్తోంది. హూయాన్ సాంగ్ దీని ఎత్తు 61 మీటర్లు అని రాశారు. దీనిలో ఉపయోగించిన ఇటుకలు, నిర్మాణశైలినిబట్టి ఇది గుప్తుల కాలం నాటిదని చరిత్రకారులు చెబుతున్నారు. వర్తమాన మూలగంధకుటి విహారాను బోధిసత్వ అంగారిక ధర్మపాల 1922లో నిర్మించారు. ఈయన మహాబోధి సొసైటీ స్థాపించారు. దీనిలో బుద్ధుని అవశేషాలు ఉంచారు. దీనిలో జపాన్ చిత్రకారుడు కోసెత్సు నోసు చిత్రాలు ఉన్నాయి. మూలగంధ కుటి విహారాకు పక్కన పెద్ద రావి చెట్టు ఉంది. ఇది శ్రీలంకలో అశోకుడు నాటిన చెట్టు బిడ్డ. దీనిని ధర్మపాల నాటాడు. దీనికింద అయిదుగురు శిష్యులకు బుద్ధుడు బోధిస్తున్న విగ్రహాలున్నాయి.

మూలగంధ కుటి విహారాకు వెనుకవైపు జింకలవనం (డీర్ పార్క్). నేలకు ఆకాశం గొడుగులు పట్టినట్లు చుట్టూ చెట్లు. ఆకాశమే హద్దుగా గెంతుతూన్న జింకలు. మత్తులో ఉన్నాయో, మెలకువగా ఉన్నాయో అర్థంకాకుండా ఉన్న మొసళ్ళు. మనుషుల వినోదం కోసం బంధీ అయిన పక్షులు. ప్రశాంత వాతావరణం. అది మిగదాయ.

సారనాథ్‌కు మృగదాయని, మిగదాయ అనే పేర్లు కూడా ఉన్నాయి.

సారనాథ్ పేరు ఎలా వచ్చింది?

దీనికి సమాధానంగా ఈ.బి. హావెల్ 'బెనారస్, ద సీక్రెడ్ సిటీ' - పుస్తకంలో బౌద్ధ జాతక కథను పేర్కొంటారు. బుద్ధుడు, దేవదత్తుడు బంధువులు. వీరిద్దరూ పూర్వ జన్మలో జింకల రాజులు. ఇద్దరికీ ఇసిపటాన వద్ద చెరో నూరు జింకలున్నాయి. కాశీ రాజు వాటిని వేటాడటం మొదలుపెట్టాడు. రోజుకు ఒక జింకను వంట కోసం తీసుకోమని పూర్వజన్మ బుద్ధుడు (బోధిసత్వ) రాజును అభ్యర్థించాడు. రాజు అంగీకరించాడు. ఒకరోజు ఓ జింక బోధిసత్వని ప్రార్థించింది. 'నా పొట్టలో బిడ్డ ఉంది. కొంత సమయం ఇప్పించమని.'

బోధిసత్వ రాజువద్దకు వెళ్ళాడు. అభ్యర్థించాడు. జింక స్థానంలో వంటశాలకు తన ప్రాణాన్ని తీసుకోమన్నాడు. రాజు జింకలను వధించడం నిషేధించాడు. జింకల రక్షణకు చర్యలు తీసుకున్నాడు. ఆ విధంగా బుద్ధుడికి 'సారంగనాథుడు'గా పేరు వచ్చింది. దాని నుండి సార్‌నాథ్ పేరు వచ్చిందని ఈ.బి. హావెల్ అంటారు.

మూలగంధ విహారాకు దగ్గరలో చైనీయుల విహార ఉంది. దీనిని 1939లో చైనా కళాశైలిలో నిర్మించారు. ఇది 14 ఎకరాల్లో ఉంది. దీనిలో చైనీయులు ఎక్కువగా ఆరాధించే తెల్ల తారాదేవి మందిరం కూడా ఉంది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నుండి దీనిని థాయ్‌లాండ్ సంస్థ నిర్వహిస్తుందని అక్కడ గురువు చెప్పారు.

అక్కడకు కొంచెం దూరంలో సారంగనాథ దేవాలయం ఉంది. విశాల ప్రాంగణంలో పెద్ద గుడి. ముందు పెద్ద కొలను. సారంగనాథుడు శివుడి బావమరిది. ఒకే స్థానంలో శివలింగం, సారంగనాథ లింగం ఉండడం విశేషం. "శ్రావణ మాసంలో శివుడు కాశీలో ఉండడు. అత్తారిల్లు సారంగనాథ్‌కు వచ్చి ఉంటాడు. బయటవాళ్లకు తెలియక, యధావిధిగా కాశీలో శివుడి దర్శనానికి వెళ్తారు. కానీ స్థానికులు మాత్రం సారంగనాథ దేవాలయానికి వస్తారు." అని అక్కడ పూజారి చెప్పారు.

కజరీ గాయికి ఆరతి రాజ్ 'పియా సారనాథ్ ఘుమాయి ద' పాటలో తన భర్తను ఉద్దేశించి ఇలా పాడుతారు.

***అబ్ కీ సావన్ మే చలబ్ సారనాథ్ పియా***
***ననద్ జీ కే సాత్ పియా నా***
***కయికే థోదా సా ఆరామ్***
***పహుచవ్ బాబాజీ కే ధామ్.....***

ఈసారి శ్రావణ మాసంలో సారనాథ్ వెళ్దాం. మా ఆడబడుచును కూడా తీసుకెళ్దాం. అక్కడ బాబా ధాం (సారంగానాథ ధాం)కు వెళ్దాం. పువ్వులూ, దండలు అర్పించి ప్రార్థిద్దామని ఒక గృహిణి తన భర్తను కోరుతుంది. ఇక్కడ శివలింగాన్ని ఆదిశంకరులు స్థాపించినట్లు ఆధారాలున్నాయి. ఈ దేవాలయంవల్ల సారనాథ్ అనే పేరు వచ్చిందని అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ అభిప్రాయపడ్డారు. సారనాథ్ 1500 ఏళ్ల పాటు బౌద్ధ మతానికి కేంద్రంగా ఉంది. అశోకుడు, శుంగులు,

గాహద్వాలులు, శాతవాహనులు సారనాథ్‌ను అభివృద్ధి చేశారు. కళలకు కేంద్రం అయింది. క్రీ.శ. 12వ శతాబ్దం వరకు ఇది గొప్ప యాత్రా స్థలం. ఇక్కడ మౌర్య, కుషానుల కాలంలో బౌద్ధం ఉండేది. కుషానుల కాలంలో మహాయానం ప్రారంభం అయింది. గుప్తుల కాలంలో విస్తరించింది. గుప్తుల కాలంలో హిందూధర్మ ప్రభావం కనిపిస్తుంది. గాహద్వాలుల కాలంలో ఇక్కడ వజ్రయానం వృద్ధి చెందింది.


జపనీస్ బుద్ధిస్ట్ టెంపుల్

ఆ తరువాత ఇక్కడ దేవాలయాలను, విహారాలను ఐబక్, ఘోరీలు విధ్వంసం చేశారు. సారనాథ్ శిథిలాలుగా మారిపోయింది. పురాతత్త్వ శాస్త్రజ్ఞులు శోధించేవరకు అది విస్మృత నగరంగా ఉండిపోయింది.

సారనాథ్‌లో తిరుగుతుంటే –

శిథిలాలు కథలతో పలకరిస్తున్నాయి. స్తూపాలు ధర్మాన్ని చాటుతున్నాయి. విహారాలు త్యాగనిరతిని ప్రదర్శిస్తున్నాయి.

సార్‌నాథ్ అంటే గతకాలపు ఆనవాళ్ళే కాదు. నడుస్తున్న జీవకళ కూడా. ఇక్కడున్న విహారాలను చూడకపోతే, సార్‌నాథ్ సారాన్ని పొందలేనట్లే.

సారనాథ్ స్తూప ప్రాంగణం వెనుక వజ్ర విద్యాసంస్థ ఉంది. దీనిని 1999లో 14వ దలైలామా గ్యాల్వ ఇంజిన్ గిస్తో ప్రారంభించారు. టిబెట్ సంస్కృతిలో కట్టిన ఒక పెద్ద ద్వారం ఉంది.

లోపలికి వెళ్ళాను. అక్కడ నల్లరాతి పలకపై గోడ మీద ఇలా రాసి ఉంది.

వజ్ర విద్యా విహార –

నిర్మాణ సంక్షిప్త చరిత్ర, సారనాథ్ , వారణాసి.

వారణాసిలోని జింకల పార్కు బుద్ధశాక్యముని పవిత్ర ధర్మానికి ద్వారం తెరిచిన స్థలం. ఇక్కడ బుద్ధుడి గుడి, విహార బౌద్ధ అధ్యయనానికి, ధర్మ ప్రచారానికీ కృషి చేస్తుంది. ఇది భారత్‌లోనూ, టిబెట్లోనూ శాంతి సామరస్యాలకు తోడ్పడుతుంది. బుద్ధుడి బోధనలు ఉన్నత దశలో ఉన్నప్పుడు ప్రపంచంలో శాంతి ఉండేది. ముఖ్యంగా భారతదేశంలో. సమస్త జీవులు సుఖ సంతోషాలతో ఉండేవి. అశోకుడూ, ఇతర పాలకులూ ధర్మాన్ని పాటించారు. సంపదలో, సంస్కృతిలో, ధ్యానంలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా ఉండేది. దీనిని 'ల్యాండ్ ఆఫ్ ఎక్సాల్టెడ్ వన్' అని పిలిచారు.

తర్వాత నలందాతో సహా అన్ని పవిత్ర స్థలాలను ధ్వంసం చేశారు. రోగం, ఆకలి, కరువు కాటకాలు పెరిగిపోయాయి. యుద్ధాలు మనిషిని పీడించాయి. అవి మెల్లగా ప్రపంచ యుద్ధంలోకి తీసుకెళ్లాయి.

తర్వాత అంగారిక ధర్మపాల జింకలవనంలో మూలగంధ కుటి మందిరాన్ని నిర్మించారు. ఆయన ద్వారా ధర్మాన్ని పునరుద్ధరించడంవల్ల మూడవ ప్రపంచ యుద్ధం నివారించబడింది......

అలా ఆరు ఫలకాలపై ఇంగ్లీషులో ఈ సంస్థ ప్రాముఖ్యతను వివరించారు.

ఆ సంస్థ ప్రాంగణంలోకి వెళ్ళాం. మందిరానికి వెనుకవైపు వంటగది ఉంది. అక్కడ వంటతను ప్రేమతోపాను కలిశాను. గత 35 సంవత్సరాల నుండి అతను ఇక్కడే పని చేస్తున్నట్లు చెప్పాడు. నేపాల్ నుండి వచ్చాడు. ఇక్కడ ప్రతి రోజు 50 – 60 మంది గురువులు, 150 మంది విద్యార్థులు భోజనం చేస్తారట. వీరికి ఉచితం. అతిథులకు రోజుకు రెండు వందల రూపాయలు తీసుకుంటారు. వీరు ఉదయం టిమ్మొమ్మొ, పాస్తా, మధ్యాహ్నం ఫ్రైడ్ రైస్, రాత్రి చౌమీన్, థూప్పా తింటారట. టిమ్మొమ్మొ, థూప్పాలను మైదాతో చేస్తారని చెప్పాడు.

అక్కడి నుండి విద్యార్థుల వసతి గృహానికి వెళ్ళాం. అక్కడ ఫుర్పా, ఫుర్పాదిందు, షల్టిం నందాలను కలిశాం. వీరందరూ నేపాల్ నుండి వచ్చినవారే.

వీరు ఆచార్య డిగ్రీ కోసం చదువుతున్నారు. విద్యకోసం విహారాలో చేరడానికి 8 ఏళ్ల వయస్సు ఉండాలి. ఇక్కడ 12 సంవత్సరాలు చదవాలి. అప్పుడు 'ఉపసంపద' ప్రక్రియ ద్వారా సంఘ సభ్యుడుగా చేర్చుకోబడతారు. ఆ తర్వాత ఆచార్య కోర్సు. అది 12

సంవత్సరాలు. ఆచార్య తర్వాత భిక్షువుగా, మేనేజర్‌గా, టీచరుగా, గురువుగా, ప్రీస్ట్‌గా ఉద్యోగం చేయొచ్చు. లేదా మూడు సంవత్సరాలు ధ్యానం చేయొచ్చు.

ఆచార్య కోర్సులో డిబేట్ , బౌద్ధ తత్త్వం, వ్యాకరణం, టిబెటన్ భాష చదవాలి. వీరి క్లాసులో ప్రస్తుతం 23 మంది విద్యార్థులున్నట్లు చెప్పారు. వీరు శీతకాలం ఆరు నెలలు ఇక్కడ చదువుతారట. వేసవిలో నేపాల్‌లో చదువుతారు. వీరు నేపాలీలోనూ, టిబెటన్‌లోనూ మాట్లాడుకుంటున్నారు. హిందీ కొంచెం వచ్చు. "హిందీ భాష చాలా వినసొంపుగా ఉంటుంది. అయితే నేపాలీలో మాట్లాడినప్పుడు మాత్రమే ఆ ఫీల్ వస్తుంది" అని ఫర్భాదిండు చెప్పాడు.

విద్యార్థులు రాత్రిపూట గుంపుగా కూర్చుని చదువుతారు. డిబేట్ ప్రాక్టీస్ చేస్తారు. కరెక్టుగా చెప్పినప్పుడు అందరూ గట్టిగా చప్పట్లు కొడతారు. "దీనివల్ల మాట్లాడిన వ్యక్తికి ప్రోత్సాహం కలుగుతుంది. మిగిలినవారిలో ఉత్సాహం కలుగుతుందని" షుల్టిం నందా అన్నారు.

వసతి గృహంలో మద్యం, మాంసం, జూదం, ధూమపానం, పాన్ మసాలా నిషేధం. వీరు కాఫీ, టీ తాగుతారు.

అక్కడ నుండి బౌద్ధ మందిరానికి వెళ్ళాం. దాన్ని టిబెటన్ శిల్పకళలో అతి సుందరంగా నిర్మించారు. లోపల పెద్ద హాలు. ఎదురుగా కంచులో ప్రకాశిస్తున్న బుద్ధుడు. బుద్ధుడి విగ్రహం ప్రక్కన ఇద్దరు లామాల చిత్రపటాలు ఉన్నాయి.

ఈ ప్రాంగణంలో ఎటుచూస్తే అటు బౌద్ధ భిక్షువులు. కొందరు చదువుకోవడం కోసం. కొందరు జ్ఞానం కోసం. మరికొందరు ధ్యానం కోసం. అతి తక్కువ మంది మోక్షం కోసం.

బిక్షువులకు, భిక్షగాళ్లకూ ఒక్కటే తేడా. ఒకరు ఆత్మ నిండడాన్ని చూస్తారు. మరొకరు పాత్ర నిండడాన్ని చూస్తారు.

అక్కడ నుండి బౌద్ధ బడికి వెళ్ళాం. గేటు దగ్గర ఏడేళ్ల పిల్లాడు 'చింగా' కలిశాడు. నేపాల్ నుండి చదువు కోసం వచ్చాడు. ఇతని గురువు ఫెమా ధీన్ క్యోం వచ్చారు. స్కూలు చూపించారు. పాతబడిన భవనం. మొదట 70 మంది భిక్షినులు ఉండేవారని చెప్పారు. తాను పిల్లలకు సంబోటా లిపిని (టిబెటన్) నేర్పిస్తున్నట్లు చెప్పారు. ప్రార్థన నేర్పిస్తున్నారు. ఎనిమిదవ తరగతివరకూ పిల్లలకు బౌద్ధతత్త్వంలో పునాది వేస్తారు. టిబెటన్ భాష నేర్పుతారు.

తాను గెలొంగ్ దశలో ఉన్నట్లు గురువు చెప్పారు. గృహస్తు దశను గెనిన్‌గాను, గృహస్తిని విడిచినవారిని గేచుల్‌గాను, గృహస్తిని విడచి ఆత్మజ్ఞానంవైపు ప్రయాణిస్తున్న వాళ్ళను గెలొంగ్‌గా పిలుస్తారని ఆయన చెప్పారు.

తాను మైసూరుకు సమీపంలో ఉన్న విహారాలో 12 సం.లు చదివానని చెప్పారు. అక్కడ మూడు విహారాలున్నాయి. ఒక్కో విహారాలో 5000 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు.

ఇక్కడంతా చిన్న పిల్లలు. అందరూ నేపాల్ నుండి వచ్చినవాళ్ళే. యూరోపియన్లు లాటిన్ నేర్చుకున్నట్లు, భారతీయులు సంస్కృతం నేర్చుకున్నట్లు వీళ్ళంతా టిబెటన్ భాషను నేర్చుకుంటున్నారు.

ఈ శిక్షణ జీవనోపాధికా? జీవించడానికా? జీవనముక్తికా? దేనికి? అని అక్కడున్న గురువును ప్రశ్నించాను.

అక్కడ నుండి సాంఖ్య యోగ కపిలముని ఆశ్రమానికి వెళ్ళాం. దీన్ని పరమహంస హరి హరానంద్ స్థాపించారు.

బర్మా బౌద్ధ విహారానికి వచ్చాం. దీన్ని 1907లో స్థాపించినట్లు అక్కడ బౌద్ధ గురువు చెప్పారు. ఈ కేంద్రంలో 40 గదులతో వసతి ఉంది. మందిరంలో కంచుతో చేసిన బుద్ధ విగ్రహం ఉంది. ధ్యాన కేంద్రం ఉంది. బౌద్ధ గురువు నాకు అక్కడున్న మియాన్మార్ యాత్రికురాలను పరిచయం చేసారు. ఆమె ప్రతి సంవత్సరం యాత్రికులను ఛార్టర్డ్ ఫ్లైట్ ద్వారా తీసుకొస్తారట.

తర్వాత సారనాథ్‌లోని ప్రాచీన టిబెట్ బౌద్ధ విహారానికి వెళ్లాను. దీన్ని 1955లో స్థాపించారు. దీని గురువు సేరింగ్ (Tsering)ను కలిసాను. ఇతను 32 సంవత్సరాల నుండి ఇక్కడే ఉంటున్నారు. వీరు నాకు విహారాన్ని చూపిస్తూ మందిరంలోకి తీసుకెళ్లారు. అక్కడ చాలా పెద్ద బౌద్ధ విగ్రహం ఉంది. దాని ముందు దలైలామా చిన్న విగ్రహం ఉంది. కొవ్వొత్తి పదార్థంతో చేసిన వివిధ రంగుల వస్తువులతో మందిరాన్ని అలంకరించారు. బీరువాల్లో చిన్న బౌద్ధ విగ్రహాలు చాలా ఉన్నాయి. అక్కడి నుండి మందిరం వెనుక ఉన్న ఒక నిల్వగది వైపు

తీసుకెళ్లారు. దానిలో చిన్న చిన్న వంట పాత్రలను గుర్తులుగా కట్టి పైకప్పుకు వేలాడదీశారు. వీటిని సంవత్సరంలో ఒకసారి తీస్తారని గురువు చెప్పారు. అంటే డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో దలైలామా పూజకు బోధ్ గయ తీసుకువెళ్తారు. అక్కడకు కొంచెం దూరంలో మరో నిలవగది ఉంది. దీనిలో చాలా పెద్దపెద్ద పాత్రలున్నాయి. వీటిని కూడా గయలో వంట చేసేందుకు తీసుకువెళ్తారు. ఆ రోజుల్లో ప్రతిరోజూ సుమారు లక్షమందికి వంట చేస్తారట.

ఈసారి దలైలామా గయ వస్తున్నారని, నెల రోజులుంటారని సేరింగ్ చెప్పారు.

అక్కడి నుండి ముఖ్యద్వారానికి వచ్చాం. ద్వారానికి ఎడమవైపు దీపదానం గది ఉంది. ఇక్కడ నాలుగు వేల దీపాలను ఒక్కసారి వెలిగించవచ్చు. ఇక్కడ దీపాలు వెలిగిస్తే రోగాలు నయం అవుతాయని బౌద్ధులు నమ్ముతున్నారు.

అక్కడ 'ప్రో పూర్ ప్రాజెక్ట్' ఇంజనీరు కలిసారు. సార్‌నాథ్‌లో 75 కోట్ల ఖర్చుతో మురికి కాలువ నిర్మాణం, సేవేజ్ ప్లాంట్, అండర్ గ్రౌండ్ వైరింగ్, ఫుట్‌పాత్ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత జపానీ మందిరానికి వెళ్ళాం. దీనిని హోజోసకే, మేజోసకే దంపతులు 1992లో ప్రారంభించారు. ఇది పూర్తిగా జపానీ శైలిలో నిర్మితమై ఉంది. వీరి కుమార్తె నాగకుబో వ్యోజితస్సు. ఈ మందిరానికి ప్రస్తుత ధర్మకర్త. దీని మేనేజర్ కల్‌సాంగ్ నోర్బు లధాక్‌కు చెందినవారు.

కొందరు కూడబెట్టడానికి లోకమంతా తిరుగుతారు. కొందరు కూడబెట్టినదంతా విడిచి, అంతరాత్మవైపు ప్రయాణిస్తారు. ఈమె రెండవ కోవకు చెందినవారు.

'నా మూ మ్యో హో రెన్ జే క్యో' అని పాడుతూ డప్పు వాయిస్తూ నన్ను ఆహ్వానించారు నాగకుబో. దీని అర్థం 'క్షితి జల్ పావక్ గగన్ సమీరా' అని చెప్పారు. పంచ భూతాలను ప్రార్థించడం. పూజాస్థలంలో బుద్ధుడి విగ్రహం ఉంది. అక్కడి హాల్లో పెద్ద డప్పు (డ్రం) ఉంది. వీరి ప్రార్థనలో సంగీతం అభిన్న అంగమని చెప్పారు.

ఈ మందిరానికి కొంచెం దూరంలో జపానీ స్తూపం ఉంది. స్తూపంలో నాలుగు దిశల్లో నాలుగు వేరు-వేరు ముద్రలలో బుద్ధుడి విగ్రహాలున్నాయి. ఈ స్థూపానికి ద్వారం సాంచి నమూనాలో ఉంది. అక్కడ స్తంభం అశోక



వజ్రాయన ఇన్‌స్టిట్యూట్ - సారనాథ్

స్తంభం నమూనాలో ఉంది. అక్కడ కలిశారు అజయకుమార్ జైన్. అతను సారనాథ్‌లో వార్డు మెంబరు. అతని భార్య మీహా, జపానీ. తన జపానీ ప్రేమకథ చెప్పాడు.

"నేను ఇంటర్ తర్వాత జపానీ భాష నేర్చుకోసాగాను. స్వతహాగా జపానీ పదాలు, హిందీ అర్థాలతో నోట్సు రాసుకునేవాణ్ణి. ఢిల్లీలో జపానీ భాషలో డిగ్రీ కోర్సు చేశాను. తిరిగి సారనాథ్ వచ్చి వ్యాపారం ప్రారంభించాను. 1995లో మీహా మరికొందరి జపానీ యాత్రికులతో సారనాథ్ వచ్చారు. అప్పుడు నా దుకాణం వద్దకు వచ్చి సారనాథ్ గురించి అడిగారు. నేను జపనీ భాషలో వారికి చెప్పే ప్రయత్నం చేశాను. వారితో కలిసి సారనాథ్‌లో వారం రోజులు తిరిగాను. అలా మీహాతో స్నేహం కుదిరింది. ఆ తర్వాత 95, 98, 99, 2000లో టూర్‌లో జపాన్ వెళ్ళాను. అక్కడ ఆమెను కలిసేవాణ్ణి. అలా మా స్నేహం ప్రేమగా మారింది.

2000లో నాలో అకస్మాత్తుగా ఒక మార్పు వచ్చింది. సన్యాసం స్వీకరించాను. ఇల్లు విడిచి దేశాటన మొదలుపెట్టాను. 2002లో మద్రాసుకు దగ్గరలో ఉన్న పెరియార్ నగర్ వెళ్ళాను. అక్కడ 'ఆగస్త్య నారియల్ జ్యోతిష్య కేంద్రానికి' వెళ్ళాను. అక్కడ కొబ్బరి ఆకుమీద నా పెళ్లి జపానీ అమ్మాయితో జరుగుతుందని రాసి ఉంది. వెంటనే సన్యాసం విడిచిపెట్టి సారనాథ్‌కు వచ్చాను. మళ్లీ జపాన్ వెళ్లాను. మీహా తల్లిదండ్రులను కలిసి పెళ్లి ప్రస్తావన చెప్పాను. అందుకు వాళ్ళు అంగీకరించారు. నవంబర్ 28 2002లో మా పెళ్లి అయ్యింది. మాకు ఇద్దరు పిల్లలు. వారి పేర్లు హిందూ జైన జపనీ సంప్రదాయాలకు అనుకూలంగా పెట్టాం. పెద్దమ్మాయి యూకా యోగేశ్వరి జైన్. చిన్నమ్మాయి తమామి తనిష్క

జైన్. తర్వాత సారనాథ్ మున్సిపాలటీ ఎన్నికల్లో పోటీ చేశాను. గెలిచాను.

"నవంబర్ 13న ఓయ్ షికి ఉత్సవం జరిగింది. మీరు పదిరోజులు ముందు వచ్చి ఉంటే జపానీ సంస్కృతిని చూసి ఆనందించేవారు" అన్నారు అజయ జైన్.

వారణాసిలో జపనీయురాలిని పెళ్లి చేసుకున్న మొదటి వ్యక్తి శాంతిరంజన్ గంగోపాధ్యాయ్ అని ఆయనన్నారు. వీరు పాండేఘాట్‌లో కుమికో గెస్ట్‌హౌస్ స్థాపించారు. అక్కడకు వెళ్ళాను. శాంతిరంజన్ భార్య కుమికో. వాళ్లకు పెళ్లయి 45 సంవత్సరాలు అయిందన్నారు. ప్రస్తుతం వాళ్ళ కుమారుడు గెస్ట్‌హౌస్‌ను నడుపుతున్నాడు.

సారనాథ్ నుండి వారణాసి వచ్చే మార్గంలో టిబెటన్ విశ్వవిద్యాలయం ఉంది. దీనిని 1967లో స్థాపించారు. దీనిలో ఉన్న శాంతరక్షిత గ్రంథాలయం చూడదగ్గది. బౌద్ధధర్మ అధ్యయనానికి సంబంధించిన సంపూర్ణ జ్ఞానం ఇక్కడ లభ్యమవుతుంది. దీనిలో ప్రాచీన బౌద్ధగ్రంధాలు ఉన్నాయి. తాళపత్ర గ్రంధాలు, డిజిటల్ గ్రంధాలు, గ్లైలో గ్రాఫ్‌లు ఉన్నాయి. వీధుల్లో విహరిస్తున్న చెత్త - సారనాథ్ సౌందర్యాన్ని కొంత కప్పివేస్తున్నది. రోడ్లపై ఎగురుతున్న ధూళి ఆకుల పచ్చని కళ్ళను మసక చేస్తున్నది.

ఒక ప్రదేశంలో తిరగడం అంటే - అక్కడ చెట్ల చిరునవ్వును స్వీకరించడం. అక్కడ శిల్పాలతో ఊసులాడడం. అక్కడ పశుపక్ష్యాదులతో ఆటలాడడం. అక్కడ మనుషుల మనసు లోతుల్ని స్పృశించడం. వెరసి మట్టి, మనిషి, ఆకాశాన్ని ఆకలించుకోవడం.

హిందూ, జైన, బౌద్ధ ధర్మాల త్రిధర్మ సంగమం సారనాథ్. ప్రకృతి, పురుషుల సహజీవన సౌందర్యం సారనాథ్. భూత, భవిష్యత్, వర్తమానాల కూడలి సారనాథ్.

కిల్లాడ సత్యనారాయణ
వారణాసి. ఫోన్: 833 398 7838.

## కుందమాలా

తంజావూరులో దొరికినవి రెండూ మైసూరులో దొరికినవి రెండూ మొత్తం ఈ నాలుగు వ్రాతప్రతులూ ఆధారంగా (రెండు తెలుగు లిపి, రెండు గంధ లిపి) మానవల్లి రామకృష్ణ కవీ ఎస్.కె. రామనాథశాస్త్రిగార్లు మేలు ప్రతి సిద్ధం చేసి, ఆంగ్లంలో ముందుమాట సమకూర్చి ఈ కుందమాలా గ్రంథాన్ని మద్రాసులో కూర్చి ముంబైలో ముద్రింపించారు. 1923నాటి ఈ ముద్రిత ప్రతీ ఆ వ్రాత ప్రతులే అనంతర కాలంలోని ముద్రణలకూ అనువాదాలకూ వ్యాఖ్యానాలకూ ఆధారం.




వ్రాత ప్రతులలోని శిథిల భాగాలకు - ముఖ్యంగా ప్రాకృత సంభాషణలకు - పూరణలు చూపకుండా చుక్కలు పెట్టి విడిచిపెట్టారు తొట్టతొలి ముద్రాపకులు మానవల్లి - రామనాథశాస్త్రిగార్లు (1923). ఈ శిథిల భాగాలకు తన అపూర్వ కృషి ఫలితంగానూ ప్రాకృత భాషా పాండిత్యంవల్లనూ సరియైన పూరణలను అందించిన శ్రీకాళీ కుమారదత్తుగారి ఋణం తీర్చుకోలేనిది. ఇంతకీ ఈ కుందమాల మీద ఇంత విస్తృతంగా పరిశోధన జరిగినా రచయిత ఎప్పటివాడు, ఎక్కడివాడు, అసలుసిసలు పేరేమిటి; అతడు బౌద్ధుడా, ఒకడా పలువురా, ఇంకా ఏమేమి రచించాడు - మొదలైన ప్రశ్నలన్నీ నేటికీ సజీవంగానే ఉన్నాయి. కవిభ్యః కావ్యాన్యేవ బహుమన్యామహే - అన్నాడు ఆనందవర్ధనుడు. అందుకని పై ప్రశ్నల సమాధానాలు ఏవీ ఒక కొలిక్కి రాకపోయినా ఈ కుందమాల కావ్యసౌందర్యం దృష్టితో శిరోధార్యమనీ కరుణవేదులకు ఆస్వాదనీయమని - కాలం నిరూపించింది. అలాగే అగ్నిపరీక్ష - సీతా పరిత్యాగాలు వాల్మీకాలా అవాల్మీకాలా? ఎప్పటివి? ఇత్యాది చర్చలు సైతం కావ్య రసాస్వాదనవేళ పరిహర్తవ్యాలు. అగ్నిపరీక్ష ప్రక్షిప్తమనీ, ఉత్తరకాండ అవాల్మీకమనీ నా దృఢవిశ్వాసం. అయినా ఈ కుందమాలకూ భవభూతి ఉత్తరరామచరిత్రకూ తెలుగు వ్యాఖ్యానాలు ముచ్చటపడి రాశానంటే - "రసపట్టులో తర్కం కూడదు" అనే! అలాగే మీరూ ఆస్వాదించండి!

**కుందమాలా** - *వ్యాఖ్యానం : బేతవోలు రామబ్రహ్మం - పేజీలు: 354, వెల: ₹ 400/-*

*ప్రతులకు: ఎస్.ఆర్. పబ్లికేషన్స్, ఫోన్: 0866-6889999, 949 487 5959, 949 387 5959, 903 242 8516.*

# అనర్ఘ రత్నాలు

– పప్పు వేణుగోపాల రావు

సంప్రదాయంగా మనకి ఎన్నో ముఖ్యమైన నీతులు ఉన్నాయి. మనం తరచుగా చెప్పుకోనేవి, శుక్ర నీతి, విదురనీతి, చాణక్య నీతి ఇలాంటివి కొన్ని. ఒక్కొక్కరి దృక్కోణం ఒక్కొక్కలా ఉంటుంది, దానికనుగుణంగానే వారు చెప్పిన నీతులూ ఉంటాయి.

మహాభారతం గురించి వ్యాసుల వారు ఏమన్నారంటే, ధర్మంలోగాని, అర్థంలోగాని, కామంలోగాని, మోక్షంలోగాని మహాభారతం లో లేనిది ఈ ప్రపంచంలోనే లేదు అని. అంటే అంత విస్తృతంగా లోకంలో ఉన్న అన్ని విషయాలూ మహాభారతం లో కనిపిస్తాయి. అందుచేత విదురుడు *భారతం* లో చెప్పిన నీతులు ఈ కాలానికీ అందరికీ వర్తిస్తాయి.

**ఒక ఉదాహరణ చూద్దాం:**

ధృతరాష్ట్రుడికి ఒక రాత్రి నిద్ర పట్టలేదు. ఎంత ప్రయత్నించినా నిద్ర రావడంలేదు. వెంటనే విదురుడికి కబురు పెట్టాడు. విదురుడు వచ్చాడు. ధృతరాష్ట్రుడు ఆయనతో ఇలా అన్నాడు. సంజయుడు ధర్మరాజు దగ్గిరకి రాయబారం వెళ్లి వచ్చాడు. ఏం జరిగింది అని అడిగితే నన్ను తిట్టి వెళ్లిపోయాడు. రేపు సభలో వివరాలు చెప్తాను అన్నాడు. అదిగో, అప్పటి నుంచి నాకు ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదు. ఏమయి ఉంటుంది చెప్పు విదురా అని అడిగాడు.

విదురుడు అప్పుడు చెప్పిన కొన్ని అమోఘమైన మాటలు విదురనీతి లో ముఖ్యమైనవి.

ఆయన చెప్పిన మొదటి రెండు శ్లోకాలు ఇవి:

***అభియుక్తం బలవతా దుర్బలం హీనసాధనం ।***
***హృతస్వం కామినం చోరమావిశంతి ప్రజాగరాః ॥***
***కిన్చిదేతైర్ మహాదోషైః న స్పృష్టోసి నరాధిప ।***
***కచ్చిన్న పరవిత్తేషు గృధ్యన్ విపరితప్యసే ॥***

నిద్ర ఎవరెవరికి పట్టదో ముందు చెప్తున్నాడు. బలవంతుడైనవాని చేతిలో ఓడిపోయినవాడికి, సంపద పోయినవాడికి, కామం గలవాడికి, దొంగవాడికి నిద్రరాదు.

రెండవ శ్లోకంలో ఓ నరాధిపా! ఈ మహా దోషాలలో ఏదైనా తగిలిందా? ఒకవేళ ఇతరుల సంపద మీద కోరికతో బాధపడడం లేదుగదా! అన్నాడు.

ఈ మాటలు చెప్పినవాడు, విదురుడు, మహాజ్ఞాని, సాక్షాత్తు ధర్మమూర్తి.

జాగ్రత్తగా పరిశీలిస్తే మొదటి శ్లోకంలో చెప్పినవాటిలో ఈ రోజుల్లో నిద్ర రాకపోవడానికీ దాదాపు అవే కారణాలు. నిజానికి ధృతరాష్ట్రుడికి బలవంతుడైనవాని చేతిలో ఓడిపోతామనే భయం, సంపద పోతుందేమో అనే భయం,, కామం అంటే కోరిక; ఎలాగయినా తన కొడుకే రాజ్యాన్ని పరిపాలించాలనే కోరిక, పాండవులకు ధర్మబద్ధంగా రావలసిన రాజ్యం దొంగిలించాలనే కోరిక – ఇవన్నీ మనసులో ఉడడంచేత నిద్ర రాలేదు.

రెండో శ్లోకంలో ఒక మంత్రిగా, ధృతరాష్ట్రుడికి స్వయంగా తమ్ముడిగా, విదురుడు అడుగుతున్నాడు, పాండవుల రాజ్యాన్ని అపహరించాలనే కోరిక నిన్ను దహిస్తోందా, అందుకే నిద్ర పట్టడంలేదు అంటున్నాడు.

న్యాయం, ధర్మంకంటే మమకారం, మనిషిని గుడ్డివాడిని చేస్తుంది, ఆయనే ధృతరాష్ట్రుడు, వందలకొలది తప్పులు చేయిస్తుంది, వాళ్ళే నూరుగురు కౌరవులు, పంచభూతాలను విస్మరిస్తుంది. వాళ్ళే పంచ పాండవులు, సారథి భగవంతుడైనా ఎదిరించాలనుకుంటుంది. నడిపించేవాడు శ్రీకృష్ణుడు. అదే భారతం లో కథ.

**ఈ నెల చాటువు:**

మనకి కోకొల్లలుగా శతకాలున్నాయి. చాలావరకు శతకాలు కూడా చాటువులే. అప్పటికప్పుడు సందర్భానుసారంగా చెప్పిన ఆశువులు. వీటిని ముక్తకాలు అంటారు, అంటే ఏ పద్యానికదే పూర్తిగా స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటుంది. ఆ విషయం అక్కడితో సరి. శతకం అంటే వంద, కాని ఒక్కోసారి కొంచెం నూరుకన్నా ఎక్కువే ఉంటాయి. వేమన శతకం అయితే వేలల్లో పద్యాలున్నాయి. నాలుగు వేలకు పైగా ముద్రణ చెందాయి. వావిళ్ళవారు వేమన పద్యాలను వాటిలో విషయాన్ని అనుసరించి 18 భాగాలుగా విభాజించారు. కాలక్రమంలో ఎవరికితోచిన పద్యాలు వాళ్ళు వ్రాసి చివర 'విశ్వదాభిరామ వినురవేమ' జోడించారు. చాటు పద్యాల మీద గ్రంథాలు వ్రాసినవారు విషయసూచికల్లోనే వేమన యుగం అని ఒక అధ్యాయం

వేమనకిచ్చి పెద్ద పీట వేశారు. వేమన రచనలు అజరామరం, పలు విషయాలను స్పృశించిన అనర్ఘ రత్నాలు. కొన్నికొన్ని పాదాలు నానుడులై, సామెతలై ప్రజల మస్తిష్కాలలో నిలిచిపోయాయి. కొన్ని ఉదాహరణలు:

✧ *గంగిగోవు పాలు గరిటడైనను చాలు*

✧ ***తలలు బోడులైన తలపులు బోడులా***

✧ ***కుక్క తోక పట్టి గోదావరీదునా***

✧ ***పురుషులందు పుణ్య పురుషులు వేరయా***

✧ ***మేడిపండు చూడ మేలిమై యుండును***

✧ ***కొండ అద్దమందు కొంచెమై ఉండదా ....***

ఇలా ఎన్నో. విచిత్రమేమిటంటే ఇవన్నీ ఆయన పద్యాలలో మూడవ పాదాలు! ఆ మూడో పాదంలో వేమన మానవ నైజాన్ని గ్రుచ్చి చెప్తాడు.

ఎన్ని పద్యాలు ఉదాహరణగా చూపినా తనివి తీరదు. ఒకటి రెండు చూద్దాం.

అయ్యా! విష్ణు మూర్తి పాల సముద్రంలో పడుకుంటాడుగదా, మరి కృష్ణావతారంలో ఇంటింటికీ వెళ్లి పాలు వెన్న దొంగిలించడం ఏమిటి? దీనికి వేమన సమాధానం ఈ పద్యంలో చూడండి.

***పాలకడలిపైన పవ్వళించెడి స్వామి***
***గొల్లఇండ్ల పాలు కోరనేల?***
***ఎదుటివారి సొమ్ములెల్లవారికి తీపి***
***విశ్వదాభిరామ! వినుర వేమ!***

ఇలాంటి పద్యాలే కాకుండా చాలా ఘాటైన పద్యాలూ వ్రాశాడు. ఆచారాలని దుయ్యబట్టాడు, దేవుళ్ళని విమర్శించాడు, మూర్ఖులను నిరసించాడు.. ఇలా రకరకాలు.

ఇంకో పద్యం చూడండి.. ఘాటుగానే ఉంటుంది మరి.. లోకంలో బంగారు లేడి ఉంటుందా, ఆవిడడిగిందట, ఈయన వెళ్ళాడట!

***కనక మృగము భువిని కద్దులేదనకుండ***
***తరుణి విడిచిపోయె దాశరథియు***
***తెలివిలేనివాడు దేవుడెట్లాయెరా***
***విశ్వదాభిరామ! వినుర వేమ!***

వేమన ఒక యోగి, లోకమెరిగిన కవి, విప్లవకవి. తెలుగు చాటువు వేమన కవితలో సర్వసమగ్రరూపం దాల్చింది.

ఆచార్య పప్పు వేణుగోపాల రావు
చెన్నై. e-mail: pappuvenu@gmail.com

## గాంధీజీ

ఎంతటి శత్రువు ఎదురైనా, శారీరక హింస, మరణం తప్పదని తెలిసినా, ఓర్పు కోల్పోకుండా సహనంతో, చిరునవ్వుతో చేసే క్షమతో కూడిన పోరాటమే సత్యాగ్రహం! ఈ సమాజం సమూలంగా మారాలన్న విప్లవవాది, అయితే దానికి ఎన్నుకోవాల్సిన విధానం కూడా ఉత్కృష్టంగా, అహింసాయుతంగా ఉండాలని ప్రతిపాదించిన సిద్ధాంతకర్త గాంధీజీ!



అసలైన విప్లవవాది...
సిసలైన సిద్ధాంతకర్త **గాంధీజీ**
– *డా. నాగసూరి వేణుగోపాల్*
*పేజీలు: 208, వెల: ₹ 200/- ప్రతులకు: నాగసూరి అకాడెమీ ఆఫ్ మీడియా & సైన్స్, బి-517, విల్లా హైట్స్, బ్రాహ్మన్‌వాడి, బేగంపేట, హైదరాబాద్ – 16. ఫోన్: 944 073 2392.*

## దేశదేశాల కవిత్వం

ఇది దేశదేశాల కవుల వైవిధ్యభరితమైన అనువాద కవితా సంకలనం.

ఇందులో భారతీయ కవుల కవితలు కూడా మీరు చదవవచ్చు.

గత వందేళ్లలో (1922–2022) తెలుగులో వచ్చిన ఉత్తమ అనువాద కవిత్వాన్ని ఒడిసిపట్టే ప్రయత్నమిది. ఈ సంకలనంలో 207 మంది కవులు,



158 మంది అనువాదకులు ఉన్నారు. మొత్తం 281 కవితలు ఉన్నాయి. సరిహద్దులు లేని కవిత్వం రుచి చూద్దాం రండి.

**దేశదేశాల కవిత్వం**
– సంపాదకుడు అనిల్ బత్తుల
*పేజీలు: 400, వెల: ₹ 500/- ప్రతులకు: అనిల్ బత్తుల, ఫోన్: 967 636 5115.*

# చారిత్రక నవల - ఒక తులనాత్మక పరిశీలనము

- రమేష్ ప్రసాద్ రావెళ్ళ

ఏ భాషలోనయినా చారిత్రక నవలకో ప్రత్యేకస్థానం ఉంటుంది. చరిత్రకు తగు మోతాదులో కాల్పనికం జోడైనప్పుడు అది ఎంతో విజ్ఞానపరంగా ఉంటుంది, రసవత్తరంగానూ ఉంటుంది.

ఇది ఎలా సాధ్యం? చరిత్ర, కాల్పనిక నవల పరస్పర విరుద్ధమయిన ప్రక్రియలు కదా! వాటిని మిళితం చేయడం అంత తేలికపని కాదు. ఈ వైవిధ్యాన్ని గురించి ఎందరో వ్రాశారు. రచయిత్రి, సాహిత్య విమర్శకురాలు Joanne Brown ఈ క్రింది విధంగా వ్రాసినదాంట్లోని స్పష్టత, క్లుప్తత నాకు నచ్చింది.

The historian's approach is necessarily broader, examining historical complexities in greater depth and using digressions and footnotes to qualify and explain. Novelists, on the other hand, forego the expansive canvas that historians use in order to create clear characterizations and forward-moving plot lines that arrive, finally, at resolutions often denied to history.

చారిత్రకుని లేని స్వేచ్ఛ కాల్పనిక రచయితకు ఉంటుంది. వాస్తవికత కన్నా కాల్పనికత ఒక్కోసారి అతివాస్తవికతగా కనపడుతుంది.

చరిత్ర గత కాల పంకంలో ఘనీభవించిన బండ రాయి లేక శిల్పం. కల్పన విశాల గగనంలో విహరిస్తూ, విన్యాసాలు చేసే విహంగం. చారిత్రక నవల ఆ నవలాకారుని చేతిలోని పతంగం. ఆ గాలిపటానికి పక్షికి ఉన్నంత స్వేచ్ఛ ఉండదుగాని రంగురంగుల తోకతో ఆకాశనాట్యం చేయగలదు. కాల్పనికతకు ఉన్న శక్తిని Aristotle (384-322 BCE) గుర్తిస్తూ, అది నిర్జీవ వస్తువులకు అలంకార జీవితాన్ని ఇస్తుందన్నాడు. అలంకార శాస్త్రజ్ఞుడు రుద్రటుడు (తొమ్మిదో శతాబ్దం) చెప్పిన రసహీనమైన రచన నిష్ప్రయోజనం అన్న సూత్రం అరిస్టాటిల్ చెప్పిన భావానికి అన్వయించవచ్చును.

వాస్తవికతకూ, కాల్పనికతకూ ఉన్న భేదాన్ని వివరిస్తూ, చింతనకు రూపకం, అలంకారం (Metaphor) ఎంత అవసరమో, అరిస్టాటిల్ తన Rhetoric గ్రంథంలో ఈ విధంగా సూచించినాడు.

We all naturally find it agreeable to get hold of new ideas easily: words express ideas, and therefore those words are the most agreeable to us that enable us to get hold of new ideas. Now strange words simply puzzle us; ordinary words convey only what we know already; it is from the metaphor that we can best get hold of something fresh.

చరిత్రాత్మక నవల అనగానే మనం అవి రాజులు, రాణులు, సామ్రాజ్యాలు, యుద్ధాలకు సంబంధించినవి అని అనుకుంటాము. చరిత్ర వాస్తవికత, చారిత్రక నవల ఉత్ప్రేక్ష, రూపకం. హంగరీ దేశస్థుడు, మార్క్సిష్టు, సాహిత్య సిద్ధాంతకర్త జార్జ్ లూకాచ్ Georg Lukács (1885-1971) చారిత్రక నవలకు అయిదు లక్షణాలుండాలని ప్రతిపాదించాడు. అందులో ముఖ్యమైనవి ఈ నవలల్లో చారిత్రక వ్యక్తులు నామ మాత్రికులేననీ, సమాజంలోని సాధారణుల జీవితాలు, అందులో మార్పులను ప్రతిబింబించాలన్న సూచనలు.

మరి శ్రీశ్రీ కూడా అదే అన్నాడు, తనదైన శైలిలో.

ఏ యుద్ధం ఎందుకు జరిగెనో?
ఏ రాజ్యం ఎన్నాళ్ళుందో?
తారీఖులు, దస్తావేజులు
ఇవి కావోయ్ చరిత్రకర్థం.
అవి కాక మరేమిటండీ, శ్రీశ్రీ గారూ?
సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహస మెట్టిది?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్,
అది మోసిన బోయీ లెవ్వరు?
...



మహీధర
రామమోహనరావు

చారిత్రక విభాతసంధ్యల
మానవకథ వికాసమెట్టిది?
ఏ దేశం ఏ కాలంలో
సాధించిన దే పరమార్థం?
ఏ శిల్పం? ఏ సాహిత్యం?
ఏ శాస్త్రం? ఏ గాంధర్వం?
ఏ వెల్గులకీ ప్రస్థానం?
ఏ స్వప్నం? ఏ దిగ్విజయం?

ఇలాంటి ప్రశ్నలకు చరిత్ర జవాబు చెప్పలేదు. చారిత్రక నవలలతోనే ఇది సాధ్యం అవుతుంది.

అమెరికన్ చరిత్రలో సామ్రాజ్యాలు, రాజులూ లేరుగదా. కాని చారిత్రక ఘట్టాలు ఉన్నాయి. అందువల్లనే అమెరికన్ చారిత్రక నవలలు ఆ ఘట్టాల నేపథ్యంలోనే ఉంటాయి. అమెరికన్ స్వాతంత్ర్య, విప్లవ యుద్ధము (1775-1783), అంతర్యుద్ధము (1861-1865), మొదటి ప్రపంచ యుద్ధము (1914-1918), రెండవ ప్రపంచ యుద్ధము (1939-1945) ముఖ్యమయిన చారిత్రక ఘట్టాలు. వీటిపై ఎన్నో చారిత్రక నవలలు వచ్చాయి. అన్నిట్లోకి బహుళ ప్రజాదరణ పొందిన చారిత్రక నవల మార్గరెట్ మిఛెల్ (1900-1949) అంతర్యుద్ధము ఘట్టంపై వ్రాసిన Gone with the Wind (1936). దీనిని ఎం.వి. రమణారెడ్డి తెలుగులోకి "చివరకు మిగిలింది?" అనే పేరుతో అనువాదం చేశారు. ఈ నవల నవ్య వీక్లీలో ధారావాహికంగా వచ్చింది.

అమెరికాలో వచ్చిన ఆర్థిక మహాసంక్షోభం (Great Depression, 1929-1939)పై జాన్ స్టీన్ బెక్ 1939లో వ్రాసిన "రగులుతున్న ద్రాక్షలు" (Grapes of Wrath) ఒక మహత్తర చారిత్రక నవల. సంవత్సరాల పాటు వర్షాల్లేక, దేశం మధ్యలోని వ్యవసాయ రాష్ట్రాలలో పంటభూములన్నీ ఎడారులయిపోయినవి. గాలి దుమ్ములతో ఆ విశాల భూములన్నీ ధూళి భాండంగా, దుమ్ము బొచ్చెగా (DustBowl) తయారయ్యాయి. సన్నకారు రైతులు తమ కుటుంబాలతో కాలిఫోర్నియా వలస వెళ్ళి అక్కడ పండ్ల తోటల్లోనూ, నిర్మాణ రంగంలోనూ రోజువారీ కార్మికులయ్యారు. ఈ పేద వలస కుటుంబాల హృదయ విదారక జీవితాల గురించి వ్రాసిన నవల ఇది. ఈ నవలకు నేషనల్ బుక్ అవార్డు, పులిట్జరు ప్రైజు లభించాయి. స్టీన్ బెక్‌కి 1962లో నోబెల్ బహుమతి రావటానికి ఈ నవల ముఖ్య కారణం. Grapes of Wrath నవల గురించి ఒక చిన్న విషయం. అది స్టీన్ బెక్ వ్రాసినప్పుడు సమకాలీన (Contemporary) నవల. చారిత్రక నవలలో ఇతివృత్త కాలానికి, రచన కాలానికి మధ్య కనీసం 50 సంవత్సరాలు ఉండాలి అంటారు సాహిత్య సూత్రాచార్యులు. కాని ఇప్పుడు అది చారిత్రక నవలగా మనం గ్రహించవచ్చునని నా అభిప్రాయం. మహీధర రామమోహనరావు వ్రాసిన "కొల్లాయి గట్టితేనేమి?" నవల విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. సమకాలీనం కాకపోయినా, రెండుతరాల కాలభ్రమణం లేదు. తెలుగులో దుగ్గిరాల రామచంద్రయ్య (విజయనగర సామ్రాజ్యము), విశ్వనాథ సత్యనారాయణ (ఏకవీర, బద్దన్న సేనాని), మల్లాది వసుంధర (తంజావూరు పతనం, సప్తపర్ణి), ధూళిపాళ శ్రీరామమూర్తి (భువన విజయము, గృహరాజు మేడ), పాటిబండ్ల మాధవ శర్మ (రాజశిల్పి), తెన్నేటి సూరి (చెంఘిజ్ ఖాన్), మహీధర రామమోహనరావు (కొల్లాయిగట్టితేనేమి?), ముదిగొండ శివప్రసాద్ (తంజావూరు విజయము, ఇంకా ఎన్నో), నోరి నరసింహ శాస్త్రి, అడివి బాపిరాజులాంటి ఎందరో ప్రసిద్ధులు చారిత్రక నవలలు వ్రాశారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు (నేటి ఆంధ్ర యూనివర్సిటీ) 1951లో జరిపిన చారిత్రిక నవలల పోటీలో మల్లాది వసుంధర, ధూళిపాళ శ్రీరామమూర్తి, పాటిబండ్ల మాధవశర్మ తమ పై జెప్పిన నవలలతో విజేతలుగా ఒక్కొక్క నవలకు వెయ్యి రూపాయలు చొప్పున బహుమతులు గెల్చుకున్నారు.

ఈ వ్యాసంలో నోరి నరసింహ శాస్త్రిగారు, అడవి బాపిరాజుగారు వ్రాసిన కొన్ని చారిత్రక నవలలను పరిచయం చేసి, తులనాత్మక పరిశీలనా ప్రయత్నం చేస్తాను.

ముందు వారిరువురు వ్రాసిన చెరి మూడు చారిత్రక నవలలను స్థూలంగా పరిచయం చేస్తాను.

✧ ✧ ✧

**నారాయణ భట్టు** (నోరి నరసింహశాస్త్రి)

ఈ నవల పదకొండో శతాబ్దంలోని చోళచక్రవర్తి రాజరాజనరేంద్రుని ఆస్థానంలోని కథ. రాజమహేంద్ర

నగరంలో (నేటి రాజమండ్రి) ఆ చక్రవర్తికి నారాయణభట్టు మంత్రి. నన్నయభట్టు ఆస్థానకవి. ఇద్దరు భట్టులు చిరకాల మిత్రులు. అప్పటి క్రీడలు, ఉత్సవాలు, దైనందిన జీవితం, వైదిక బౌద్ధమతాల మధ్య అంతర్గత పోరాటాలు, ఆస్థాన రాజకీయాలు, రాజకీయ విప్లవాలు ఈ నవలలో చక్కగా చిత్రించారు. సముద్రతీరంలో ఉన్న విశాఖపట్నం, భీమునిపట్నం, మోటుపల్లి, కృష్ణాపట్నం లాంటి రేవు పట్నాలు అప్పటికే ప్రసిద్ధిగాంచినవని ఇందువల్ల తెలియవస్తుంది. రాజరాజనరేంద్రుడు నన్నయభట్టుని మహాభారతాన్ని తెలుగులో వ్రాయమని ఆదేశిస్తాడు. నన్నయ ఆ బృహత్తర కార్యక్రమంలో నిమగ్నమయి ఉన్నప్పుడు నవల ముగుస్తుంది.

✧ ✧ ✧

**రుద్రమదేవి** (నోరి నరసింహశాస్త్రి)

పదమూడో శతాబ్దంలో ఓరుగల్లు పట్టణం రాజధానిగా కాకతీయ సామ్రాజ్యాన్ని ఏలుతున్న గణపతి దేవమహారాజు వృద్ధాప్యములో తన పుత్రిక రుద్రమదేవికి పట్టం కడతాడు. రుద్రమదేవి భర్త చాళుక్య రాజు వీరభద్రేశ్వరునికి ఆ నిర్ణయం నచ్చదు. తన మొదటి భార్యకు పుట్టిన తనయుడు మహారాజు కావలయునని అతడి కోరిక. కొందరు సామంత రాజులతో కలిసి రుద్రమదేవిని ఓడించవలెనని కుట్ర చేస్తాడు. రుద్రమదేవి ఆ తిరుగుబాటు చేసిన రాజులను ఓడించి, వీరభద్రేశ్వరుడుని శిక్షిస్తుంది. సామ్రాజ్యాన్ని సురక్షితం చేస్తుంది.

తిక్కన సోమయాజి నెల్లూరు నుండి ఓరుగల్లు వచ్చి, అక్కడ మహాభారత పఠనం చేస్తుంటాడు. నోరి వారు తిక్కన గురించి, ఓరుగల్లులోని సాధారణ ప్రజల దైనందిన జీవితాలను గురించి విపులంగా వర్ణించినారు. పతాక సన్నివేశంలో మహారాష్ట్రుల సైన్యం రుద్రమదేవి కోటను ముట్టడించినప్పుడు, వారిని ఓడించిన వైనం ఎంతో ఉత్కంఠభరితంగా ఉన్నది.

✧ ✧ ✧

**కవిద్వయం** (నోరి నరసింహశాస్త్రి)

ఈ నవల శ్రీనాథుని (15వ శతాబ్దం) అంతమదశనూ, పోతన మహాభాగవతము వ్రాయక ముందు యువ కవిగా ఉన్నప్పటి కాలంనూ వివరిస్తుంది.



నోరి నరసింహశాస్త్రి

శ్రీనాథుడు తన రెండవ భార్య భూదేవితో శ్రీశైలం వెళతాడు. అక్కడ మూడు నెలలు ఉండి శివరాత్రి మహాత్మ్యము కావ్యము వ్రాసి తనకు ఆశ్రయమిచ్చిన దండురాజుకి అంకితం ఇస్తాడు. పోతన శ్రీశైలం వచ్చి శ్రీనాథుడితో రెండు మూడు రోజులు గడుపుతాడు. శ్రీనాథుడు ఇలా అంటాడు.

‘‘పోతనా, నీవు తప్పక భాగవతము ఆంధ్రీకరింపవలె. నీలో నాకు మొదటినుంచీ శ్రీకృష్ణ పరమాత్మ కళావేశము గోచరిస్తున్నదోయి. తప్పక వ్రాసి కృతార్థుడవు కావలె.’’

శ్రీనాథుడు నేటి విజయవాడ దగ్గరి తన స్వస్థానము బొడ్డుపల్లెకి వస్తూ, దారిలో మాచెర్ల దగ్గర చంద్రవంక తీరాన కొద్ది రోజులు ఆగి, పల్నాటి వీరచరిత్రము వ్రాసెను. వ్రాయసకాడు పిడుగు వీరభద్రునికి, శ్రీనాథునికి ఉన్న అనుబంధమూ, వారి సంభాషణలు రసవత్తరంగా ఉన్నవి.

బొడ్డుపల్లెలో శ్రీనాథుని పొలాలు కొంత వరదలో దెబ్బతిన్నాయి. పైరు కంకెలను పిట్టలు తినివేశాయి. ఆదాయం లేకపోవటంతో టంకం కట్టలేకపోతాడు. అధికారులతో దెబ్బలు తిని స్పృహ కోల్పోతాడు. అమరావతి ప్రజలు డబ్బు పోగుజేసి టంకం కట్టి శ్రీనాథుని విడిపిస్తారు. తరువాత శ్రీనాథుడు ప్రస్థానం చేస్తాడు.

నవల తరువాతి భాగం పోతన గురించి సాగుతుంది. పోతన తండ్రి కేసన చావుబ్రతుకుల్లో ఉన్నాడు. పోతన అన్న తిప్పన్నకు, ఇతర కుటుంబ సభ్యులకు భేదాభిప్రాయము వస్తుంది, తమ తండ్రి చనిపోతే, ఖననము (పాతి పెట్టుట) లేక దహనము (కాల్చుట) చేయాలా అన్న విషయం గురించి. ఈ విషయచర్చ ఎన్నో పేజీలకు సాగుతుంది. ఇది నాకు అప్రస్తుతం అనిపించింది. పైగా ఖననం చేసినచో పోతన తల్లికి సహగమనం చేయటానికి వీలుండదని, దానికి వ్యతిరేకత అట. సహగమనం ఓడిపోయిన రాజుల రాణివాసాల్లో స్త్రీలు శారీరక, మానసిక భంగములు తప్పించుకోవటానికి చేసే దుర్భరచర్య కానీ, సాధారణ స్త్రీలకు పైగా శాంతికాలంలో ఈ చర్యకు అవసరంలేదు గదా! ఈ విషయ ప్రస్తావనలో


అడవి బాపిరాజు

నోరివారి ప్రతీకాత్మకత లేక గుర్తిమి (Symbolism) నాకు బోధపడలేదు. తరువాత పోతన భాగవతరచన మొదలుపెట్టిన సన్నివేశంతో నవల ముగుస్తుంది.

✧ ✧ ✧

**అంశుమతి**

(అడవి బాపిరాజు)

ఈ నవల ఏడవ శతాబ్దంలో తూర్పు చాళుక్యులు ఆంధ్ర చాళుక్య సామ్రాజ్యమును స్థాపించిననాటి గాథ. వేంగీ రాజ్యాధిపతి విష్ణుకుండిన మంచన భట్టారకుని ఏకైక పుత్రిక అంశుమతి. పదునెనిమిది వర్షముల ప్రాయములో నున్న అత్యంత సౌందర్యరాశి. ఎందరో రాజకుమారులు ఆమెను వివాహమాడ కోరుతూ రాయబారములు వేంగీ రాజుకి పంపుతున్నప్పటికీ అంశుమతి ఆ రాయబారాలనన్నిటినీ తిరస్కరించింది. ఏదైనా గ్రహచారము ఉన్నదేమోనని గోదావరిలో నలుబది దినములు స్నానవ్రతము చేయుమని అంశుమతిని గోవూరు పంపించినారు ప్రభువులు. ఒకరోజు స్నానవ్రతము ముగించి రాజనౌకలో గోవూరులోని తన విడిదికి వెళ్ళుతుండగా కళింగ రాజ్యదుండగులు అంశుమతిని అపహరించి కళింగరాజులు ఆక్రమించిన పిష్టపురం కోటలో బంధించారు.

ఇది ఇలా ఉండగా, వాతాపి చాళుక్య సామ్రాట్టు పులకేశి మహారాజు తన చిన్న తమ్ముడగు కుబ్జ విష్ణువర్ధనుడిని ఆంధ్రప్రాంతపు చిన్నచిన్న రాజ్యాలను జయించి, తూర్పుచాళుక్య సామ్రాజ్యాన్ని స్థాపించుమని పంపినాడు. అ ప్రయత్నంలో విష్ణువర్ధనుడు పిష్టపురంను రహస్యంగా చుట్టుముట్టి అకస్మాత్తుగా ఒక అర్ధరాత్రి ఆ కోటపై దండెత్తి, కళింగులపై విజయం సాధించెను. అక్కడ బందీగా ఉన్న అంశుమతికి విముక్తి లభిస్తుంది. అంశుమతి, విష్ణువర్ధనుడుఒక పుష్పవనంలో (ఇంకెక్కడ?) అనుకోకుండా తారసపడి, తమ తమ పుట్టుపూర్వోత్తరాలను తెలుపకుండా ప్రేమలో పడతారు. వేంగీ రాజు మంచన భట్టారకుడు వారి ప్రేమ వ్యవహారము తెలుసుకొని, తన పుత్రిక అంశుమతిని విష్ణువర్ధనుడికి ఇచ్చి వైభోగంగా వివాహం జరిపి, తన వేంగీ రాజ్యాన్ని విష్ణువర్ధనుడుకి కట్టబెట్టుతాడు. ఆ విధంగా కుబ్జ విష్ణువర్ధనుడు ఆంధ్ర చాళుక్య సామ్రాజ్యాన్ని స్థాపించినాడు. ఆ మహా సామ్రాజ్యానికి మూలపురుషుడయినాడు.

✧ ✧ ✧

**గోన గన్నారెడ్డి** (అడివి బాపిరాజు)

కాకతీయ సామ్రాజ్యాధిపతి గణపతిదేవుని సామంతులలో ఒకడయిన గోన బుద్ధారెడ్డి తనయుడు గన్నారెడ్డి. బుద్ధారెడ్డి వృద్ధాప్యంలో గన్నారెడ్డి బాగోగులను తన తమ్ముడు లకుమాయారెడ్డికి అప్పజెప్పి, తన రాజ్యాన్ని కూడా అప్పజెప్పి, గన్నారెడ్డి పెద్దయ్యాక ఆ సామంత రాజ్యాన్ని గన్నారెడ్డికి ఇవ్వవలసినదిగా కోరుతాడు, తరువాత చనిపోతాడు.

ఆదవోని మహారాజు కోటారెడ్డి కుమార్తె అన్నమాదేవి (అన్నాంబిక) పెళ్లి లకుమాయారెడ్డి కొడుకు వరదారెడ్డితో పెళ్లి జరగబోతున్నప్పుడు గన్నారెడ్డి తన అనుచరులతో వెళ్లి మందిరంపై దాడి చేసి వరదారెడ్డిని లాక్కుని తీసుకొని పోతారు. వివాహం ఆగిపోతుంది.

గణపతిదేవుడు పుత్రాభావంచేత తన ప్రథమ పుత్రిక రుద్రమదేవిని పురుషునిగా పెంచి, ఆమె స్త్రీత్వాన్ని గోప్యంగా ఉంచి, తన సర్వసేనాని కుమార్తె ముమ్మిడమ్మతో వివాహం చేస్తారు. రుద్రమదేవి ముమ్మిడమ్మకు తన రహస్యం చెప్పి, సరైన సమయంలో తన రహస్యం ప్రజలకు తెలుపుతాననీ, అప్పుడు ముమ్మిడమ్మకు పెళ్లి జరిపిస్తాననీ చెప్పుతుంది.

అన్నాంబిక, గన్నారెడ్డి ప్రేమలో పడతారు. అన్నాంబికను తన అక్క సాయంతో ఆదవోని నుండి ఓరుగల్లు తెప్పించి రుద్రమదేవి రాణివాసంలో చేర్పిస్తాడు. రుద్రమదేవి, ముమ్మిడమ్మ, అన్నాంబిక స్నేహితురాళ్ళు అవుతారు. రుద్రమదేవి గన్నారెడ్డి సహాయంతో తిరుగుబడిన సామంత రాజులను ఓడిస్తుంది. రుద్రమదేవి చాళుక్య వీరభద్రమహారాజుని వరించి, వివాహం చేసుకొంటుంది. ముమ్మిడమ్మకు వీరభద్రమహారాజు తమ్ముడయిన చాళుక్య మహాదేవ మహారాజుకిచ్చి పెళ్లి జరిపిస్తుంది. గన్నారెడ్డి గజదొంగ కాదనీ, కాకతీయ సామ్రాజ్య భక్తుడనీ జగద్విదితం అవుతుంది. అన్నాంబిక, గన్నారెడ్డి దంపతులవ్వుతారు. స్థలాభావంవల్ల ఈ పరిచయాన్ని విశేషంగా కుదించాను. ఈ నవలకు

pustakam.net లో బెల్లంకొండ లోకేష్ శ్రీకాంత్ వ్రాసిన చక్కటి పరిచయం ఇక్కడ చదవవచ్చును.

http://pustakam.net/?p=4075

✧ ✧ ✧

**హిమబిందు** (అడివి బాపిరాజు)

శాతవాహన మహారాజు శ్రీముఖుని కాలంలో రాజధాని పట్టణం ధాన్యకటకంలో చారుగుప్తుడు ప్రముఖ వర్తకుడు, అత్యంత ధనవంతుడు. అందాలరాశి అయిన తన పుత్రిక హిమబిందుని శ్రీముఖుని జ్యేష్ఠపుత్రుడు శ్రీకృష్ణయువరాజుకిచ్చి పెళ్లి చేయాలని అతని కోరిక. ఎడ్లబండి పందాలలో తన బంగారు శకటము గెలిస్తే, ఆ బండిని యువరాజుకి బహూకరించి, మహారాజువారి మన్ననలను పొందితే, హిమబిందు, శ్రీకృష్ణుల వివాహం జరగడానికి వీలుంటుందని చారుగుప్తుడు భావించాడు. కాని ఆ పందెంలో ఇంకొక శకట చోదకుడు సువర్ణశ్రీ గెలుస్తాడు. హిమబిందు సువర్ణశ్రీతో ప్రేమలో పడుతుంది.

శాతవాహనులు బౌద్ధమతాభిమానులు. స్థౌలతిష్యులు అనే హిందు మహర్షి శాతవాహనుల సామ్రాజ్యాన్ని హిందు సామ్రాజ్యంగా మార్చటానికి ఒక పన్నాగం పన్నినాడు. తన మనుమరాలు చంద్రబాలను విషకన్యగా చేసి, ఆమె తన దగ్గరతనంతో శ్రీకృష్ణుని చంపివేయటం, మహారాజు రెండవ పుత్రుడు మంజుశ్రీని తస్కరించి, అతనికి రహస్యంగా హిందూమత బోధ చేసి, అతన్ని మహారాజుగా గద్దె ఎక్కించడం అతని పన్నాగం. కాని శ్రీకృష్ణుడు చంద్రబాలను ప్రేమించి, రాజవైద్యుల మందులతో చంద్రబాలను అమృత కన్యగా మార్చి, పెళ్లి చేసుకొంటాడు. హిమబిందు, సువర్ణశ్రీ కూడా పెళ్లి చేసుకొంటారు. చారుగుప్తుడు, స్థౌలతిష్యులు వేసిన ఉపాయాలు ఫలించలేదు. ప్రణయాలు వేరే దారికి మళ్ళాయి.

ఎడ్లబండ్ల పందెము, హిమబిందుని దుండగులు అపహరించటం, సువర్ణశ్రీ ఆమెను కాపాడటము, ఇంకా ఎన్నో సన్నివేశాలు పాఠకుడిని కట్టివేస్తాయి. బాపిరాజుగారు అప్పటి సాధారణ జీవన విధానాలను కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు.

✧ ✧ ✧

**తులనాత్మక పరిశీలన**

(Comparativeanalysis)



తెన్నేటి సూరి

తులనాత్మక పద్ధతి అనగా ‘‘సమానేతి వృత్తములుగల కావ్యములను, సమాన ధర్మము గల కవులను, సమకాలికులైన కవులను పరస్పరము పోల్చి చూచుచు తారతమ్య నిరూపణము చేయవలెను.” అని పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర సాహిత్య చరిత్రలో వ్రాశారు. ఆ ప్రయత్నం ఇప్పుడు చేస్తాను.

నోరి నరసింహ శాస్త్రి కవి, నవలా రచయితయే కాదు, ప్రముఖ సాహిత్య విమర్శకుడు. తాను వ్రాసిన చారిత్రక నవలలను, బాపిరాజు నవలలను పోలుస్తూ ఇలా వ్రాసారు. “శ్రీ నోరి నరసింహ శాస్త్రి ప్రకృతి ఒకవిధంగా బాపిరాజు ప్రకృతికి విరుద్ధమైనది. బాపిరాజు ఉత్సాహము నిరంకుశంగా పొంగులెత్తుతుంది. నోరి ఉత్సాహము సంయమనంతో నిండి ఉంటుంది. బాపిరాజుకి ఆంధ్రాభిమానమెక్కువ. నోరికి మహాభారతాభిమాన మెక్కువ.”

నోరివారు కవిప్రియుడు. వారు వ్రాసిన చారిత్రక నవలలన్నిటిలోనూ కవుల ప్రసక్తి ఉంటుంది. ‘‘నారాయణభట్టు’’ ఆదికవి నన్నయ గురించి, ‘‘రుద్రమదేవి’’ తిక్కన సోమయాజి గురించి, “కవిద్వయము” శ్రీనాథుడు, పోతన గురించి ఉన్నాయి. పైగా “మల్లారెడ్డి” అనే నవలలో ఎర్రన ప్రసక్తి ఉంటుంది. ఇక “కవి సార్వభౌముడు”, “ధూర్జటి” నవలల్లో కవులే ప్రధాన పాత్రలు.

నోరివారి శైలి చాలా సరళంగా ఉంటుంది. పాత్రల చిత్రణ, సన్నివేశాలు సహజంగా పరిమిత స్థాయిలో ఉంటాయి. అక్కిరాజు రమాపతి రావుగారు నోరివారి గురించి ఇలా వ్రాసారు. “చారిత్రక నవలలు వ్రాయటంలో, నాటి సామాజిక వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తూ, భావుకతా స్ఫోరకంగా, పాత్ర చిత్రణలో సజీవికా రామణీయక స్ఫూర్తితో, ఇతివృత్త నిర్మాణం చేయడం నోరివారి రచనా విశిష్టత.”

బాపిరాజు కవి, చిత్రలేఖకుడు, చలనచిత్ర దర్శకుడు. చాలా సన్నివేశాలు దృశ్యప్రాధాన్యంగా ఉంటాయి. కళ్ళకు కట్టినట్లుండు ఆ వర్ణనలతో పాఠకులు ఆ చలనభూరిత సన్నివేశాల్లో లీనమయిపోతారు. బాపిరాజుగారికి ఆంధ్రాభిమానము, స్త్రీ పాత్ర ప్రేమ అతి మోతాదులో ఉంటాయి. ఆంధ్రుల వీరత్వం గురించిగాని, వారు పండించే పంటల గురించిగాని ఏ ప్రసక్తి వచ్చినా ఆయన్ని ఆపడం కష్టం. కళ్ళెం వదిలిన గుర్రంలాగా దూసుకు పోతారు. స్త్రీ పాత్ర వర్ణనలూ అంతియే. బాపిరాజుకి స్త్రీ పాత్రలపై మిక్కిలి మక్కువ. ఆ నాయికలను ఆకాశానికి ఎత్తేస్తారు. చదువరులు కూడా దిగ్భ్రమ చెందుతారు, మంత్రముగ్ధులవుతారు.

నోరి నరసింహ శాస్త్రి బాపిరాజు గురించి ఇలా వ్రాశారు. "ఆంధ్ర చారిత్రక నవలను ఆంధ్ర సారస్వత పరిధిని దాటించినవారిలో ప్రథముడు అడవి బాపిరాజు. ఆయన మూడు చారిత్రక నవలలలో "హిమబిందు" నిస్సందేహంగా ప్రపంచ భాషలలోని ఉత్తమ నవలల స్థాయినందుకొన్నది."

నా ఉద్దేశంలో నోరివారి "నారాయణభట్టు" కూడా అదే కోవకు చెందుతుంది.

బాపిరాజుగారిపై ప్రశంసలు కొన్ని చూద్దాము.

**అక్కిరాజు రమాపతి రావు** (తెలుగు నవల): "స్వర్గీయ అడవి బాపిరాజు అన్నిటా భావుకుడు. గంధర్వ లోకాల నుండి శప్తుడై వచ్చి తెలుగు దేశంలో కవిగా, చిత్రకారుడిగా, భావుకుడిగా, సౌందర్య పిపాసిగా, కళావేత్తగా ఆయన జన్మించారేమోననిపిస్తుంది. తెలుగు దేశం, తెలుగు భాష, తెలుగు చరిత్ర, తెలుగు విజ్ఞానం, తెలుగు అన్నది ఏదైనా ఆయనను పులకింపచేసేది, పరవశింపచేసేది."

E. Nageswara Rao (Indian Literature Magazine, Sahitya Academy): "In himabindu, Bapiraju is concerned with the recreation of great epoch in fictional terms.His internal framework is historical and there is a good deal of internal evidence to suggest that he studied with painstaking attention to minute detail the geography, history, politics, religion, warfare, the fine arts, traditions and customs of that period. The novel has an encyclopedic range in its depiction of the life and times of the Satavahanas."

**కురుగంటి సీతారామ భట్టాచార్యులు** (హిమబిందు నవల పీఠిక): "బాపిరాజు ఉపమానములొకప్పుడు వాల్మీకిని తలపింపజేయును.... రత్నములవలె నెడనెడ పొదుగబడియున్నవి. సంభాషణములు కడు హృదయంగమములుగ నుండి పాత్రల శీలమున కుచితములై సమంజసములైయుండును. ఎక్కడ చదువుచున్నను కవి శిల్పిగనో, చిత్రకారునిగనో, బాలునిగనో, శాస్త్రవేత్తగనో తొంగి చూచుచుండును."

బాపిరాజుగారిపై ప్రశంసలతో పాటు విమర్శలూ ఉన్నాయి.

**అక్కిరాజు రమాపతిరావు** (తెలుగు నవల): "బాపిరాజు నవలల్లో ఇతివృత్తానికి అపరిహార్యం కాని విషయాలు కూడా విశేషంగా చోటుచేసుకొంటాయనీ, పాత్ర చిత్రణం, వర్ణనలు మొదలైనవాటిలో వైవిధ్యం కూడా చెప్పుకోదగినంతగా కనిపించదనీ ఒక విమర్శ ఉన్నది."

**నిడదవోలు మాలతి** (తూలిక బ్లాగు): "గోనగన్నారెడ్డిలో నాయకీనాయకుల వర్ణనలతో పాటు యుద్ధవర్ణనలు కూడా కొంచెం అతిగానే అనిపించాయి. కథనంలో కొంత గందరగోళం కూడా ఉంది."

**బెల్లంకొండ శ్రీనివాస్** (పుస్తకం.నెట్): "గోనగన్నారెడ్డి నవల చదవడానికి చాలా ఓపిక, ఏకాగ్రత కావాలి. రచన గ్రాంథిక భాషలో సాగటం ఇందుకు కారణం కాకపోయినా, వాక్యనిర్మాణం, రాజవంశీయుల చరిత్రలు, వారి పేర్లు (ఒకే పేరు ఇద్దరు ముగ్గరికి ఉండటం), బిరుదులు కొన్నిసార్లు తికమక పెడతాయి. కథలో ప్రధాన పాత్రలకే కాకుండా, ఇతర పాత్రలకు కూడా స్తోత్రపాఠాలు వ్రాశారు బాపిరాజుగారు. సగం పేజీ ఆక్రమించే ఆ బిరుద పాఠాలు చాలాచోట్ల అనవసరమనిపిస్తాయి."

చూశారా, బాపిరాజుగారిలాగే వారి ప్రశంసకులు, విమర్శకులు కూడా మోతాదు మించారు కదా!

మరి నావంతు. ''హిమబిందు'' నవలలో హిమబిందుని ప్రియుడు సువర్ణశ్రీ చూస్తుంటాడు.

"ఆమె భుజరేఖలు సువ్వన బారి అంగులీరేఖలలో వికస్వరమైనవి. బాహుమూల పార్శ్వశోభారేఖలు

వక్షోపరీనమున్నత సుందరాకృతులు తాల్చి, వక్రపతనావేగమున డిగ్గనురికి మధ్యదేశమున నించుక కాలూని, మలుపులై నితంబచక్రముల సుళ్ళుతిరిగి ప్రవహించి, ప్రవహించి పదరేఖల మొగ్గలు దొడిగినవి.”

ఇందులో నాకు విచిత్రంగా కనపడినదేమిటంటే ఈ వర్ణన హిమబిందుపై కాదు. ఆమె ప్రతిమ వర్ణన. ఆమె యొక్క రేఖాచిత్రం (Sketch) గీస్తే, ఎలా ఉంటుందో, లేక ఆమె శిల్పం చెక్కితే ఎలా ఉంటుందో ఆ ఊహా చిత్రపు వర్ణన. అందులోనూ కేవలం బాహిర్యరేఖలు (Outerlines) మాత్రమే. వక్షస్థానం నుండి మధ్యస్థానంవరకూ వంకరగీత వడిగా పడిపోతుందట, అక్కడ కొంచెంసేపు ఆగిపోతుందట. మరి చిత్రకారుడలాగే గదా గీసేది, చిత్రప్రేక్షకుడు అలాగే కదా చిత్రాన్ని చూసేది. సువర్ణశ్రీ స్వతహాగా శిల్పి. చిత్రలేఖనంలో సిద్ధహస్తుడయిన బాపిరాజుగారు ఇక్కడ హిమబిందుని కాకుండా, ఆ యువశిల్పి ఊహలో ఆ సౌందర్యవతి శిల్పం ఎలా ఉంటుందో, ఆ ప్రతిమను వర్ణిస్తున్నాడు.

శ్రీ విద్యానాథుని “ఆంధ్ర ప్రతాపరుద్రీయము” (జమ్మలమడక మాధవరామశర్మగారి అనువాదం) అలంకారశాస్త్రం చూస్తే బాపిరాజుగారు ఇక్కడ వాడినది భావికాలంకారం అని అర్థమయినది.

మన చరిత్రలోకి వెళ్ళితే, ఆంధ్రులవి నాలుగు సామ్రాజ్యాలు. వరుసవారిగా అవి శాతవాహన సామ్రాజ్యము (100 BCE - 2nd century CE), తూర్పు చాళుక్య (624–1189), కాకతీయ (1163–1323), విజయనగర (1336–1646) సామ్రాజ్యాలు. ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఆరు నవలలు ఈ నాలుగు సామ్రాజ్యాల కాలాల్లో జరిగిన కాల్పనిక కథలు. ఈ ఆరు నవలలతో పాటు నరసింహ శాస్త్రి గారు, బాపిరాజు గారు వ్రాసిన ఇతర చారిత్రక నవలలు చదివితే చాలు,మన పూర్వీకుల రెండు వేల సంవత్సరాల చరిత్రకు వీక్షకులమవుతాము. ఆ అన్వేషణకు నోరి, బాపిరాజు గార్లు దిక్సూచకులు. అందుకు తెలుగు పాఠకులువారిరువురికి ఎప్పటికీ ఋణపడి ఉంటారు.

**నోరి నరసింహ శాస్త్రి** (1900–1978): గుంటూరులో పండిత కుటుంబములో జన్మించారు. మద్రాసులో బి.ఏ, బి.ఏల్ చదివారు. గుంటూరు జిల్లాలో కృష్ణానది తీరాన ఉన్న రేపల్లెలో స్థిరపడి, న్యాయవాది వృత్తితో పాటు, తమ సాహిత్య వ్యాసంగం కూడా సాగించారు. ఏబది సంవత్సరాలకు పైగా చేసిన సాహిత్య కృషిలో ఎన్నో నవలలు, కవితలు, నాటకాలు, వందల కొద్దీ సాహిత్య వ్యాసాలు వ్రాశారు.


విశ్వనాధ సత్యనారాయణ

పేరుప్రఖ్యాతులు గడించారు. తెలుగు, సంస్కృతము, ఇంగ్లీషు, కన్నడ భాషలలో పారంగతుడు. కవిసామ్రాట్ బిరుదు నందుకొన్నారు. తల్లావజల శివశంకర శాస్త్రితో కలిసి గుంటూరులో సాహితీ సమితి స్థాపించి, ఎన్నో సాహిత్య ప్రయోగాలు చేశారు. వీరు వ్రాసిన చారిత్రక నవలలు ఎంతో ప్రసిద్ధి చెందినవి. నారాయణ భట్టు, రుద్రమదేవి, మల్లారెడ్డి, ధూర్జటి, కవిసార్వభౌముడు, కవిద్వయము వీరు వ్రాసిన చారిత్రక నవలలు.

అడివి బాపిరాజు (1895–1952) పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో జన్మించారు. రాజమండ్రిలో బి.ఏ, మద్రాసులో బి.ఎల్. చదివారు. కొద్దికాలం న్యాయవాద వృత్తిలో ఉండి, అది మానివేసి, ఇతర వృత్తులలోకి ప్రవేశించారు. మచిలీపట్నంలోని నేషనల్ కాలేజిలో ప్రిన్సిపాల్‌గానూ, తరువాత తెలుగు దినపత్రిక మీజాన్ సంపాదకునిగానూ, ఆ తరువాత విజయవాడ ఆకాశవాణి రేడియోలో సాహిత్య సలహాదారుడుగానూ పనిచేశారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొని, ఒక సంవత్సరం జైలుశిక్ష అనుభవించారు. కొన్ని సినిమాలకు దర్శకుడిగా పనిచేశారు.

బాపిరాజు బాల్యం నుండి కవితలు వ్రాసేవారు. 1934లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు నిర్వహించిన నవలల పోటీలో బాపిరాజు వ్రాసిన నారాయణరావు నవలకు, విశ్వనాథ సత్యనారాయణ వ్రాసిన వేయిపడగలు తో పాటు, ప్రథమ బహుమతి లభించింది. ఎన్నో నవలలు, కథలు, కవితలు, నాటికలు ప్రచురించారు. గోన గన్నారెడ్డి, హిమబిందు, అడవి శాంతిశ్రీ, అంశుమతి బాపిరాజు వ్రాసిన చారిత్రక నవలలు.

డా. రమేష్‌ప్రసాద్ రావెళ్ల
Email:rravella2@gmail.com

# విద్య యొక్క లక్ష్యం

**- కోదాటి వియ్యన్నరావు**

ఆది మానవుని కాలం నుండి విద్యపై మక్కువ ఉన్నట్టు బలమైన సాక్ష్యాలు ఉన్నాయి. ఇంతవరకు బయల్పడిన రెండు ప్రధాన నాగరికతలు (మెసపొటేమియా, ఇండస్)లోను, ఆనాటి మానవులు ఒకరితోనొకరు తమ భావాలను పంచుకొనేటందుకు అవసరమైన భాషపై దృష్టి సారించినట్టు తెలుస్తుంది. ఆ కాలంలో వారు గుర్తులు, చిహ్నాలు ద్వారా తమ భావాలను ఇతరులతో పంచుకొనే ప్రయత్నం చేసినట్టు చెప్పవచ్చు. దురదృష్టవశాత్తు, ఆ రెండు లిపులపైన స్పష్టమైన అవగాహన నేటికీ లభించలేదు. కాని ఆనాటి ప్రజల ప్రయత్నం అభినందించదగ్గది. వారు అవలంభించిన పద్ధతులు, చేపట్టిన నిర్మాణాలు, వారి యొక్క విద్యా కౌశల్యాన్ని స్పష్టంగా తెలియచేస్తున్నాయి. ఆది మానవుని జీవన విధానంలో కూడా కళలకు, కౌశలాలకు (skills) ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. జంతువులను వేటాడడం, మచ్చిక చేసుకోవడం, వాటిని వ్యవసాయానికి ఉపయోగించడం వారికి తెలిసిన విద్యలు. ఆ విధంగా చూస్తే "జీవన పోరాటానికి అవసరమైనదే విద్య".

**గణతంత్ర రాజ్యాల కాలంలో విద్య:**

గణతంత్ర రాజ్యాల స్థాపన వరకు ఉన్న చరిత్రను సమీక్షిస్తే, స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన విద్యా బుద్ధులు, పద్ధతులు, కౌశలాలు అన్నీ ఆనాటి ప్రజలకు సంవృద్ధిగానే ఉన్నాయని చెప్పవచ్చు. రెండు నాగరికతలలోని కట్టడాల నిర్మాణ పద్ధతులను, రహదారులు, పారిశుధ్య ప్రణాళికలను గమనిస్తే వారి యొక్క సాంకేతిక కౌశలం నేటి తరానికి ఏమాత్రం తీసిపోదని చెప్పవచ్చు. కాబట్టి వారి దృష్టిలో 'సుఖమైన, సౌకర్యవంతమైన, మెరుగైన, మేలైన జీవనాన్ని గడపడానికి పనికి వచ్చేదే విద్య'. సమూహాలు గణతంత్ర రాజ్యాలుగా ఏర్పడిన తరువాత విద్యకు ఒక క్రమ పద్ధతి తోడైందని చెప్పవచ్చు. జానపదాలు (నేటి గ్రామాలని చెప్పుకోవచ్చు) కొన్ని కలసి మహాజన పదాలుగా, కొన్ని మహాజన పదాలు 'గణతంత్ర రాజ్యాలు'గా రూపొందించినట్టు చరిత్ర. సుమారుగా ఇవి కామన్ ఇరాకు పూర్వం 600-400 సంవత్సరాల మధ్య కాలంలో ఉన్నట్టు తెలుస్తుంది. అయితే గణతంత్ర రాజ్యాలు ఉన్న కాలంలోనే, కొన్ని మహాజన పదాలు స్వతంత్ర రాజ్యాలుగా కొనసాగాయి. ఈ గణతంత్ర రాజ్యాలలో ఎక్కువగా ప్రచారంలో ఉన్నవి మల్ల, వజ్జి, కాంబోజ, వత్స, అంగ, కాశి, గాంధార, శృసేన, చేది, మత్స్య వంటివి. బుద్ధుని కాలంలో కూడా ఈ గణతంత్ర రాజ్యాలు గంగానదీ తీరంలో ఉన్నట్టు చెప్పబడింది. అలెగ్జాండర్ దండయాత్ర కాలం (కామన్ ఇరాకు పూర్వం 326)లో అలెగ్జాండర్‌కు ఈ సమూహాల నుండే గట్టి ప్రతిఘటన ఎదురైనట్టు చరిత్ర. ఈ గణతంత్ర రాజ్యాల కొన్ని ముఖ్య లక్షణాలు, ప్రస్తుత వ్యాసానికి తోడయ్యే వాటికి దిగువన పేర్కొనటం జరిగింది.

- ✧ స్వయంప్రతిపత్తి. రాజు అనే వ్యక్తి ఎవరూ లేకుండా, ప్రజలే పాలకులుగా వ్యవహరించడం. నేటి ప్రజా వ్యవస్థకు ఇవే మూలం.
- ✧ ప్రజల మధ్య ఐక్యత, సహాయకారిగా ఉండే అలవాటు.
- ✧ ప్రాంతీయ, మత, కుల ప్రాతిపదికలుగా విభజన, వివక్ష లేకుండడం.
- ✧ సామూహిక నిర్ణయాధికారం. వ్యక్తి సామ్యానికి అవకాశం లేకుండడం.
- ✧ అందరూ సమానులే అన్న సామాజిక న్యాయాన్ని (Social Justice) పాటించడం.

ఈ కాలంలోనే ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన సంఘాలు, సమితులు, విధులు, బాధ్యతల వివరణ అనేక విషయాలపరంగా స్పష్టత చేకూరింది.

ఈ విధంగా విద్య యొక్క లక్ష్యాన్నిపై సూత్రాల కనుగుణంగా నిర్వహించాలని చెప్పబడింది. ముఖ్యంగా పౌర వ్యవస్థ, పౌరుల విధులు, బాధ్యతలు, రాజ్యం యొక్క శ్రేయస్సు, బాధ్యతల వంటి విషయాలను చక్కగా నిర్వహించారు. కాబట్టి గణతంత్ర రాజ్యాలు పాటించిన పద్ధతులు నేటి విద్యా విధానానికి ప్రాతిపదికలుగా చేసుకుని, విద్యను మరింత బలోపేతం చేయవచ్చు.


చదువుతున్న యువతి
చిత్రకారుడు: Jean-Honoré Fragonard (1732–1806)

**సామ్రాజ్యాల కాలం:**

ఈ కాలంలో విద్య యొక్క లక్ష్యం, సామ్రాజ్యాల స్థాపన, నిర్వహణ, విస్తరణవంటి విషయాలపై శ్రద్ధ అని చెప్పవచ్చు. నిరంతరం యుద్ధాలు చేయవలసిరావడం, రాజ్య రక్షణ తక్షణ కర్తవ్యంగా ఉన్న కారణంగా యుద్ధ విద్యలు, రాజ్యపాలన మొదలైన విషయాలపైన శ్రద్ధ ఎక్కువగా ఉన్నట్లు గ్రహించవచ్చు. నిజానికి రామాయణ కాలంలో రాజ్యపాలన ఏ విధంగా ఉండాలి, ప్రజలందరు సుఖ-సంతోషాలతో ఉండాలంటే చేపట్టివలసిన కార్యాలు విద్య యొక్క లక్ష్యాలుగా ఉండి ఉంటాయని చెప్పవచ్చు. ఇక మహాభారత కాలంలో దృష్టి అంతా సైనిక విషయాలు, యుద్ధ విద్యలు, రాజులు, రాజ్యాల ఆక్రమణ మొదలైన అంశాలతో మొదలై, మహాభారత యుద్ధంతో ముగుస్తుంది. కొసమెరుపు విద్యాపరంగా, భగవద్గీతోపదేశం. విజ్ఞానం యొక్క స్వభావం, ఆచరణ ప్రధాన అంశాలుగా చెప్పబడిన విజ్ఞాన సర్వస్వం. అదేవిధంగా కౌటిల్యుని అర్ధశాస్త్రమంతా రాజనీతి, రాజ్యపాలన, శత్రురాజులను జయించడం, ఆర్థిక, కోశాగార, గణక అంశాలతో నిండి ఉంది. మొత్తం మీద ఈ కాలంలో 'విద్య' యొక్క లక్ష్యం రాజ్యస్థాపన, రాజ్య రక్షణ, పాలనలకు సంబంధించిన విషయాలపై కేంద్రీకృతమై ఉన్నట్టు చెప్పవచ్చు.

**తత్త్వవేత్తల దృక్కోణంలో విద్య:**

కామన్ ఇరాకు పూర్వం, అంటే 470-399 సంవత్సరాల మధ్య కాలంలో పాశ్చాత్య తత్త్వానికి పునాదులు వేసిన 'సోక్రటీస్' ఉద్దేశ్యంలో 'తెలియని దానిని తెలుసుకోవడమే విద్య'. ఆ విధంగా విద్యార్జన చేయాలంటే ముందుగా మనం, మన అజ్ఞానాన్ని లేదా తెలియనితనాన్ని (Ignorance) అంగీకరించాలి. మనకు అంతా తెలుసుననే భ్రమ నుండి బయటకు రావాలి. విద్యార్థులు ప్రశ్నించే తత్త్వాన్ని అలవాటు చేసుకోవాలి. విద్యార్థులే తమంతట తాము ఏమి తెలుసుకోవలసి ఉన్నది అన్న అంశాన్ని రూఢి చేసుకోవాలి. ఇందులో అధ్యాపకుని పాత్ర ఏమీ ఉండదు. సోక్రటీస్, అతని శిష్యులైన ప్లేటో, జెనోఫెన్‌వంటి వారు స్వీయ శోధన (Self learning) యొక్క ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

తాత్వికుల ఆలోచనా విధానం ప్రకారం 'సత్యాన్ని తెలుసుకోవడం నేర్చుకొనే సిద్ధాంతం యొక్క పరమావధి'. సత్యాన్ని తెలుసుకోవడంలో ప్రశ్నించడం, ఇతరుల విజ్ఞానాన్ని తరచి చూడడం ఇమిడి ఉన్నాయి. సోక్రటీస్ యొక్క గొప్పతనమేమంటే, తాను ప్రతిపాదించిన సూత్రాలను, సిద్ధాంతాలను కూడా తర్కించి, నిగ్గు తేల్చవలసి ఉన్నదని చెప్పాడు. విజ్ఞాన సముపార్జనలో, సత్యాన్ని తెలుసుకోవడంలో అన్ని రకాల వాదనలకు, అనంగీకారాలకు చోటు ఉన్నది. ప్లేటో ప్రకారం విద్య యొక్క ముఖ్య లక్ష్యం న్యాయాన్ని పొందడం. వ్యక్తి న్యాయము, సమాజ న్యాయములు రెండూ ఇందులో ఇమిడి ఉన్నాయి. న్యాయాన్ని పొందడం అంటే సమర్థత (efficiency)ను సాధించడం. ఇది విద్య ద్వారా సమకూరుతుంది. అరిస్టాటిల్ ప్రకారం విద్య యొక్క లక్ష్యం మానవజాతి సంక్షేమం, ఆనందం (welfare and Happiness). విద్యార్థులలో నైతికత (Ethical Character)ను పెంపొందించడమే విద్య యొక్క ముఖ్యోద్దేశ్యం. అరిస్టాటిల్ ప్రకారం చేయడం ద్వారా తెలుసుకోవడం (Learning by Doing) సూత్రంపై ఆధారపడి విద్యా బోధన ఉండాలి. అదేవిధంగా సిద్ధాంతం, ఆచరణ, సాంకేతికతల మధ్య సమన్వయం ఉండాలి. అప్పుడే విద్యకు సార్థకత ఏర్పడుతుంది.

పందొమ్మిదవ శతాబ్దం మొదటి అర్ధభాగంలో జాతీయ విద్యా విధానంపై సమగ్ర చర్చ జరిపిన జాన్-జాక్వెస్ రూసో, విద్య యొక్క లక్ష్యం "వ్యక్తి యొక్క సహజ ప్రవృత్తిని ఉద్దీపనం చేయడమేనని" పేర్కొన్నాడు.

అందుచేత ప్రతి వ్యక్తి తన స్వీయ అనుభవం ద్వారా, ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా సహజ లక్షణాలను ద్విగుణీకృతం చేసుకోవాలి. ఒక జాతి ప్రజలు, వేరొక జాతి ప్రజలకంటే భిన్నంగా ఉండడమనేది విద్య ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. అందువల్లనే ఆధునిక సమాజంలో నేడు మానవ వనరుల ప్రాధాన్యాన్ని గుర్తించి, దేశాల అభివృద్ధిలో సహజ వనరుల కంటే, మానవ వనరుల ప్రాముఖ్యం అధికమని గుర్తించారు. ఇదే ఒరవడిలో నికొలస్ కండొర్సై అనే ఫ్రెంచి తత్త్వవేత్త విద్య యొక్క లక్ష్యం "సమానత్వాన్ని" సాధించడం అని చెప్పాడు. భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోను, అటు తరువాత, భారతదేశ నిర్మాణంలోను, రాజ్యాంగ రచనలోను క్రియాశీలక పాత్ర పోషించిన డా. బి.ఆర్. అంబేద్కర్ యొక్క ఆలోచనా ధోరణికి ఇదే ప్రాతిపదిక అయి ఉండవచ్చు. అంబేద్కర్ ఉద్దేశ్యంలో విద్య యొక్క ప్రధాన లక్ష్యం స్వేచ్ఛ (Liberation) లేదా విముక్తి (Emancipation).

సమాజంలో ఆనాడు కొనసాగుతున్న అంటరానితనం, కులవివక్ష, చులకన భావంవంటి సామాజిక రుగ్మతల నుండి విముక్తి పొందాలంటే విద్య యొక్కటే మార్గమని తెలియజేసాడు.

ఇక భారతీయ తాత్త్విక చింతన ఆధారంగా విద్య యొక్క పరమావధిని గుర్తించే ప్రయత్నం చేద్దాం. భారతీయ తాత్త్విక చింతన కామన్ ఇరాకు ముందు 14వ శతాబ్దం నుండే మొదలైనట్టు చెప్పబడుతున్నది. అయితే అది మత ప్రాతిపదికన జరిగినట్టు తెలుస్తున్నది. బృహస్పతి, లోపాముద్ర, అగస్త్య, అత్రి, భరద్వాజ, వశిష్ట, శకల్య, వాల్మీకి, వ్యాస, ఐత్రేయ, గార్గి, ఘోష, యజ్ఞవల్క, బోధాయన, సత్య కామజాబాలి, పాణిని, అసురి, కణాద, కశ్యప మొదలైనవారు, వారి భాష్యాలలో తాత్త్విక విచారణ చేసిన దాఖలాలు ఉన్నాయి. వీరి కృషి అంతా ధార్మిక విషయాలతోనే ముడిపడి ఉన్నది.

అటు తరువాత ప్రచారంలోకి వచ్చిన జైన, బౌద్ధతత్త్వాలు, విద్య యొక్క లక్ష్యాన్ని గూర్చి విపులీకరించాయి. జైన సిద్ధాంతం ప్రకారం విద్య యొక్క అంతిమ లక్ష్యం "విముక్తి" లేదా స్వేచ్ఛ. ఈ భావనలో ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక అంశాలు ఇమిడి ఉన్నాయి. జైన వాదం ప్రకారం రెండు ప్రధాన అంశాలైనటువంటి జీవము (Living), అజీవము (Non-living) గురించి తెలుసుకోవడమే విద్య. బౌద్ధం భావనలో "మానవుని పరిపూర్ణ వంతునిగా చేయడమే విద్య యొక్క పరమావధి". మానవుడు స్వేచ్ఛగా, బుద్ధిజీవిగా, నైతికతతో, అహింసా వాదాన్ని నమ్మి, ఆచరించడమే నిజమైన విద్య. బౌద్ధ విద్యలో ముఖ్యమైనది జీవిత సత్యాలను బోధించడమే. వీటినే అష్టాంగ మార్గాలుగా పేర్కొన్నారు. ఈ మార్గాలను పాటించినట్లయితే మానవుడు 'నిర్వాణ దశకు' చేరుకొని శాశ్వత ఆనందాన్ని (Eternal Bliss) పొందుతాడు. ఒకవిధంగా పరికిస్తే, భారతీయ తత్త్వ విచారణలో శుద్ధతత్త్వం (Pure Philosophy) నుండి మతాన్ని (Religion) వేరు చేయడం బహు కష్టం.

ఆ తరువాత కాలంలో భారతీయ తత్త్వచింతను బలోపేతం చేసిన భర్తృహరి, అక్కమహాదేవి, జిడ్డు కృష్ణమూర్తి, అరబిందో, రమణ మహర్షి, నారాయణగురు, జ్యోతిరావ్ పూలే, బి.ఆర్. అంబేద్కర్, ఎం.ఎన్. రాయ్, రామకృష్ణ, పరమహంస, వివేకానంద మొదలైనవారు విద్యా లక్ష్యాన్ని వారి తాత్విక దృష్టితో వివిధాలుగా పేర్కొన్నారు. 'జీవితం యొక్క విలువైన ఆస్తి విద్య' అని రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పారు. విద్య యొక్క అంతిమ లక్ష్యం మానవ మేధస్సును సత్యాన్ని గ్రహించడంలో వినియోగించడం, స్వామి వివేకానంద ఉద్దేశ్యంలో మానవునిలో దాగి ఉన్న అజ్ఞానపు తెర (Ignorance)ను తొలగించడమే విద్య యొక్క ప్రధాన లక్ష్యం. సామాజిక విప్లవకారుడైన మహాత్మా జ్యోతిరావ్ పూలే ఉద్దేశ్యంలో 'సమాజంలో వ్యక్తి పురోగతి సాధించడానికి విద్య తప్పనిసరి. అందున మహిళలు విద్యావంతులవడం అత్యంత ఆవశ్యకం'. ఆనాడే పూలే విద్య అందరికీ ఉచితంగా లభించాలని, దానికి మూల్య నిర్ధారణ అన్యాయమని చాటి చెప్పారు. అట్లే శూద్రులు, అతిశూద్రులు బాగుపడాలన్నా, కుల వర్ణ వివక్ష రూపుమాపాలన్నా, విద్య ఒక్కటే మార్గమని సూచించారు.

ఆధునిక కాలంలో భారతీయ తత్త్వ విచారణను ప్రోదిచేసిన వారిలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి అగ్రగణ్యులు. డా. రాధాకృష్ణన్ అభిప్రాయం ప్రకారం విద్య యొక్క అంతిమ లక్ష్యం స్వేచ్ఛాయుతమైన, సృజనకు ఆలవాలమైన మానవుని

రూపొందించడమే. విద్య మొత్తం భావస్వేచ్ఛ (Idealism). సత్యము, ప్రేమ (Truth and Love) అంశాలపై ఆధారపడి ఉండాలని సూచించాడు. అందుచేతనే అధ్యాపకులు దేశంలో అత్యంత విలువైన మేధా సంపత్తి కలిగిన వ్యక్తులుగా ఉండాలి. ఆచార్య సచ్చిదానందమూర్తి ఉద్దేశంలో 'విమర్శనాత్మక బుద్ధిజీవులను తయారు చేయడమే' విద్యయొక్క లక్ష్యం. భారతీయ విద్యాలయాలలో విమర్శనాత్మక వాతావరణాన్ని నేటికీ రూపొందించలేకపోవడం శోచనీయం. పనిలో, వృత్తిలో స్వాభిమానాన్ని అంగీకరించడం విద్య యొక్క, విద్యాధికుని యొక్క ప్రథమ కర్తవ్యం. విశ్వ విద్యాలయాల బాధ్యతను గురించి వివరిస్తూ, 'ఉత్తమ పౌర ధర్మ శిక్షణ' వాటి విధి అని చెప్పాడు. అదే మానవత్వాన్ని ప్రోదిచేసి, నూతన జీవిత దృక్పథాన్ని, నిక్కమైన శాస్త్రీయ వివేచనను విద్యార్థుల యందు నిక్షిప్తం చేయడం విశ్వ విద్యాలయాల విధి.

**స్వాతంత్ర్యానంతర కాలంలో విద్య యొక్క లక్ష్యం:**

స్వాతంత్ర్యానంతర కాలంలో విద్యా వ్యవస్థ యొక్క స్వరూప స్వభావాలు, లక్ష్యాలు పూర్తిగా మారిపోయాయి. స్వేచ్ఛ పట్ల మక్కువ కలిగిన బ్రిటీషువారి విద్యా విధానం కొనసాగుతూ, అవే లక్ష్యాలు, పాఠ్యాంశాలు, పట్టాలు ప్రదానం చేయబడుతున్నాయి. విద్య యొక్క లక్ష్యం 'జీవన వికాసం' నుండి 'బ్రతుకుదెరువు సంపాదన'వైపు మళ్ళుతున్నది. 'తిండికి', విద్యకు లంకె పెట్టడం, అదే జీవిత పరమ లక్ష్యంగా తెర మీదకు తేవడం, యువత యొక్క సృజనాత్మకతను నిర్వీర్యం చేయడమే. 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో' అన్న కందుకూరి వీరేశలింగం యొక్క ఆశయం నేటి యువత మెదళ్ళలోనికి చొరబడాలి.

వలస రాజ్యంగా ఉన్న భారతదేశంలో లార్డ్ మెకాలే, కేవలం బ్రిటీషు ప్రభుత్వ నిర్వాహణకు అవసరమైన 'గుమస్తా' తరహా విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, ప్రోత్సహించాడని విమర్శించడం తప్ప, మనం ఆ దారి నుండి ప్రక్కకు జరిగిన దాఖలాలు ఏమీలేవు. కనీసం విద్య ద్వారా 'స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు' సాధించే పిపాస కూడా కనపడదు. విద్య కేవలం 'ఆర్థిక స్వావలంబన' పని ముట్టు మాత్రమే. కనీసం బ్రిటీషువారి విద్యా విధానంలో నిగూఢమై ఉన్న 'ఆత్మ'ను గుర్తించలేకపోయారు.

జాతీయ విద్యా విధానం పేరుతో 2020లో ఒక విధాన ప్రకటన చేయబడింది. ఇది కొంతమేరకు, భారతీయ మూలాలను తరచి చూసే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా "భారతీయ విజ్ఞాన మూలాలను" స్పృశించాలని నొక్కి చెప్పింది. అయితే ఇది కేవలం కొన్ని మతతత్త్వ ధోరణులకు ఊతం ఇచ్చే విధంగా రూపొందితే మొదటికే మోసం వస్తుంది. భారతీయతను చాటి చెప్పే, లేదా వెలికితీసే, ఏ ప్రయత్నమైనా ఆహ్వానించదగినదే. మానవుని యొక్క 'జీవిత సాఫల్యానికి', కళలు, తత్త్వం, విజ్ఞానం అన్ని అవసరమైనవే. విజ్ఞాన సంచయం, కళాపోషణల మధ్య సమన్వయాన్ని సాధించవలసిన అవసరాన్ని నేటి యువతకు తెలియజెప్పాలి. విద్యాలయాల్లో అందుకు అవసరమైన వాతావరణాన్ని, సాధన సంపత్తిని పోగు చేయాలి. విజ్ఞానానికి ఎల్లలులేవనే విషయాన్ని గుర్తెరగాలి. ఒక విధంగా చూస్తే, వివిధ విజ్ఞాన అంశాల మధ్య అవినాభావ సంబంధం విడదీయరానిది. దానిని కనిపెట్టడంలోనే మన 'చతురత' ఇమిడి ఉంది. ఎంతోమంది శాస్త్రవేత్తలు నేడు 'పదార్థ విజ్ఞానానికి' కళలకు మధ్య ఉన్న సంబంధాన్ని ప్రకటించడంలో ఎంతో కృషి జరుపుతున్నారు. ముఖ్యంగా భౌతిక శాస్త్రం (Physics)కు సంగీతానికి (Music)కు ఉన్న బంధాన్ని ఛేదించే దిశగా ఎంతో కృషి జరుగుతున్నది. అట్లే నోబెల్ బహుమతితో సమానమైన 'ఫీల్డ్స్' బహుమతి (గణితంలో) గ్రహించిన ముంజల్ భార్గవ్, గణితానికి, మృదంగ శబ్ద తరంగాలకు మధ్య ఉన్న సహసంబంధాన్ని కనుగొనే పరిశోధన దిశగా గట్టి కృషి చేస్తున్నాడు. కాబట్టి 'ఉపాధి కోసమే విద్య' అన్న లక్ష్యాన్నుండి కొంచెం జరిగి, జీవన వికాసంవైపు పరుగు పెట్టడం విద్య యొక్క సముచిత లక్ష్యం.

ఆచార్య కోడాటి వియ్యన్నరావు - పూర్వ వైస్ ఛాన్సలర్
ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు.
ఫోన్: 709 326 0655.

# స్వాతంత్ర్యోద్యమం : నాటకాలు

– దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు

కృష్ణాజిల్లా గుడివాడ మండలంలో ప్రదర్శించిన నాటకాలలో ఊటుకూరు సత్యనారాయణ రచించిన – చత్రపతి శివాజీ, డి.ఎస్. రావు గారు – ఇదే నా దేశం, కర్పూరం ఆంజనేయులు – గాంధీ మళ్లీ పుడితే, కొండముది గోపాలరాయ శర్మ – ఏక దేశం, చుక్కబట్ల సత్యనారాయణమూర్తి ఝాన్సీ లక్ష్మీబాయి, వీర తానాజీ., పురాణం సూరి శాస్త్రి – అశోక వనము, వీరే కాకుండా ప్రాంతీయేతర నాటకాలు కూడా విరివిగా ప్రదర్శింపబడినాయి.

భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో జరిగిన అనేక సంఘటనల్ని నాటక రచయితలు వివిధ నాటకాలుగా మలిచి ప్రజల్ని చైతన్య పరిచిన విధానాన్ని రచయిత దీనిలో చక్కగా నిరూపించారు. ప్రజలు తాము నివసిస్తున్న నేల మీద అభిమానాన్ని ప్రకటించడం, స్వజాతి జనుల మీద ప్రేమను పెంపొందించుకోవటం జాతీయతలో కనిపించే కొన్ని ముఖ్యాంశాలు. తరతరాలుగా కొనసాగుతున్న స్థానిక సత్సంప్రదాయాలపై ప్రగాఢమైన అభిమానం; నిర్దిష్ట పాలనా వ్యవస్థకి అనుగుణంగా మనుగడ సాధించే మానసిక స్థితిని కలిగి ఉండటం జాతీయత అనవచ్చు.

సర్వసాధారణంగా ప్రజలు తమ అస్తిత్వాలకు తీవ్రంగా భంగం కలుగుతుందని భావించినప్పుడల్లా ఈ జాతీయతా భావాలు ఉద్యమ రూపంలో కనిపిస్తుంటాయి. భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతదేశంలోని ప్రజలంతా తరతరాలుగా కలిసిమెలిసి జీవించేవారని చరిత్ర చెబుతుంది. బ్రిటీష్ వాళ్ళు వ్యాపారం కోసం వచ్చి, క్రమేపీ పాలనాధికారాన్ని చేజిక్కించుకోవడంతో వాళ్ళకు వ్యతిరేకంగా భారతీయుల్లో జాతీయతా స్ఫూర్తి అంకురించింది.

అది ఆంగ్ల విద్యాప్రభావంతో మరింతగా విస్తరిల్లింది. అనేక సాహితీ ప్రక్రియల్లో సాహిత్యం సృజనీకరించబడి ప్రజల్లో జాతీయతా భావాలు వేగంగా వ్యాపించాయి. ఈ పరిస్థితి అన్ని భాషల్లోనూ కనిపిస్తుంది. అలాగే తెలుగులోనూ జాతీయోద్యమ ప్రభావంతో భిన్న ప్రక్రియల్లో సాహిత్యం వెలువడింది. కవిత్వం, నవల, వ్యాసం, నాటకంవంటి సాహిత్య ప్రక్రియలు జాతీయోద్యమాన్ని వేగంగా ప్రసరించడంలో నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహించాయి.

జాతీయోద్యమ ముఖ్య లక్ష్యం పరదేశీయుల్ని పారద్రోలడమే ప్రధాన ధ్యేయమైనప్పటికీ, నాటకాల్లో నాడు జాతీయోద్యమం సామాజిక రంగంలో కనిపించే అనేక సమస్యల్ని పరిష్కరిం చేదిశగా పయనించిన కోణాన్ని కూడా ఈ తెలుగు పరిశోధనలు – నాటక ప్రక్రియలు గ్రంథంలో వివరంగా పేర్కొన్నారు (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ). వందేమాతరం, విదేశీవస్తు బహిష్కరణ, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైన చారిత్రక ఘట్టాలను తెలుగు నాటకాల్లో ప్రతిఫలించిన తీరు ఈ గ్రంథంలో కనిపిస్తుంది.

కేవలం 1947 ఆగస్టు 15 వరకు మాత్రమే కాకుండా, 1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం అయ్యేవరకూ చరిత్రను పరిగణనలోకి తీసుకొన్నప్పుడు మాత్రమే, ఆంధ్రప్రాంతానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించినట్లవుతుందంటారు రచయిత. అందుకనే ఈ గ్రంథంలోని అయిదో అధ్యాయంలో తెలుగు నాటకాలపై చూపిన తెలంగాణా సాయుధ పోరాట ప్రభావాన్ని వివరించారు.

వేదాంతకవి 1948లో రాసిన ఛలో హైదరాబాద్, వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణలు కలిసి రాసిన మాభూమి నాటకాలపై సుదీర్ఘమైన విశ్లేషణ చేశారు. ఈ రెండు నాటకాలు చదివితే తెలంగాణాలో జరిగిన సాయుధ పోరాటం చాలావరకూ అవగాహనకొస్తుంది. నిజాం నిరంకుశ పాలనలో అమీనులు, దేశ్‌ముఖ్‌లు సాగించిన దురంతాలపై నాటి సామాన్య ప్రజలు సహితం పోరాడిన సంఘటనలన్ని జాతీయోద్యమంలో భాగంగానే చూడాలనేది ఈ గ్రంథంలో కనిపించే ఒక ప్రతిపాదన. తెలంగాణా సాయుధ పోరాటంలో స్త్రీల పాత్రను కూడా

చిత్రించిన నాటకాలను వివరించారు. స్త్రీ చైతన్యాన్ని కూడా ఆయా నాటకాల్లో ప్రతిఫలించిన తీరుని వివరించారు.

సాధారణంగా పరిశోధనలో ఒక్క కొత్త అంశాన్నైనా బహిర్గత పరచాలి. అది అన్ని వేళలా సాధ్యం కానప్పుడు, ముఖ్యంగా సాహిత్య పరిశోధనలో కొత్త సమన్వయాన్నైనా అందించాలి. ఈ పరిశోధన గ్రంథంలో ఈ రెండంశాలూ కనిపిస్తున్నాయి. ఆరు ప్రధాన అధ్యాయాలుగా ఫలితాంశాలు చివరి అధ్యాయంగానూ గ్రంథాన్ని విభజించారు. తాను పరిశీలించిన అన్ని నాటకాల్లో కనిపించే ప్రధానాంశాలను రచయిత ఇలా వర్గీకరించారు. అవి: సంఘ సంస్కరణ, దేశభక్తి, సమగ్ర జాతీయతా భావం, మద్యపాన నిషేధం, విదేశీ వస్తు, శాసనోల్లంఘన, ఖద్దరు వస్త్రాలను ధరించడం, గాంధీజీ సూక్తులు పాటించడం, సత్యాగ్రహం, శాంతి సౌహార్ద్ర భావం, అస్పృశ్యతా నివారణవంటివన్నీ జాతీయోద్యమంలో అంతర్భాగంగా కొనసాగిన సంస్కరణలని రచయిత వింగడించి విశ్లేషించారు. కొండ అద్దమందు చూపినట్లుగా జాతీయోద్యమంలోని ముఖ్యఘట్టాల చారిత్రక క్రమపరిణామాన్ని వివరించారు. జాతీయోద్యమ నాటక నేపథ్యాన్ని వివరిస్తూ పూర్వపరిశోధనల్ని పేర్కొంటూనే తనదైన ప్రతిపాదనలను పాఠకుల ముందుంచారు. దేశభక్తి పూరితాలైన తెలుగు నాటకాలను పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలుగా విభజిస్తూనే, స్వాతంత్ర్య సమరాన్ని ప్రత్యక్షంగా వ్యాఖ్యానించిన రాజకీయ నాటకాలనే విభజన కూడా చేస్తే బాగుంటుందన్నారు.

తిరుపతి వేంకట కవుల రచించిన ప్రఖ్యాత నాటకం పాండవోద్యోగము (1938)లో ధర్మరాజువంటి గుణ సంపన్నుడిగా గాంధీజీని కవులు వర్ణించారని ఈ పరిశోధకుడు చేసిన సమన్వయం బాగుంది. 'అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడజాత శత్రువే అలిగిన నాడు' అనే పద్యంలో ధర్మరాజు పాత్ర చిత్రణలో గాంధీజీ జాతీయోద్యమ స్వభావం ఉందని పరిశోధకుడు వ్యాఖ్యానిస్తున్నారు. ఊటకూరు సత్యనారాయణ గారి అభిమన్యు (1938) నాటకంలో భర్తపై ఉండే ప్రేమకొద్దీ ఉత్తర అభిమన్యుణ్ణి యుద్ధరంగానికి పోవద్దన్నా, తానూ సారథియై వస్తానని పలకడం, భర్త వద్దన్నా, స్త్రీలు కూడా యుద్ధంలో పాలుపంచుకోవాలని వాదించడంలో నాటి స్వాతంత్ర్య సమరంలో స్త్రీలను చైతన్యపరచడమేనంటారు రచయిత!

చారిత్రక నాటకాల్లో మహమ్మదీయుల పాలనలో హిందూధర్మానికి జరిగిన హానిని ప్రస్తావిస్తూ వ్రాసిన నాటకాలు అధికంగా ఉన్నాయి. పౌరాణిక పురుషులకంటే చారిత్రక పురుషులు స్వాతంత్ర్యయోధులలో, ప్రజలలో మరింత ఉత్సాహాన్ని నింపారని, ఆ నాటకాలను సోదాహరణంగా వివరించారు.

ముత్తరాజు సుబ్బారావు ''చంద్రగుప్త' (1932), శేషబాబు అశోకరాజ్యము' (1945), ప్రభులింగాచార్యుల పల్నాటి వీరచరిత్రము' (1928), ఉన్నవ లక్ష్మీనారాయణ ''నాయకురాలు' (1926), నండూరి బంగారయ్య ''ఆంధ్రతేజము' (1938), వేదం వేంకటరాయశాస్త్రి ''ప్రతాపరుద్రీయము' (1897), పోతుకూచి సుబ్బయ్య ''ఆంధ్రవాణీ సామ్రాజ్యము' (1944), కోలాచలం శ్రీనివాసరావు "సుల్తాన్ చాంద్ బీ' ( 1900) కాళ్ళకూరి సాంబశివరావు ''రంగరాయ కదన సమవాకారం' (1899), శ్రీపాద కృష్ణమూర్తి "బొబ్బిలి యుద్ధం' (1908), కొప్పరపు సుబ్బారావు ''రోషనార' (1921), పడాల రామారావు 'అల్లూరి సీతారామరాజు' (1950) మొదలైన నాటకాల్లో దేశవ్యాప్తంగానూ, ఆంధ్రదేశంలోనూ ప్రజారంజకంగా పాలన అందించిన పాలకుల స్ఫూర్తినీ, వారి పోరాట పటిమనీ, వారు మహమ్మదీయులు, విదేశీయులతో పోరాడిన చారిత్రక సంఘటనలను వర్ణించారన్నారు. ఇవన్నీ జాతీయోద్యమ ప్రభావంతో రాసిన నాటకాలేనని నిరూపించారు.

సాంఘిక, రాజకీయ నాటకాల్లో గాంధీజీ చేసిన ఉద్యమ ప్రభావం అత్యధికంగా కనిపిస్తుందన్నారు. గాంధీజీ ఒకవైపు స్వాతంత్ర్యం కోసం పోరాటాన్ని కొనసాగిస్తూనే, దేశం సమైక్యంగా ఉండాలంటే అంతర్గతంగా జరగాల్సిన వాటిని గుర్తించారన్నారు. దీనిలో భాగమే ఆయన కొనసాగించిన హరిజనోద్యమం అనీ దీనికి నాటక కర్తలు ఎంతో ప్రభావితులైయ్యారని ఆ నాటకాలను సోదాహరణంగా నిరూపించారు. సుమారు 280 పేజీలున్న ఈ పుస్తకంలో జాతీయోద్యమంలో పాల్గొన్న కొంతమంది నాయకుల, కొంతమంది నాటకకర్తల ఛాయా చిత్రాల్ని కూడా ప్రచురించారు.

మొత్తం మీద తెలుగు నాటక వికాసాన్ని అర్థం చేసుకోవడానికి ఈ గ్రంథం ఒక ముఖ్య ఆకరంగా ఉపయోగపడుతుంది. అనేక నాటకాలను సేకరించి, జాతీయోద్యమ ప్రభావాన్ని వివరించిన పరిశోధకుడు అభినందనీయుడు. ప్రతి విద్యాలయంలోనూ ఉండదగిన పుస్తకం. మరోసారి మన భారతీయ జాతీయోద్యమ స్ఫూర్తి రగిలించుకొని, నేటి సామాజిక సమస్యలపై ఎలా స్పందించాలో అవగాహన చేసుకోవడానికీ పుస్తకం దోహదపడుతుంది.

**జాతీయోద్యమ నాటకాల్లో:**

ప్రజలు తమ దేశాన్ని జాతిని సంస్కృతిని నిలుపుకొని స్వతంత్రంగా జీవించడం కోసం వాటిపై ప్రేమాభిమానాలతో దృఢమైన పూనిక వహించడమే జాతీయోద్యమం అని భావించవచ్చు. ఈ జాతీయోద్యమం సఫలీకృతం కావాలంటే కులమత వర్గ భేదాలు నశించి ప్రజలంతా సమభావంతో సమైక్యంగా వర్తించాలి. అంతేగాక సంఘంలో వేశ్యాసంపర్కం, మద్యపానం, మూఢ విశ్వాసాలు, అంటరానితనంవంటి దురాచారాలు అంతరించాలి. ఇటువంటి ప్రబోధంతోనే జాతీయోద్యమ ప్రభావంగల సాహిత్యం వెలసింది. 1885లో జాతీయకాంగ్రెసు స్థాపించబడిన పిమ్మట కొందరు రాజకీయవేత్తలు, మేధావులు, జాతి జాగృతికై చేసిన ఉపన్యాసాలు, రచనలు దేశ ప్రజల్లో కొంత రాజకీయ చైతన్యం కలిగించాయి. దానితో సంఘసంస్కరణ ప్రాతిపదికగా ప్రారంభమైన సాంస్కృతిక పునరుజ్జీవనం, నెమ్మదిగా రాజకీయ స్పృహను మేళవించుకొని జాతీయోద్యమంగా ఎదిగి, ఉధృత రూపం దాల్చి స్వాతంత్ర్యోద్యమంగా రూపొందింది.

ఆంధ్రదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి ఊతమిచ్చిన వారిలో ఆద్యుడు కందుకూరి వీరేశలింగం పంతులు. సంఘసంస్కరణ దృష్టితో రచనా వ్యాసంగం కొనసాగించిన దారిలోనే వీరేశలింగం పంతులు నాటకాలు కూడా సాగాయి. బాల్య వివాహ నిరసనం, విధవా వివాహ ప్రోత్సాహం, కులమత వర్ణ భేదాల ఖండన, మూఢవిశ్వాసాల ఖండన మొదలైన దురాచారాలను ఏకరువు పెడుతూ బ్రాహ్మవివాహం, వ్యవహార ధర్మబోధిని రాగమంజరి, తిర్యగ్విద్వన్మహాసభ, మహారణ్య పురాధిపత్యం, విచిత్ర వివాహం, కలిపురుష శనైశ్చ విలాసం, వేశ్యాప్రియ, కౌతుక వర్ధిని, వినోద తరంగిణి మొదలైన రూపకాలు రచించాడు. వావిలాల వాసుదేవ శాస్త్రి నందకరాజ్యమనే సాంఘిక నాటకంలో బ్రాహ్మణుల్లోగల వైదిక నియోగి వైషమ్యాలు, అధికారుల దౌర్జన్యాలు వివరించాడు. చిలకమర్తి లక్ష్మీనరసింహం వ్యభిచారం, కన్యాశుల్కం, వరకట్నం, బాల్య వృద్ధ వివాహాలు, వ్యసనాలవంటి సంఘ దురాచారాలను నిరసిస్తూ ఎన్నో ప్రహసనాలు రచించాడు. కైలాస యాత్ర, అపూర్వ యాచకుడు, పిశాచవిలాసం, శామాలమ్మ దర్బారు, ముష్టి ప్రహసనాల్లో మూఢ విశ్వాసాల నిరసనం, దొంగ సన్యాసిలో దొంగ సన్యాసులు చేసే మోసాలు, కొండూరి జానకి రామయ్య పెండ్లి ప్రహసనంలో బాల్య వృద్ధ వివాహాల నిరసనం, కవి గీత, తుంబుర నారద ప్రహసనాల్లో దుర్నీతి కాలుష్యం, కలియుగ యక్ష ప్రశ్నలు, ఓట్ల ప్రహసనాల్లో కుల వైషన్యాలు, అపూర్వ స్వయంవరంలో ఆడపిల్లల అమ్మకం, వరదక్షిణ, పెళ్ళి కొడుకుల ధరలు ప్రహసనాల్లో వరకట్నం వంటి దురాచారాలు నిరసింపబడ్డాయి.

**సంఘసంస్కరణోద్యమంతో ప్రదర్శించిన నాటకాలు:**

కృష్ణాజిల్లా గుడివాడ మండలంలోని సంఘసంస్కరణోద్యమంతో ప్రదర్శించిన నాటకాలలో ప్రజల్లో మూఢనమ్మకాలను తీసివేసి చైతన్యవంతులుగా తీర్చిదిద్దడమే ఈ నాటకాల ఉద్దేశం. చిన్నప్పుడే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం భర్త చనిపోయాక విధవరాళ్లుగా ఉండిపోవడం. సతీసహగమనంవంటివి అరికట్టడమే ఈ నాటకాల ఉద్దేశం త్రిపురేని రామస్వామిగారు మూఢనమ్మకాలును ఎత్తివేసి ప్రజల్లో చైతన్యవంతం నింపిన వ్యక్తి. అదేవిధంగా వేలూరు శివరామశాస్త్రి గారు కూడా ముక్తలత, సుల్తానీ నాటకంలో కూడా వివరంగా తెలియజేస్తారు. కమల, అనార్కలి, కర్ణ దారి, ఆత్మహత్య, ఎర్ర గులాబీ, ఇంటి దీపాలు ముళ్ళ కిరీటం ఆశాజ్యోతి వసంత కోకిల చిన్న కోడలు అమృత అక్షర గమ్యం మొదలగునవి సంఘసంస్కరణ ఉద్యమంతో గుడివాడ మండలంలోని ఇప్పటికి కొన్ని-కొన్ని నాటకాలు ప్రదర్శింపబడుతూనే ఉన్నాయి. ప్రాంతీయ నాటక రచయితలేకాక ప్రాంతీయతర నాటక రచయితలు

నాటకాలు ఎన్నెన్నో విరివిగా ప్రదర్శించారు.

**సాంస్కృతిక పునర్జీవన బాటలో వచ్చిన నాటకాలు:**

*భరతఖండంబు చక్కని పాడియావు*
*హిందువులు లేగదూడలై యేడ్చుచుండ*
*తెల్లవారను గడుసరి గొల్లవారు*
*పితుకుచున్నారు మూతులు బిగియగట్టి* – ఈ పద్యం తెలియని తెలుగు సాహిత్య జీవులు ఉండరు. ఇరవయ్యో శతాబ్ది తొలినాళ్లలో, గోదావరి తీరంలో జరిగిన ఓ బహిరంగ సభలో చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆశువుగా చెప్పిన ఈ చరిత్రాత్మక పద్యాన్ని, కృషాణ బరాజ్ గోడల మీద కెక్కించారు ఆనాటి దేశభక్తులు. ఒక దేశభక్తి గీతానికి అంతకుమించిన సమ్మానం, సత్కారం ఏముంటాయి? అందుకే, ఆ విషయాన్ని చిలకమర్తి తన 'స్వీయచరిత్రము'లో సగర్వంగా నమోదు చేసుకున్నారు. కందుకూరి వీరేశలింగంకన్నా దాదాపు రెండు దశాబ్దాలు – గురజాడకన్నా అర్ధ దశాబ్దం చిన్నవాడయిన చిలకమర్తి పద్యం, ప్రహసనం, నాటకం, నవల, కథానిక, స్వీయ చరిత్ర తదితర ప్రక్రియల్లో రాణించిన బహుముఖ ప్రజ్ఞావంతుడు. గోదావరికి ఎడాపెడా గట్లపై వర్ధిల్లిన నడిమితరగతి జీవనాన్ని – ఆనాటికి అంకురప్రాయంగానే ఉండిన సమకాలీన చరిత్రని – అన్నివర్గాల పాఠకుల హృదయాలకూ పట్టేలా 'రామచంద్ర విజయం'లాంటి నవలల రూపంలో రాసిన విమర్శనాత్మక వాస్తవవాది. 'కీచక వధ' మొదలుకుని 'గయోపాఖ్యానం'వరకూ, 'ప్రసన్న యాదవం' మొదలుకుని 'పారిజాతాపహరణం'వరకూ, 'శ్రీరామ జననం' మొదలుకుని 'సీతాకల్యాణం'వరకూ కళ్లకి కట్టినట్లు నాటకమాడించిన ఆంధ్రా షేక్స్పియర్. 'కర్పూర మంజరి' మొదలుకుని 'సుధా శరచ్చంద్రము'వరకూ కాల్పనిక కథాకావ్యాలను చెప్పి మెప్పించిన ఆంధ్రాస్కాట్. కర్నల్ జేమ్స్ టాడ్ రాసిన చారిత్రిక కథనాల ఆధారంగా 'రాజస్థాన కథావళి' వరసగా రాసిన సృజనశీలి. 'గణపతి'లాంటి నవలలో 'శుక్లాంబర ధరం విష్ణుం శశివర్ణం...' శ్లోకానికి అనూహ్యమయిన, అనిదం పూర్వమయిన హాస్యభాష్యం వినిపించిన చతురుడు. నండూరి సుబ్బారావు, సి. రామమోహనరావు, సీతారత్నమ్మలాంటి నటశిఖరాలతో రూపొందించిన 'గణపతి' శ్రవ్య నాటకం – అర్ధశతాబ్దం కిందట విన్న రేడియో పరికల్పన – ఇప్పటికీ చెవుల్లో మార్మోగుతూనే ఉంది! 'గణపతి' పుణ్యమాని చిలకమర్తితో కనీసం అరడజను హాస్య రచనలు చేయించి, అచ్చువేయించి, అమ్ముకున్నారు మన ప్రచురణకర్తలు.

చిలకమర్తి కేవలం రచయిత మాత్రమే కారు. 'సరస్వతి' 'మనోరమ' 'దేశమాత' తదితర పత్రికల ద్వారా కొత్తతరం పాఠకులను సృష్టించి, కొత్త సంస్కృతిని పరిపోషించడంలో కందుకూరికి వారసుడిగా నిలిచినవాడు చిలకమర్తి. వివేకవర్ధని ప్రెస్‌లో కొంత భాగం కొని, తన రచనలనేకం ప్రచురించిన దక్షకుడు చిలకమర్తి, కందుకూరి ప్రియశిష్యుడిగా ఆయన బాటలో కడదాకా నడిచిన సంస్కర్త చిలకమర్తి. గురుపాదుల బాటలోనే, చిరుద్యోగిగా ఉండే రోజుల్లోనే విద్యావ్యాప్తికి పాఠశాలలు పెట్టిన చొరవ ఆయనది. మహాభారతానువాదం మొదలయిన గడ్డ మీద – బ్రాహ్మణ వాడకట్టు నడిబొడ్డున – దళితుల కోసం పాఠశాల స్థాపించి, పదమూడేళ్లు నిర్వహించిన సామర్థ్యం ఆయనది. తన ఎనిమిది పదుల జీవితంలో చిలకమర్తి దాదాపు సగభాగం, కంటిచూపు లేకుండానే మనుగడ సాగించవలసి వచ్చింది. ఆయన చేత ఉద్యోగం మాన్పించిన 'మహారాజ పోషకులే', తమ పాటకు తాళం కొట్టలేదని చిలకమర్తికి లీగల్ నోటీసులు ఇప్పించారు. బ్రిటిష్ పాలకులు 'దేశమాత'లాంటి పత్రికలపై నిఘా చర్యలు పెంచి, పని చేసుకోలేని వాతావరణం సృష్టించారు. ఆ పత్రిక ఆర్థిక మూలాల మీద దెబ్బతియ్యడానికి తెగబడ్డారు. ఆ దశలో కొందరు, పత్రిక మీద వచ్చే నష్టం తాము భరిస్తామని ముందుకొచ్చినా, తన కార్యకలాపాల కారణంగా మరెవరో నష్టపోవడం నచ్చక చిలకమర్తి ఆ పత్రికను మూసేశారు. అంతకుమించి, బ్రిటిష్ పాలకుల పెత్తందారీతనానికి తలవంచి, పత్రికను కొనసాగించడం అంతరాత్మను తాకట్టుపెట్టడంగా భావించారు చిలకమర్తి. అదీ ఆయన వ్యక్తిత్వంలోని విశేషాంశ!

వాస్తవానికి, మన సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమానికీ, సంఘ సంస్కరణ కృషికీ జీవితాలు ధారపోసిన మహనీయులు ప్రతి ఒక్కరి చరిత్రలోనూ ఈ విశేషాంశ తళతళ మెరుస్తూ కనిపిస్తుంది. ఇక, అసలు మన చరిత్రలో సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమమూ, సంఘ సంస్కరణ కృషీ జరగనే లేదని భావించేవారి కళ్లకి ఈ కార్యకలాపాలు

ఎలా కనిపిస్తాయో ఒక్కసారి చూద్దాం – 'భారతీయుల సామాజిక రూపం ఎంత ఛండాలంగా ఉందో, ఇక్కడి విద్యావిధానం ఎంత అశాస్త్రీయంగా ఉందో, ఇక్కడి వ్యవస్థలు ఎంతగా కుళ్లి కంపు కొడుతున్నాయో వివరిస్తూ భారతీయ సంస్కర్తలు నాటకాలు రాశారు. పాటలు పాడారు. వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కొత్తకొత్త సంస్థలు నెలకొల్పారు. వారి వెనుక రవి అస్తమించని బ్రిటిష్ ప్రభుత్వం ఉంది. వారి ఆశీస్సులున్నాయి. సంస్కర్తలెవరూ జాతీయవాదులు కాకపోవడం మనం గమనించాల్సిన అంశం' అంటూ ఓ సరికొత్త సిద్ధాంతం ప్రవచించారు పిన్నమనేని మృత్యుంజయరావు అనే సిద్ధాంతి. మనం 'గమనించాల్సిన అంశ'మేమిటయ్యా అంటే మన సంస్కర్తలెవరూ జాతీయవాదులు కారనీ, వాళ్లందరూ 'లార్డ్ మెకాలే ప్రణాళిక' అనే కుట్రను విధేయంగా అమలు చేసేందుకు జీవిత పర్యంతం కృషి చేసిన తైనాతీలనీను! శభాష్, సిద్ధాంతం మోతెక్కిపోయింది!! ఇటీవలి కాలంలో ఇంతకు మించిన మౌలిక సిద్ధాంత కల్పన మరొకటి లేదని ఢంకా బజాయించి చెప్పొచ్చు.

ఎటొచ్చీ, సదరు మౌలిక సిద్ధాంత ప్రవచనం చెవిన పడగానే, కొన్ని ప్రశ్నలు గూబ గుయ్యిమనిపిస్తున్నాయి. 'భరతఖండంబె ఒక పెద్ద బందిఖాన..' పద్యం చెప్పిన చిలకమర్తి లక్ష్మీనరసింహం జాతీయవాది అవునా కాదా? గాంధీగారు 'హరిజనోద్ధరణ' నినాదం ఇవ్వకముందే, రాజమండ్రి – ఆర్యాపురంలో దళితుల కోసమే ఓ పాఠశాల స్థాపించి, పుష్కరానికి పైగా నడిపిన చిలకమర్తి సంస్కర్త అవుతారా? కారా?? గోదావరి జిల్లాల్లో పర్యటించిన బిపిన్ చంద్ర పాల్ ప్రసంగాలను ఊరూరా తిరిగి అనువదించిన చిలకమర్తి జాతీయవాది అవునా కాదా? వీరేశలింగంగారికి తాను ప్రియశిష్యుడినని చెప్పుకున్న చిలకమర్తి సంస్కర్త అవుతారా? కారా? గోదావరీ మండల కాపుల (రైతుల) మహాసభల్లో ఆశువుగా పద్యధార వినిపించి, తెలుగులో మొట్టమొదటి జాతీయవాద కవి అనిపించుకున్న చిలకమర్తి జాతీయవాది అవునా? కాదా? తన 'స్వీయ చరిత్రము'లో విద్య – మతం – రాజకీయ రంగాల్లో సంస్కరణలు అవసరమనీ, అవి సంపూర్ణంగా పూర్తి కాకుండా, అన్ని వర్గాలకూ స్వాతంత్ర్య ఫలాలు దక్కవని నొక్కి వక్కాణించిన చిలకమర్తి సంస్కర్త అవుతారా? కారా?? గురుపాదుడయిన వీరేశలింగంతోనే విభేదించి, రాజకీయ స్వాతంత్ర్యం రానిదే దేశం విముక్తం కాదని ప్రకటించిన చిలకమర్తి జాతీయవాది అవుతారా? కారా?? తన సొంత అక్కకి బాల్యవివాహం జరిపించిన ఉదంతాన్ని విపులంగా 'స్వీయ చరిత్రము'లో వివరించి, అలాంటి దురాచారాన్ని నిరసించిన చిలకమర్తి సంస్కర్త అవుతారా? కారా??

అదేవిధంగా, 'హిందూ మహాయుగము' 'ముస్లిం మహాయుగము' 'శివాజీ చరిత్రము' తదితర జాతీయ చరిత్ర రచనలు చేసిన కొమర్రాజు వేంకట లక్ష్మణరావు జాతీయవాది అవునా? కాదా? విజ్ఞాన చంద్రికా గ్రంథమాల ద్వారా పాశ్చాత్య వైజ్ఞానిక, సాంకేతిక పరిజ్ఞానం తెలుగువాళ్లకి అందించిన ఈ నడిచే 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము' సంస్కర్త అవుతారా కారా? 'దేశమును ప్రేమించుమన్నా' అని ప్రబోధించడమే కాకుండా, చిలకమర్తి చెప్పిన 'నేల దున్నుదమన్న చాల తరవౌ పన్ను, నీరు కావలెనన్న నీటి పన్ను..'లాంటి పద్యాలను ఇంగ్లిష్‌లోకి అనువదించిన గురజాడ జాతీయవాది అవునా, కాదా? 'కన్యాశుల్కం' నాటక కర్త సంస్కర్త అవుతారా కారా? రఘుపతి వెంకటరత్నం అంతేవాసిగా బ్రహ్మ సమాజంలో కృషి చేసిన ముట్నూరి కృష్ణారావు సంస్కర్త అవుతారా కారా? 38 సంవత్సరాలపాటు 'కృష్ణాపత్రిక'ను జాతీయ భావాలకు వేదికగా మలచిన ఈ సంపాదక మహాశయుడు జాతీయవాది అవుతారా? కారా? కాశీనాథుని నాగేశ్వరరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, టంగుటూరి ప్రకాశం తదితరులు వీరేశలింగంగారి సంస్కరణోద్యమాన్ని త్రికరణ శుద్ధిగా బలపరిచారు కూడా, వారు జాతీయ వాదులవుతారా? కారా?? సంస్కర్తల జాతీయవాదాన్ని గీటురాళ్ల మీద నిగ్గుతేల్చడానికి తెగబడిన సిద్ధాంత ప్రవక్తలను ఇలాంటి ప్రశ్నలు పెద్దగా బాధించలేదేమో!

ఎందుకంటే, వారు 'చక్కగా ఆచరింపబడిన పరధర్మము కన్న గుణము లేనిదైనను స్వధర్మమే మేలు' అనే గీతాబోధను ఔదలదాల్చే నిఖార్సయిన జాతీయవాది మరి. ఇంతకీ, ఈ 'మతబోధ'లో జాతీయ భావం ప్రతి ఒక్కరిలో ఉండిపోయింది.

దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు
బంటుమిల్లి, కృష్ణాజిల్లా. ఫోన్: 855 582 2648.

# సూడాన్

**– నిమ్మగడ్డ శేషగిరిరావు**

నేను సూడాన్ వెళుతున్నానని తెలుసుకున్నప్పుడు నా క్షేమం కోరుకునే స్నేహితులు, కుటుంబ సభ్యులు, “అక్కడకి వెళ్ళటం ప్రమాదకరం కదా! చూడటానికి ఎన్నో దేశాలుండగా, చూస్తూ-చూస్తూ సూడాన్‌కే వెళ్ళటం ఎందుకు? అంటూ ప్రశ్నలు కురిపించారు. వారందరికీ నేనొక్కటే సమాధానం చెప్పాను, మరొక ప్రశ్నతో, “ఎందుకు వెళ్ళకూడదు?” అని. కాని, వారందరినీ సమాధానపరచే ప్రయత్నం ఇప్పుడు చేస్తున్నాను. ప్రత్యేకించి సూడాన్ చూసెయ్యాలనేది నా ఆశయం అని చెప్పలేను కానీ, ఏదో ఒకరోజు సూడాన్ రాజధాని ఖార్టూమ్ నగరంలో తెల్ల నైలు, నీలి నైలు నదుల సంగమాన్ని, సహారా ఎడారిలోని మేరో - నూబియన్ పిరమిడ్‌లను తప్పనిసరిగా చూడాలనే సంకల్పం మాత్రం నాకు ఉంది. సూడాన్‌లోని నేషనల్ సైకియాట్రీ కాన్ఫరెన్సులో మాట్లాడటానికి నాకు ఆహ్వానం వచ్చినప్పుడు, దానిని దైవదత్తమైన అవకాశంగా భావించి, చేజార్చుకోకుండా నేను సద్వినియోగం చేసుకున్నాను.

**సూడాన్ పూర్వాపరాలు:**

దక్షిణ సూడాన్ విడిపోక ముందు సూడాన్ ఆఫ్రికాలో అతి పెద్ద భూభాగమున్న దేశం. విభజన జరిగాక అల్జీరియా, అంగోలా తర్వాత ఇది మూడవ పెద్ద దేశం. సూడాన్ జనసంఖ్య సుమారు 40 మిలియన్లు. దానిలో మూడొంతులమంది ఖార్టూమ్ పరిసరాల్లోనే ఉంటారు. ఇటీవల జరిగిన రక్తసిక్త ఆంతర్గత యుద్ధం తరువాత విడిపోయిన దక్షిణ సూడాన్‌లోని ఆఫ్రికన్లు ప్రధానంగా క్రైస్తవ మతస్థులు. ప్రస్తుతం ఎక్కువమంది సూడనీయులు అరబ్ - ఆఫ్రికన్లు. వారు ఇస్లాం మతస్థులు.



సుడాన్ పిరమిడ్లు

నీలి, శ్వేత నైలు నదుల ద్వివేణీ సంగమం వద్ద రూపు దిద్దుకున్న ఖార్టూమ్ నగరం సూడాన్ రాజధాని. నీలి నైలు నది తూర్పు దిక్కున, ఇథియోపియాలోని తానా సరస్సువద్ద బయలుదేరి, భూమాత ఎత్తు పల్లాలను తడుముతూ, పల్లపు ప్రాంతాలను వెతుక్కుంటూ, క్రిందకు జారినట్టే జారి మళ్ళీ కొంత దూరం పశ్చిమంగా సాగి, క్రిందకు జారటం ఏమాత్రం నచ్చనట్టు, ఉత్తరదిశగా మళ్ళుతుంది. శ్వేత నైలు నదిని కలవటానికేనేమో! శ్వేత నైలు మాత్రం దక్షిణాన ఉగాండాలోని విక్టోరియా సరస్సు నుండి ప్రయాణం మొదలుపెట్టి, నీలినైలును వెతుక్కుంటూ ఉత్తరంగా సాగి, ఖార్టూమ్ వద్ద తన భాగస్వామిని కలసుకుంటుంది. అలా ఆ రెండు నదులూ ఒకటిగా మారి, సరికొత్త అస్తిత్వాన్ని సంతరించుకుని, సహారా ఎడారి ఇసుక తిన్నెలను చీల్చుకొంటూ, తన దోవ పొడవునా, ఇరువైపులా సారవంతమైన ఒండ్రుమట్టిని పేర్చుకుంటూ, ఈజిప్టు దేశంలోకి వెళ్ళి, చివరకు మధ్యధరా సముద్రపొద్దునున్న, అలెగ్జాండ్రియా పట్టణంవద్ద సముద్రంలో కలుస్తుంది. ఈ నదుల ప్రయాణం చూస్తే, నీరు పల్లమెరుగు అన్న చందాన, నది సాగినవైపే దిగువ ప్రాంతమని, భూగోళం మీద ‘పైన’ ‘క్రింద’ అనేవి ఎంత సాపేక్షమైన మాటలో అర్థమౌతుంది. కంటికి కనిపించే ఎత్తుపల్లాల వైనానికి వ్యతిరేకంగా సాగే ఈ నది ప్రయాణం విచిత్రంగా, విశిష్టంగా ఉండి, నన్ను ఎప్పటి నుండో ఆకట్టుకుంది.

నైలు నది బహుదూరపు బాటసారి. 6650 కి.మీ. సాగిన ఈ నది ప్రపంచంలో కెల్ల పొడవైనది. ఈజిప్టు నాగరికతకి, నూబియన్ నాగరికతకి పుట్టిల్లు. ఈజిప్టు, సూడాన్ దేశాలకు ఈ నది జీవధార, ప్రాణప్రదాయని. జీవనాధారం కూడా.

**నా సూడాన్ పయాణం:**

ముందు చెప్పినట్టు, ఫోరెన్సిక్ సైకియాట్రీ మీద ఉపన్యాసం ఇవ్వటానికి, బ్రిటిష్-సూడానీస్ సైకియాట్రీ అసోసియేషన్‌కి అధ్యక్షుడుగా ఉన్న డాక్టర్ సయీద్ బుష్రా, ఆహ్వానం మీద 2017వ సంవత్సరంలో జనవరిలో నేను, నా కోలీగ్ మోహన్ ఇద్దరం కలిసి సూడాన్ వెళ్ళాలనుకున్నాము. మా ఇద్దరికీ కావలసిన ఏర్పాట్లు కూడ డాక్టర్ సయీద్ బుష్రా చేశారు. సూడాన్‌కు వీసా సంపాదించటం ఒక తతంగంతో

కూడుకున్న పని. దరఖాస్తు పంపటానికి, కొన్ని వారాల ముందే, సూడాన్ విదేశాంగశాఖ నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందాలి. అది వచ్చాకే మనం నివసిస్తున్న దేశంలో, వీసాకు దరఖాస్తు పెట్టుకోగలం. ఇదంతా మామూలుగా చాలా వారాలు పడుతుంది. మేము సూడాన్ సైకియాట్రిక్ కౌన్సిల్‌కి అతిథులుగా వెళుతున్నాం కాబట్టి, ఇదంతా లేకుండా వీసా సులభంగానే లభించింది.

మేము కతార్ ఎయిర్‌లైన్స్ ద్వారా ఖార్టూమ్ చేరుకున్నాము. ఖార్టూమ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాత్రి రెండు గంటలకు, పూర్తి యూనిఫామ్‌లో, ఎన్నో అధికారిక అలంకారాలతో ఉన్న ఒక పోలీసు ఆఫీసర్ మమ్మల్ని స్వాగతించి, ఇమ్మిగ్రేషన్, కష్టమ్స్ కార్యక్రమం చకచకా లాగించేసి, మమ్మల్ని హోటల్‌కు చేర్చాడు. నిజానికి ఆ పోలీసు ఆఫీసరు ఒక సీనియర్ కన్సల్టెంట్ సైకియాట్రిస్టు అనీ, 'ఆలీడ్రేసీ' అనే ప్రభుత్వ సైకియాట్రీ హాస్పిటల్‌కి డైరెక్టర్ జనరల్ అని తరువాత తెలిసింది. "నా పేరు ఒమార్ హుసేన్" అంటూ ఆయన పరిచయం చేసుకొన్నాడు. పోలీసు వ్యవస్థలో అతడు కల్నల్‌లాంటి ర్యాంకులో ఉన్నాడు. జనరల్ పదవికి ఒక మెట్టు తక్కువ. సూడాన్‌లో పోలీసులకి ఆర్మీలో ఉన్నట్లుగానే ర్యాంకులు ఉంటాయి. పెద్ద హోదాలో ఉన్న గవర్నమెంటు ఆఫీసరు మాకు స్వాగతం పలకటం ఒక వింత అనుభవమే. ఆయన చాలా వినయంగా సాధారణ పౌరుడులాగానే ఉన్నాడు. తన సహ మానసిక వైద్యులుగానే మమ్మల్ని చూశాడుగానీ, కొన్ని ఎదుగుతున్న దేశాలలో మాదిరిగా లేనిపోని హంగామా చేస్తూ తన అధికారదర్పాన్ని ప్రదర్శించలేదు. గొప్పతనానికి నిర్వచనంలా ఉన్న 'కొరింధియా' హోటల్లో మాకు బస ఏర్పాటు చేశారు. దానిని కల్నల్ గఢాఫీ నిర్మించాడు. లిబియా దేశానికి మాజీ నియంతగా గఢాఫీ అందరికీ తెలుసు. ఒకప్రక్క నుండి చూస్తే తెరచాపలా, మరొకవైపు నుండి చూస్తే పెద్ద గుడ్డులా కనిపిస్తుంది ఈ హోటల్ భవనం. ఇదొక ఆధునిక వాస్తుకళా అద్భుతం. నీలి నైలు ఒడ్డునున్న ఈ హోటల్లో, నదివైపు గది నాకు కేటాయించబడింది. అక్కడి నుండి నీలినైలు టూటి ఐలాండ్‌ను చుట్టుకున్న దృశ్యం కనపడుతోంది.

ఈ హోటల్ నిర్మాణం వెనుక ఒక ఉన్న కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఆఫ్రికా దేశపు అగ్ర నాయకుల సభకి గఢాఫీ ఇక్కడికి వచ్చినప్పుడు ఖార్టూమ్‌లో ఉన్న హోటళ్ళేమీ ఆయనకి నచ్చలేదట. భవిష్యత్‌లో తను ఇక్కడ పాల్గొనబోయే సమావేశాల దృష్ట్యా, తనే ఒక విశిష్టమైన డిజైన్‌తో ఈ హోటల్‌ను నిర్మించాడట. ఆ తరువాత అరబ్ స్ప్రింగ్ తిరుగుబాటులో గడాఫీని తొలగించి హత్య చేశారు. అది వేరే చరిత్ర. మాకు అతిథి మర్యాదలు చేసినవారిలో ముఖ్యుడు డాక్టర్ అబ్దుల్ ఘనీ. ఈయన సూడాన్ సైకియాట్రీ కౌన్సిల్ అధ్యక్షుడు. ఉదయపు అల్పాహారం తరువాత మమ్మల్ని హోటల్‌లో కలసి మాకు సాదరంగా స్వాగతం పలికాడు. మా ఉపన్యాస కార్యక్రమం మరుసటిరోజు కాబట్టి మెహమూద్, ఖాలిద్ అనే ఇద్దరు స్థానిక సైకియాట్రిస్ట్‌లు, ఆ రోజు మాకు సిటీ చూపించటానికి తీసుకెళ్ళారు.

**ఖార్టూమ్ పురవిహారం:**

మొదటగా టూటి దీవిని చూశాం. దీనిని చుట్టుకుని ఉన్న నీలినైలు మెత్తని సిల్క్ వస్త్రంలా హొయలొలుకుతోంది. నైలు రోడ్డులో ఉన్న రాజభవనాలు కొన్ని కొత్తవి, కొన్ని పాతవి. పురాతనంగా కనిపించే భవనాలు బ్రిటిష్‌వారి కాలంలో గవర్నర్ జనరల్ నివాసగృహాలు. 1880లలో ప్రఖ్యాతిగాంచిన జనరల్ గోర్డాన్ ఇక్కడ నివసించాడట. జనరల్ గోర్డాన్ పేరు ఖార్టూమ్ నగరంతో పెనవేసుకుపోయింది. క్రిమియా నుండి చైనా వరకు అతడు సాధించిన విజయాలెన్నో. ఖార్టూమ్ ప్రజలు అతనిని 'గోర్డాన్ పాషా' అని పిలుచుకొనేవారు. 19వ శతాబ్దం మొదట్లో స్థానిక మెహ్దీ సేన తిరుగుబాటులో ప్రజలను తప్పించి రక్షించే క్రమంలో, చివరికి తనేవారి చేతుల్లో హతమయ్యాడు గోర్డాన్. బ్రిటిష్ దేశంపట్ల, బ్రిటిషు రాణిపట్ల అతడు చూపిన భక్తి, గౌరవాలకు, వీరత్వానికి అతనిని వార్-హీరోగా గుర్తించారు., అతని పార్ధివ దేహానికి లండన్‌లోని సెయింట్ పాల్స్ కాథెడ్రల్‌లో అంతిమ సంస్కారం జరిగింది. ఇది ఇంతకు ముందు నెల్సన్, వెల్లింగ్‌టన్‌లాంటి వీరులకు మాత్రమే దక్కిన అరుదైన గౌరవం. ఇలాంటి గొప్ప వ్యక్తి గురించి తీసిన హాలీఉడ్ సినిమా 'ఖార్టూమ్'. దానిలో గోర్డాన్ పాత్రను ఛార్లటన్ హెస్టన్ పోషించగా, మెహ్దీ పాత్రలో లారెన్స్ ఆలివర్ జీవించాడు. అటు తరువాత మేము శ్వేత నైలు దాటి ఓమ్డర్‌మాన్ అనే ప్రాంతానికి వెళ్ళాం. ఈ ప్రాంతం, రెండు వందల సంవత్సరాల క్రితం

కాలంలో శిలాజమై నిలచిపోయిన పాతకాలపు ఖార్టూమ్‌లా కనపడింది నాకు. అదంతా రణగొణధ్వనులతో నిండిన ఆఫ్రో–అరబిక్ బజారు. వైవిధ్యమైన లావాదేవీలన్నీ అలవోకగా చేసుకుంటూపోయే స్థానికుల స్థావరమైన బజారు చూడటం నాకెంతో ఇష్టం. అదే ఎక్కడ చూసినా ఒకే విధంగా కనిపించే అమెరికన్ పద్ధతి అధునాతన మాల్స్ అంటే మాత్రం నాకు ఏ మాత్రం గిట్టదు. మేము ఒక చేపల బజారులో ఆగాము. ఖార్టూమ్‌లో నదీజల పుష్పాలను ఎక్కువగా ఇష్టపడతారు. నైలునదిలో జలపుష్పాలకు కొదవా మరి! తరువాత మేము స్థానికంగా ముఖ్యమైన మెహ్ది సమాధివద్దకు వెళ్ళాము. 1880వ సంవత్సరంలో ఒక సామాన్య పౌరుడు తనకు తానుగా 'మెస్సయ్య'గా ప్రకటించుకొని, ఎంతోమంది అనుచర సేనను కూడగట్టాడు. అతని పేరు మహమ్మద్ అహ్మద్ బిన్ అబ్దల్లా. ఇస్లాం రాజ్యాలు వెనుకటి రోజుల్లో ఎలా ఉండేవో అటువంటి గత వైభవాన్ని తిరిగి తీసుకురావటానికి ఎటువంటి ప్రయాసకైనా వెనుకాడని సేనను తయారు చేసుకొన్నాడు. మెహ్ది, గోర్డాన్‌లు సమకాలీనులు. ఖార్టూమ్ మీద ఆధిపత్యం సాధించే విషయంలో సమ ఉజ్జీలైన ప్రత్యర్థులు. విలియమ్ గ్లాడ్ స్టోన్ నాయకత్వంలో, ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం, మెహ్ది సేనలు నిలువరించబోతున్న ఖార్టూమ్‌ను వదిలిపెట్టి, ఈజిప్ట్‌కు తిరోగమించమని గోర్డాన్‌ను ఆదేశించినా, అతను లక్ష్యపెట్టకుండా, ఖార్టూమ్‌ను పరిరక్షించుకోవటానికి ప్రయత్నించాడు. 1884 మార్చ్ నెలలో మొదలై పది నెలల పాటు జరిగిన ముట్టడిలో, బ్రిటిష్, మెహ్ది సేనల మధ్య జరిగిన పోరులో గోర్డాన్ వీరమరణం పొందాడు. ఖార్టూమ్ మెహ్ది హస్తగతమయింది. ఆ తరువాత రెండు సంవత్సరాలకి మెహ్ది కూడా స్వర్గస్తుడయ్యాడు. ఆ తర్వాత ఖార్టూమ్‌ను బ్రిటీషు వారు, జనరల్ కిచ్చెనర్ సారధ్యంలో తిరిగి ఆక్రమించుకొన్నారు. జరిగిన రక్తపాతాన్ని తలచుకుని నా గుండె బరువెక్కింది.

మధ్యాహ్నం అయింది. ఆకలిగా ఉంది. సూడాన్ వారు మధ్యాహ్న భోజనం ఆలస్యంగా చేస్తారని అర్థమయింది. మెహమూద్, ఖాలిద్‌లు మంచి చేపల కూర దొరికే రెస్టారెంట్‌కి తీసుకెళ్ళారు. అది పూలమొక్కలతో నిండి ఉన్న పెద్ద ఆవరణ. అందులో చిన్న–చిన్న రెల్లుగడ్డి కుటీరాలున్నాయి. పక్కా సూడానీయుల పద్ధతిలో, తివాచీ నేల మీద, పెద్ద పళ్ళెంలో వడ్డించిన నైలు చేపల వంటకాల చుట్టూ కూర్చొని, భోజనం చేశాము. వాటిల్లో నైల్ పర్చ్, ఇంకా హమ్మోర్ అనే చేపలు చాలా రుచిగా ఉన్నాయి. ఆ రోజు, చివరిగా మేము సూడాన్ జాతీయ మ్యూజియం చూశాము. ఇక్కడ క్రీస్తుపూర్వం కొన్ని శతాబ్దాల నాటి బ్లాక్ ఫారోల కాలంనాటి పురావస్తు ప్రదర్శనలున్నాయి. వీరే ఉత్తర సూడాన్ నుండి వెళ్ళి ఈజిప్టుని పరిపాలించిన ఇరవైఐదవ వంశం వారు. నూబియన్లు.

**వివాహ మహోత్సవ ఆహ్వానం:**

మెహమూద్, ఖాలిద్‌లకు ధన్యవాదాలు తెలిపేటప్పుడు సాయంత్రం భోజనం గురించి ప్రస్తావన వచ్చింది. అబ్దుల్ ఘాని మమ్మల్ని, మా హోటల్ వద్ద నుండే డిన్నర్‌కి తీసుకెళతారని, ఆ రోజు అక్కడ జరిగే ఒక సైకియాట్రిస్ట్ కుమారుని వివాహానికి పత్యేకంగా మమ్మల్ని ఆహ్వానించారని తెలిసింది. బొత్తిగా తెలియనివారింటికి వెళ్ళటమంటే కొంచెం ఇబ్బంది అనిపించింది. కాని ఏదో మూల, స్థానికుల పెళ్ళి సంబరం చూద్దామని మాకు కూడ ఉంది. డాక్టర్ ఘాని ఏడు గంటలకల్లా వచ్చి "ఈ రాత్రి సూడాన్‌లో ఒక ప్రముఖ సైకియాట్రిస్ట్ మీకు అతిధ్యాన్ని ఇస్తున్నారు. ఆమె భర్త స్థానికంగా పేరు పొందిన సర్జన్. సూడాన్ ప్రెసిడెంట్ ఒమర్ అల్‌బషీర్‌కి స్వయంగా తమ్ముడే ఈ డాక్టరుగారు. మనం వెళ్ళబోయేది ఈ డాక్టర్‌గారి అబ్బాయి వివాహానికే" అని చెప్పాడు. మేము వెళ్ళేసరికే దాదాపు రెండు వందల మంది అతిథులు వచ్చున్నారు. అది వివాహానికి ముందు వరుని తరఫువారు ఇస్తున్న డిన్నర్ పార్టీ. వారు మమ్మల్ని ఎంతో మర్యాదగా ఆహ్వానించి ఇంటి వెనుక విందు జరుగుతున్న ప్రదేశానికి తీసుకెళ్ళారు. పెద్ద తోటలో చక్కని వాతావరణంలో టేబుల్స్ వేసి ఉన్నాయి. ఎక్కువ మంది తమ సాంప్రదాయ దుస్తుల్నే ధరించారు. పురుషులు తెల్లని జలాబియా (పొడవాటి జుబ్బా), ఇంకా తలపాగాలు ధరించారు. స్త్రీలు వివిధ వర్ణాల దుస్తులు, వేసుకుని, తల చుట్టూ ఇంకా రంగురంగుల స్కార్ఫ్‌లు ధరించారు.

స్త్రీ, పురుషులందరూ కలిసి తిరుగుతూ మాట్లాడుకొంటున్నారు. మమ్మల్ని పరిచయం చేసినప్పుడు, స్త్రీలు పాశ్చాత్య పద్ధతిలో మాకు షేక్ హాండ్ ఇస్తూ మాట్లాడారు. కొద్ది సంవత్సరాల క్రిందట స్త్రీలు

సాంప్రదాయ దుస్తులే ధరించాలని పెట్టిన ఆంక్షలు, ఎవరూ పాటించని కారణంగా సడలించారట. ఇంతలో అక్కడ కాస్త కలవరం చెలరేగింది. 'ఏమిటా!' అని చూస్తే, సూడాన్ ప్రెసిడెంట్ ఫంక్షన్‌కు విచ్చేసి, మా పక్క టేబుల్ వద్ద కూర్చున్నాడు. మమ్మల్ని ఆహ్వానించిన సైకియాట్రిస్టు మమ్మల్ని ఇంగ్లండ్ నుండి వచ్చిన డాక్టర్లుగా ఆయనకి పరిచయం చేసింది. ఆయన మాకు షేక్ హ్యాండ్ ఇచ్చి, నవ్వుతూ అభినందనలు తెలుపుతూ, 'వెల్ కం టు సూడాన్' అన్నాడు ప్రెసిడెంట్. నేను మాత్రం "హలో! 'థ్యాంక్యూ మిస్టర్ ప్రెసిడెంట్" అని మాత్రమే చెప్పగలిగాను. దాదాపు ఎడారిలాంటి ఆఫ్రికా దేశంలో ప్రవేశించి, ఇరవై నాలుగు గంటలలోపే ఆ దేశపు నిరంకుశ ప్రెసిడెంట్‌ని, ముఖాముఖి కలుసుకోవటం ఒక నమ్మశక్యం కాని విషయం. ఇంతకు మించిన ఉత్తేజభరితమైన సంఘటన మరెప్పుడైనా జరుగుతుందా!

మంచి భోజనంతో పాటుగా సాంప్రదాయ సంగీతం కూడా ఏర్పాటు చేశారు. అతిథులందరితోపాటుగా ప్రెసిడెంట్‌గారు కూడా సాంప్రదాయ నృత్యంలో పాల్గొన్నారు. డాన్సు చేస్తున్నప్పుడు అతని చేతిలో ఉన్న చిన్న కర్రని కూడా లయబద్ధంగా తిప్పుతున్నాడు. అది వారి ఆచారమట. పాశ్చాత్య ప్రభావం ఎంతగా ఉన్నా, సూడాన్‌వారు వారి సాంప్రదాయాలు మరచిపోరని నా పక్కనున్న డాక్టరుగారు తెలిపారు. అతిథ్యాన్ని ఇస్తున్న వారి తరపున ఎక్కువమంది డాక్టర్లే ఉన్నారు. వారందరూ మా టేబుల్ వద్దకి వచ్చి మమ్మల్ని పలకరించి వెళుతున్నారు. హోత అంత నిర్విరామంగా ఉండి కూడా, మాతో కలసి సమయం గడపటానికి ప్రయత్నం చేస్తూనే ఉంది. సూడాన్‌లో మానసిక వ్యాధిగ్రస్తుల సామాజిక స్థితి గురించి, వారిపట్ల ఉన్న చిన్న చూపు ధోరణిని మార్చటానికి, మానసిక చికిత్స అందించటానికి చాలా సంవత్సరాలుగా ఆమె చేస్తున్న కృషి గురించి వివరించింది. ప్రభుత్వపరంగా నియమావళికి అవసరమైన మార్పులు చేయమని కూడా ఎన్నోసార్లు ప్రెసిడెంట్‌తో చర్చలు జరిపిందట కూడా.

ఆ రోజు సూడాన్ – అరబ్ మిశ్రమ సంస్కృతి, అతిథి సత్కారాలు చాలా బాగున్నాయి. ఇదొక గొప్ప అనుభవం. ఇలాంటి వివాహానికి అతిథిగా నేను ఎప్పుడూ వెళ్ళలేదు. సూడాన్ పూర్తిగా ఆఫ్రికా దేశంలో ఉన్నాసరే, వారి సంస్కృతిలో ఆరబ్ ఆచారాలు కలసిపోయినా, ఇంకా ఆదిమ తెగల ప్రభావం వేళ్ళూనే ఉంది. డాక్టరు గారి తమ్ముళ్ళలో ఒకరికి ఉర్దూ భాష బాగావచ్చు. అతడు లక్నో, జబల్‌పూర్ నగరాల్లో ఏడు సంవత్సరాల పాటు ఉర్దూ నేర్చుకున్నాడట. కాసేపు నాతో ఉర్దూలో మాట్లాడాడు. సూడాన్ వారికి ఇండియా అంటే బాగా ఇష్టమనీ, చాలామంది ఇండియాలో చదువుకోవటానికి వెళతారనీ అతను చెప్పాడు. భారతదేశాన్ని వారు అరబ్బీలో, ఇరాన్ వారి మాదిరిగానే, 'హింద్' అంటారని చెప్పాడు.

**జీవన విధానం:**

సూడాన్ ఇస్లాం మతాన్ని పాటిస్తుంది. ఐదు నక్షత్రాల హోటళ్ళలో కూడా ఆల్కహాలు నిషేధం. ఉదయం ఉపాహారం తింటున్నప్పుడు 'ఫుల్ మెడీమెస్' అనే పేరుతో ఉన్న ఫావా బీన్ వంటకాన్ని చూశాను. చాలామంది ఆఫ్రికన్‌లు దాన్ని అడిగి తీసుకుంటున్నారు. అదేమిటో అని నేను ఆరా తీస్తే, అది సూడాన్ అనధికారిక జాతీయ వంటకమని చెప్పారు. మొదట తిన్నప్పుడు నాకు దానిలో ఎలాంటి రుచీ కనిపించలేదు. దాన్ని మీద మసాలాలు చల్లుకొని, గుడ్డు లేదా రొట్టెతో పాటుగా తినమన్నారు. అలా తింటే దానికి రుచి వచ్చింది. నేను ఇలాంటి పదార్థాన్ని ఈజిప్టులో తిన్నట్లు గుర్తు.

మా హోటల్లో నేను చాలామంది చైనా, ఇండియా వ్యాపారస్తుల్ని చూశాను. 16, 17వ శతాబ్దాల్లో ఐరోపా వారు ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవటానికి ప్రయత్నించినట్లుగా, ప్రస్తుతం చైనావారు, ఇండియా వారు ప్రపంచం అంతా విస్తరిస్తున్నారు. తమకి మంచి అవకాశాలు ఎలా వస్తాయో తెలుసుకొంటున్నారు. ఖార్టూమ్‌లో చాలామంది భారతీయులు ఎప్పటి నుండో నివశిస్తున్నట్లుగా తెలిసింది. వారికి ప్రత్యేకమైన కాలనీలు, క్లబ్బులు, స్కూళ్ళు కూడా ఉన్నాయట.

**వృత్తి పరంగా సూడాన్:**

సూడాన్ జాతీయ సైకియాట్రిక్ కాన్ఫరెన్సులో మా ప్రసంగాలకు మంచి స్పందన వచ్చింది. ప్రత్యేకించి, పోస్ట్‌గ్రాడ్యుయేట్ సైకియాట్రీ ట్రైనీలు బాగా స్పందించారు. ఈ సంవత్సరంలో జరిగిన ముఖ్యమైన కాన్ఫరెన్సు ఇదే కాబట్టి, సూడాన్‌లోని మూడింట రెండు వంతుల సైకియాట్రిస్టులు ఈ మీటింగ్‌కు హాజరయ్యారని మాకు తెలిసింది. అయినా, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే

సూడాన్‌లో సైకియాట్రిస్ట్‌ల సంఖ్య చాలా తక్కువ. అటు తరువాత, మేము దగ్గరలో ఉన్న ఒక సైకియాట్రిక్ హాస్పిటల్‌కి వెళ్ళాము. అక్కడ ఉన్న డాక్టర్లతో కలిసి అనుభవాలను పంచుకోవాలనేది ముఖ్య ఉద్దేశ్యం. చాలా తక్కువ పరికరాలు, ఉపకరణాలతో అక్కడి డాక్టర్లు అందిస్తున్న సేవలను చూసినప్పుడు, ఎన్నో వనరులు, వసతులు ఉంటేనే నడచే సంస్థలలో మేము పనిచేయటం గుర్తొచ్చి, అక్కడి డాక్టర్ల పట్ల గౌరవం పెరిగింది. 'నేషనల్ రిబాత్ యూనివర్సిటీ' వైస్ ఛాన్సలర్‌ని, డీన్‌ని కూడా కలిశాం. సూడాన్ మెడికల్ స్పెషలైజేషన్ బోర్డు వారి ప్రతినిధులతో కూడా అనుభవాలు పంచుకోవటం బాగుంది.

**ఖార్టూమ్ దాటి:**

మరునాటి కార్యక్రమం సహారా ఎడారిలోని మెరోయి పిరమిడ్లను చూడటం. ఇది ఒక రోజు ప్రయాణం. ఆ ప్రదేశం ఖోర్టమ్‌కి ఉత్తరంగా నాలుగు గంటల దూరం. ఉదయాన్నే మా గైడు అవెయిఫ్, డ్రైవరు ముస్తాఫా మమ్మల్ని తీసుకు వెళ్ళాటానికి వచ్చారు. అవాయిఫ్ శిక్షణ తీసుకొన్న పురాతత్త్వవేత్త, ఆమెది ముప్ఫై దాటిన వయస్సు. ప్రస్తుతం కొన్ని అంతర్జాతీయ బృందాలతో పాటు పురాతత్త్వ త్రవ్వకాల పనుల్లో ఉంది. మంచి ఇంగ్లీషు వచ్చు. స్థానికుల అభ్యర్థనమేరకు ఆమె అప్పుడప్పుడు విదేశీ అతిథులకి గైడుగా పని చేస్తానని చెప్పింది. మా ట్రక్ మా నలుగురికి చక్కగా సరిపోయింది. మా డ్రైవరు ముస్తాఫా. వయసు ముప్ఫైకు చేరువలో ఉన్నట్టుంది. బాగా సిగ్గరి. చాలా తక్కువగా మాట్లాడతాడు. కాని చాలా వేగంగా కారు నడుపుతూ, ప్రావీణ్యం చూపిస్తున్నాడు. చాలాసార్లు మరీ అంత వేగంగా నడపొద్దని నా గైడుచేత చెప్పించవలసి వచ్చింది. "మా ప్రాణాలు నీ చేతుల్లో ఉన్నాయి. కాపాడు బాబూ" అని ప్రాధేయపడితేనే వేగం తగ్గించాడు.

మా రోడ్డు నైలునది వెంటే సాగింది. ఇది సూడాన్‌లోని ముఖ్యమైన రోడ్డు మార్గం. ఇది ఖార్టూమ్ నుండి ఎర్ర సముద్రం మీద ఉన్న పోర్ట్ సూడాన్ అనే పట్టణంవరకూ నేరుగా సాగిపోతుంది. సూడాన్ ఎగుమతులు, దిగుమతులు చాలావరకు ఈ ఓడరేవు ద్వారానే చేస్తుంటారు. నైలు నదికి రెండువైపులా అంతా సారవంతమైన నేల పచ్చగా పరచుకుపోయింది. ఇంకొంచెం సేపటికి, అంతటి పచ్చదనం ఆకస్మికంగా



కార్టూమ్ సిటీ

హరించుకుపోయి, గోధుమ రంగు ఎడారిగా మారిపోయింది. ఎడారిలో దారి చేసుకుంటూ బిరబిరా సాగిపోయే నైలునది ప్రవాహం ఎంతో అందంగా కనిపిస్తూ ఉంది. ఇసుక తప్ప మరేమీ లేక వట్టిపోయిన సహారా మీద దయ తలచి, దక్షిణం నుండి ఉత్తరానికి ఉరికి వచ్చిన నైలునది, ఎడారి ప్రజలకు, నిజంగా 'ఎక్కివచ్చిన' దేవతే. అక్కడ జరిగే వ్యవసాయం, పండే పంటలు, వాటికోసం ఆ నేల మీదకు చేరుకున్న ప్రజలు, ఏర్పడిన గ్రామాలు, పట్టణాలు, నగరాలు, రూపు దిద్దుకున్న సంస్కృతి అంతా ఆ దేవత అనుగ్రహమే. సౌదీ అరేబియా, యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్, మొదలైన అరబిక్ దేశాలు వారికి కావలసిన ధాన్యం, కూరగాయలవంటి ఆహారం పండించుకోవటానికి, నైలు నది పరివాహక ప్రాంతంలో పెద్ద ఎత్తున వ్యవసాయ భూముల్ని కొనుగోలు చేశారని మా గైడ్ చెప్పింది. వారి జంతువులకి కావాలసిన ఆల్ఫాల్ఫా గడ్డిని కూడా ఈ భూముల నుండే సంగ్రహిస్తారట. చాలా దేశాలు పరిశ్రమలు, అనుబంధ వసతులు ఏర్పరచుకోవటానికి విదేశీ పెట్టుబడులను స్వాగతిస్తుంటే, సూడాన్ మాత్రం తమ విలువైన వ్యవసాయ భూములను విదేశీ సంస్థలకు అమ్ముకుంటోందని మా గైడ్ వాపోయింది. ముందుకెళ్ళేకొద్దీ దోవలో భోజన సదుపాయాలుండవని, మా గైడ్ సలహా మేరకు, మధ్యాహ్న భోజనం కాస్త ముందుగానే చేసేశాము. దారిలో రోడ్డు పక్కన ఉన్న హోటల్లో మరోసారి మంచి చేపల భోజనం దొరికింది.

ఖార్టూమ్ నుండి సుమారు 140 కి.మీ.లు ఉత్తర దిశగా ప్రయాణం చేసిన తరువాత, హైవే నుండి దిగిపోయి, ఎడారి మట్టి బాటల మీద దాదాపు 45 నిముషాల పాటు ప్రయాణం చేసి, 'నక్వ' అనే పట్టణ పురావస్తు తవ్వకాలను చేరుకున్నాము. ఆ ప్రదేశమంతా

ముళ్ళతో కూడిన అడవి తుమ్మ చెట్లు, పొదలతో నిండిపోయి ఉంది. అక్కడ చాలా ఒంటెలు మేస్తూ కనిపించాయి. గతుకులు, గుంటల దారిలో అక్కడి వరకు సాగిన మా ట్రక్కు ప్రయాణం, సహారా సఫారీకేమీ తీసిపోదు. పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్టు, ఈ ప్రయాణంలో మేము హాహాకారాలు చేసిన కొద్దీ, మా డ్రైవరు కావాలని ఇంకా వేగం పెంచి మమ్మల్ని హింస పెట్టేవాడు. అందువల్లే నేమో, ఈ ప్రయాణం తాలూకు భయభ్రాంతులు ఇప్పటికీ గుర్తున్నాయి. 'నక్వ', నూబియా సాండ్ స్టోన్‌లో చెక్కిన గొర్రెపొట్టేలు శిరస్సుతో ఉండే 'అమున్' అనే ఈజిప్షియన్ దేముడు, ఇంకా సింహపు శిరస్సుతో ఉన్న 'అపాడెమక్' అనే నూబియన్ దేముళ్ళ ఆలయాలకి ప్రసిద్ధి. ఇవి క్రీ॥శ॥ ఒకటి నుండి మూడు శతాబ్దాలనాటివి. మా గైడు. అవెయిఫ్, కుషైట్ రాజ్యమైన నూబియా గురించి చాలా ఆసక్తికరమైన విషయాలు తెలిపింది. అమున్ ఆలయం శిధిలావస్థలో ఉంది. సింహ దేవుడు, అపాడెమక్ ఆలయం కొంతవరకు మంచి స్థితిలోనే ఉందని చెప్పాలి. దాని ముందున్న పెద్ద స్తంభాల మీద ఈజిప్టు దేవతలు, రాజులు, రాణుల శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. ఈ ఆలయాలు పురాతన ఈజిప్టు దేవాలయాలను పోలి ఉన్నాయి. ఆనాటి ఈజిప్టు నాగరికత నైలునది వెంబడి సూడాన్‌వరకూ వచ్చిందని మాగైడ్ చెప్పింది. స్థానిక నూబియన్లు, ఈజిప్ట్‌లో రాజకీయ అనిశ్చతి ఉన్నప్పుడల్లా స్వతంత్రం ప్రకటించేవారట. క్రీస్తుపూర్వం 300 నుండి 200 సంవత్సరాల మధ్యలో నూబియన్లు ఈజిప్టు దేశాన్ని చేజిక్కించుకుని, దాదాపు 150 సంవత్సరాలపాటు ఈజిప్టుని పరిపాలించిన ఇరవైఐదవ రాజవంశంగా చరిత్రలో నిలిచారు. వీరిని బ్లాక్ ఫారోలని పిలుస్తారు.

తరువాత మేము ప్రఖ్యాతి చెందిన నూబియన్ పిరమిడ్లు ఉన్న ప్రదేశం, 'మెరోయి'కి వెళ్ళాం. అక్కడ ఉన్న 200 పిరమిడ్లు రెండు సమూహాలుగా ఉన్నాయి. ఈజిప్టు పిరమిడ్లతో పోల్చుకొంటే ఇవి చిన్నవి. విలువైన వస్తువుల కోసం సమాధులను నాశనం చేసే హీనులు చాలా పిరమిడ్లను నాశనం చేశారు. గుసప్పి ఫెర్లిని అనే ఇటాలియన్, నిధుల వేటలో తవ్విన మొదటి పిరమిడ్‌లో బంగారం దొరకటం వలన, మిగిలిన పిరమిడ్లన్నిటినీ తవ్వి నాశనం చేశాడు. నూబియన్ మెరోయి పిరమిడ్లు ఈజిప్షియన్ పిరమిడ్‌లకు గొప్పదనంలో ఏ మాత్రం తీసిపోవు. ఎంతగా అవి నాశనం చేయబడినా, వాటి పురాతన దర్పం, గొప్పతనం తెలుస్తూనే ఉంది. అందుకేనేమో యునెస్కో దీనిని, ప్రపంచ సాంస్కృతిక వారసత్వ సంపదగా గుర్తించింది. మెరోయి పిరమిడ్లను సందర్శించిన రోజు, ఆ సమయం ఎప్పటికీ మరువలేనిది. అది సాయంత్రం. సూర్యుడు అస్తమించటానికి సిద్ధమౌతూ, తన బంగారు వెలుగుతో ప్రపంచానికి మెరుగు పెడుతున్నాడు. పిరమిడ్‌లను చేరుకోవాలంటే ఒక పెద్ద ఇసుక తిన్నెను ఎక్కాలి. అప్పటివరకూ కనిపించని ఆ ప్రాచీన సమాధులు, మేము ఆ తిన్నె మీదికి చేరుకోగానే హఠాత్తుగా దర్శనమిచ్చాయి. అవి చాలావరకు శిధిలమైనా, వాటి అందాన్ని, దర్పాన్ని ఏ మాత్రం కోల్పోలేదు.

2,700 సంవత్సరాల క్రితం ఈజిప్టును చేజిక్కించుకుని, 'మెరోయి' రాజధానిగా విరాజిల్లిన ఆనాటి కుషైట్ సామ్రాజ్యం గురించి ఇంకా వివరంగా తెలుపగలిగే పురావస్తు శాస్త్రజ్ఞుల కృషి ఇంకా మధ్య దశలోనే ఉందని మా గైడు అవెయిఫ్ తెలిపింది.

**సమాగమం, అద్భుతం, అలౌకికం:**

అల్ ముగ్రాన్ వద్ద శ్వేత, నీలి నైలు నదుల సమాగమాన్ని చూడగలగటం, ఈ ప్రయాణంలో మాకు లభించిన గొప్ప అనుభవం. పేరుకు తగ్గట్టు ఆ రెండు నదుల నీటి రంగులో తేడా కనిపిస్తూనే ఉంది. శ్వేత నైలు ప్రవహించే ప్రాంతమంతా పాటిమట్టివంటి తెల్లని మట్టి ప్రాంతం కావటంవలన అ నీరు తెల్లగా ఉంటుంది. కన్నుల పండుగగా ఉంది. ఆ రెండు నదులు కలుసుకునే ప్రదేశంవరకూ నడచి వెళ్ళవచ్చు. ఎన్నాళ్ళుగానో ఈ దృశ్యం చూడాలనుకున్న నా కల నెరవేరిన క్షణాలవి.

ఆ క్షణంలో, ఆ ప్రదేశంలో నిలబడి, ఆ మహానది గమన మార్గం తలచుకుంటుంటే, తన మార్గంలో ఉన్న రువాండా, బురుండీ, కాంగో, టాంజానియా, కెన్యా, ఉగాండా, సూడాన్, ఈజిప్టు, ఇథిమోపియా మొదలైన దేశాలలో దాదాపు 120 మిలియనుల ప్రజలకి ఆహారాన్ని అందిస్తున్న అన్నపూర్ణలా కనిపించింది. నిజానికి నీలి నైలు, దాదాపు ఎనభై శాతం నీటిని అందిస్తుంది. వర్షాకాలంలో ప్రతి సంవత్సరం నైలు నదికి వచ్చే పెద్ద వరదలకు కారణం నీలి నైలు ప్రవాహమే. ఈ నది పరివాహక ప్రాంతమంతా సారవంతమైన ఒండ్రు మట్టి వ్యవసాయ భూములు. వెరసి ధాన్యాగారాలు. మేము ఉన్నప్పుడు, అక్కడ జన సమ్మర్ధం

అంతగా లేదు. మమ్మల్ని ఆ సంగమ స్థానం వరకూ తోడ్కొని వెళ్ళింది మా పోలీస్-సైకియాట్రిస్ట్-ఫ్రెండ్ ఓమర్ హుస్సేన్. అక్కడికి ప్రత్యేకమైన పోలీసు బందోబస్తుతో మాత్రమే వెళ్ళగలమట. అందుకేనేమో మిత్రుడు హుస్సేన్ ఆ రోజు పోలీసు దుస్తులే ధరించాడు. ఇంత అద్భుతమైన ప్రదేశంలో యాత్రికులు అంతగా కనపడని విషయం గురించి అడిగినప్పుడు. ఏ కారణం చేతనో, ప్రభుత్వం అక్కడకు యాత్రికులను ప్రోత్సహించదని అతను చెప్పాడు.

చివరి రోజున అల్పాహారం తరువాత నీలి నైలు ఒడ్డున సాగిపోయే ప్రధాన వీధిలో నడుస్తూ వెళ్ళాము. దారికి రెండు వైపులా మహా వృక్షాలు క్రమంగా పెరిగి ఉన్నాయి. దోవ పొడుగునా బ్రిటిషు వారి కాలం నాటి చక్కని భవనాలు ఇప్పటికీ సుస్థిరంగా నిలచి ఉన్నాయి. సూడాన్ ప్రభుత్వ కార్యాలయాలు చాలావరకు ఈ భవనాల్లోనే ఉన్నాయి.

**ముక్తాయింపు:**

మమ్మల్ని ఎంతో మర్యాదగా, వారి సామాజిక, సాంస్కృతిక జీవితంలోకి కూడా ఆహ్వానించిన సూడాన్ ప్రజలు మర్యాదస్తులనుకోవటం తప్పుకాదనుకుంటాను. ఒకవేళ వారు ఇంగ్లండ్ వస్తే, వారు మాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలో నాలుగో వంతైనా వారిపై చూపగలమా? అని కూడా నాకనిపిస్తోంది. మేము చూసినంతవరకు ఖార్టుమ్ శాంతియుతంగా కనిపించింది. దానికి తోడు, మేము కలసినవారంతా నిజాయితీగా కనిపించారు. మనకి సహాయం చేయటానికి, కష్టమనుకోకుండా చాలా దూరం వెళ్ళగలరు అనిపించింది. నైలు ఎవెన్యూలో నేనూ, నాతో వచ్చిన మోహన్ తిరుగుతున్నప్పుడు అక్కడ ఒక పెద్ద భవనం చుట్టూతా రక్షణ దళాలు ఉన్నట్లుగా తెలుసుకొన్నాను. అది ప్రెసిడెంట్ నివాసం. అక్కడ ఉన్న గార్డులు ఒక పాయింట్ దాటి ముందుకు పోగూడదని చాలా మర్యాదగా చెప్పారు. మేము మంచి దుస్తులు వేసుకొన్న విదేశీయులం కాబట్టి అంత మాత్రమైనా చెప్పారనుకొంటాను. ఖోర్టమ్‌కి ఉత్తరవైపులో అంతా చాలా శాంతియుత వాతావరణం ఉంది అంటున్నారు. అయితే ఖోర్టమ్‌తో సహా దర్‌పూర్ ప్రాంతం, దక్షిణ సూడాన్ ప్రాంతాల్లో పరిస్థితులు బాగా లేవట. అవి ఖోర్టమ్‌కి చాలా దూరంలో ఉన్నాయి. నీలి నైలు నీళ్ళు తేటగా, ఏ రంగు లేకుండా, సహజమైన నీటి రంగులో ఉంటాయి. రెండు నదులు కలిసేచోట, రెండు నదుల నీటి రంగులో తేడా ఛాయామాత్రంగా కనపడుతుంది. సమాగమానంతరం ఉధృతమైన ఉరవడితో సాగిపోయే నైలునది చూస్తుంటే ఊపిరి ఆడటం లేదు. ఆ రెండు నదులు కలుసుకొనే చిట్టచివరి ప్రదేశం వరకూ నడచుకొని వెళ్ళవచ్చు. ఎన్నాళ్ళు నుండో ఈ ప్రదేశాన్ని చూద్దామనుకొంటున్నాను. ఇన్నాళ్ళకి ఆ కల నిజమైంది.

ఈ నైలు నది తన గమన మార్గం ద్వారా 120 మిలియనుల ప్రజలకి ఆహారాన్ని అందిస్తుంది. తెలుపు నైలు నదీ మార్గంలో రువాండా, బురుండీ, కాంగో, తాంజానియా, కెన్యా, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలు వస్తాయి. నిజానికి బులుగు నైలు నదిలోనే ఎక్కువ నీళ్ళు ప్రవహిస్తాయి. వర్షాకాలంలో ఐతే ఈ బులుగు నది ఎనభై శాతం నీటిని మోసుకొని వస్తుంది. ప్రతి సంవత్సరం నైలు నదికి వచ్చే పెద్ద వరదలకు కారణం ఈ బులుగు నైలు తెచ్చే గంభీరమైన ప్రవాహాలు, అది మోసుకు వచ్చే ఒండ్రుమట్టి. అందువలన పరిసరాల్లోని వ్యవసాయ భూముల్లో ఎక్కువ పంటలు పండుతున్నాయి. ఎందుకో మరి ఈ నైలు సంగమం వద్ద ఎక్కువమంది యాత్రికులు లేరు. మమ్మల్ని జాగ్రత్తగా ఆ సంగమంవరకూ, నా ఫ్రెండ్ ఓమర్ హసన్, నడిపించుకొని వెళ్ళాడు. అక్కడికి ప్రత్యేకమైన పోలీసుల సహాయంతో మాత్రమే వెళ్ళగలం. అందుకనే నా మిత్రుడు హసన్ కూడా పోలీసు దుస్తులే ధరించాడు. చివరి రోజున అందరం ఒక సుదీర్ఘ నడకని అనుభవించాలనుకొన్నాం. అల్పాహారం పూర్తయ్యాక అలాగా బులుగు నైలు నది ఒడ్డు మీది మార్గంలో నడక మొదలుపెట్టాం. దారికి రెండుప్రక్కలా పెద్ద వృక్షాలు ఉన్నాయి. అక్కడ నిలిచి ఉన్న బ్రిటిషు వారి నిర్మాణాలను ఇప్పటికీ జాగ్రత్తగానే కాపాడుతున్నారు.

సూడాన్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ కూడా ఆనాటి కలోనియల్ భవనాల్లోనే ఏర్పాటు చేసుకొన్నారు.

సూడాన్ ప్రజలు చాలా మర్యాద తెలిసిన వ్యక్తులు. మా స్నేహితులు మమ్మల్ని ఎంతో మర్యాదగా చూసుకొన్నారు. మమ్మల్ని వారి సామాజిక, సాంస్కృతిక జీవితంలోకి కూడా ఆహ్వానించారు. వారు మాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలో వారికి నాలుగోవంతైనా బదులు ఇవ్వగలనా అనిపించింది. ఈ ఖోర్టమ్‌లో అంతా శాంతియుత వాతావరణమే కనిపించింది. దానికి తోడుగా

ప్రజలందరూ మంచివాళ్ళు, నిజాయితీగలవాళ్ళు అనిపించింది. మనకి సహాయం చేయటానికి ఎంత దూరమైనా వెళ్ళగలరు అనిపించింది.

నైలు ఎవెన్యూలో నేనూ, నాతో వచ్చిన మోహన్ తిరుగుతున్నప్పుడు అక్కడ ఒక పెద్ద భవనం చుట్టుతా రక్షణ దళాలు ఉన్నట్లుగా తెలుసుకొన్నాను. అది ప్రెసిడెంట్ నివాసం. అక్కడ ఉన్న గార్డులు ఒక పాయింట్ దాటి ముందుకు పోగూడదని చాలా మర్యాదగా చెప్పారు. మేము మంచి దుస్తులు వేసుకొన్న విదేశీయులం కాబట్టి అంత మాత్రమైనా చెప్పారనుకొంటాను.

ఖోర్టమ్‌కి ఉత్తర వైపులో అంతా చాలా శాంతియుత వాతావరణం ఉంది అంటున్నారు. అయితే ఖోర్టమ్‌తో సహా దర్‌పూర్ ప్రాంతం, దక్షిణ సూడాన్ ప్రాంతాల్లో పరిస్థితులు బాగా లేవట. అవి ఖోర్టమ్‌కి చాలా దూరంలో ఉన్నాయి. తిరుగు ప్రయాణంలో నేను విమానంలో వెళ్ళేటప్పుడు నైలు నదిని ఫోటోలు తీశాను. నది ఖోర్టమ్ మీదుగా అలా సహారా ఎడారిలోకి నేలని చీల్చుకు వెళ్ళటం చాలా అందంగా కనిపించింది. ఎండిన ఎడారిలో గుండా పాల ప్రవాహంలాగా మెరుస్తూ, పాక్కుంటూ పోయే ఆ దృశ్యాన్ని, వర్ణించటం కష్టం. నదికి రెండు వైపులా ఉన్న పచ్చదనం, అక్కడి వ్యవసాయ భూములు, పని చేస్తున్న వ్యవసాయదారులు, ఇళ్ళు అన్నీ కూడా అనంతంగా పరచుకొనిపోతూనే ఉంటాయి. సహారా ఎడారి ఎర్ర సముద్రంలో కలవటాన్ని కూడా కొన్ని ఫోటోలు తీసుకొన్నాను. ఆ రోజు ఆకాశం అంతా స్పష్టంగా ఉండబట్టి ఈ అవకాశం దక్కింది. ఈ సూడాన్ యాత్ర నాకు ఎన్నో సంతోషకరమైన జ్ఞాపకాలను అందించింది. సహారా ఎడారి ప్రాంతాలన్ని దర్శించటమే గొప్ప అనుభూతి. సూడాన్ మెడికల్ స్పెషలైజేషన్ బోర్డువారు ఆహ్వానించకపోతే ఇవన్నీ జరిగేవి కావు. వారికి నా ప్రత్యేక అభినందనలు.

2017లో ఈ ప్రయాణం జరిగింది. అప్పుడు ప్రెసిడెంట్‌గా ఉన్న ఓమర్ అల్ బషీర్‌ని తరువాత మిలటరీ తిరుగుబాటుదారులు కూలదోసి, తన ఇంటికి మాత్రమే పరిమితం చేశారు. నైలు ఎవెన్యూలో నేనూ, నా మిత్రుడు మోహన్ తిరుగుతున్నప్పుడు అక్కడ భద్రతాదళాలు పహరా కాస్తున్న ఒక పెద్ద భవనం, ప్రెసిడెంట్ నివాసమని తెలిసింది. అక్కడ ఉన్న రక్షక భటులు మమ్మల్ని ముందుకు పోగూడదని చాలా మర్యాదగా చెప్పారు. మేము మంచి దుస్తులు వేసుకొన్న విదేశీయులం కాబట్టే ఆ మర్యాద చూపించారేమో అనుకున్నాము. ఖార్టూమ్‌కి ఉత్తరభాగం శాంతియుతంగా ఉంటుందన్నారు. అయితే దర్ఫూర్, ఇంకా దక్షిణ సూడాన్ ప్రాంతాల్లో గొడవలు, సాయుధ పోరాటాలు జరుగుతుంటాయట. అవి ఖార్టూమ్‌కి చాలా దూరంలో ఉన్నాయి. తిరుగు ప్రయాణంలో నేను విమానం నుండి నైలు నదిని ఫోటోలు తీశాను. నది ఖార్టూమ్ మీదుగా సహారా ఎడారిలోకి నేలని చీల్చుకుని వెళుతున్నట్టు, చాలా అందంగా కనిపించింది. మండే ఎడారి ఇసుకను తడుపుతూ, చల్లబరుస్తూ, ప్రవహించే పాలనురుగులా కనిపించే నదికి రెండు వైపులా ఉన్న వ్యవసాయ భూముల పచ్చదనం, పనులు చేసుకుంటున్న వ్యవసాయదారులు, వారి గృహాలు అన్నీ వెనుకకు సూక్ష్మరూపంలో అనంతంగా పరచుకుని కనిపిస్తూ అంతలోనే కంటికి కనుమరుగౌతూ మనసుకు హత్తుకుపోతున్నాయి. సూడాన్ వైపు నుండి సహారా ఎడారి, సౌదీ అరేబియా వైపు నుండి అరేబియా ఎడారి ఎర్ర సముద్రాన్ని కద నొక్కటం కూడా ఆకాశం నుండి మాత్రమే కన్ను చూడగలిగే దృశ్యం. మరిన్ని ఫోటోలు తీసుకొన్నాను. ఆ రోజు ఆకాశం మేఘరహితంగా ఉండటం నా అదృష్టం.

సూడాన్ యాత్ర నాకు ఎన్నో సంతోషకరమైన జ్ఞాపకాలను అందించింది. సూడాన్ మెడికల్ స్పెషలైజేషన్ బోర్డు వారు ఆహ్వానించకపోతే ఇవన్నీ జరిగేవి కావు. వారికి నా ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు. నేను 2017లో సూడాన్ వెళ్ళాను. అప్పుడు ప్రెసిడెంట్‌గా ఉన్న ఓమర్ అల్ బషీర్‌ని, 2019లో మిలటరీ తిరుగుబాటుదారులు కూలదోసి, అతనికి గృహ నిర్బంధం విధించారు.

ఈ యాత్రా విశేషాలలో నేను కన్నవి, విన్నవి అన్నీ నిష్పాక్షికంగా పొందుపరచాను. ఇప్పుడు చెప్పండి, 'సూడాన్ ఎందుకు వెళ్ళకూడదు?' అని నేను అడగటం సమంజసమే కదా?

*రచయిత ఆంగ్లంలో రాసిన ఈ యాత్రావిశేషాలను – తెలుగు చేసింది 'భ్రమణకాంక్ష' – ఆదిరానాయణ; జయశ్రీ అట్లూరి గారలు (లండన్).*

**డా. నిమ్మగడ్డ శేషగిరిరావు**
ఇంగ్లాండ్, e-mail: srnimmagadda@googlemail.com

# మండలి బుద్ధప్రసాద్ తో మాటామంతీ

– అశ్వినీకుమార్

రెండవ భాగం

***మిసిమి* : ఏ ప్రక్రియ తీసుకున్నా విశ్వనాథది అద్భుతమైన ప్రతిభ. ఏకవీర లో వాడిన భాష వేరు, జీవుని వేదనకు వాడిన భాష వేరు. కొన్ని సందర్భాలలో వాడుక భాష కూడా వాడారు విశ్వనాథ.**

***బుద్ధప్రసాద్:*** వేయిపడగలు నవలలో ఆయన ఎలక్ట్రిసిటీకి వ్యతిరేకంగా ఉన్నాడనుకుంటాం. ఆయన ఉద్దేశ్యం దానివలన గ్రామాలలో వీధి దీపాలు వెలిగించే వారి జీవనోపాధి పోతుందని. నాకలాంటి సమస్య ఎదురైంది జీవితంలో. మా దగ్గర పులిగడ్డ – పెనుమూడి వంతెన కట్టాలని పెద్ద పోరాటం చేయటం జరిగింది. చివరికి ఆ వంతెన కట్టడం జరిగింది. అంతకు ముందు పడవల ద్వారా రాకపోకలు సాగిస్తుండేవారు. ఈ బ్రిడ్జ్‌వలన పడవలు నడిపేవారికి ఇబ్బంది కలిగింది. పడవలు, లాంచీలు ఎత్తేయాల్సిన పరిస్థితి వచ్చింది. వాళ్ళంతా లబోదిబోమంటే అప్పుడు రాజశేఖరరెడ్డిగారు డిఆర్‌డిఏ ద్వారా వారికి ప్రత్యామ్నాయం చూపారు. ఆ రోజుల్లో విశ్వనాథ రచయితగా వేయిపడగలు నవలలో ఎక్కువ చేసేనరికి ఈయన కరెంట్‌కు వ్యతిరేకమనుకున్నారు.

***మిసిమి* : బుద్ధప్రసాద్‌గారంటే బుద్ధిజీవిగానే తెలుసు. ప్రజలకు తెలియనిది, ప్రజలు తెలుసుకోవలసింది ఏమయినా ఉన్నదా!**

***బుద్ధప్రసాద్:*** అది మనమెలా చెబుతాం, ప్రజలు తెలుసుకోవాలికానీ.

***మిసిమి* : అది ప్రజలకు తెలుసు, న్యూస్ పేపర్స్ ద్వారా, వివిధ మాధ్యమాల్లో ఇంటర్వ్యూల ద్వారా మీరేమిటో తెలుసు వాళ్ళకి. అయినా మీరేమైనా చెప్పదలుచుకున్నారా?**



మండలి బుద్ధప్రసాద్

***బుద్ధప్రసాద్:*** వాస్తవానికి నా జీవితం రెండు పార్శ్వాలుగా ఉంటుంది. ఒకటి నేను చేసిన పోరాటాలు.. ప్రజలకు అవి అందుతాయి. మరో పార్శ్వం ఇలాంటిది.. సాహిత్యంపై చర్చ. ఇది అందదు. ఈయన కవులు కళాకారులతో తిరుగుతుంటాడు. మన గురించి పట్టించుకోడు అని ప్రతిపక్షం వాళ్ళంటుంటారు. కానీ నేనది లెక్కచేయను. వాళ్ళ ఆలోచనలు వేరేలా ఉంటాయి. కానీ నా ప్రగాఢ నమ్మకమేమిటంటే నాకీనాడు గుర్తింపు వచ్చిందంటే తెలుగువలనే. సరే, మా నియోజకవర్గంలో ఏం చేసినా ప్రతిపక్షంవాళ్ళొప్పుకోరు. అయితే కొన్ని ఉద్యమాల్లో పాల్గొన్నప్పుడు జనం సన్నిహితుడిగా భావించారు.

కృష్ణా డెల్టా ఉద్యమం గురించి చెబుతాను.

అది యాదృచ్ఛికంగా జరిగింది. ఒకరోజు పిన్నమనేని కోటేశ్వరరావుగారూ, నేను ఒక సమావేశానికి ఇద్దరం కలిసి తిరువూరు వెళుతున్నాం.

హనుమాన్ జంక్షన్ రాగానే ఆయన 'నీళ్ల సమస్య వస్తే నువ్వేం మాట్లాడవేంటి బుద్ధప్రసాద్' అన్నాడు.

నేనన్నాను 'ఏం మాట్లాడతానండి, అక్కడ జలశయాల్లో నీళ్లు లేవు. అనావృష్టి పరిస్థితులు, ఏం మాట్లాడినా రాజకీయంగా మాట్లాడినట్టుంది' అన్నాను.

'లేదు, ఇంతకు పూర్వం ఇంతకంటే తక్కువ నీళ్లున్నప్పుడే విజయభాస్కరరెడ్డి, ఎన్టీరామారావు ఇద్దరు నీళ్ళిచ్చారు. ఆ రోజుకంటే ఈ రోజున నీళ్ళెక్కువున్నాయి

నాగార్జున సాగర్‌లో. అయినా ఇవ్వటంలేదు' అన్నాడాయన. ఇందులో వాస్తవమెంతుందని నీటి లెక్కలు తెప్పించా..

ఆయన చెప్పింది వాస్తవమేనని తేలింది. 'అంతకన్నా తక్కువున్న సమయంలో మనవాళ్ళడక్కుండానే నీళ్ళిచ్చారు విజయభాస్కరరెడ్డి, రామారావుగారలు. సరే. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, నువ్వు అన్ని పార్టీలను పిలువు, తెలుగుదేశంతో సహా.. అలాగే రైతు నాయకులను పిలువు' అన్నాడాయన.

విజయవాడ స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేశాను. తెలుగుదేశం నాయకులు నేరుగా రాకపోయినా ఆ పార్టీలో ఉన్న యలమంచిలి శివాజీ, ఎర్నేని నాగేంద్ర నాథ్ వచ్చారు. సరే, అక్కినేని భవానీ ప్రసాద్ రైతు సంఘం నాయకుడు, సిపిఎం, సిపిఐ వాళ్ళు వచ్చారు. సమావేశం అయ్యాక, దీనిమీద పోరాటం చెయ్యాలని నిర్ణయం చేశారు. పోరాటం చేయాలంటే పెద్దాయన భుజస్కంధాల మీద నడిపిద్దామంటే... అది నువ్వు చేయాలన్నాడాయన. కమ్యూనిస్టులు కూడా నువ్వు చేయాలన్నారు. నువ్వే కన్వీనర్ అన్నారు.

అప్పుడు నేను చెప్పాను.. నాకు వ్యవసాయం గురించి తెలిసింది తక్కువ. తర్వాత టిఎంసి లు, క్యూసెక్కుల గొడవ నాకు తెలీదన్నాను. అవతల పోరాడాల్సింది వడ్డే శోభనాద్రీశ్వరరావుగారితో, ఆయన వ్యవసాయ మంత్రి, వ్యవసాయంలో నిష్ణాతుడు, ఆలోచించండి – అన్నాను.

'మీరుండండి.. వెనకుండి నడిపిస్తాను' అన్నాను.

అప్పుడు కోటేశ్వరరావుగారు ఒక మాటన్నారు.

'నేను చేసిన పోరాటాలు, ఉద్యమాలు సక్సెస్ కాలేదు.

నీతో అవుతుందేమో చూద్దాం' అన్నారు.

సర్లే అని రోజూ పగటిపూట అవనిగడ్డ నియోజకవర్గం తిరగటం.. రాత్రయేసరికి విజయవాడ చేరటం, గెస్ట్ హౌస్‌లో అక్కినేని భవానీ ప్రసాద్‌నో, ఎర్నేని నాగేంద్ర నాథ్‌నో, ఎవరన్నా ఇంజనీర్‌నో కూచోబెట్టుకుని ఓనమాలు నేర్చుకున్నట్టు అన్నీ నేర్చుకోవటం...

ఆ ఉద్యమం అలా ప్రారంభించి చివరికి ప్రకాశం బ్యారేజీ మీద ధర్నా తలపెట్టాం.

ధర్నా ఎలా ఉంటుందంటే వర్షం పడిందనుకోండి.. ఒక్క రైతు కనిపించేవాడు కాదు. సరే రెండుసార్లు వర్షంతో వాయిదాపడి, మూడోసారి జరిగింది. పదివేలమంది రైతులతో కృష్ణా బ్యారేజీ మీద మహా ధర్నా జరిగింది.

తర్వాత బందరులో ఆమరణ నిరాహారదీక్ష చేశాం నీటి విడుదల కోసం. ఆ ఉద్యమాన్ని అలా జనం తమదిగా భావించారు. ఆ తరువాత ఎక్కడికి వెళ్ళినా జనం పరుగెత్తుకుంటూ వచ్చేసేవారు. ఆ తర్వాత కాంగ్రెస్ గెలవటానికి తోడ్పడింది. అలా ఆ ఉద్యమం నాకు తృప్తినిచ్చింది. నాకు టర్నింగ్ పాయింట్ కూడా. నా వెనుక పిన్నమనేని, కోనేరు, చనుమోలు.. ఈ ముగ్గురు నాయకులు నాకు అండగా నిలిచేవారెప్పుడూ. అయితే ఆ ముగ్గురు నిష్క్రమించిన తరవాత నేనే ఉద్యమంలోకి దిగలేదు. వారిలాగా వెనకే నిలబడే నాయకులు లేకపోవటం కారణం. అలా నిలబడేవాళ్ళు లేకపోతే బలయిపోతాం. సమైక్యాంధ్ర ఉద్యమంలో చాలా పడ్డాను. వేదికలెక్కి కలిసుండాలనే వాళ్ళు, వేదిక దిగి విడిపోతే ఏమవుతుందని మాట్లాడేవారు. ప్రస్తుత రాజకీయ నాయకులకు ప్రమాణాలు లేవు.

**మిసిమి : డెల్టా ఉద్యమంతో నీళ్లు విడుదల చేశారా?**

*బుద్ధప్రసాద్:* విడుదల చేశారు. పంటలు బాగా పండాయి. విడుదల చేయకపోవటానికి కారణం, అప్పుడే తెలంగాణ ఉద్యమం మొదలయింది. ప్రభుత్వం జడిసింది. డెల్టా ఉద్యమంతో నీళ్లు విడుదల చేయక తప్పలేదు.

**మిసిమి : కృష్ణా డెల్టా ఆధునీకరణకు మీరే కారకులు కదా!**

*బుద్ధప్రసాద్ :* కృష్ణా డెల్టా ఆధునీకరణ, పులిచింతల ఈ రెండింటి గురించి చెప్పాల్సిన అవసరముంది. ఈ రెండూ రాజశేఖరరెడ్డితో ముడిపడున్నాయి. ముందు పులిచింతల. అవనిగడ్డలో మా నాన్నగారి విగ్రహం ఆవిష్కరించటానికి రాజశేఖరరెడ్డి వచ్చారు. వచ్చేటప్పటికి అప్పుడే డెల్టా ఉద్యమం మొదలయింది. జనాలందరూ ఇబ్బందుల్లో ఉన్నారు.

రాజశేఖరరెడ్డిగారు సభలో ప్రసంగం మొదలుపెట్టగానే జనం పులిచింతల, పులిచింతల అని కేకలేశారు. వెంటనే ఆయనేం చేశాడు, కాంగ్రెస్ గవర్నమెంట్ రాగానే పులిచింతల కడతామని ప్రకటించాడు. మర్నాడేమయింది, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పెద్ద యుద్ధం ప్రకటించారు కానీ వాళ్ళని ఢీకొనడం ఆయన ఒక్కడివలనే అయింది. సరే ఈయన

ముఖ్యమంత్రి అవగానే అన్నమాట ప్రకారం పులిచింతల ప్రారంభించాడు. అది ప్రారంభించినప్పుడు ఎన్ని సమస్యలో.. ఒకపక్క శంఖుస్థాపన జరుగుతుంటే మరోపక్క బాంబులతో నక్సల్స్ దాడి. అదవగానే కోర్టుకెళ్ళారు. హైకోర్టు స్టే ఇచ్చింది. నేను డెల్టా తరపున Implead అయ్యాను. అనంతశయనం (లోక్ సభ స్పీకర్ చేశారు) గారి మనవడు రమేష్ రంగనాథన్ నీటి చట్టాలలో దిట్ట అని జస్టిస్ చలమేశ్వర్, ఇతరులు నాకు సూచించారు. అందుకని ఆయన దగ్గరకు వెళ్ళాం. తెలంగాణా వాదులు కోరిందేంటంటే మూడు బ్యారేజీలు కట్టాలని.

రమేష్ రంగనాథన్ అడిగిందేమిటంటే మూడు బ్యారేజీల మీద గవర్నమెంటేమైనా స్టడీ చేసిందా అని. 'నాకు తెలీదండీ, తెలుసుకుంటానని' ఇంజనీర్ ఇన్ ఛీఫ్ ఆఫీసుకు వెళ్ళాను. అలాంటిదేమీ లేదన్నాడు ఇఎన్‌సి గారు. అక్కడో గమ్మత్తు జరిగింది. అక్కడున్న సెక్షనాఫీసర్, 'లేద్సార్, కడియం శ్రీహరి గారు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు దానిమీదో కమిటీ వేశారు. దాని రిపోర్ట్ ఉంది సర్' అన్నాడు.

సరే చూద్దామని ఆ రిపోర్ట్ తెప్పించాను. ఆ రిపోర్ట్‌లో ఏముందంటే, అది రాతినేల కాదు. ఇసకనేల, బ్యారేజీలు కడితే నిలబడవని ఉంది. ఆ కాపీ తీసుకుని రమేష్ రంగనాథన్‌గారికిచ్చాం. అది ఆయన కోర్టుకు సమర్పించారు. ఆ తరువాత స్టే వెకేట్ అయింది. అనుమతులు తెచ్చుకుని మీరు పనులు చేసుకోవచ్చని కోర్టు చెప్పింది. అనుమతులు తేవటం అదీ ఆ ప్రక్రియ అయిపోయింది. ఆ తరువాత కెసిఆర్ గారు సోనియాగాంధీకి ఫిర్యాదు చేశారు. వారు వెంటనే దిగ్విజయ్ సింగ్‌ని పిలిచి రాజశేఖరరెడ్డి, కెసిఆర్‌లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను సర్దుబాటు చేయమని కోరారు. నేనప్పుడెందుకో ఢిల్లీ వెళ్లా. ఏపీ భవన్‌లో ఉండగా టీవీలో స్క్రోలింగ్ వస్తోంది. దాని సారాంశమేంటంటే వీరి మధ్య ఒప్పందం జరిగింది. దాని ప్రకారం పులిచింతల నిర్మాణ పనులు ఆపేస్తారని, మధ్యప్రదేశ్ నుంచి ఇంజనీర్ల బృందం వచ్చి పులిచింతల పరిశీలిస్తారని, వారిచ్చే నివేదిక ఆధారంగా పులిచింతల నిర్మాణం పరిశీలిస్తారని. ఇక్కడో కీలకమైన అంశం చెబుతాను. ముఖ్యమంత్రి గారి సమావేశం నుంచి కెసిఆర్ బయటకి వెళ్లగానే నేను వెళ్లాను. కీలకమైన అంశమిదే.

రాజశేఖరరెడ్డి గారు నా మొహం వంక చూశాడు. వాడిపోయింది నా మొహం. నేను బాధపడటం గమనించాడాయన. 'బుద్ధప్రసాద్ నువ్వేమీ బాధపడమాక. ఇప్పుడు నేను చెబితే ఏడుస్తారు కానీ, బయటకు వెళ్లి ప్రెస్‌కు ప్రకటించు. పులిచింతల పనులాగవని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని' అని రాజశేఖరరెడ్డి నాతో చెప్పారు. సరే నేను బయటికి వచ్చి చెప్పాననుకోండి (నవ్వు). ఆ రకంగా పులిచింతల గండాలు దాటుకుని నిర్మాణం మొదలయి చివరకి కిరణ్ కుమారరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పూర్తయింది. దానిని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా చెప్పుకోవచ్చు.

ఆ తర్వాత ఒకసారి ఓగ్ని తుపానొచ్చింది. అదేరోజు రాజశేఖరరెడ్డి గారు బందరులో జిల్లా అభివృద్ధి మండలి సమావేశం పెట్టారు. ఆ రాత్రి అక్కడే ఉండి మరుసటిరోజు మరో కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉందాయన. ఆ రాత్రి కలెక్టర్ గారు నాకు ఫోన్ చేసి మీరు అవనిగడ్డ వెళ్లిపోతే మంచిదని చెప్పారు నాకు.

నేను వెళ్లిపోతాను అలా అయితే, ఈ విషయం ముఖ్యమంత్రిగారికి కుడా చెప్పండని చెప్పి నేను వెళ్లిపోయాను. తుఫాను బీభత్సానికి బందరులో కొన్ని ప్రాంతాలు మునిగిపోయాయి. కారులో వెళ్లే పరిస్థితి లేకపోవటంతో ఆయనను బస్సులో ఒంగోలు పంపించారు. మళ్ళీ అక్కడ నుండి ఆయన బస్సులో అవనిగడ్డ వచ్చారు. అవనిగడ్డ వచ్చినప్పుడు కృష్ణా జిల్లా ఆధునికీకరణ గురించి అనౌన్స్ చేశారు. అనంతరకాలంలో కృష్ణా జిల్లా ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన కూడా అవనిగడ్డలోనే చేశారు.

అలా ఆయన ఏ చిన్న విపత్తొచ్చినా వెంటనే ఆ ప్రాంతాన్ని విజిట్ చేసేవారు.

ఒకసారి వరదొచ్చింది మా ప్రాంతంలో. మరీ పెద్దదేమీ కాదు. నేనప్పుడు శాసనసభ్యుడిగానే ఉన్నాను. మంత్రిను కాను. ముఖ్యమంత్రి పేషీలో ఉన్న ప్రభాకరరెడ్డి అంతకుముందు కృష్ణాజిల్లా కలెక్టర్‌గా చేశారు. నేనాయనకు ఫోన్ చేసి వరద పరిస్థితి చెప్పాను. ప్రస్తుతం సార్ విజిటర్స్‌ని చూస్తున్నారనిచెప్పి మీకు ఫోన్ చేస్తానన్నారు. అరగంటలో ఫోన్‌చేసి సార్ రెండు గంటలకు వస్తామని

చెప్పమన్నారనగానే నేనాశ్చర్యపోయాను. మా దగ్గరంతా ద్వీపంలా ఉంది పరిస్థితి. నేను ఎలాగోలా కష్టాలు పడి అవనిగడ్డ చేరాను. కృష్ణాజిల్లా కలెక్టర్ నవీన్ మిట్టల్ అప్పటికే అక్కడున్నారు.

ఎలాగూ ముఖ్యమంత్రిగారొస్తున్నారు కాబట్టి ఏదయినా అడుగుదామని ప్రతిపాదించాను నేను. అప్పటికేంటంటే విజయవాడ నుంచి పులిగడ్డవరకు కరకట్టమీద కచ్చా రోడ్డుంది.. ఆ రోడ్డొకటి వేయమని అడుగుదామని నేను కలెక్టరుగారికి చెప్పాను. ఆయన కూడా మంచి ఆలోచన అని చెప్పారు.

'నేను ముఖ్యమంత్రిగారినడుగుతాను. ఆయన మిమ్మల్ని అడుగుతారు. మీరు అవసరమని చెప్పండి అని చెప్పాను. (నవ్వు).

సరే నేను మైక్ తీసుకుని స్వాగత వచనాలు మాట్లాడుతూ అడిగాను, కరకట్ట రోడ్డు చాలా అవసరమండీ అని. దానివలన వరద నుంచి రక్షణ ఉంటుంది, అందుకని దాన్ని బలోపేతం చేయటం అవసరం, అలాగే వాణిజ్య పంటల ఉత్పత్తులను విజయవాడ తీసుకెళ్లడానికి మంచి రోడ్డు కావాలని.. ఇలాంటివేవో చెప్పాను.. అనుకున్నట్టుగానే ఆయన మిట్టల్‌నడిగారు, ఎంత ఖర్చవుతుందని.. ఆయన ఇరవై కోట్లవుతుందని చెప్పారు. వెంటనే ముఖ్యమంత్రి గారు మైక్ తీసుకుని అనౌన్స్ చేశారు. కరకట్ట రోడ్డు శాంక్షన్ చేస్తున్నానని. అలా డెబ్బైకోట్ల ఖర్చుతో మొత్తానికి పూర్తయిందది. దానివలన ఇవాళ అవనిగడ్డ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చు.

దీనికి కారణమేమిటంటే నాకు మంత్రి పదవి ఇవ్వలా ఆ సమయంలో. నన్ను బుజ్జగించటానికొచ్చారాయన అవనిగడ్డ. (నవ్వు)

మరొకటి ఆ టైంలో ఏర్పాటయిన కృష్ణా విశ్వవిద్యాలయం గురించి చెప్పాలి. అప్పుడు జిల్లాకో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నారాయన. అప్పుడు నేను మంత్రిగా ఉన్నాను. బెజవాడలో ప్రెస్‌వాళ్ళడగితే మనక్కూడా ఒక విశ్వవిద్యాలయం వస్తుందని చెప్పాను. సరే ఒకరోజు నేను కలిసి ఆయన్ని విశ్వవిద్యాలయం అవసరం గురించి, నేపథ్యం గురించి చెప్పాను. బందరులో జాతీయ కళాశాల ఎప్పటి నుంచో ఉందండి. కాంగ్రెస్ పార్టీకి చెందిన కోపల్లె హనుమంతరావు గారు, పట్టాభి సీతారామయ్య గారు దానికి కారణం. బెజవాడ గోపాలరెడ్డి గారు అక్కడే చదివారు, మరో కళాశాల నోబెల్ కళాశాలలో కాసు బ్రహ్మానందరెడ్డిగారు చదివారు. అందుకని బందర్‌ని ఓ విద్యా కేంద్రంగా చేస్తే బావుంటుంది. ఆంధ్రజాతీయ కళాశాలను దృష్టిలో పెట్టుకుని అక్కడ విశ్వవిద్యాలయమిస్తే బావుంటుందనగానే ఆయన వెంటనే ఒప్పుకున్నారు. సరే ఆయన ఒప్పుకున్నారని ప్రెస్‌లో ప్రకటనిచ్చేశాం. కథ అక్కడితో అయిపోలేదు.

ఆయన బందరు పోర్ట్ ప్రారంభోత్సవానికి వస్తున్నారని తెలిసినప్పుడు కృష్ణా యూనివర్సిటీకి కూడా శంకుస్థాపన చేయండని కోరాను. అప్పుడాయన హైయర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఛైర్మన్ కె.సి. రెడ్డికి ఫోన్ చేయమన్నారు. ఆయనేమో ఈసారి బడ్జెట్‌లో ప్రొవిజన్ లేదన్నారు. రాజశేఖరరెడ్డిగారు వెంటనే సైట్‌ని సెలెక్ట్ చేయమని కోరాడు. ఆరోజు ఆ నిర్ణయం ఆయన తీసుకోపోయుంటే కృష్ణా యూనివర్సిటీ వచ్చేది కాదు.

***మిసిమి* : మీరు అధికార భాషా సంఘం ఛైర్మన్‌గా చేశారు కదా.. మీ పదవీ కాలంలో చేసినవి చెప్పాలంటే?**

**బుద్ధప్రసాద్:** *నిజానికి నాకిష్టమైన పోస్టది.* కిరణకుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ బాధ్యత నిర్వహించాను. రోశయ్యగారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆయన కూడా నన్నడిగారు, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా ఉండమని. అయితే అప్పుడు హైకమాండ్ ఒక రూల్ పెట్టుకుంది. ఓడిపోయిన వారికి పదవులేమీ ఇవ్వకూడదని.

ఆ తర్వాత కిరణకుమార్ రెడ్డి గారొచ్చినప్పుడు ఆయన ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహించాలనుకున్నారు. నేనుండాలని గట్టిగా కోరుకున్నారు. ఈలోగా ఏఐసీసీ జనరల్ సెక్రటరీ గులాంనబీ ఆజాద్ వస్తున్నారని ఆయన్ని కలుద్దాం అని పిలిచాడు. నేనెవరినీ కలవాల్సిన పని నాకు లేదని చెప్పినా వినకుండా నన్ను లాక్కుపోయాడు. ఇతను బుద్ధప్రసాద్. ఇతను అధికార భాషా సంఘం ఛైర్మన్‌గా ఉండాలంటే పర్మిషన్ ఇచ్చాడతను. సరే ప్రపంచ తెలుగు మహా సభలు తిరుపతిలో బాగా జరిగాయి. అప్పుడు నల్గొండ జిల్లా కలెక్టర్ ముక్తేశ్వరరావని ఉండేవారు. ఆయన జిల్లాలో పరిపాలనా భాషగా తెలుగు పూర్తి స్థాయిలో అమలు

చేస్తుండేవారు. ఆయన ఏ విధంగా తెలుగును అమలు చేయగలుగుతున్నారో పరిశీలించే అవకాశం కలిగింది. ఆ తర్వాత రాధాగారని తమిళుడు ఉండేవారు. ఆయన విపత్తుల నిర్వహణ శాఖ చూస్తుండేవారు. సెక్రటేరియట్‌లో పూర్తిస్థాయిలో తెలుగును వినియోగించిన ఏకైక శాఖ అదే. ఇందుకోసం నెల్లూరు నుంచి ఒకాయన్ని పిలిపించి వారి సహకారంతో చేయగలిగారాయన. అదే సమయంలో ఛీఫ్ సెక్రటరీగా మిన్నీ మాథ్యూస్ ఉండేవారు. తెలుగు వాడకాన్ని వారు కూడా ప్రోత్సహించారు. అందరు సంతకాలు తెలుగులో పెట్టాలని పట్టుబట్టి ఆర్డర్ తెప్పించారు. అలాగే వాణిజ్య సంస్థల పేర్లన్నీ తెలుగులో ఉండాలని లేకపోతే ఫైన్ విధిస్తామని ఉత్తర్వులను జారీచేశారు.

ఇవన్నీ ప్రపంచ తెలుగు మహా సభలు తెచ్చిన ఊపు, ఉత్సాహం.

పాఠశాల స్థాయిలో కూడా తెలుగు వ్యాప్తికి కృషిచేశాం.

అప్పుడు శైలజానాథ్ విద్యాశాఖ మంత్రితో సమావేశాలు నిర్వహించాం. ఇంటర్మీడియట్‌లో రెండవ భాషగా తెలుగుతో పాటు సంస్కృతం కూడా ఉండేది. అయితే అది ఏ భాషలోనైనా రాసే సౌలభ్యం ఉండటంతో, మార్కుల కోసం విద్యార్థులు దాన్ని తీసుకునేవారు. అప్పుడు ఇంటర్మీడియట్ బోర్డుతో చర్చలు జరిపి సంస్కృతం దేవనాగరి లిపిలోనే రాయాలని ఒప్పించాం. అలాగే తెలుగు సిలబస్ తగ్గించి మార్కులెక్కువ వచ్చేందుకు ప్రయత్నం చేశాం. అయితే ఏ ప్రభుత్వం ఉన్నా కూడా కార్పొరేట్ కాలేజీల పెత్తనం వలన అది అమలు కాలేదు. మరోపక్క మేము రాష్ట్ర విభజన గొడవల్లో ఉండి దాన్ని గుర్తించలేకపోయాం. ఆ తర్వాత తెలుగు సిలబస్‌లో పద్యాలు, గేయాలు ఉండేట్టు చూశాం. ఇంకో విషయమేమిటంటే తెలుగు మహాసభల సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణగారు ఈనాడు లో ఒక వ్యాసం రాశారు. న్యాయపాలన కూడా తెలుగులో జరగాలని, అందుకు సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించారు. అది చదివి నేను వారి దగ్గరకు వెళ్ళాను, మమ్మల్నేం చేయమంటారో చెప్పండంటూ. అప్పుడు రమణగారు జ్యుడీషియల్ అకాడమీ ఛైర్మన్‌గా ఉండేవారు. వారి సూచన మేరకు జూబ్లీ హాలులో ఓ సెమినార్ పెట్టాం. చరిత్రలో మొదటిసారిగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, జిల్లాస్థాయి న్యాయసిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. హైకోర్టులో తీర్పులు ఇంగ్లీష్‌లో ఉన్నా జిల్లా స్థాయి తీర్పులు తెలుగులో ఉండాలని ఆదేశాలున్నా అమలయ్యేవి కాదు. ఆ సదస్సు ప్రభావంతో అరవై, డెబ్బై తీర్పులు రకరకా తెలుగులో వచ్చాయి. అయితే కొన్ని ఉపకరణాలు అవసరమయ్యాయి. ఐటీ శాఖ ద్వారా అవన్నీ చేయించగలిగాం. కానీ వాటిని అన్వయించేలోపే రమణగారు సుప్రీం కోర్టుకు వెళ్లిపోయారు. మేము రాష్ట్ర విభజన ప్రక్రియలో కూరుకుపోయాం. తర్వాతేమిటంటే ప్రధానంగా ఐటి శాఖ ద్వారా తెలుగు వ్యాప్తికి కృషి చేశాం. దానికి పొన్నాల లక్ష్మయ్యగారు ఐటి శాఖ మంత్రిగా కృషి చేశారు. అమరనాథరెడ్డిగారని తెలుగు భాషాభిమాని అమెరికాలో ఉండేవారు. సెల్‌ఫోన్‌లో తెలుగులో టైప్ చేసేందుకు అవసరమయిన తెలుగు సాఫ్ట్‌వేర్ తయారుచేసి హైదరాబాద్ వచ్చి దాని ఆవిష్కరణ చేశారు. అలాగే అదే సమయంలో సిలికానాంధ్ర కూచిభొట్ల ఆనంద్‌గారొచ్చారు. అంతర్జాలంలో తెలుగు వాడకం పెంచటం కోసం మీటింగ్ పెడితే బావుంటుందంటే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో ఒక సమావేశం పెట్టాం. దానికి అంతర్జాలం, ఐటి నిపుణులను ఆహ్వానించాం. ఆ సమావేశంలో తెలుగులో యూనికోడ్‌లో అన్ని అక్షరాలు లేవన్న అంశం ప్రస్తావనకొచ్చింది. ముఖ్యంగా శాసనాలలో వాడిన కొన్నక్షరాలు లేవు. అవి తేవాలంటే యూనికోడ్‌లో సభ్యత్వం తీసుకోవాలి. ఆ సభ్యత్వం తీసుకుని ఆ మార్పులకేదో ప్రయత్నించాం. రెండోది ఫాంట్స్, అంటే తెలుగు కతులు. అప్పటికి రెండో, మూడో తెలుగు కతులు ఉండేవి. వాటిని పెంచాలంటే కొత్త ఫాంట్స్ కావాలి. వాటిని ముంబైలో తయారు చేయించాలని కొందరంటూ ఉండేవారు. సరే నేనొక రోజు ఎమెస్కోకి వెళ్లినప్పుడు పురుషోత్తం కుమార్ అనే వ్యక్తి ఫాంట్స్ తయారు చేశాను చూడండంటూ వచ్చాడు. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టనిపించి ఆనంద్‌కు ఫోన్ చేసి చెప్పాను, ఇవేమన్నా పనికొస్తాయోమే చూడమని. మరో ఆయన అంబరీష్ అని చెప్పి మిరియాల రామకృష్ణ గారి అల్లుడున్నారు. ఆయన కొన్ని ఫాంట్స్ తయారు చేశారు. అట్లా పదిహేను ఫాంట్స్‌వరకు మేం తయారు చేయగలిగాం. కొంతమంది

డోనార్స్ కూడా వచ్చారు ఈ యజ్ఞంలో పాల్గొనేందుకు.

తరువాతి దశలో నేను అమెరికా వెళితే, ఒకరోజున ఆనంద్ గూగుల్ సంస్థ వారి దగ్గరకు వెళదామన్నాడు. సరే అని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆనంద్, నేనూ ముగ్గురం కలిసి వెళ్ళాం. వారికి వివరించి చెప్పాం, మా దగ్గర కొన్ని ఫాంట్స్ ఉన్నాయి. వాటిని మీరు వినియోగించాలన్న ప్రతిపాదనను వారంగీకరించారు.

ఫాంట్స్ అన్నింటిని ఇవాళ గూగుల్ తీసుకొని ఉచితంగా అందచేస్తోంది. అప్పుడు తెలుగు విజయం అని గవర్నమెంట్ వెబ్‌సైట్ పెట్టింది. దాంట్లో ఫాంట్స్‌తో పాటు, నిఘంటువులు ఇవన్నీ పెట్టారు. ఒకపక్క ప్రైవేటు వ్యక్తులు కృషి చేస్తున్నారు. మరోపక్క మేం కూడా కొన్ని ప్రణాళికలు సిద్ధం చేసిపెట్టాం. పెట్టిన తరవాత రాష్ట్ర విభజన గొడవల్లో అన్నీ పక్కకెళ్ళిపోయాయి. అంతర్జాలంలో తెలుగు కతులు (ఫాంట్స్) నాకు చాలా తృప్తినిచ్చిన విషయం. దాంట్లో 'మండలి' ఫాంట్ అనేదొకటుంది. ఇవాళ చాలా పత్రికలు ఆ ఫాంట్‌ని ఉపయోగిస్తున్నాయి. అలా చూస్తే ఫాంట్స్ తయారు చేయించటం పెద్ద విప్లవం అప్పట్లో.

కానీ ఇంకా చాలా టెక్నిక్స్ వచ్చినయి. ఉదాహరణకు స్పెల్ చెక్కర్స్. వాటినన్నిటిని తెలుగులోకి తేవాలి. అక్కడి ఐటి వాళ్ళు, ఇక్కడ ఐటి వాళ్ళు దానిపై దృష్టి పెట్టాలి.

***మిసిమి*** : **మీరు కృష్ణా డెల్టా అభివృద్ధి గురించి, బ్రిడ్జిలు కట్టడం గురించి చెప్పారు. కృష్ణాజిల్లాలో ఒక్క పెద్ద ఇండస్ట్రీ కూడా రాకపోవడానికి కారణం? ఒకప్పుడు ఆటోనగర్‌లో సైకిల్ ఫాక్టరీ ఉండేది, సబ్బుల ఫాక్టరీ ఉండేది.. ఇప్పుడొక ఇండస్ట్రీ కనపడదు. కారణమేమిటో?**

***బుద్ధప్రసాద్:*** ఒకప్పుడు ఉన్నవన్నీ ఇప్పుడు పోయాయి. మా దగ్గర చల్లపల్లి షుగర్స్ ఉండేది. ఇప్పుడు లేదు. కానీ బయట ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టింది కృష్ణా జిల్లా వారేకదా.

***మిసిమి*** : **బయట ప్రాంతంలో పెట్టినవారు తమ ప్రాంతంలో ఎందుకు పెట్టలేకపోయారు?**

***బుద్ధప్రసాద్:*** దానికి రకరకాల కారణాలు. స్కిల్ లేకపోవటం కాదు. జనం అర్థం చేసుకోలేకపోవటం. పెట్టేది ప్రైవేటువారే కాబట్టి వారికి అవసరమైన భరోసా కల్పించాలి. స్థలం ఇవ్వగలిగే పొజిషన్‌లో మనముండాలి. ఇవాళ మా దగ్గర సైట్లు తక్కువున్నాయి. స్వర్గీయ కృష్ణగారు స్టూడియో పెడతానంటే మానాన్నే మంగళగిరిలో స్థలమిప్పించారు కానీ వారు పెట్టలేకపోయారు. ఒకసారి రామానాయుడు గారు విశాఖపట్నం విమానాశ్రయంలో కలిశారు. వారినికూడా విజయవాడలో స్టూడియో పెట్టండి, బావుంటుందన్నప్పుడు ఆయన సరేనన్నారు. రాజశేఖరరెడ్డిగారికి చెబితే సైట్ ఫైనలైజ్ చేయమని చెప్పారు. రామానాయుడుగారు వచ్చి చూస్తామని ప్రామిస్ చేశారు. బెజవాడ కనకదుర్గమ్మను దర్శించి బుద్ధప్రసాద్ ఇంటికి భోజనానికి వచ్చి స్టూడియో గురించి మాట్లాడుతానన్నవారు. వారు ఫ్లైట్ మిస్సయ్యారు. ఈలోగా ఎలక్షన్లు వచ్చాయి.. నేను ఓడిపోయాను. స్టూడియో ప్రపోజల్ కూడా మూలన పడిపోయింది. చెప్పొచ్చేదిమటంటే ఎవరో ఒకరు పూనుకొని ఫాలో అప్ చేస్తేకానీ పనులు కావు.

***మిసిమి*** : **సార్! నేనడిగింది పరిశ్రమ (ఇండస్ట్రీ) గురించి మీరు స్టూడియో గురించి చెబుతున్నారు. సినిమా ఇండస్ట్రీ కాదు.**

***బుద్ధప్రసాద్:*** ఇంకోటండీ, ఇప్పుడు నియోజకవర్గాలన్నీ సామంతరాజ్యాలయ్యాయి.. ఇంకో నియోజకవర్గంలో మనమేదో చేస్తామంటే ఎవరూ ఒప్పుకోరు. అదొక పెద్ద సమస్యయి కూచుంది. వాస్తవానికి శాసనసభ్యుడంటే ఏమిటి.. శాసనాలు చేయడంవరకే. ఇవాళ వీధి దీపాల బాధ్యత ఈయనిదే. పంచాయతీల నిర్వహణ కూడా ఈయనిదే. ఆ రకంగా లేనిపోనివన్నీ తెచ్చిపెట్టుకుంటున్నారు. (నవ్వు).

***మిసిమి*** : **బుద్ధప్రసాద్ గారూ, ప్రతి సంవత్సరం ధరలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా కోవిడ్ తరవాత విపరీతంగా పెరిగిపోయాయి. కలం నుంచి కారు వరకు. కానీ రైతు పండించే పంటల ధరలు పెరగవేంటండీ? కనీస మద్దతు ధర కూడా ఇవ్వలేకపోతున్నామండీ.. కొన్ని పంటలు ఐడెంటిఫై చేసి మద్దతు ధర ప్రకటించాలి ప్రభుత్వం. కానీ అది జరగటం లేదు.**

***బుద్ధప్రసాద్:*** రైతులకు సంబంధించి ఈ పోరాటమెప్పుడూ జరుగుతూ ఉండాలి. అయితే రైతు దళారీ చేతుల్లో చిక్కుకుపోతున్నాడు. అదొక దురదృష్టకరమైన అంశం. రైతుల కోసం స్వామినాథన్ కమీషన్ అంటారు.. ఇంకోటంటారు. అవేమీ అమలుకు

నోచుకోవు. దానికితోడు రైతు అసంఘటిత శక్తిగా మిగిలిపోతున్నాడు.

***మిసిమి*** **: ఇక్కడ రైతునేమీ అనొద్దండీ. బాధ్యత ప్రభుత్వానిది కదా.**

***బుద్ధప్రసాద్:*** మీరు చెబుతున్నది బానేవున్నది కానీ, రైతు పోరాడాలి కదా. వారంతా ఏకమవ్వాలి కదా.

***మిసిమి*** **: ఓట్లు గెలిపించిన ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి కదా!**

***బుద్ధప్రసాద్:*** ఇక్కడ బాధ్యత అంటే చాలా చెప్పాల్సి వస్తుంది. ఎవరికి వారు వారికి వ్యక్తిగత బాధ్యత వహించాలి. ఒకసారి పి.వి. నరసింహారావుగారిని కలిసినప్పుడు వారు చెప్పిన మాటలు కళ్ళు తెరిపించాయి.. పి.వి. నరసింహారావుగారు ఏంటోయ్ కబుర్లని పలకరిస్తే మా పులిచింతల ప్రాజెక్టు కావాలని బతిమాలాను. అది లేకపోతే మా డెల్టా బతకదు. దానికి తెలంగాణ మిత్రులొప్పుకోవటంలేదని చెప్పాను. దానికో మాట చెప్పారాయన. అప్పటికీ, ఇప్పుడు ప్రస్తుతం పరిస్థితులు మారిపోయినాయి. ఒకప్పుడు భాక్రానంగల్ ప్రాజెక్టు ఎక్కడుందో మనవారికెవరికయినా తెలుసా.. తెలీదు. అయినా కూడా దేశమంతా పండగ చేసుకుంది, మన భాక్రానంగల్ అని మురిసిపోయింది. అలాగే నాగార్జున సాగర్ కట్టారు, లబ్దిదారులానంద పడవచ్చు. కానీ దేశమంతా ఆనందపడింది. అలాగే నేను మంత్రిగా ఒక స్కూల్ శాంక్షన్ చేస్తే ఆ ఊరంతా ఆనందపడేది. కానీ ఇప్పుడలా లేదు. ఆ వార్డులో పెట్టారు, నా వార్డులో పెట్టలేదు అని కదా అంటున్నారు. (నవ్వు)

***మిసిమి*****: ఇప్పుడు మరో ప్రశ్న. బందరు, విజయవాడ మధ్య దూరం, డెబ్బై కిలోమీటర్లు. నిత్యం కలెక్టర్ మొదలు అధికారులందరూ తిరుగుతూనే ఉంటారు. కానీ దాన్ని ఫోర్ వే చేయటానికి డెబ్బై ఏళ్లు పట్టిందేమిటి సార్?**

***బుద్ధప్రసాద్:*** అదయిపోయింది కదా సర్. అవ్వాల్సిన రోడ్ల గురించి మాట్లాడండి. ఇవ్వాళ ఉన్న రోడ్లే చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. వాటి గురించి ఆలోచిద్దాం. వాటివెంట మంత్రులు వెళ్ళటం లేదా! అధికారులు వెళ్లటం లేదా! వెళుతున్నారు కదా. అంటే ప్రణాళికలోనే లోపముంది సర్. మరొక విషయమేమిటంటే ఇవాళ ప్రాధాన్యతలు మారిపోయాయి. వ్యక్తిగత ప్రాధాన్యతలు పెరిగిపోయాయి. అది గమనించాలి.

***మిసిమి*** **: బుద్ధప్రసాద్ గారు, ఇవాళ కృష్ణా డెల్టా యాభైఏళ్ళ క్రితమెలా ఉందో ఇప్పుడు అలాగే ఉంది. దాన్నెలా చూస్తారు మీరు?**

***బుద్ధప్రసాద్:*** కృష్ణా డెల్టా వచ్చేటప్పటికి అతివృష్టి, అనావృష్టి సర్. దానివలన ఎన్ని ప్రాజెక్టులు కట్టినా సమస్యలు తీరలేదు. పులిచింతల కట్టాక, చంద్రబాబు నాయుడుగారు పట్టిసీమ కట్టారు. అయినా సమస్యలున్నాయి. పంటచేతికొచ్చే సమయానికి వర్షం ముంచేస్తుంటుంది. ఈ రకమైన కడగండ్లన్నీ రైతును కన్నీటి పాలు చేస్తున్నాయి.

***మిసిమి*** **: ఇప్పుడు వ్యవసాయమంతా చేపల పెంపకం, రొయ్యల పెంపకంగా మారిపోయింది కదా. ఎంతో రిచ్ అనుకున్న కృష్ణా డెల్టా నుంచి రైతులందరు వలస వెళ్ళారు. మొదట బోధన్ వెళ్ళారు. అక్కడ నుండి నిజాంసాగర్, బళ్ళారి ఇలా వెళ్ళిపోయారు. ఆ ప్రాంతాలను అభివృద్ధి చేశారు. కానీ కృష్ణా డెల్టా మాత్రం దిక్కులేనిదయిపోయింది. ఒకప్పుడు గుడివాడ స్టేషనులో గడ్డి బేళ్లను కోసి రోల్స్‌గా వైర్‌బైండ్ చేసి ఉత్తర దేశానికి రైళ్లలో పంపేవారు. 100కు పైగా రైసు మిల్లులు, ఉప్పుడు బియ్యం కేరళకు నిత్యం వెళ్తుండేవి! ఇప్పుడేమయింది?**

***బుద్ధప్రసాద్:*** ఒకప్పుడు దక్షిణ దేశపు ధాన్యాగారంగా పేరుగాంచింది. కాలం తెచ్చిన మార్పుగా భావించాలి.

***మిసిమి*** **: కూచిపూడితో మీ అనుబంధం చెప్పండి.**

***బుద్ధప్రసాద్:*** కూచిపూడితో మా నాన్నగారికి అనుబంధమెక్కువ. మా ప్రాంతంలో ఉన్న గొప్ప ప్రదేశం. వేదాంతం సత్యనారాయణ శర్మ, వెంపటి చినసత్యంగారివంటి పెద్దలు మా ఇంటికొస్తూ ఉండేవారు. సిద్దేంద్ర కళాక్షేత్రం కార్యక్రమాలకు వెళుతుండేవాడిని. నాకు కూడా వారందరు తెలుసు. ఆ తర్వాత మేము అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాలు అమెరికాలో జరిపినప్పుడు దానికి నేనే అధ్యక్షుడిని. సిలికానాంధ్ర వారు దానిని నిర్వహించారు. మొదటిసారి జరిగిన కార్యక్రమానికి మూడుతరాల గురువులొచ్చారు. కూచిపూడిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు మా ప్రయత్నాలు చేశాం. చంద్రబాబునాయుడుగారు ప్రభుత్వం వచ్చాక కూచిపూడికి

వంద కోట్లిస్తాను, కూచిపూడిలో అంతర్జాతీయ స్థాయి నాట్యారామం పెట్టమని కోరారు. దాని ఏర్పాటు బాధ్యతను కూచిభట్ల ఆనంద్‌కి అప్పచెప్పాం. వందెకరాల భూమిలో ఆ నాట్యారామం ఉండాలని చంద్రబాబునాయుడు చెప్పారు. కానీ స్థల సేకరణ చేయలేకపోయాం. చెరువది ఏర్పాటు జరిగింది కానీ, అనుకున్నట్లు జరగలా. జరిగిందేమిటంటే పాఠశాలల్లో కూచిపూడి నేర్పించే ప్రయత్నం చేయగలిగాం. సిలబస్ కరికులంలో కూచిపూడి పెట్టి టీచర్లను నియమించాం!

జన్మభూమి కార్యక్రమం జరుగుతుండేది కదా! ఆ కార్యక్రమం కూచిపూడి నృత్యంతో ఆరంభమయేది. చంద్రబాబునాయుడి గారితో సమ్యేమిటంటే ఏదయినా సరే అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి. అయితే దానికాయిన మీకిచ్చే టైం తక్కువగా ఉంటది. కూచిపూడి విషయంలో కూడా ఆయన ఉద్దేశ్యమేమిటంటే మరెవ్వరూ ఈ ప్రమాణాలనందుకోలేనంత గొప్పగా ఆ నాట్యారామం ఉండాలని ఆయన కోరిక. వేరేవాళ్ళకి మనం ఆదర్శం కావాలి. మన దగ్గరకి వచ్చేటప్పటికి ఉన్నవి ఐదు సంవత్సరాలు, కాని అన్నీ ప్రతిబంధకాలే. అయితే ఆయనున్న ఐదేళ్ల కాలంలో వేలాది కళాకారులను ఆయన ప్రోత్సహించారు. వేలాదిమందికి ఉపాధి కల్పించారు.. గోదావరి, కృష్ణా పుష్కారాలలో జానపద కళాకారులకు ఎనలేని అవకాశాలు లభించాయి. ఇప్పటి పరిస్థితి వేరు.

***మిసిమి*** : **ఇందాక చెప్పుకున్నట్లు కృష్ణా డెల్టా కాని, దివి సీమకానీ వ్యవసాయమంటే చేపలు, రొయ్యలు అన్నట్టే కాలం గడుపుతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో కృష్ణాడెల్టాకు ఎలాంటి భవిష్యత్తు ఉందని మీరనుకుంటున్నారు! పోనీ ఆశించవచ్చు.. ఎందుకంటే మనిషికి ఆశ చావదుకదా..**

***బుద్ధప్రసాద్:*** రైతన్నవాడు మట్టిని నమ్ముకునుంటాడు. ఎన్ని సాధక బాధకాలు పడ్డా దానిని వదిలిపెట్టడు.

రైతు లేకపోతే ఎవరి జీవితమూ లేదు. పివిగారు నాతో మాట్లాడినప్పుడు కొన్ని విషయాలు చెప్పారు. మనరైతెక్కడ నష్టపోతున్నాడంటే, ప్రపంచ మార్కెట్‌ను రైతు గమనించటం లేదు. ఇవాళ ఇప్పటికే నూనెగింజలు, ఔషధ మొక్కలు మనవసరాలు. వరిని తగ్గించుకుని వాటికెళితే రైతు లాభపడతాడు. ఏ పంటకైతే కొరత ఉంటుందో అది రైతు పండించాలి. ఆ కోణంలో రైతులు ఆలోచించాల్సిన సమయమొచ్చిందన్నారు. పామాయిల్‌కు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, సబ్సిడీలిచ్చి ఆ పంటసాగు చేయించానని పివి చెప్పారు.

***మిసిమి*** : **మీ పత్రిక అనుభవం చెప్పండి.**

***బుద్ధప్రసాద్:*** మీకు ప్రింటింగ్ ప్రెస్ ఉంది. దానితో పత్రిక నడుపుతున్నారు కదా.

అలాగే నాకు పత్రిక నడపాలని కోరిక ఉండేది. గాంధీ క్షేత్రంలో ప్రెస్ ఉండేది. గాంధీ క్షేత్రం కమిటీలో ఆచార్య రంగాగారు, సూర్యప్రకాశరెడ్డిగారు, అడపా రామకృష్ణగారు ఇత్యాది పెద్దలుండేవారు. అవనిగడ్డలో సమావేశమయినప్పుడు పత్రిక పెట్టాలనే నా కోరిక చెప్పాను. ఆచార్య రంగాగారు దాన్ని వ్యతిరేకించారు. నేను, ప్రకాశం పత్రిక పెట్టి చేతులు కాల్చుకున్నాం అన్నారు.

మీరాపని చేయకండి అన్నారు.

నేనక్కడికి నా ప్రయత్నాన్ని విరమించి సంవత్సరం తరువాత పత్రిక మొదలుపెట్టాను. *గాంధీ క్షేత్రం* దాని పేరు. పన్నెండు సంవత్సరాలు నడిపాను. రంగాగారు ఆ పత్రిక చూసి ఎంత ఆనందించేవాడో చెప్పటానికి వీల్లేదు. దాంట్లో దాశరథిగారు, సంజీవదేవ్‌గారు, సి. నారాయణరెడ్డిగారు వంటి పెద్దలందరు రాస్తుండేవారు. ప్రింట్ చేయడం.. అందరికీ పంపించడం.. చిలకలూరిపేటలో జాన్ డేవిడ్ అని ఉండేవాడు. ఆయన అడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చేవాడు.

పత్రికను పెద్దవాళ్ళకు పంపేవాళ్ళం. ప్రధానంగా గాంధీజీ ఆశయాలను ప్రతిబింబించే విధంగా ఉండేది. వావిలాల గోపాలకృష్ణయ్యవంటి గాంధేయవాదుల ఇష్టాగోష్ఠులుండేవి. ఒకసారి ఎందుకో పత్రిక ఆగింది. అప్పుడు ద్వారకా హోటల్‌లో అల్లు రామలింగయ్య గారు కలిశారు. పత్రిక రావటం లేదేమిటి అని కనుక్కొని రూ. 500/- చేతిలో పెట్టి పత్రికాపకు అని చెప్పారు. (నవ్వు)

***మిసిమి*** : **ప్రస్తుతం గాంధీ క్షేత్రం కార్యక్రమాలు ఏం చేస్తున్నారు?**

***బుద్ధప్రసాద్:*** ప్రస్తుతం కార్యక్రమాలు జరుగుతున్నాయి కానీ సమాజంలో మార్పు వచ్చింది. మాకు ఆ రోజుల్లో గొప్ప-గొప్ప వ్యక్తులు అండగా ఉన్నారు. వారుండబట్టి నడిచింది కానీ మా ఒక్కరివల్ల కాదు. ఇప్పుడు అలాంటి వ్యక్తులు లేరు. సేవ చేసేవారు

లేరు. చేయించుకున్నవారు లేరు. వాలంటరీ ఆర్గనైజేషన్స్‌లోనే మార్పు వచ్చింది.

***మిసిమి* : పత్రిక నడిపారు – పుస్తకాలు రాశారు – మీ రచనలు గురించి చెప్పండి.**

***బుద్ధప్రసాద్:*** కొన్ని యాత్రా సాహిత్య రచనలు చేశాను. తెలుగు విశ్వవిద్యాలయం, మారిషస్ ప్రభుత్వం కలిసి తెలుగు మహాసభలు నిర్వహించాయి. నేను మా నాన్నగారితో కలిసి వెళ్ళాను. ఆ సభలపై మారిషస్ తెలుగుతేజం అనే పుస్తకం రాశాను. దానికి వావిలాలగారు, మారిషస్ తెలుగు మహాసభ అధ్యక్షులు సోమినాయుడుగారు ముందుమాట రాశారు.

ఆ తరువాత లండన్ వెళ్లినప్పుడు లండన్‌లో తెలుగు వైభవ స్మృతులు పేరుతో పుస్తకం రాశాను. అక్కడ బ్రౌన్, కాటన్ దొరల సమాధులు చూడాలని తపన. నేను లక్ష్మీ ప్రసాద్ తిప్పలుపడి కెన్సెల్ గ్రీన్ శ్మశానభూమిలో ఆయన సమాధినిని వెతికాం. అక్కడ రిజిస్టర్‌లో బ్రౌన్ పేరుంది కాని ఆయన సమాధి కనపట్టంలా. గొప్ప–గొప్ప వారి సమాధులున్న ప్రదేశమది. బ్రౌన్ సమాధి దొరికింది కానీ, అక్షరాలు కనపట్టంలా. అక్కడ పచ్చికతో తోమితే సిపి బ్రౌన్ పేరు కనపడింది. తెలుగు భాషకు ఎనలేని సేవచేసిన ఆ మహానుభావుడికి అంజలి ఘటించాం. ఆ రోజు రాత్రి లండన్లో ఉన్న తెలుగు అసోసియేషన్ వారిని కలిశాం. బ్రౌన్ సమాధి పరిస్థితి వివరించాం. వారు కూడా వెంటనే స్పందించారు. కానీ మీరేమన్నా చేయాలన్నా అనుమతులు తప్పనిసరి. బ్రౌన్ పెళ్లి చేసుకోలేదు. ఆయన సోదరులు ఎవరు జీవించిలేరు. వారసులు లేరు. అయినా ఆ తెలుగు అసోసియేషన్‌వారు శ్రమించి అనుమతులు సంపాదించి, రెండు లక్షలు ఖర్చుపెట్టి ఆ సమాధికి కాస్త హంగులు కల్పించారు. అదక్కడ పత్రికల్లో వచ్చాక తెలుగు వారు వెళ్లి చూసొస్తున్నారు.

కాటన్ దొర సమాధి డార్కింగ్ పట్టణంలో ఉంది. ఆయన మిలిటరీ ఆఫీసర్ కావటంతో ఆయన అంత్యక్రియలు రాజలాంఛనాలతో జరిగాయి.

ఆ తరువాత కోహినూరు వజ్రం చూశాం. ఇవన్నీ ఆ పుస్తకంలో రాశాను. అలాగే బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న అమరావతి శిల్పాలు అద్భుతం. మొదట్లో అమరావతి శిల్పాలు వెనక్కి తెచ్చాయాలని ఉపన్యాసాలిస్తుండేవాడిని. అక్కడికి వెళ్లి చూశాక అది తప్పని తెలుసుకున్నాను. ప్రపంచంలో ఉన్న అన్ని శిల్పాలు అక్కడున్నాయి. కానీ అమరావతి శిల్పాలు అత్యున్నతమైనవని చెప్పి, వాటిని సమశీతోష్ణ స్థితిలో పెట్టి, రక్షణగా గార్డుని కాపలాగా పెట్టింది ఒక్క అమరావతి శిల్పాలకే. తర్వాత అమరావతి శిల్పంపై పుస్తకం వేశారు వాళ్ళు. తరువాత నేను మన శాసనాల కోసం మద్రాసులోని ఎగ్మూరు మ్యూజియం వెళ్లినప్పుడు, అప్పుడు రోశయ్య గారు గవర్నర్. నాకోసం పర్మిషన్ ఇచ్చారాయన. వెంట మనిషిని పంపించారు. అక్కడ గోడౌన్‌లో ఎన్ని తెలుగు శాసనాలున్నాయో, ఎన్ని శిల్పాలున్నాయో.. పైన అమరావతి శిల్పాలు పడున్నాయి. మనకూ ఇవ్వరు. వాళ్లూ ఉపయోగించుకోరు. ఆ తరువాత తంజావూరు లైబ్రరీకి వెళ్లాం. దానికి కూడా రోశయ్యగారు సహాయపడ్డారు. అక్కడేంటంటే తెలుగు పుస్తకం ప్రచురించాలంటే దానితోపాటు తమిళ పుస్తకం కూడా వేయాలనే నిబంధన ఉంది.

మొత్తానికి రెండు, మూడు పుస్తకాలు ఈయన చెప్పాక వచ్చినయి. అలాగే జర్మనీ వెళ్లినప్పుడు తెలుగువాడు గుజ్జుల రవీందర్ బ్రాండెన్ బర్గ్ నగర మేయర్‌గా ఉండేవారు. గుజ్జుల యలమందారెడ్డిగార బ్బాయి. ఆ నగర వార్షికోత్సవానికి నన్ను అతిథిగా పిలిచారు. అప్పుడు జర్మనీయానం అనే పుస్తకం రాశాను. ఆ తర్వాత ఇటీవల రాసిన పుస్తకం ఆపత్బాంధవులు. దివిసీమ ఉప్పెనలో ఎవరయితే సహాయం చేశారో వారందరి గురించి రాశాను. వ్యాసాలు చాలా ఉన్నాయి. అలాగే ఎడిట్ చేసిన పుస్తకాలున్నాయి.

***మిసిమి* : మన జీవితం ఓ ప్రయాణం. దానికో లక్ష్యం కూడా ఉంటుంది కదా. మీ లక్ష్యమేమిటిప్పుడు?**

***బుద్ధప్రసాద్:*** ప్రస్తుతం నా లక్ష్యం తెలుగు భాషే. తెలుగు భాషకు సేవచేయడం. తెలుగు భాష మరుగున పడకుండా శక్తివంచన లేకుండా పోరాడటం. కృష్ణాజిల్లా రచయితల సంఘం ద్వారా సాహిత్య సేవ చేస్తున్నాం. పాఠశాలల్లో ఒకటి నుంచి పదిదాకా తెలుగులో బోధన ఖచ్చితంగా ఉండాలని పోరాడుతున్నాం. రాష్ట్ర హైకోర్టు అనుకూలంగా తీర్పిచ్చింది. ఎస్సీఆర్టీ వారి నిబంధనలు పొందుపరిచాం. ఆ తీర్పు కాపీని తెలుగులో ముద్రించాం. సుప్రీం కోర్టులో కూడా కేసేశాను.

***మిసిమి*** : **మీరు చాలా ఉద్యమాలు చేశారు. కమ్యూనిస్టు ఉద్యమాలు చల్లపల్లి ప్రాంతంలో జరిగాయి. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, దాసరి నాగభూషణం, మాకినేని బసవపున్నయ్య, కొండపల్లి సీతారామయ్య చాలామంది ఉద్యమాలు చేశారు. మీరు ఉద్యమాలు చేయటానికి వారి స్ఫూర్తి ఏమన్నా ఉందా?**

***బుద్ధప్రసాద్:*** జై ఆంధ్ర ఉద్యమంలో కమ్యూనిస్ట్‌లతో కలిసి పనిచేసే అవకాశం దొరికింది. ప్రధానంగా రాజేశ్వరరావుగారు మా తాతగారి శిష్యులవటంతో, మా నాన్నగారంటే, గురువుగారబ్బాయని ప్రత్యేక అభిమానముండేది. ఆ రకంగా రాజేశ్వరరావుగారి నిరాడంబరత మమ్మల్ని ప్రభావితం చేసింది. అయితే కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలను ఎలా శిక్షణ చేయాలన్న అంశం ఉండేది కాదు. మాకు అందుకు తగిన మెటీరియల్ ఉండేది కాదు. అంచేత నేను కమ్యూనిస్టు మెటీరియల్ తీసుకుని నేను మా కనుగుణంగా మార్చుకునేవాడిని (నవ్వు). ఇప్పుడా సిద్ధాంతాలన్నీ పోయినయికదా.. ఇదివరకు కాంగ్రెస్ కానీ కమ్యూనిస్టులు కానీ మీటింగంటే రాత్రంతా నడుస్తుండేవి. భళ్ళున తెల్లారిపోయేది. చద్దన్నం మూటలు కట్టుకొచ్చేవారు. తర్వాతేంటంటే కమ్యూనిస్టు ఉద్యమాలను బతికించింది ప్రజానాట్యమండలి. జానపద కళారూపాలను బతికించింది. తొలిరోజుల్లో సినిమాను కూడా బతికించింది. నాకు చాలా బాధనిపించిందేంటంటే చివరి రోజుల్లో రాజేశ్వరరావుగారి భార్య సావిత్రిగారిని చూసినప్పుడు. చివరి రోజుల్లో పార్టీ ఆఫీసులో ఉండేదావిడ. పార్టీ కోసం ఒక పిల్లాడు చాలనుకున్నారా దంపతులు. కలవారి కోడలు సరిగ్గా చూడలేదు. ఇంకో పిల్లాడుంటే బాగుండేది కదా అని బాధపడ్డారు ఆవిడ. రాజేశ్వరరావుగారు ఆస్తంతా పార్టీకిచ్చేశారు కదా. ఆయనకు సంబంధించిన గుర్తులు కూడా లేవు. శాలువాలను అనాథాశ్రమంకిచ్చేసేవారు. మొమెంటోలు పార్టీకిచ్చేశారు. ఇవాళ పార్టీలో కోటీశ్వరులయిపోయినవారున్నారని దుఃఖించిదావిడ.

ఆ రకంగా ఏంటంటే చాలామంది స్వాతంత్ర సమరయోధులు ఆనందంతో చచ్చిపోలా. దీని కోసమా పోరాడింది అని వేదనతో చనిపోయినవారున్నారు. వావిలాల గోపాలకృష్ణయ్యగారు అందుకు ఉదాహరణ

***మిసిమి*** : **సినిమాలు చూసేవారా?**

***బుద్ధప్రసాద్:*** చిన్నప్పుడు బాగా చూసేవాడిని. ఇప్పుడు తగ్గింపోయింది కానీ ఆ రోజుల్లో ఎన్టీఆర్ అభిమానిని. పౌరాణిక చిత్రాలంటే బాగా ఇష్టం. ఎంతభిమానమంటే పుస్తకం తీసే ఎన్టీఆరే కనపడేవాడు. చివరికి ఆ దెబ్బకు టెన్త్ పరీక్ష తప్పాను.

***మిసిమి*** : **ఇప్పుడు బూతుల పురాణం లేని రాజకీయ ఉపన్యాసాలు లేవు. మీరెట్లా భరించగలుగుతున్నారు?**

***బుద్ధప్రసాద్:*** నేను డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు నా ప్రసంగం దీనిమీదే చేశాను. అప్పుడింత బూతులు లేవు. లేకపోయినప్పటికి కరుణశ్రీగారి పద్యం చెప్పాను.

***కాకి చేసుకున్న కర్మమేంటి,***
***కోయిల చేసుకున్న పుణ్యమేంటి?***
***మధురభాషలోనే మర్యాద ప్రాప్తించు!***
***లలిత సుమబాల తెలుగు బాల!***

అన్న పద్యం చెప్పాను. చాలామంది పెద్దలు ఓడిపోయారు. వాళ్లందరు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టి, ఎదుటివారిని తిట్టలేదు అని చెప్పాను. అప్పటికింకా కొంచెం మర్యాద ఉంది.

అన్‌పార్లమెంటరీ భాష అంటాం కదా. ఆ భాషను విసర్జించటానికే పార్లమెంటరీ పదాల పుస్తకం ఉంది మనకు. అబద్ధం అనే మాట కూడా వాడకూడదు. సత్యదూరం అని మాత్రమే వాడాలి. అలాంటిది ఇవాళ శాసనసభలో భరించలేని విధంగా మారిపోయింది భాష. చివరికి స్పీకర్లు కూడా అదే భాష మాట్లాడుతున్నారు. మన దురదృష్టం. నేనొకటే చెబుతాను. దీనికి కారకుడు. సభా నాయకుడు, ప్రతిపక్ష నాయకుడు. అధికార పార్టీవారు మాట్లాడితే ముఖ్యమంత్రి వారించాలి అలాంటి భాషను. ప్రతిపక్ష సభ్యులు మాట్లాడితే ప్రతిపక్ష నాయకుడు దానిని నివారించాలి. ఇవాళ ఈ భాష చూసి స్త్రీలందరూ అసహ్యించుకుంటున్నారు. ఒకప్పుడు శాసనసభలో ఎటువంటి ఉద్దండులుండేవారు. మానాన్న కాలంలో ప్రతిపక్షం చాలా చిన్నది. గౌతులచ్చన్నగారో, సుందరయ్యగారో, వావిలాల గోపాలకృష్ణయ్యగారో ఉండేవారు. కానీ వాళ్ళు ఎక్స్‌పర్ట్స్. వాళ్లేమడుగుతారో అని మంత్రులంతా కసరత్తు చేస్తుండేవారు. ఆ తర్వాత నేను మంత్రిగా ఉన్నప్పుడు ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం

చేసుకునేవాడిని. అవును కాదుతో సరిపోయేది. వారేమి ప్రిపేర్ అయివచ్చేవారుకాదు. నేనున్నప్పుడు కూడా కొంతమంది శాసనసభ్యులు లైబ్రరీకి వెళ్లి చదువుతుండేవారు. ఈమధ్య లైబ్రరీకి వెళ్ళాను. అప్పుడు మీరు పెట్టిన సంతకాలు సర్ ఇప్పుడు ఎవరివీ లేవు అన్నారక్కడ. (నవ్వు)

***మిసిమి* పత్రిక గురించి మీ అభిప్రాయం?**

***బుద్ధప్రసాద్:*** ***మిసిమి*** సకల కళల సమాహారంగా వెలువడే పత్రిక. అద్భుతమైన చిత్రాలు చోటుచేసుకుంటాయి. తత్త్వశాస్త్రం, సాహిత్యం, చరిత్ర, సంగీతం, నాట్యం ఎన్నో అంశాల రచనలతో కూడి ఉంటుంది. ఎంతో లోతయిన పత్రిక ***మిసిమి***. విశ్లేషణాత్మకమయిన పత్రిక. దాచుకోవాలనిపించే పత్రిక. ప్రస్తుత తెలుగు పత్రికా ప్రపంచంలో అద్భుతమైన పత్రిక. ఈ మాట ఇక్కడికి వచ్చానని చెప్పటం లేదు. దురదృష్టమేమిటంటే రాసేవారు తగ్గిపోయారు. బుర్రపెట్టి రాసేవారు అరుదైపోయారు. నేను చాలా పుస్తకాలు రాయిస్తూ ఉంటాను కాబట్టి చెబుతున్నాను. విజయనగరంలో యు.ఎ. నరసింహమూర్తిగారు ఎంతో చక్కగా రాసేవారు. అలాగే రాపాక ఏకాంబరాచార్యులుగారు, గురువుగారు గంగప్పగారు. ఇలాంటి కొద్దిమంది కూడా వెళ్లిపోయారు. మేమో సబ్జెక్టు చెబితే ఇలాంటివారు పరిశోధన చేసి రాసేవారు. అలాంటి రచయితలు కావాలి. మనమిప్పటికీ పాతతరం వారి పద్యాలనే చెప్పుకుంటున్నాం. ఇప్పటి తరంలో ట్రెండ్ సెట్టర్స్ లేరు. నేనీమధ్య తెలుగు భాషా సంస్కృతులపై ఖండ కావ్యాల పోటీపెట్టాను. దాదాపు నూటపాతిక రచనలు వచ్చాయి. ఐదింటికి బహుమతులు ఇచ్చామనుకోండి. నా ఉద్దేశం కొన్ని పద్యాలన్నా నిలవాలి. ఆ ప్రయత్నం చేస్తున్నాను.

***మిసిమి* : మీ ప్రాంతంలో ప్రముఖుల విగ్రహాలను ప్రతిష్ఠంచటంలో మీదే ముఖ్య పాత్ర కదూ!**

***బుద్ధప్రసాద్:*** అవునండీ, అది నేటి అవసరం కూడా. ఇక్కడున్న ప్రముఖుల గురించి తరువాతి తరం తెలుసుకోవాలి. ఇటీవలే ఘంటసాల శతజయంతి ఉత్సవం జరిగింది. వారి స్వగ్రామం టేకుపల్లి – దివిసీమకు చెందిందే.. చాలామంది శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి, కాని ప్రజల హృదయాలలో నిలిచిపోయిన ఏకైక వ్యక్తి ఘంటసాల. ఘంటసాల గారి మొదటి విగ్రహం బాలసుబ్రహ్మణ్యం గారు పెట్టారు, రెండో విగ్రహం పెట్టినవాడిని నేనే. ఘంటసాల స్వగ్రామం టేకుపల్లి కళ్లేపల్లి మండలంలో ఉంది.

టేకుపల్లిలో బాలసుబ్రహ్మణ్యం గారి చేతుల మీదుగా ఘంటసాల విగ్రహాన్ని ఆవిష్కరింపచేశాను. ఈ ప్రాంతంలో పుట్టిన ప్రముఖులందరి విగ్రహాలు పెడుతున్నాను. భవిష్యత్ తరాలవారికోసం. వారికి స్ఫూర్తినివ్వడం కోసం. మెన్నీమధ్యే డప్పు కళాకారుడు కుంపటి సూర్యభగవంతం విగ్రహం పెట్టించాను. ఆయన తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేశాడు. డప్పు నేర్పడం కోసం తెలుగు విశ్వవిద్యాలయం అతన్ని నియమించినది. రెండువేల మంది శిష్యులను తయారు చేశాడు. అంతర్జాతీయంగా ఎన్నో దేశాలు తిరిగొచ్చాడు. వారం రోజుల క్రితం వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించాం. నాదస్వర విద్వాంసులు డాలిపర్తి పిచ్చయ్యగారి విగ్రహాన్ని లక్ష్మీపురంలో ఆవిష్కరించాం. కళ్లేపల్లిలో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, నుసర్ల దక్షిణామూర్తి, వేటూరి సుందరరామమూర్తిగారు విగ్రహాలను పెట్టాం. శ్రీకాకుళంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం, కాసుల పురుషోత్తమ కవి విగ్రహాలను ప్రతిష్ఠ చేశాం. ఇంకా పెట్టాల్సినవి ఉన్నాయి కొన్ని (నవ్వు). దీవి గోపాలాచార్యులు గారి విగ్రహం పెట్టాలనుంది. వారిది మా ఊరే భావదేవరపల్లి. అలాగే జాయపసేనాని విగ్రహం గణపేశ్వరంలో పెట్టించాం.

చరిత్రను, భాషను, సంస్కృతిని ఈ విధంగా కాపాడుకోవటం చాలా ముఖ్యమైన అంశంగా భావిస్తాను.

***మిసిమి* : ధన్యవాదాలు బుద్ధప్రసాద్‌గారు. *మిసిమి* కోసం, *మిసిమి* పాఠకుల కోసం మీ అమూల్యమైన సమయాన్ని కేటాయించి, అనేక జ్ఞాపకాలను మాకందించారు.**

***బుద్ధప్రసాద్:*** నేను నడిచినదారిని గుర్తుచేసుకునే అవకాశమిచ్చిన ***మిసిమి*** కి నా కృతజ్ఞతలు.

(మాటామంతీ సమయంలో పాల్గొని ఈ రాతప్రతి రూపొందించిన **సి.ఎస్. రాంబాబుగారికి** ధన్యవాదాలు)

# చిత్రగీతాలు జావళీలు

**– ఎమ్. పురుషోత్తమాచార్య**

**5. పిలచిన బిగువటరా**

**చిత్రం : మల్లీశ్వరి (1951)**

**రచన : దేవులపల్లి కృష్ణశాస్త్రి**

**సంగీతం : ఎస్.రాజేశ్వరరావు**

**గానం,నృత్యం : పి.భానుమతి**

**కాఫీ–ఆది**

*పిలచిన బిగువటరా ఔరౌర ॥పిల॥*
*చెలువలు తామే వలచి వచ్చిన–భళిరా రాజా ॥పిల॥*
*ఈ నయగారము ఈ వయ్యారము*
*ఈ నవయౌవనమానగ నిను నే ॥పిల॥*
*చ॥ గాలుల తేలెను గాటపు మమతలు*
*నీలపు మబ్బుల నీడలు కదిలెను*
*అందెల రవళుల సందడి మరిమరి*
*అందగాడ యిటు తొందర చేయగ ॥పిల॥*

చిత్రంలో నాయికానాయకులు జాతరకు వెళ్ళి వస్తూ వానకు గురియయి, కనిపించిన చిన్న గుహలోనికి వెళ్ళి తలదాచుకుంటారు, అక్కడ కాలక్షేపం కోసం నాయిక తన బావకు వినోదం కలిగించాలనుకుని సరదాగా నృత్యం ఆరంభించిన దృశ్యంలో ఈ పాటను చిత్రించారు.

1950 తరువాత నుంచి జావళీలలో చురుకు, వేగం తగినంతగా పెరిగినట్లు గమనింపవచ్చు. వాటిలో ఈ పాట ఎంతో ప్రముఖమైనది. పల్లవి, అనుపల్లవి, చరణాలతో కృతిలాగా క్లుప్తంగా సాగిన రచన ఇది. పల్లవి, అనుపల్లవి మొదటి పాదాలలో, చరణంలోని మొదటి రెండు పాదాలలో యతి నియమాన్ని పాటించారు. మిగతా పాదాలలో ప్రాసయతిని అనుసరించారు. పాటంతా చక్కని ప్రాసనియమంతో భాసించింది. అనుపల్లవిని చరణాలతో అనుసంధించడం ఈ పాటలోని ప్రత్యేకత. పల్లవిలోని రెండవ పాదాన్ని పరిశీలిస్తే 'వనిత తనంత తా వలచి వచ్చిన చుల్కన నౌదురే' అనే ప్రాచీనకావ్య పద్యం స్ఫురిస్తుంది. అనుపల్లవిలో 'నయగారం, వయ్యారం, యౌవనం' అన్నీ 'ఆనగ' అంటే, అనుభవించడానికి నిన్ను పిలిస్తే బిగువు చేస్తావేం? అనే నాయిక అంకితభావాన్ని హృద్యంగా చెప్పారు. చల్లగాలులు, నీలపు మబ్బులు, అందెల రవళులు అన్నీ కలిసి వలపును ప్రేరేపించగా ప్రియుడిని పిలచిన విధానాన్ని చరణంలో అందంగా మలిచారు. పిలవడానికి సహకరించిన కారణాలను ప్రియునికి సవివరంగా తెలుపుతూ, ఇంకా బెట్టు చేయవద్దన్న హెచ్చరికను సున్నితంగా వినిపిస్తున్నది. అదీ దేవులపల్లివారి రచనానైపుణ్యం.

సాలూరి రాజేశ్వరరావుగారికి ఇష్టమైన రాగాలలో ముందు వరుసలో నిలిచేది కాఫీరాగం. ఆయనలో వెలిగే సంగీతాభరణం ఒక ముప్పేట గొలుసు. కర్ణాటక, హిందూస్తానీ, పాశ్చాత్య శాస్త్రీయసంగీతాలు ఆయనకు కరతలామలకాలు. ఎప్పుడు, దేన్ని, ఎలా ఉపయోగించాలో క్షుణ్ణంగా తెలిసిన మహావ్యక్తి.

ఈ పాటను కర్ణాటక సంగీతపు కాఫీరాగాన్ని పట్టుగా ఉపయోగించి స్వరపరచారు. ఆదితాళపు అక్షరకాలాన్ని ఎక్కడా చెదరకుండా జాగ్రత్తపడ్డారు. ప్రారంభంలో ఏ వాద్యసంగీతాడంబరం లేకుండా నేరుగా 'నిసనిపా' స్వరాల బాణీలో పల్లవిని పాడించారు. మొదటి పాదాన్ని




మొదటిసారి 'పిలచిన' అని పాడించి, తరువాత నుంచి 'పిలచినా' అని పాడించారు. అంటే, మామూలుగా 'పిలచిన' అంటే పిలిస్తే అని అర్థం. 'పిలచినా' అని అనడం వల్ల 'ఎంత పిలిచినా, ఎన్నిసార్లు పిలచినప్పటికీ...' అనే విశేషార్థం స్ఫురించేట్టు చేశారు.

'వలచి వచ్చిన'ను రెండుసార్లు రెండు రకాల సంగతులతో పలికించారు. అయితే,

‘వలచి’లో దీర్ఘాక్షరాలు లేకున్నా ‘వాలా’ అంటూ అందమైన సంగతిని పొదగడం ఎంతో హృద్యంగా ఉంది. హ్రస్వాలపై సంగతులివ్వడం ఆయనకు అలవాటే అయినా, ఆ సంగతులు మనస్సుకు బలంగా హత్తుకుంటాయి. కనుక అక్షరాల గురించి ఆందోళనపడనక్కరలేదు.




‘భళిరా రాజా’ తరువాత మూడు ఆవర్తాలలో వయొలిన్స్, వేణువులతో, మృదంగనాదంతో బిట్‌వర్క్ ఇచ్చారు. దీనిలో చివరి ఆవర్తాన్ని ముక్తాయిగా మలిచారు. అప్పుడు అనుపల్లవి ‘ఈ నయగారము’ను ‘పదమప’ బాణీలో ఒక అక్షరం జాగా వదిలి, పంచమం నుండి ప్రారంభించారు. రెండోసారి పాడుతున్నప్పుడు ‘ఈ వయ్యారము’ దగ్గర, ‘మానగ’ దగ్గర వైవిధ్యపు సంగతిని పొదిగారు. పల్లవి ‘బిగువటరా’ దగ్గర వదిలేయగానే అర ఆవర్తం నుండే బిట్వర్క్‌ను వయొలిన్స్, వేణువులతో ఆరంబించి, మూడున్నర ఆవర్తాలుగా వినిపించారు. మరో మూడు ఆవర్తాలలో మృదంగ విన్యాసాన్ని ప్రదర్శించారు. అప్పుడు మళ్ళీ అనుపల్లవిని అందుకుని పాడి ‘బిగువటరా’ దగ్గర వదిలేశారు. అర ఆవర్తం నుండి అవే వాద్యాలతో బిట్టును ప్రారంభించి అయిదున్నర ఆవర్తాలలో ముక్తాయిని కలుపుకుంటూ బిట్‌వర్కును ఇచ్చారు. అప్పుడు చరణం ‘గాలుల’ అనేది కాఫీరాగపు అన్యస్వరమైన అంతర గాంధారం నుండి ప్రారంభించారు. రెండోసారి ‘తేలెను’ పదాన్ని వైవిధ్యంతో పాడారు. ‘కదిలెను’ దగ్గర ఒక ఆవర్తంలో బిట్‌వర్కును ఇచ్చిన తరువాత ‘అందెల రవళు ల’ అని ‘మపనిస’ బాణీలో అందుకున్నారు. ‘మాబ్బుల’ అని ఉచ్చరించినా అక్కడ చూపిన సంగతికి దాసోమమనవలసిందే. రెండోసారి ‘అందెల రవళుల’ దగ్గర ముగ్ధమనోహరమైన ఆలాపనను ఒకటిన్నర ఆవర్తాలలో వినిపించి ‘సందడి’ని వైవిధ్యంతో పాడారు. ‘తొందర’ను రెండు వేరువేరు సంగతులతో ఆలపించారు. తరువాత పల్లవిని ఎత్తుకుని ‘బిగువటరా’ దగ్గర వదిలేయగానే అర ఆవర్తం నుండి బిట్‌వర్క్ ప్రారంభమై నాలుగున్నర ఆవర్తాలుగా సాగింది. 5వ ఆవర్తంలో 3వ అక్షరం దగ్గర టక్కున ఆగింది.

ఇది సినిమా అవసరం. నాయిక తన బావను చూనస్తూ నృత్యం చేస్తున్న పారవశ్యంలో మునిగిపోయి పరిసరాలను గమనించలేదు. కాని పాట ప్రారంభం నుంచే ప్రవేశించి గమనిస్తున్న శ్రీకృష్ణదేవరాయలను, అల్లసాని పెద్దనను ఆమె మొదట చూడలేదు. పాట చివరలో నృత్యాన్ని ప్రదర్శిస్తూ అలవోకగా ఆమె వారిని చూచి టక్కున నృత్యాన్ని ఆపేసింది. ఆ భావనను చివరి వాద్యసంగీత నిర్వహణలో చూపారన్నమాట.

### 13. నడిరేయి గడిచెనే

**చిత్రం : జయసింహ (1955)**
**రచన : మల్లాది రామకృష్ణశాస్త్రి**
**సంగీతం : టి.వి.రాజు**
**గానం : పి.సుశీల**
**నృత్యం : వహీదా రహమాన్**
**బేగడ–ఆది**

*నడిరేయి గడిచేనే చెలియా*
*రాడాయెనే స్వామి నా స్వామి* ॥నడి॥
*ఎదురుతెన్నులు చూచి చూచి*
*ఓ చెలియా వానికై వేచి వేచి నేడు* ॥నడి॥

1. *గగనాన నెలరేడు దిగజారిపోయె*
*సిగలోని విరులెల్ల వసివాడిపోయె*
*దిగులాయెనే మది వగలే మిగులాయె*
*మగరాయుడే వాడు మనలేను నేడు* ॥నడి॥

2. *గడప పడిగాపు పడియుండలేనె*
*గడియొక్క యుగముగా గడుపగలేనె*
*ఎడబాటుతో ఈ నడిలేని ఏ రేయి*
*కడలేని కన్నీరై నిలువగలేనె* ॥నడి॥

చిత్రంలో రాజకుమారి పాత్రను ధరించిన వహీదా రహమాన్ మీద ఈ పాటను నృత్యగీతంగా చిత్రించారు. ఈమె తెలుగమ్మాయే. గతంలో ‘రోజులుమారాయి’ సినిమాలో ‘ఏరువాక సాగారో’ పాటను అభినయించి మంచి పేరును సంపాదించారు. తరువాత హిందీ చిత్రరంగానికి వెళ్ళిపోయి ప్రముఖ నటీమణిగా

పేరుప్రతిష్ఠలు సంపాదించారు. చిత్రంలో ఈమెకు చెలికత్తెగా సురభి బాలసరస్వతి నటించారు. ఈమె తెలుగు సినిమా మొదటి హీరోయిన్ సురభి కమలాబాయి కూతురు.

బందరులో దేవదాసీలను ఎందరినో పరిచయం చేసుకుని వారినుండి జావళీలను సేకరించిన చిన్నతనంలోని మల్లాదివారు వాటి ప్రేరణతో ఇలాంటి జావళీలను వ్రాసినట్లు వి.ఎ.కె. రంగారావుగారివంటి పెద్దలు భావిస్తున్నారు. అందుకే ఈ పాట పల్లవి ఆ జావళీల నుండి పుట్టిందే అని విజ్ఞులు చెబుతారు.

ప్రియుని కోసం ఎదురుచూచి విసిగి వేసారుతున్న ఒక విరహిణి మనోబాధ ఈ పాటలో చక్కగా కనిపిస్తుంది. చంద్రుడు, మల్లెపూలు మొదలైనవాటి పరిస్థితిని దీనంగా వివరిస్తున్నారు. గడప దగ్గర పడిగాపులు పడివుండడం సహింపలేకపోతున్నది. ఒక్కో గడియను ఒక్కో యుగంగా గడుపుతూ కన్నీటిపర్యంతమైంది. దిగులుపడుతున్న ఆమెకు వగలే మిగిలాయట. రెండు చరణాల్లోనూ ప్రాసను ఖచ్చితంగా పాటించారు.

మొదట మృదంగ విన్యాసం ఒక ఆవర్తంలో వినిపించాక తారషడ్జమం నుండి వయొలిన్స్, వీణ, గజ్జెలతో రెండు ఆవర్తాల బిట్టును వినిపించారు. అప్పుడు పల్లవి 'నడిరేయి'ని సమంలో 'గమపా' అంటూ ప్రారంభించారు. బేగడరాగానికి 'గమపా' అనేది జీవస్వరసంపుటి. పల్లవి చివర 'నేడు'లో సాధారణంగా 'నే'లాంటి దీర్ఘం మీద సంగతులిస్తారు. కానీ ఇక్కడ మాత్రం 'నేడూ' అంటూ 'డూ' మీద చక్కని సంగతిని వినిపించారు. తరువాత వచ్చిన అనుపల్లవి, చరణాల తరువాత మాత్రం 'నే' మీదనే సంగతిని వినిపించారు. 'గడిచేనే' దగ్గర వదిలేయగా మిగిలిన అర ఆవర్తంలో మృదంగం ముక్తాయిని వినిపించారు. అక్కడ 'ఎదురుతెన్నులు' అనే అనుపల్లవిని సమంలో 'పపదప' బాణీలో రాగముద్రను పలికిస్తూ ప్రారంభించారు. రెండవ 'వేచి' పదాన్ని రాగజీవలక్షణమైన 'రిసనిసదప' సంగతిని లాలిత్యంతో పాడారు. సుశీలమ్మగారి గొంతు ఈ పాటలో నునులేత తమలపాకంత మార్దవంతో వినిపిస్తుంది. 'నేడు' దగ్గర కైశికనిషాదాన్ని కలుపుతూ 'సానిదపమగ' అని పాడిన తీరు బాగుంది.

అనుపల్లవి తరువాత పల్లవిని పాడి 'గడిచెనే' దగ్గర చిన్న ఆలాపనతో వదిలారు. మిగిలిన అర ఆవర్తం నుంచి ఒకటిన్నర ఆవర్తాలలో వాద్యాలతో బిట్‌వర్క్ ఇచ్చారు. తరువాత మరో ఆవర్తంతో మృదంగపు ముక్తాయిని ఇచ్చారు. వెంటనే పంచమం నుండి సమంలో 'గగనాలు' అనే మొదటి చరణాన్ని అందుకున్నారు. మొదటి రెండు పాదాలను రెండుసార్లు పాడారు. 'దిగులాయెనే' దగ్గర ఆలాపన చేశాక అర ఆవర్తంలో ముక్తాయినిచ్చారు.

తరువాత చరణం రెండో భాగాన్ని పాడారు. పిదప పల్లవిని ఎత్తుకుని 'గడిచేనే' దగ్గర మళ్ళీ ఆలాపన చేసి వదిలాక మిగిలిన అర ఆవర్తం నుంచి బిట్‌ను ప్రారంభించి, రెండు ఆవర్తాలలో ముగించి, చివరి అర ఆవర్తంలో ముక్తాయిని ఇచ్చారు. అప్పుడు పంచమం నుండి ఒక అక్షరం జాగా వదిలి 'గడప' అనే చరణాన్ని అందుకున్నారు.

బాణీని ప్రధానంగా అనుసరించడంవల్ల రాగముద్ర కోసం రెండో పాదంలో 'యుగముగా గడుపగా' బదులు 'యుగమూగ, గడుపాగ' అనిపించాల్సి వచ్చింది. మొదటి రెండు పాదాలను రెండుసార్లు పాడాక మూడో పాదంలోని 'ఎడబాటుతో' దగ్గర చిన్న ఆలాపన చేశాక అర ఆవర్తంలో ముక్తాయిని ఇచ్చారు. తిరిగి 'ఎడబాటుతో'ను అందుకుని స్వరకల్పన ప్రారంభించారు.

1. గమరిసా రిసనిసదపా గమరిగమ ॥ఎడ॥
2. సాసా పనిద సాసా మనిదపా రిగమదా
   పనిదసా పనిదస నిరీసనిద నిదపా సానిద సనీదపమ ॥ఎడ॥
3. సా నీ దా సన్ని సనిదపమ నీ దా పా నిద్దా నిదపమగా
   మాపమ గమగమ దపగప మపగమ దానిద పదపద
   నిని సని దదని దపద నిదమప ॥ఎడ॥

ఈ మూడవ భాగం తరువాత మిగిలిన అర ఆవర్తం నుండి ఒకటిన్నర ఆవర్తాలలో మృదంగవిన్యాసంతో ముక్తాయింపును వినిపించాక 'ఎడబాటుతో' అందుకుని మిగతా భాగాన్ని పాడారు. చివరి పదంలో 'నిలువాగాలేనే' అనక తప్పలేదేమో! పల్లవినంతా పాడాక చివరలో 'గడిచేనే' దగ్గర ఆలాపన అయ్యాక అర ఆవర్తంలోనే మృదంగం ముక్తాయింపును ఇచ్చి, ఎందుకోగాని ఇంతా సశాస్త్రీయంగా నడిపించి ఇక్కడ మాత్రం 5వ అక్షరంలో ముక్తాయిని ముగించడం కొంత వెలితి అనిపిస్తుంది. బహుశా సాంకేతిక లోపం కారణమయిందేమో!

**16. అంతలోనె తెల్లవారె**
**చిత్రం : ముద్దుబిడ్డ (1956)**
**రచన : ఆరుద్ర**
**సంగీతం : పెండ్యాల**
**గానం : పి.సుశీల**
**నృత్యం : పుష్ప**
**బేహాగ్–రూపకం**




*అంతలోనె తెల్లవారె*
*అయ్యొ ఏమి సేతునే*
*కాంతుని మనసెంత నొచ్చెనో*
*ఇంత ఎటు సైతునే ॥అంత॥*

*1. కొంతసేపు ప్రియములాడి*
*చెంతజేరి చేయి జాపి*
*దోరవయసు నా సామి*
*దొంతర విడెమందుకునే ॥అంత॥*

*2. చెక్కిలిపై కొనగోటితో*
*ఒక్కసారి కొసరలేదు*
*మక్కువతో గోపాలుడు సుంత*
*పరిహాసమాడు ॥నంత॥*

చిత్రంలో పుష్ప అనే నర్తకి సరసుల యెదుట నృత్యప్రదర్శన ఇస్తున్న సందర్భంలో ఈ పాటను చిత్రించారు. ఆనాటి వినోదం కోసం రమణారెడ్డి పాత్ర ఎక్కడినుంచో ఈ నర్తకిని పిలిపిస్తుంది. ఈమె, తల్లి (సురభి కమలాబాయి)తో కలిసి నాట్యం చేయడానికి వచ్చింది. ప్రజలకు తన శాస్త్రీయ నృత్యం నచ్చుతుందో, లేదోనని మొదట 'తేలు కుట్టిందోయ్' అంటూ జానపద నృత్యం ప్రారంభించింది. కాని దీన్ని ఎవరూ ఆమోదించరు. నిర్వాహకుడు రమణారెడ్డి కూడా చిరాకుపడతాడు. పుష్ప, తల్లి సలహా మేరకు ఈ పాటను ప్రదర్శిస్తుంది. అప్పుడందరూ ఉత్సాహంతో కేరింతలు గొడుతూ వినోదిస్తారు.

పల్లవిలో, చరణాలలో పాక్షికంగా ప్రాసను, ఒకచోట యతిని అనుసరించారు. ప్రేమగా చెంతకు జేరిన ప్రియుడు తాంబూలం అందుకునేలోపే తెల్లవారిపోయిందట. చెక్కిలి మీద కొనగోటితో సరిగా మీటలేదు, పరిహాసమూ ఆడలేదు, అంతలోనే తెల్లారిపోయిందట. ఆ ప్రియుడు ఎవరో కాదు, శ్రీకృష్ణుడే. శృంగారరసభావాన్ని నిర్మించుకుంటూ వచ్చి చివరకు 'గోపాల' పదంతో మధురభక్తిని ప్రకటించడం ఆరుద్రలోని గొప్ప గడుసుదనం అనే చెప్పాలి.

బేహాగ్ రాగం కాని, రూపకతాళం కాని సామాన్యులకు అంతగా అందరానివి. అందుకే ఈ పాటకు రావలసినంత గుర్తింపు రాలేదనిపిస్తుంది.

బేహాగ్ రాగం హిందూస్తానీ సంప్రదాయం నుంచి దక్షిణభారత సంగీతంలోకి ప్రవేశించింది. హిందూస్తానీలోని కల్యాణ్ థాట్ నుంచి వచ్చిన రాగమిది. దీన్ని కర్ణాటక సంగీతంలో 65వ మేళకర్త అయిన మేచకల్యాణి రాగజన్యమని చెప్పవచ్చును. దీనికే "బ్యాగు, బిహాగ్" అనే పేర్లు కూడా ఉన్నాయి. అవరోహణలో కైశికనిషాదం, వక్రసంచారంలో శుద్ధమధ్యమం అన్యస్వరాలుగా పలుకుతాయి.

ఆరో : సగమపనిదనిస

అవ : సనిదపమపగమగరిస

ఈ రాగంలో 'సమయమిదె' అనే పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ గారి; 'నిరుపమ' అనే రామనాథపురం శ్రీనివాస అయ్యంగార్‌గారి; 'వగలాడి బోధనలు' అనే తిరుపతి నారాయణస్వామివారి జావళీలు ఎంతో ప్రసిద్ధిని పొందాయి. అలాగే, 'నారాయణతే' అనే అన్నమయ్య కీర్తన; 'పశ్యతి దిశి దిశి' అనే జయదేవ అష్టపది బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి.

సినిమా పాటలు... 1. నీలగగనఘనశ్యామా ...చెంచులక్ష్మి
2. శ్రీదేవిని నీదు ..................శ్రీవేంకటేశ్వరమహాత్మ్యం
3. చిన్నారి ఓ చిలుక ..............శ్రీవేంకటేశ్వరమహాత్మ్యం
4. మనసు పాడింది ................ పుణ్యవతి
5. ఇలకు దిగిన అందాల........... చంద్రహాస

ప్రారంభంలో నాలుగు ఆవర్తాలలో నృత్యాచార్యులు జతులు పలికారు. మరో నాలుగు ఆవర్తాలలో మృదంగం విన్యాసంతో ముక్తాయి పలికింది. అప్పుడు పల్లవి 'అంతలోనె' ఒక అక్షరం తరువాత గాంధారం నుండి అందుకున్నారు. రెండోసారి నర్తకి వెనుక ఉన్న మహిళాబృందం అందుకుని పాడింది. 'అంతలోనె' అని పాడడంలోనే శుద్ధమధ్యమస్పర్శ స్పష్టంగా వినిపిస్తుంది. అనుపల్లవిలోని 'నొచ్చెనో'లో 'నో' మీద 'దసనిసదా'

అంటూ కైశికనిషాదప్రయోగం హృద్యంగా వినిపిస్తుంది. వెంటనే బృందం అందుకుని పల్లవిని, అనుపల్లవిని పాడింది. తరువాత 10 ఆవర్తాలలో ఆకర్షణీయమైన వాద్యసంగీతపు బిట్‌వర్క్ వినిపించి పైషడ్జమం దగ్గర ముగించారు. అప్పుడు మొదటి చరణం 'కొంతసేపు'ను ఒక అక్షరం జాగా వదిలి గాంధారం నుండి ఎత్తుకున్నారు. మొదటి రెండు పాదాలను పాడాక వీటినే బృందం అందుకుని పాడింది. వెంటనే సుశీల మళ్ళీ అవే పాదాలను అందుకుని మొదటి పాదాన్ని ఒక సంగతిని మార్చి పాడారు. తరువాత రెండో పాదాన్ని మూడు వైవిధ్యమైన, భావాత్మకమైన సంగతులతో అందంగా పాడారు. ముఖ్యంగా 'చేయి' పదాన్ని మొదట చక్రగమనంతో, తరువాత 'గమగసనిద' బాణీలో పాడారు. వెంటనే మళ్ళీ బృందంవారు ఈ రెండు పాదాలను మామూలుగా పాడారు.

తరువాత మూడో పాదాన్ని తారస్థాయి గాంధారంలో అందుకుని పాడి పల్లవిని ఎత్తుకున్నారు. పిదప 5 ఆవర్తాలలో అకారపు ఆలాపన పాడి వదిలేయగా నృత్యాచార్యులు జతులను అందుకుని 9 ఆవర్తాలలో పలుకగా 'చెక్కిలిపైన' అనే రెండవ చరణాన్ని కూడా గాంధారం నుండే ప్రారంభించారు. శుద్ధమధ్యమాన్ని కలుపుకుంటూ 'కొసరలేదు' పదం మీద కైశికనిషాదాన్ని కూడా స్పృశించారు. ఇక్కడ నాలుగు ఆవర్తాలలో ఆలాపనను రాగస్వరూప ప్రదర్శనతో వినిపించాక బృందంవారు ఈ పంక్తులను పాడారు. మూడో పాదాన్ని తారస్థాయి గాంధారం నుంచి సుశీల పాడుతూ చరణాన్ని ముగించారు. బృందంవారు పల్లవిని అందుకున్నారు. సుశీల అనుపల్లవితో కూడా కలిపి పాడి 'తెల్లవారె' దగ్గర ఆపగా,వాద్యసంగీతాన్ని పొడిగిస్తూ 23 ఆవర్తాలలో వినిపించారు. వీటిలో 11వ ఆవర్తం నుండి ప్రత్యేకించి వయొలిన్ వాద్యంపై జిమ్మిక్కులను, మృదంగం జతులతో కలిపి చమత్కారంగా వినిపించారు. చివరలో సుశీల పల్లవిని అందుకుని పాడి ముగించారు. మి

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్: 939 661 1905.

---

**(1) పాడే పక్షులు:** బాలల అనువాద కథలు. మూలం: డా. బి.జి. రమేష్, అనువాద రచయిత: ఒద్దిరాజు మురళీధర్‌రావు, సంపాదకులు: డా. కొండపల్లి నీహారిణి. డా. నీహారిణి సంపాదకత్వంలో వెలువడిన ఈ బాలసాహిత్యం – ఇవన్నీ రమేష్‌గారు కన్నడంలో రాసినవి. బాలలకు మనం చదివి చెప్పటానికి చాలా అనువుగా అనువాదం చేశారు. కవులు – కోకిల పాటకు కారణం పక్షులు మాట్లాడటం – కుక్కపిల్ల టామీ అల్లరి – గబ్బిలాలు – సాలీడు కోతి – ఇలా ఎన్నో వింతలు – విశేషాలతో పిల్లల్ని ఆకర్షించే కథలున్నాయి.




*పేజీలు: 79, వెల: ₹ 100/–*

**(2) నీదేగానీ నీదే కాదు:** పి.వి.ఆర్. శివకుమార్. ఇవి కామెడీ కథలని చెప్తున్నారు. ''మనసు మూడీగా ఉన్నప్పుడు ఈ కథలు చదవండి. మీలో ఆనందం వెల్లివిరుస్తుంది – నవ్వులు పువ్వులు పూస్తాయి. నవ్వు ఆరోగ్యదాయకం కదా" – అంటారు వేమూరి బలరాం! తప్పక కొని చదవతగిన కథలు!




*పేజీలు: 124, వెల: ₹ 150/–*

**(3) అంతర్లీనం:** అడ్డగూరి శ్రీలక్ష్మి. ఇది కవిత్వం – అదే వచన కవిత్వం. "విలువల్ని జారకుండా మూటకట్టుకొని / విలువైన కాలాన్ని ఒడిసిపట్టుకొని / కొన్ని తీర్చిదిద్దుకుంటూనో / కొన్ని పేర్చి సర్దుకుంటోనో / కదిలే జీవనగమనం..." ఇదీ ఆమె కవితా శైలి. "నీతో సాగే పయనం / ఆలోచనల హార్మ్యం – నీకే సాగే పయనం / అలసటకి ఆమడదూరం" – ఈ కవిత్వంలో ఆంతర్యం, లయ – విన్యాసం అన్నీ ఉన్నాయి – వచన కవిత్వానికి మరో పార్శ్వం ఇది! *పేజీలు: 111, వెల: ₹ 100/–*




*పై మూడు ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీం నగర్, మలక్‌పేట, హైదరాబాద్ – 36. ఫోన్: 984 878 7284.*

# వీధి చిత్రకారుడు – బాంక్సీ

## (Street Artist - Banksy)

*– టి.వి. ప్రసాద్*

**బాం**క్సీ ఇంగ్లండు వీధి కళాకారుడు. అతని అసలు పేరు, ఊరు, వృత్తి అన్నీ ఊహించుకోవలిసిందేగాని, కచ్చితంగా చెప్పలేము. వీథుల్లో బొమ్మలు వేయడం ద్వారా ప్రఖ్యాతిగాంచాడు.

బ్రిస్టల్లో జన్మించాడనీ, ఆస్టిన్ మ్యూజియంలో ఇతని చిత్రాలు చూడవచ్చనీ, వీధి చిత్రకారుడనీ, అతని భార్య జాన్ మిలో వర్డ్ అనీ, సినిమాలను నిర్మించి, దర్శకత్వం చేపట్టాడనీ కొన్ని ఆధారాలనుబట్టి తెలస్తుంది. మొదట్లో బాంక్సీ అని బొమ్మల కింద సంతకం చేసేవాడు. ఇప్పుడు అతని బొమ్మల్లోని యితివృత్తాన్ని బట్టి అవి బాంక్సీ వేసినవని తెలుసుకోవచ్చు.

బ్రిస్టల్లో పుట్టి పెరిగిన ఈ అజ్ఞాత వీధి చిత్రాకారుడు 1990 నుండి చురుగ్గా చిత్రాలు వేస్తున్నాడు. డయానా, మార్సెల్ డచమ్, కేథ్ కోల్విజ్జ ప్రభావితుడు. వ్యంగ్యం, విమర్శ, విషాదపు హాస్యం (డార్క్ హ్యూమర్) బాక్సీ చిత్రాల ప్రత్యేకత. గోడలు, వంతెనలు, వీధుల్లో ఖాళీగా ఉండే ప్రదేశాల్లో బాంక్సీ చిత్రాలు కనిపిస్తాయి. తొలినాళ్ళలో బ్రిస్టల్ అధోజగతి కళాకారులు, సంగీత బృందంతో కలిసిమెలిసి పనిచేయడంవరకే పరిమితమైన బాంక్సీ జీవితం ప్రస్తుతం విస్తృతంగా పెరిగిపోయి అతని ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. దానితోపాటు బ్రిస్టల్ పట్టణానికి గుర్తింపు వచ్చింది. స్టెన్సిల్, ప్రింట్ శైలితో ఉండే చిత్రాలను గోడలమీద నైపుణ్యంతో పెయింట్ చేయడం బాంక్సీ ప్రత్యేకత. రాజకీయ సామాజిక సమస్యలు ఇతివృత్తాలు. మాసివ్ అటాక్ అనే సంగీత బృందంలోని స్థాపక సభ్యుడు, ఆ బృందంలోని కళాకారుడు కూడా అయిన 'త్రీడీ'ని తనకు ఆదర్శం అని చెప్పుకున్నాడు.

పదిమందికీ కనిపించే బహిరంగ ప్రదేశాల్లోని పాడుబడిన గోడలు. కిటికీలు మొదలైన వాటిమీద బాంక్సీ బొమ్మలు కన్పిస్తాయి. అతని ఫోటోగ్రాఫ్‌లుగానీ, అతని బొమ్మల నకళ్ళుగానీ అమ్మకానికి కన్పించవు. కానీ అతని కుడ్య చిత్రాలను విపరీతంగా యిష్టపడేవారు కొందరు బాంక్సీ చిత్రాలున్న గోడల్నే కొనేవారు. కొన్ని బొమ్మల్ని మాత్రం పెద్దగా ప్రచారం లేకుండా, ఏజంట్ల సాయంతో అమ్మేవాడు. తాను సృష్టించిన పెస్ట్ కంట్రోల్ ద్వారా 2010లో బాంక్సీ తీసిన తొలిసినిమా సన్‌డాక్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొని, 2011లో అకాడమీ అవార్డుకు నామినేట్ చేయబడింది. 2014లో ఆ సంవత్సరపు మేటి వ్యక్తిగా వెబ్బీ అవార్డు అందుకున్నాడు.

2003 గార్డియన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ అప్పటికి అతని వయసు 28 సంవత్సరాలనీ, జీన్స్, టీషర్ట్ ధరిస్తాడనీ, బంగారపు పెట్టుడు పన్ను, మెడలో వెండి గొలుసు, చెవిరింగుతో వుంటాడనీ వర్ణించింది. 14వ యేటి నుండే కళను ప్రారంభించాడని, పాఠశాల నుండి బహిష్కృతుడైనాడని, ఏదో చిన్న నేరానికి కొద్దికాలం జైలులో గడిపినాడనీ వెల్లడించింది. అనుమతి లేకుండా కుడ్య చిత్రాలు వేయడం నేరం కావడంవల్ల అజ్ఞాత జీవితం గడపవలసి వచ్చింది. బ్రిస్టల్ నుండి 2008లో లండన్‌కు మకాం మార్చాడు అని తెలిపింది, ద మెయిల్ పత్రిక. బహుశా అతడు రాబిన్ బాంక్సీగా చలామణి అవుతున్న గన్నింగామ్ (Gunningham), అయివుండొచ్చని ఊహించింది. 1973లో బ్రిస్టల్ సమీపాన ఏల్‌లో జన్మించాడు, లండన్ యూనివర్సిటీలో చదివాడు అని మరికొంత సమాచారం యిచ్చింది. 1993లో కాసెట్ కవర్ మీద బాంక్సీ చిత్రం ఒకటి సంతకంతో కన్పించింది. ఇంకొకరకమైన ఊహాగానం, మాసివ్ అటాక్ మ్యూజిక్ బృందంలోని రాబర్ట్ డెల్ నాజా బాంక్సీ కావచ్చుని, లేదా అతని దగ్గరి మిత్రుడైనా కావచ్చని ఊహించింది. 2014లో బాంక్సీ ఎవరో తెలిసింది, అతడ్ని అరెస్టు చేశారని ఒక పుకారు పుట్టింది.



ఫ్లవర్ త్రోయర్



బాంక్సీ (ఊహాచిత్రం)

ప్రతి ఒక్కరూ పేరు ప్రఖ్యాతుల కొరకు తాపత్రయపడే ఈ రోజుల్లో అజ్ఞాతంగా ఉండిపోవడం అతని గొప్పతనం అని నటుడు బ్రాడ్‌పిట్ అంటాడు.

ఒక దశాబ్దకాలం 1990-2000వరకు మరో ఇద్దరు కళాకారులు కాటో, టెన్‌లతో కలిసి బొమ్మలు వేయడం మొదలుపెట్టాడు. బ్రిస్టల్ అధోజగతి ఫోటోగ్రాఫర్ నిక్ వాకర్, 3డి, మికీల ఆర్ట్ చేత ప్రభావితుడు.

2000లో స్టెన్సిల్ కళ మొదలయింది. త్వరలోనే బాంక్సీ స్టెన్సిల్ పెయింటింగులతో మంచి వీధి కళాకారుడిగా గుర్తింపు పొందాడు. 1990లో ఫుట్‌బాల్ టీంలో గోల్‌కీపర్‌గా పనిచేశాడు. 2001లో మెక్సికో పర్యటించాడు.

1997లో చిత్రించిన 'పెద్ద మ్యూరల్' (కుడ్యచిత్రం) వైల్డ్ వెస్ట్, టెడ్డీ బేర్, రయట్ (RIOT) చిత్రాలు బాంక్సీకి మంచి పేరు తెచ్చిపెట్టాయి. అతని స్టెన్సిల్ పెయింటింగులు, నినాదాలు నవ్వు తెప్పిస్తూనే మనకు హత్తుకుపోతాయి. 2011లో పింక్ మాస్క్ ధరించిన గొరిల్లా చిత్రం ఒక క్లబ్ గోడమీద చిత్రించింది, పది సంవత్సరాల తర్వాత అనుకోకుండా దానిపై పెయింట్ చేయడంవల్ల చెరిగిపోతుంది.

**బాంక్సీ ప్రదర్శనలు:**

లాస్ ఏంజిలీస్‌లో 2002లో స్మైలీ కూపర్, బాంబు హగ్గర్ ప్రదర్శించబడినాయి. 2003లో టర్ఫ్‌వార్ పేరిట జంతువుల మీద వేసిన పెయింటింగులు జంతు సంరక్షకుల వ్యతిరేకత బారినపడగా వాటిని తుడిచివేశాడు. క్లాడ్ మానే లిల్లీపాండ్ పెయింటింగులో నీళ్ళలో తేలుతున్న షాపింగ్ ట్రాలీని, చెత్త బుట్టను చూపించాడు. 2005లో ఎడ్వర్డ్ హొరీవర్, నైట్ హాక్స్ పెయింటింగును తనదైన శైలిలో వేసి లండన్‌లో ప్రదర్శించాడు. 2017లో పారిస్, న్యూయార్క్, బెత్లహాంలో పర్యటించి కుడ్యచిత్రాలు వేశాడు. గోడలమీద ఇతర బహిరంగ ప్రదేశాల్లో చిత్రాలు వేయడం చట్ట విరుద్ధం కావడం వల్ల చీకట్లో ఎవరి కంటా పడకుండా బొమ్మలు వేశేవాడు. బొమ్మమీద పెయింట్ ఆరేవరకూ ఆగి తర్వాత అది తన పనేనని ప్రకటించేవాడు. చాలాచోట్ల బాంక్సీ చిత్రాలను నేరచర్యగా గుర్తించారు. 2004లో పది పౌండ్ల నోటు మీద ఇంగ్లండు రాణీస్థానంలో డయానా తలను, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ స్థానంలో బాంక్సీ ఇంగ్లండ్‌ను మార్చి చూపి పంచిపెట్టాడు. 2005లో పాలస్తీనా పర్యటించినప్పుడు తొమ్మిది కుడ్య చిత్రాలను ఇజ్రాయేల్ కాంక్రీటు ఎదురుగా చిత్రించాడు. 2006లో వేర్ హౌస్ ఎగ్జిబిషన్‌లో ఏనుగు మీద పెయింటింగు వేసి జంతు ప్రేమికుల అభ్యంతరంతో చివరిరోజున తుడిచివేసాడు.

**వన్ నేషన్ అండర్ సిసి టివి:**

బాంక్సీ పెద్ద చిత్రాలలో ఇది ఒకటి. దీన్ని లండన్‌లో (2008) చిత్రించాడు. మూడంతస్తుల ఎత్తున పరంజా నిర్మించుకుని, ఆ ప్రాంతంలోని సిసిటివి కెమెరాల దృష్టిలో పడకుండా అంత పెద్ద బొమ్మను. రూపొందించడం ఆశ్చర్యం కలిగించే విషయం. 'నగరం నిఘాలో ఉంది' అని నేరస్తులను హెచ్చరించే ప్రకటన, దాని పక్కనే ఎవరి దృష్టిలో పడకుండా అదే మకుటంతో బొమ్మ వేయడం గొప్ప ఐరనీ, తర్వాత ఎప్పుడో ఆ చిత్రం తొగించబడింది.

**గర్ల్ విత్ ఎ బెలూన్:**

బెలూన్‌తో ఆడుకుంటున్న అమ్మాయి చిత్రం మిలియన్ పౌండ్లకు పైగా అమ్ముడుపోతుంది. వేలంపాటలో బొమ్మను కొన్న వ్యక్తి సొంతం చేసుకోగానే ముక్కలుముక్కలుగా తెగి సగం బొమ్మ కిందపడిపోతుంది. అంతకుముందే బాంక్సీ గొప్పకోసమని బొమ్మల్ని అమ్ముకోవడాన్ని నిరసిస్తాడు. బొమ్మల్ని కొనేవారిని ప్రోత్సహించకూడదని తానే పెయింటింగు ఫ్రేములో యంత్రపరికరాన్ని అమర్చానని ప్రకటిస్తాడు. వేలంపాట కార్యక్రమాన్ని బొమ్మ ముక్కలుగా తెగిపోవడాన్ని వీడియోలో చిత్రించి ఇన్స్‌స్టాగ్రాంలో పెట్టాడు. విచిత్రంగా మిగిలిపోయిన సగం పెయింటింగ్ విలువ ముందుకంటే ఎక్కువగా పెరిగిపోయింది.

ప్రపంచ వీధి చిత్రకారుల్లో అత్యంత ప్రముఖుడు, అన్నిదేశాల్లో ఏదో ఒక మూలన తన చిత్రాలను వేశాడు. చిత్రకారుడిగా ఎంత పేరు ప్రఖ్యాతులు గడించాడో, అజ్ఞాతంగా ఉండడం వల్ల అంతకన్నా మిక్కిలిగా ఖ్యాతి గడించాడు. బ్రిస్టల్ సమీపాన సముద్రతీరంలో, డిస్నీలాండ్ అమ్యూజ్‌మెంట్ పార్కుకు పారడీగా 'డిస్మాలాండ్ బిమ్యూజ్‌మెంట్ పార్కు' నిర్మించాడు.

సమకాలీన సమస్యలకు స్పందిస్తూ చిత్రాలు రూపొందించి వ్యంగ్య వ్యాఖ్యానాలతో ప్రజల దృష్టి

నాకర్షించడం బాంక్సీ ప్రత్యేకత. డజన్లకొద్దీ చిత్రాలు వ్యంగ్య వ్యాఖ్యానాలతో అలరించడంతో పాటు మిలియన్ల పౌండ్లకు అమ్ముడుపోయాయి. 2021 వరకు వివిధ దేశాల్లో మొత్తం మీద 136 చిత్రాలు రచించాడు. అనుమతి లేకుండా కుడ్యచిత్రాలు వేయడం చట్టవిరుద్ధమైనా ఇంతవరకూ ఎక్కడా పట్టుబడకపోవడం మరీ విచిత్రం.



ఎస్కేపింగ్ ప్రిజనర్

బాంక్సీ ప్రతి పెయింటింగూ ఏదో ఒక ప్రత్యేకత కలిగి ఉంటుంది.

**ఎస్కేపింగ్ ప్రిజనర్:**

రీడింగ్ పట్టణ జైలు గోడమీద వేసిన చిత్రం ముందున్న తాడు పట్టుకొని జైలు గోడ నుండి కిందికి దిగుతోన్న వ్యక్తి. తాడు కిందివైపు టైపురైటర్‌కు బంధించబడి వుంటుంది. ఐరిష్ రచయిత ఆస్కార్ వైల్డ్ జైలు జీవితానికి ప్రతీక.



స్లేవ్ లేబర్

**ఫ్లవర్ త్రోయర్:**

2003లో జెరూసలేంలో కన్పించింది. యుద్ధవిషాదం మధ్యలో శాంతి, ఆశకు సంకేతం - పూలగుత్తిని విసిరే ఆందోళనకారుడు బాంబులు, రాళ్ళు విసిరే బదులు పూలగుత్తి విసరడం విశేషం. చిత్రానికి బాంక్సీ పెట్టిన పేరు వాల్ అండ్ పీస్. (వార్ అండ్ పీస్‌కు పారడీ).

**మ్యాన్ హాంగింగ్ ఫ్రం ది విండో:**

బాంక్సీకి చాలా పేరుతెచ్చిన చిత్రం బ్రిస్టల్‌లో వేసింది. రహస్య ప్రేమ కలాపాలు యజమానురాలి భర్తకు తెలిశాయన్న భయంతో ప్రియుడు గది కిటికీకి వేలాడే దృశ్యం. బాంక్సీ ఐరనీ ఇందులోనూ కన్పిస్తుంది. బొమ్మను చిత్రించింది సెక్స్‌వల్ హెల్త్ క్లినిక్ గోడమీద. అది హెల్త్ క్లినిక్ అని తెలియక బొమ్మ వేశానని క్లినిక్ డైరెక్టర్‌కు క్షమాపణ చెప్పుకుంటాడు.

**బాంబ్ హగ్గర్, లండన్:**

చిన్నపిల్ల బాంబును గుండెలకు హత్తుకోవడంలో యుద్ధభీతిలేని బాలిక అమాయకత్వాన్ని చూపిస్తాడు. మనం శాంతిగా బతకగలిగినప్పుడు యుద్ధపోరాటం ఎందుకు? అని ప్రశ్నిస్తాడు.



మొబైల్ ఫోన్ లవర్స్

**స్లేవ్ లేబర్:**

ఇంగ్లండు రాణీ ఎలిజబెత్ 60వ జన్మదిన (డైమండ్ జూబిలీ) సందర్భంగా 2012లో సృష్టించిన చిత్రం. బాలకార్మికుడు ఇంగ్లండ్ పతకాన్ని తయారుచేయడం పిల్లల్తో బానిసలుగా పనిచేయించుకోవడాన్ని నిరసించే చిత్రం.

**కిస్సింగ్ కాపర్స్:**

ఇద్దరు పోలీసులు ఒకరినొకరు ముద్దు పెట్టుకునే దృశ్యం. బ్రిటన్ స్వలింగ సంపర్కానికి ఇది బాంక్సీ వ్యాఖ్యానం. ఒక పబ్ గోడ మీద కన్పించే చిత్రం ఇది.

2008లో లండన్ లీక్ స్ట్రీట్‌లో కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగిన సందర్భం. ఇందులో ఇతర కళాకారులలో బాంక్సీ కూడా పాల్గొంటాడు. బాంక్సీ టన్నల్‌గా ప్రేమతో పిలుచుకునే లీక్‌స్ట్రీట్‌లో ఇంజుర్డ్ బుద్ధ బొమ్మను చిత్రించాడు. భావోద్రేకాలను (Injured) జయించిన మనసుకు సంకేతంగా బుద్ధుని మెడకూ, చేతికి బాండేజి కట్లు ఉంటాయి.

**షో మీ ద మానె:**

మానే ప్రముఖ పెయింటింగు వాటర్ లిలీస్ చిత్రం. నీటికొలనులో బాంక్సీ సూపర్ మార్కెట్‌లో కనిపించే ట్రాలీ, చెత్తబుట్టను చేర్చి కొత్త పెయింటింగును వేస్తాడు. స్వచ్ఛత ఎక్కడుంది. అంతా కల్మషమే అని చెప్పడం బాంక్సీ ఉద్దేశం.

**మొబైల్ ఫోన్ లవర్స్:**

ప్రేమికులు ఒకరి పరిష్వంగంలో ఒకరు ఉండి ఒకరికి తెలియకుండా ఒకరు వెనుక వైపు ఫోన్లో మెసేజ్ చూసుకునే చిత్రం. డివాల్వ్‌డ్ పార్లమెంట్, హ్యాపీ ఛోపర్, వెల్‌కమ్ టు హెల్, లాఫ్ నౌ, టెర్రరిస్టు హెల్మెట్, టెలిఫోన్ బాక్స్, పిస్సింగ్ గార్డ్‌లాంటి



గేమ్ ఛేంజర్

అనేక చిత్రాలు బాంక్సీ సునిశిత పరిశీలనాశక్తికి వర్తమాన సమస్యల పై వ్యంగ్యం వ్యాఖ్యానాలకు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయి. 2019లో డివాల్వుడ్ (Devolved) పార్లమెంటు (బ్రిటిష్ పార్లమెంటును కాంతుల నిలయంగా చూపించింది) ఎక్కువ ధరకు 9.9 మిలియన్ పౌండ్లకు అమ్ముడుపోయిన బాంక్సీ చిత్రం, దాన్ని అధిగమించింది గేమ్ ఛేంజర్ చిత్రం. 2021 మార్చిలో క్రిస్టీ వేలం సంస్థ ఈచిత్రాన్ని అమ్మకానికి పెడ్తే ఎన్.హెచ్.ఎస్. దీన్ని మిలియన్ల పౌండ్లకు సొంతం చేసుకుంది. ప్రపంచ ప్రముఖ వీధి చిత్రకారుడు బాంక్సీ చిత్రాలు కూడా అత్యంత ఖరీదైనవే!

బాంక్సీ ఆదాయం సంవత్సరానికి 15 మిలియన్ పౌండ్లు. తన సంపాదనలో చాలావరకు ఛారిటీలకు దానం చేస్తాడు. బాంక్సీ చిత్రాల్లో తరచుగా కన్పించే వ్యక్తి మోనాలీసా కాగా, తరచుగా కనిపించే ప్రాణి చిట్టెలుక.

పెయింటింగులు, వ్యంగ్య వ్యాఖ్యానాలతో బాంక్సీ ప్రపంచ ప్రఖ్యాత వివాదస్పద పెయింటర్‌గా గుర్తింపు పొందాడు. బాంక్సీ వీధిచిత్రాలు ఒక నూతన సంస్కృతికి దారిచూపాయి. అతని చిత్రాలు రెచ్చగొట్టేవిగా, తిరుగుబాటును ప్రోత్సహించేవిగా ఉంటాయి. 2013లో ఒక నెలరోజులు న్యూయార్క్‌లో గడిపి రోజుకొక్క కొత్త చిత్రాన్ని ఆవిష్కరించాడు. 13వ రోజున వీధుల్లో అమ్ముకునేవాడి వేషంలో సెంట్రల్ పార్క్‌లో ఒక తాత్కాలిక వేదికను నిర్మించుకొని తన నలుపు తెలుపు చిత్రాలను ఒక్కో చిత్రాన్ని 60 డాలర్లకు అమ్ముతాడు. మరుసటి రోజు అవన్నీ బాంక్సీ తన సంతకంతో అమ్మిన చిత్రాలేనని ప్రకటిస్తాడు. మొదట అరవై డాలర్లకు అమ్ముడుపోయిన అవే



ఇంజుర్డ్ బుద్ధ

చిత్రాలు తర్వాత లక్షన్నర డాలర్లకు అమ్ముడుపోతాయి. అభిమాని ఒకడు బాంక్సీ తాత్కాలికంగా నివసించిన ఇంటిని లక్ష డాలర్లకు పైగా పెట్టి కొంటాడు.

**బాంక్సీ ఇన్‌స్టాగ్రాం:**

బాంక్సీ పోస్టింగులకు అభిమానులు భారీసంఖ్యలో ఉంటారు. 174 పోస్టింగులతో కోటికిపైగా అభిమానులను సంపాదించాడు. నేను ఇంట్లో కూర్చొని పనిచేయడాన్ని నా భార్య భరించే తీరు అసహ్యంగా ఉంటుంది అన్న లేటెస్ట్ పోస్టింగ్‌కు 24 గంటల్లోనే 2.2 మిలియన్ అనుచరులు స్పందిస్తారు.

కరోనా వైరస్ సృష్టించిన ప్రపంచ విలయానికి బాంక్సీ స్పందన నూతనంగా ఇటీవల వేసిన 'గేమ్ ఛేంజర్', నలుపు తెలుపు చిత్రం, మాస్కు ధరించిన చిన్నపిల్లవాడు ఎన్.హెచ్.ఎస్. నర్సు బొమ్మతో ఆడుకుంటున్న దృశ్యం. ప్రక్కనే బిన్‌లో సూపర్‌మాన్, బాట్‌మాన్ బొమ్మలు. సౌతాంప్టన్ హాస్పిటల్ సేవలకు నివాళిగా దాన్ని నడవలో ప్రదర్శిస్తాడు. తర్వాత ఎన్.హెచ్.ఎస్. సేవలకు కృతజ్ఞతలు చెప్పడానికీ, హాస్పిటల్ సిబ్బందికి ఆనందం కలిగించడానికీ తానే ఆ చిత్రాలన్నీ రూపొందించానని ఒక ప్రకటనను విడుదల చేస్తాడు.

23 మార్చి, 2021 బ్రిటిష్ నేషనల్ హెల్త్ సర్వీసు (ఎన్.హెచ్.ఎస్.) ఈ వేలంపాటలో 20 మిలియన్ పౌండ్లకు సొంతం చేసుకుంటే, ఆ డబ్బంతా ఎన్.హెచ్.ఎస్. హెల్త్ చారిటీల సేవలకు ఉపయోగపడుతుందని ప్రకటించి బాంక్సీ తన ఉదారతను చాటుతాడు. వీధి కళ ఇంత ధరకు అమ్ముడుపోవడం కూడా ఒక రికార్డే!

ప్రస్తుతం బాంక్సీ అత్యంత జనాదరణ పొందిన, అత్యంత ఖరీదైన అజ్ఞాత వీధి చిత్రకారుడు.

బాంక్సీ రిట్రోస్పెక్టివ్ బ్రిస్టల్‌లో నిర్వహించబడినప్పుడు ఊహించనంతగా విజయం సాధించింది. 12 రోజుల ప్రదర్శన మూడు లక్షలమంది సందర్శకులను ఆకర్షించింది.

2014లో ప్రముఖ వేలం సంస్థ సథబీజ్ బాంక్సీ పెయింటింగుల్ని తొలిసారి లండన్‌లో అనధికారికంగా ప్రదర్శిస్తే (జూన్ 14న) అభిమానుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. ®

టి.వి. ప్రసాద్ - హైదరాబాద్. ఫోన్: 798 139 8250.



# కబీర్ దాస్ - 10

**- లక్ష్మీ అయ్యర్**

35వ అధ్యాయము "బే సాస్ కౌ అంగ్". ఈ 35వ అధ్యాయంలో భగవంతునిపైగల విశ్వాసాన్ని నమ్మకాన్ని గూర్చి చెబుతున్నారు. మొత్తం 21 దోహాలు ఉన్నాయి. ఈ 35వ అధ్యాయంలో భగవంతుని మనసారా నమ్మి కొలిచే వారి గురించి మాట్లాడుతూ కబీర్ ఇలా అంటున్నారు. "ఓ జీవుడా! రక్షించే భగవంతుడు చెయ్యి నీ తల మీద ఉన్నంతవరకు నిన్ను ఎవడు ఏమి చేయలేడు. ఆ అభయ హస్తము ఉన్నంతవరకు నువ్వు భయపడక్కర్లేదు నీవు కూర్చున్నది ఏనుగు మీద. ఏనుగు మీద కూర్చున్న వాడికి వెనకాల ఎన్ని లక్షల కుక్కలు మొరిగినా ఏ భయమూ ఉండదు. అలాగే భగవంతుని నమ్మిన వాళ్లకు ఎలాంటి భయము ఉండదని భాగము ఇది 12వ దోహాలు చెప్తున్నారు కవి. అదేలాగే 11వ దోహాలో ఆదిశంకరుని భజ గోవిందంలోని మొదటి శ్లోకంకు సమానంగా కబీర్ ఇలా చెబుతున్నారు: "నాకు లోకమంతా అద్వైతంలో నేను నాలో నీవు ఉన్నావు దేవా! రామమయం అయింది. నా హృదయం నీది నిన్ను వీడి నేను బయటకు రాలేను. కాలుడు నన్ను ఏమీ చేయలేడు. వాడి అధికారం నుండి నేను విడిపోయాను. నాకు, నా ఇష్టదేవుని మీద పూర్తి నమ్మకం ఉంది. నా ఇష్టదైవాన్ని స్మరించినవాళ్ళు ఎప్పుడూ నరకానికి పోరని నాకు పూర్తిగా భరోసా ఉంది'' అంటున్నారు కబీర్. ఈ అధ్యాయంలో మొత్తం 31 దోహాలు ఉన్నాయి. ఇక 24 దోహాలు నీతిపరంగా కబీర్ చెబుతున్నారు. ఎవరి దగ్గరనుండైనా ఏ వస్తువులు యాచిస్తే మన గౌరవము, మహిమలు, ప్రేమ, స్నేహం, గుణాలు అన్నీ ఒక్కసారిగా నష్టపోతాయి. అందుకే మనం వ్యక్తుల దగ్గర నుండి ఆశించకూడదు. ఏది యాచించాలన్న భగవంతుడి దగ్గర యాచించండి.

17వ దోహాలో కబీర్ ఇలా అంటున్నారు-

***మేరి మిటీ సుగత భయా, పాయా బ్రహ్మ బిసాస్***
***అబ్ మేరే దూజా కోయీ నహీ, ఏక్ తుమ్హారీ ఆస్***

"నేను, నావల్ల అనే అహంభావం నా నుండి విడిపోయింది. నేను నా సీమలన్నీ దాటి ఆ నిర్గుణ పర బ్రహ్మతో ఐక్య స్థితిని చెందాను. ఇప్పుడు నాకు ఇతరులు ఎవరి వద్ద కూడా తమ పర భేదాలు లేవు. నాకు ఎవరూ ఇతరులు కారు. ప్రభువా! నీ మీద మాత్రమే నాకు నమ్మకం ఉంది. అందరిలో నీవు నిండి ఉన్నందున అందరిలో నీవే కనబడుతున్నావు."

అదేలా 18వ దోహాలో కబీర్ హృదయంలో ఉన్న భగవంతుని గురించి వ్యాఖ్యానిస్తున్నారు "ఎవరి హృదయంలో అయితే కరుణా సముద్రుడైన ప్రభువు ఉన్నాడో వారిని ఎవ్వరూ ఏమీ చేయలేరు. భగవంతుని అనుగ్రహం అనే సముద్రం నుండి ఒక్క అల మాత్రము భక్తి అనే అల వ్యక్తిపై పడితే అతని సమస్త దుఃఖాలు దరిద్రాలు దూరమై సమాప్తం అయిపోతాయి. ఈ అధ్యాయం అంతా కబీరు భగవంతునితోగల సంబంధాన్ని ప్రకటిస్తున్నాడు. భగవంతునిపైగల భక్తికి ముఖ్యమైన ఆధారము నమ్మకం మాత్రమే. ఆ దృఢ నమ్మకం ఉంచితే ఎటువంటి కష్టమైనా కష్టంగా అనిపించదు. ఉదాహరణకు ప్రహ్లాదుని చూడవచ్చు. ఎంతటి కష్టం వచ్చినా ఆరేళ్ల బాలుడు హరిపై తనకుగల దృఢమైన నమ్మకంతో, సత్యంతో హరి కృపకు గురయ్యాడు. అదేలా అంబరీషుడు తన భక్తి భావంతో హరికంటే హరి భక్తుల మహిమలు గొప్పవని నిరూపించాడు. ఆ పరమ భాగవతోత్తముడైన భక్త అంబరీషుని కాపాడేందుకై స్వామి చేతిలోని సుదర్శన చక్రం దుర్వాసుడిని వెంటాడింది.

ఆ భగవంతునిపై నమ్మకం ఉంచితే ఆవగింజ పర్వతమవుతుంది, పర్వతం ఆవగింజవుతుంది అని నిక్కచ్చిగా చెబుతున్నారు భక్త కబీరుదాస్. ఆయన భజనల ద్వారా భగవంతుని పేరును ప్రతీ సెకనుకు ఉచ్చరించమంటున్నారు. ఈ అధ్యాయంలో మొత్తం 21 దోహాలున్నాయి.

కబీరు సన్యాసాన్ని స్వీకరించమని ఎప్పుడూ కోరలేదు. హృదయపూర్వకంగా ఆ భగవంతుని శరణులు ఉండాలని మాత్రమే కోరుకున్నాడు. ఈ అధ్యాయము 20వ దోహాలో కబీర్ స్పష్టంగా చెబుతున్నారు. చాలామంది భగవంతుని పేరు చెబుతూ బయట భజనలు పాడుతూ ఉంటారు. కానీ హృదయంలో చాలా దుఃఖంతో బాధపడుతూ ఉంటారు. ఇంకొందరు బయట నుంచి ఏడుస్తూ తన కష్టాలని చెప్పుకుంటారు. కానీ లోపల చాలా సంతోషంగా ఉంటారు. ఒకడు బయట నుంచి సన్యాసిగా ఉంటాడు కానీ, లోలోపల విషయం వాంఛలతో కామ పిశాచిగా తిరుగుతుంటాడు. ఇంకొకరు గృహస్థునిగా గృహస్థ ధర్మాన్ని స్వీకరిస్తాడు. కానీ మానసికంగా సన్యాసిగా ఉంటూ ఆ భగవంతుని పొందును కోరుకుంటాడు. సంసార సాగరంలో పడి గృహస్థాశ్రమాన్ని స్వీకరించినంత మాత్రాన అతను భక్తుడు కాడు అని చెప్పలేం. అతను ఇంట్లో ఉన్నా అతని మనస్సు దేవునిలో లీనమై సన్యాసిగా, మానసికంగా భగవంతునితో గడుపుతూ ఉంటాడు. అతని మనసు మాత్రం ప్రశాంతంగా, సంతోషంగా ఉంటుంది. వైరాగ్యానికి హృదయంతో సంబంధం ఉంది కానీ కాపురంతో కాదు అని స్పష్టంగా చెబుతున్నారు కబీర్. ఇలాంటి కోవకు చెందిన వాళ్ళే మీరాబాయి, అన్నమాచార్య, త్యాగయ్య, రామదాసు, పురందరదాసు, తరిగొండ వెంగమాంబ మొదలగువారు. ఇలాంటి మానసిక సన్యాసంతో పాటు ఒక రామకృష్ణ పరమహంసగారి కథ ముడివడి ఉన్నది. పరమహంసగారు తన ఉపన్యాసంలో ఇలా వివరించారు– "ఈ లోకంలో సన్యాసి అనేవాడు బయట బైరాగిగా తిరుగుతూ లోపల కోరికల పుట్టలతో ఉండవచ్చు.'' సన్యాసం అనేది హృదయానికి సంబంధించినది అంటూ స్వామిగారు ఇలా సెలవిచ్చారు– "ఒక మహా ఋషి తన శిష్యులతో నడుస్తూ వెళుతున్నారు. వారి బాటలో ఒక యువతి రక్షించండి రక్షించండి అని చెరువులో మునుగుతూ కనిపించింది. వెంటనే శిష్యుడు వెళ్లి దూకి ఈది ఆమెను ఒడ్డుకు తెచ్చి ప్రాణాలు కాపాడి వచ్చేసి తన నడకలను కొనసాగించాడు. అప్పుడు గురువు పదే-పదే శిష్యుని అడుగుతున్నాడు "నువ్వు కాపాడావే – ఆ యువతి వయసెంత? తను తెల్లగా అందంగా ఉంటుందా? ఆమె శరీరంగాన్ని గురించి మాట్లాడుతూ ఇక్కడ తాకావా? అక్కడ తాకావా?" అని అడుగుతూ ముందుకు సాగుతున్నాడు, గురువు శిష్యుడు ముక్తసరిగా అంటున్నాడు– "గురువు గారు! పరమాత్మను తలుస్తూ నేను ఆమెను కాపాడేనే కానీ ఆమె శరీరాన్ని చూడలేదు. ఆమె ఆత్మను మాత్రమే చూసా''నని! ఇప్పుడు అర్థం చేసుకోవచ్చు. ఎవరు గురు స్థానానికి అర్హులు? ఎవరు గురు స్థానానికి అర్హత లేనివారని. ఇలాంటి గురువులను ఇలాంటి శిష్యులను ప్రస్తుత సమాజంలో కూడా మనం చూడవచ్చు.

ఇక 21వ దోహా చివరి దోహాలో కబీర్ భగవంతుని నామ స్మరణ గూర్చి అంటున్నారు. ఇది పూర్ణ భక్తికి సంబంధించిన దోహా. ప్రహ్లాదుడు భాగవత పురాణంలో, అదేలా నారదుడు తన భక్తి ఈ సూత్రాల్లో ఇలాంటి స్మరణాసక్తి అనబడే భక్తిని గురించి చక్కగా వివరించి ఉన్నారు. ఇదే భక్తి పద్ధతిని గోకులంలో గోపికలు కూడా ఆచరించారు. భగవంతుని పేర్లను రూపాన్ని మాత్రము పదే-పదే స్మరించి స్మరించి ప్రతి మనిషిలోనూ ఆ రూపాన్ని తలచుకుంటూ తృప్తి చెందడం. ఇక్కడ కబీర్ గారు 21వ దోహాలో ఇలా అంటున్నారు "భగవంతుని మీద నమ్మకం ఉంచి ఆయన నామాలు ఉచ్చరించుతూ ఉచ్చరించుతూ తిరుగుతూనే ఉండు. ఆ భగవంతుడు తానుగా నీ దగ్గరికి వస్తాడు. నీ నోరు మాత్రం భగవంతుని పేరుని ఉచ్చరిస్తూ ఉండి మనసు మాత్రం ఎక్కడో ఉంటే అది ధ్యానం అనబడదు. భగవంతుని మీద ఎలాంటి విశ్వాసం ఉంచాలంటే పరిపూర్ణ విశ్వాసం ఉంచాలి. ఆయన నామాన్ని స్మరించేటప్పుడు నీ యొక్క శరీరపు రోమ రోమములో ఆయన ధ్యానంలో నిండి ఉండాలి. అప్పుడు ఆయన నీ పక్కనే ఉండి నిన్ను కాపాడుతాడని అంటున్నారు. నమ్మకం లేకుండా ఏ పని చేసినా ఆ పని సరిగా అవ్వదు. అది ఎలాగంటే సర్వవ్యాప్తుడైన భగవంతుని నామాన్ని చెప్పేప్పుడు ఆయన మీద పూర్ణ నమ్మకంతో పూర్తి

విశ్వాసంతోనే చెప్పాలి. అప్పుడే ఆయన నీ అండనే ఉంటూ కాపాడుతాడని భావము. "పిబరే రామరసం" అంటూ కన్నడ భాషలోనూ శ్రీరామ నీ నామం ఎంత రుచిరా! ఏమి రుచిరా! అని రామదాసు తెలుగులోనూ సదా రామజపురే బాయి అంటూ తులసీదాసు, ఎన్నగాను రామ భజన అంటూ త్యాగరాజు వేయినోళ్ల కొనియాడారు. భక్తి రసాన్ని కబీర్ మాత్రం ముందే చక్కగా చెప్పేశారు–

*మాలతో కర్ మేన్ ఫిరై జీబ్ ఫిరై ముఖ్ మాహి*

*మనువా తో దాస్ దిస ఫిరై ఏహ్ తో సుమరిన్ నాహీ*

36వ అధ్యాయం పీవ్ పిఛాణ న్ కౌ అంగ్ అంటే ప్రియుడైన ప్రభువును గుర్తించడము. ఈ అధ్యాయంలో మొత్తం నాలుగే దోహాలు ఉన్నాయి. కానీ నాలుగు దోహాల్లో బ్రహ్మతత్త్వమంతా నిండి ఉంది. కబీర్ సాహిత్య వాఙ్మయం మూడవ భాగపు రచయితలు డాక్టర్ జయదేవ్ సింగ్, డాక్టర్ వాసుదేవ్ సింగ్ గారు అద్భుతంగా ఈ దోహాకు వ్యాఖ్యలు రాశారు. రెండవ దోహాలో కబీరు ఇలా అంటున్నాడు–

*రహే నిరాల మాండ్ తే సకల మాండ్ తిహి మాణహి*

*కబీర్ రోవై తాస్ కౌ దూజా కోయీ నాహి*

"ప్రభువు నువ్వు బ్రహ్మాండంలో కూడా నిండి ఉన్నావు. బ్రహ్మాండం బయట కూడా ఉన్నావు అంటే విశ్వోత్తీర్ణుడై ఉన్నావు, విశ్వవ్యాప్తుడుగా కూడా ఉన్నావు. నిన్ను మాత్రమే నేను కొలుస్తాను అన్నాడు కబీరు. విశ్వం గురించి ఈశ్వరుని గురించి విశ్లేషణ చేస్తూ ఆ హిందీ ఆచార్యులు ఇలా అంటున్నారు "విశ్వానికి ఈశ్వరునికి ఉండే సంబంధములు మూడు ప్రకారాలుగా విభజించవచ్చు.

1. భగవంతుడు విశ్వంతో ముడిబడలేదు. ఈ సృష్టికి భిన్నమైనవాడు. అతను సృష్టిని రచించి వదిలిపెట్టేశాడు, కానీ అందులో లేడు. సృష్టి నిర్మాణం తర్వాత ఈ జగత్తుకు ఆయనకు ఏ సంబంధము ప్రయోజనం ఉండదు . దీనిని కేవలేశ్వర్ వాద్ (Deism) అంటారు.

2. ఇక రెండవది సృష్టిని నిర్మించి అంటే ఈ జగత్తును నిర్మించి ఈశ్వరుడు దాంట్లో లీనమైపోయాడు. ఏదైతే జగత్తో ఏదైతే సృష్టో అదే ఈశ్వరుడు. ఏదైతే ఈశ్వరుడో అదే విశ్వము. అంటే సృష్టి ఈశ్వరుడు, ఈశ్వరుడే సృష్టి. ఇదిగాక ఈశ్వరుడు ఎక్కడా లేడు. అందుకే ఈశ్వరుడు విశ్వమంతా లీనమై ఉన్నాడు అని అంటారు. దీన్ని విశ్వేశ్వరైక్యవాదము (Pantheism-All is God) అంటారు.

3. ఇక మూడో విషయానికి వస్తే ఈశ్వరుడు విశ్వమయుడు, విశ్వోత్తీర్ణుడై కూడా అనేది రెండు భావాలతో కూడుకున్నది. విశ్వంలో అతను వ్యాప్తి చెందినవాడు అతనిలో విశ్వము వ్యాప్తి చెందింది. అంటే అతను అంతర్వర్తిగా ఉన్నాడు అతివర్తిగా కూడా ఉన్నాడు. విశ్వమంతటా వ్యాప్తి చెంది ఉన్నాడు. విశ్వముకాక కూడా సర్వత్ర ఉన్నాడు. ఇక విశ్వేశ్వరైక్యవాదంలో ఒక దోషం ఉంది. అంటే ఈశ్వరుడు విశ్వంలో నిశ్శేశీకరణమైపోయాడు. అతను విశ్వంతో వేరు కాదు. అతను సృష్టిని రచించి దానిలో లీనమైపోయాడు. కబీర్ కావ్యంలో ఈ దోషం కనబడదు. కబీర్ ప్రకారము అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన ప్రభువు విశ్వమంతా నిండి ఉన్నాడు. సకల బ్రహ్మాండమంతా అతనిలో దాగి ఉన్నది, ఈ సృష్టిగాక అఖిల లోకాలకు దేవ కిన్నర, నాగ, కింపురుష, పాతాళ, గంధర్వ, మర్త్య అన్నీ లోకాలకూ ఆయనే ప్రభువు. దీన్ని తాత్విక శాస్త్రంలో ఈశ్వరుడు అంటే ప్రభువు. ఆయన యొక్క సృష్టి విశ్వం విశ్వసృష్టి అయిన తర్వాత ఆయనకి ఏ పనీ లేదు అని అర్థం కాదు. విశ్వంలోనూ నిండి ఉన్నాడు. విశ్వం కాని వస్తువుల్లో కూడా నిండి ఉన్నాడు అంటే ఈ సకల బ్రహ్మాండమంతా నిండి ఉన్నాడన్న భావము. దీన్నే ఉపనిషదంలో భూమా స్థితిలోని బ్రహ్మం అన్నారు. చాందోపనిషత్తులో మూడవ శ్లోకం 12వ అధ్యాయంలో పాదోస్య సర్వా భూతాని త్రిపాదస్యా మృతం దివి అన్న శ్లోకములో సంపూర్ణ విశ్వమనేది మొత్తం ఉన్న లోకాలలో నాలుగవ భాగం. అది చిన్న అల్పాంశం. ఈ సృష్టిలోని బహులాంశంలో మిగతా మూడు భాగాలు అమరలోకాలు లేదా దివ్య లోకాలు, ఇవి అన్నిటికీ అధిపతి భగవంతుడు. అదేలాగా శ్వేత ఉపనిషద్‌లో కూడా ఈశ్వరుడు విశ్వం యొక్క నాలుగు మూలాల పరిభ్రమించి ఆక్రమించిన తర్వాత కూడా పది అంగుళాలు దానికంటే ఎక్కువగా ప్రకాశిస్తున్నాడు అనబడింది. ఈ తత్త్వం అంతా కబీర్ యొక రెండు వాక్యాలైన దోహాలలో కనబడుతుంది. ఇక ఈ అధ్యాయం అంతిమ దోహాలో కబీర్ నిర్గుణ పరబ్రహ్మ స్వరూపాన్ని వర్ణించారు– "నా ప్రభువుకు ముఖము లేదు, శిరము లేదు, రూపాలు లేవు, పుష్పవాసానికంటే అధికమైన సూక్ష్మమైనవాడు. ఆయన

అనుభవం తత్త్వంతో కూడినవాడు అంటే అతనికి ఉపమాన ఉపమేయాలేవీలేవు. అతనికి సాటి అతనే. ఇంతటితో ఈ అధ్యాయము సమాప్తమవుతుంది. ఇక్కడే కబీరు ఒక తాత్వికుడుగా దర్శనమిస్తాడు, ఈశ్వరుని మనం చూడలేం. కానీ అతని మహిమలను శక్తులను అనుభవిస్తాం, ఆ అనుభవం శబ్దాలకు వర్ణనలకు అందని అనుభూతి. ఇక 37వ అధ్యాయము బిర్కతాయి కౌ అంగ్. అంటే విరక్తిని గురించి చెప్పే అధ్యాయం. ఇందులో కూడా 10 దోహాలు ఉన్నాయి. ఇక ఈ 37వ అధ్యాయంలో కబీర్ వైరాగ్య భావాన్ని గురించి వివరిస్తున్నారు. విరక్తి కోసం రాయబడిన అధ్యాయము. ఇక్కడ మొదటి దోహాలో కబీరు ఇలా అంటున్నారు – "విరిగిన శిలల్లో లేదా చీలిక వచ్చిన శిలలను తిరిగి అతికించలేము. అదేలా నా మనసులో ఈ జగత్తు పట్ల వైరాగ్యం ఉద్భవించింది. భగవంతుని మీద అనురక్తి కలిగింది అందుకనే నేను ఇక ఈ జగత్తు వైపు మనసారా చూడనే చూడను. అదేలా రెండవ దోహాలో "రెండు మూడు రోజుల తర్వాత ఉంచిన విరిగిన పాలులాగా ఒకసారి ఈ జగత్తులో ఉంటూ వైరాగ్యం ఉద్భవిస్తే తిరిగి ఈ మనస్సు ఈ ప్రపంచానికి అతుక్కోదు. అంటే తిరిగి ఈ జగత్తు మీద ఆసక్తి పెరగదు.

***ఇనుము విరిగినేని ఇనుమారు ముమ్మారు***
***కాచి అతుకు వచ్చు కమ్మరిడు***
***మనసు విరిగినయిని మరి అంటే నేర్చునా?***
***విశ్వదాభిరామ వినురవేమ***

తన విరిగిన మనస్సును కబీరు పదే పదే చెబుతున్నారు. దీనిలో కబీర్ తన వైవాహిక జీవితాన్ని సూచిస్తున్నారని కూడా కొంతమంది పండితులు అభిప్రాయపడుతున్నారు. ఆయన భార్య యొక్క కఠోరమైన మాటలు కూడా ఆయనను వైరాగ్యం వైపు మళ్లించాయి అని కూడా అనబడింది. ఇందులో మొత్తం తొమ్మిది దోహాలు ఉన్నాయి. ఈ అధ్యాయం అంతా గురువుల మహిమలను ఈ సంసారంలోని ఉంటూ తను పెంచుకున్న వైరాగ్యం గురించి చర్చిస్తున్నారు. అదేలాగా అంతిమ దోహాయైన తొమ్మిదవ దోహాలో కబీరు నిష్కామ భక్తిని ప్రతిపాదిస్తున్నారు. లాభం కోసము, ఆశ కోసం జీవించేవాళ్ళు ఆ కోరిక తీవ్రత కారణంగా మండి భస్మం అవుతారు. నిష్కామ వ్యక్తి అంటే కోరికలు లేనివాడు సంతోషంగా దిగులు లేకుండా జీవిస్తాడు. అలాంటి వ్యక్తికి ఇంద్ర లోక సుఖాలు కూడా దరిద్రంతో సమానము.

ఇక 38వ అధ్యాయము సమృథాయీ కౌ అంగ్. సమృథాయి అంటే సామర్ధ్యము.

రెండవ దోహాలో భగవంతుడి అనుగ్రహం గురించి కబీరు చక్కగా వర్ణిస్తున్నారు. భగవంతుని అనుగ్రహం లేకుండా తన పరిశ్రమతో తన సాధనలతో ఏమీ ఎవరూ చేయలేరు. దానికంటూ శ్రమ కూడా ఎక్కువ అక్కర్లేదు. కష్టపడుతూ ఉన్నా సుఖంలో తేలుతున్నా భగవంతుని స్మరించాలి. అంటే భగవద్ అనుగ్రహం లేకుంటే ఏదీ జరగదని కచ్చితంగా చెబుతున్నారు. నీవు ఎంత కష్టపడి చమటోడ్చి పనిచేసి వచ్చినా కూడా భగవత్ అనుగ్రహం లేకుంటే నీవు ముందుకు పోలేవు అన్నదే కబీర్ భావన. జీవుడికి తన సంస్కారాలతో కఠోర శ్రమతో యోగ్యతతో కీర్తి రాదు. ఇన్నింటి కంటే భక్తి ముఖ్యం. భగవంతునిపై పూర్ణ నమ్మకం ఉంటేనే మంచి ఫలితాలు లభిస్తాయి. అతను కష్టపడి తపస్సు చేస్తాడు. గురువు యొక్క ఉపదేశము మంచి స్నేహం వల్ల ఉత్కంఠ పెంచుకొని తన సాధనతో తపిస్తాడు. పరిపూర్ణ భగవద్ అనుగ్రహంవల్ల అతను ధన్యుడవుతాడు. ఇక్కడ కబీర్ భగవద్ అనుగ్రహాన్ని శ్రమించే జీవుల శ్రమకన్నా ఎక్కువగా అంటున్నాడు. ఇదే భావాన్ని తిరువళ్ళువర్ కూడా మొదటి పది దోహాల్లో చెప్పారు. అంటే ఆయన అనుగ్రహం ఆయనపై భక్తి ఉంటేనే మనం ముందుకు పోగలం. భగవంతునికై తలదించి వినయంతో మొక్కని శిరం అనేది వ్యర్థ మొండెంతో గూడిన ఒక భాగం మాత్రమే అన్నారు . ఆదిశంకరాచార్యులు కూడా సత్సంగత్వే నిత్ సంగత్వం అనే శ్లోకంలో చక్కగా వివరించారు. భగవంతుని అనుగ్రహం ఉంటేనే మంచివాళ్లను కలుస్తాము. మంచి గురువుల ఉపదేశాలను పొందుతాము. దివ్య శక్తులు లభిస్తాయి. వీటంతటికి మూల కారణం భగవద్భక్తి మాత్రమే అని చెప్పారు. ఈ అధ్యాయములో కబీర్ భగవంతుని మీద ఉన్న తన విశ్వాసాన్ని చక్కగా వ్యక్తం చేస్తున్నారు. ఎవరైతే వర్ణనాతీతుడో ఎవరైతే విశ్వమంతటా విశ్వముకాక బ్రహ్మాండమంతా నిండి ఉన్నాడో అతనిని నేను ఎలా వర్ణించను? నా వర్ణనలకు ఆయన అతీతుడు విశ్వంలోని పండితులంతా అతని

వర్ణించాలని ప్రయత్నించి విఫలులయ్యారు. నేను ఎంత మాత్రమని? అతని రూపాలను, గుణాలను, శక్తులను వర్ణించలేను. ఇక్కడ కబీర్ భగవద్ అనుగ్రహాన్ని శ్రమించే జీవుల శ్రమకన్నా ఎక్కువగా అంటున్నాడు. భగవంతుని అనుగ్రహం ఉంటేనే మంచివాళ్లను కలుస్తాము. మంచి గురువుల ఉపదేశాలను పొందుతాము. దివ్య శక్తులు లభిస్తాయి. వీటంతటికి మూల కారణం భగవద్భక్తి మాత్రమే అని చెప్పారు. ఈ అధ్యాయములో కబీర్ భగవంతుని మీద ఉన్న తన విశ్వాసాన్ని చక్కగా వ్యక్తం చేస్తున్నారు. ఎవరైతే వర్ణనాతీతుడు ఎవరైతే విశ్వమంతుడా విశ్వముకాక బ్రహ్మాండ మంత్రాన్ని నిండి ఉన్నాడో అతనిని నేను. ఎలా కొలువగలను? అతనూ సకల బ్రహ్మాండానికీ అధిపతి. నేను అందులో చిన్న రేణువును. ఇక 8వ దోహాలో కబీర్ భగవంతుని అద్భుతంగా ఒక వ్యాపారితో పోలుస్తున్నాడు. “నా ప్రభువు ఎంత గొప్ప అద్భుతమైన వ్యాపారి అంటే ఆయనే ఒక అద్భుతం. ఆయన వ్యాపారం అంతకంటే అద్భుతం అతని దగ్గర తూచేదానికి తక్కెడ లేదు కడ్డీ లేదు. తూచే రాళ్లు కూడా లేవు. కానీ ఇంత పెద్ద జగత్తును సకల బ్రహ్మాండాన్ని తూచి కచ్చితంగా ఎవరికి చెందాల్సినవాటిని వారికి ఇస్తున్నాడు. ఈ జగత్తులో ఏ వ్యక్తి ఏ కర్మ చేస్తే దాని ఫలితాన్ని వారి వారికి కచ్చితంగా ఇస్తున్న మహాప్రభు ఎంత పెద్ద వ్యాపారి అంటున్నాడు. కబీరు ఎంతోమంది వ్యక్తులతో కూడుకున్న ఈ సకల బ్రహ్మాండాన్ని ఒక తక్కెడ కూడా లేకుండా ఒక తూనిక రాళ్లు కూడా లేకుండా న్యాయ సమ్మతంగా ఎవరికి చేరాల్సిన వస్తువులు వారికి ఇస్తున్నాడు. ఇంత అద్భుతమైన వ్యాపారిని ఎవరూ చూసి ఉండరు అని సంతోషిస్తున్నాడు కబీరు. ఇదేలా లాల్ దాస్ అనే హిందీ కవి కూడా భగవంతుని వ్యాపారితో సమానపరిచే కవితలు హిందీలో రాసి ఉన్నారు. ఇక పదవ దోహాలో కబీర్ దాసు భగవంతుడి సహాయం లేకుండా ఎలాంటి యుక్తులు ఉపాయాలు పనిచేయవు. ఎలాంటి సామర్థ్యాలు పనిచేయవు. ఎటువంటి సాధనలైనా, తపస్సు అయినా కూడా దేవుని అనుగ్రహం లేకుంటే సఫలీకృతం అవ్వదు అంటున్నారు కబీరు. ఒక పెద్ద వృక్షం ఎక్కాలంటే ఒక మంచి కొమ్మను ఆధారంగా చేసుకుని ఎక్కాలి ఏదో ఒక రెమ్మని పట్టుకుంటూ ఎక్కితే కింద పడే అపాయం ఉన్నది. అలాగే సాధన చేయాలంటే ఏదైనా సాధించాలంటే ఎటువంటి కార్యం చేయాలన్నా కూడా భగవంతుని అనుగ్రహం కచ్చితంగా ఉండి తీరవలసింది అని తన అనన్య భక్తిని కబీర్ దాసు చాటుతున్నారు.

11 దోహాలో 12వ దోహాలో కూడా కబీర్ గారు లోకోక్తి అలంకార ఉదాహరణతో పుష్కలమైన భక్తిని వివరిస్తున్నారు. జీవితంలో భగవంతుని దయవల్లే మేలు జరుగుతుంది కానీ ఏ మనుష్య ప్రయత్నంతో కాదు. ఆయన దయవల్ల ఆవాలును అంటే సూక్ష్మతత్వాన్ని కూడా కొండంత చేయగలడు. అంటే కొండను చిన్నదిగా చేయగలడు. చిన్న వస్తువును ఎంతో పెద్దదిగా చేయగలడు. అంటే దేవుడు అనుకుంటే ఏమన్నా చేయగలడు.

ఆయన దయ ఉంటే ఏమన్నా జారుతుంది. అధ్భుతయాలు జరుగుతాయి. ఎటువంటి శత్రువులున్నా గెలువగలం. అసంభవం కూడా సంభవమవుతుంది.

సశేషం

ప్రొ. లక్ష్మీ అయ్యర్, రాజస్థాన్. ఫోన్: 968 027 6038.

---

**అక్షరాభ్యాసం:** గన్నవరపు నరసింహమూర్తి. 23 కథలున్న ఈ పుస్తకాన్ని పాలపిట్ట బుక్స్‌వారు ప్రచురించారు. ఉత్తరాంధ్ర రచయిత కథలివి. సహజంగానే అక్కడి పరిసరాల – ప్రజల జీవన సరళి ప్రతిబింబిస్తుంటాయి ఈ కథలు. ఆదివాసీలు బ్రతుకు గురించి మనకు తెలియని ఎన్నో ఆర్ద్రమైన విషయాలు తెలుస్తాయి వీరి కథల ద్వారా – ఇంత సంక్లిష్టమైన సమాజ – ప్రపంచ జీవనంలో మంచి చెడులను సమన్వయపరచుకోవడం ఎలాగో తెలియజేస్తాయి వీరి కథలు.




*పేజీలు: 176, వెల: ₹ 150/- ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీం నగర్, మలక్‌పేట, హైదరాబాద్ – 36. ఫోన్: 984 878 7284.*

# మూఢనమ్మకాలను వీడండి

(వేదకాల సమాజం నియమ నిబంధనలు)

– మామిడిపూడి కృష్ణమూర్తి

అది 1952వ సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షలు జరిగాయి. నేను, నా స్నేహితులు నెల్లూరులోని వి.ఆర్. హైస్కూల్ విద్యార్థులం. మొదటి తరగతి నుండి ఎస్.ఎస్.ఎల్.సి. వరకు అదే పాఠశాలలో చదివాము. మా స్నేహితులం నేను, రామమూర్తి, విశ్వనాథం, సుబ్బారాయుడు, సుబ్రహ్మణ్యం, పద్మనాభం, వెంకయ్య, చంద్రశేఖరరావు అంతా పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచి ఉన్నాం. మేమంతా ఏదో ఒక సబ్జెక్టులో కొంత ప్రావీణ్యం కనబరిచినా అంతా సగటు విద్యార్థులమే. ప్రతి దినం వేమంతా కో–ఆపరేటివ్ బ్యాంకు వెనుక సుబ్రహ్మణ్య స్వామి గుడి పక్కన వేసి ఉండే ఇసుక దిబ్బల మీద కూర్చుని బాతాఖానీ చేస్తూ ఉండేవాళ్ళం. మేమంతా యావరేజ్ విద్యార్థులం కావడం మూలాన మాకు భగవదనుగ్రహం అవసరం. కూడబలుక్కొని తిరుపతి వేంకటేశ్వరుని దర్శనం చేసుకుంటామని మ్రొక్కుకున్నాం. ఇళ్లల్లో పెద్దల అనుమతి తీసుకున్నాం. మా ఆదుర్దా, ఆతృత అర్థం చేసుకొనో, అడ్డు చెప్తే శ్రీనివాసునికి కోపం కలిగించినవారమవుతామని భయం చేతనో మొత్తానికి మా పెద్దలు అనుమతించారు. బస్సులో తిరుపతికి వెళ్ళి, అలిపిరి నుండి ఏడుకొండలు మెట్లెక్కి, నీలాలు సమర్పించుకుని, ఏడుకొండలవాడిని దర్శించుకు రావడం మేము వేసుకున్న ప్రణాళిక. మూడు రోజుల్లో ప్రయాణం అని అనుకుంటూండగా ఒక సాయంత్రం సుబ్బారాయుడు బేల ముఖంతో తయారయ్యాడు. ఏమిట్రా, ఏమైంది అని ప్రశ్నించాము. వాడి నాన్నగారి దూరపు బంధువు – వాడి నాన్న కూడా ఎన్నడూ చూడలేదట – ఆయన పోయారు. మాకు మైల వచ్చిందట – కొండ ఎక్కకూడదట – దేవుడి దర్శనం సంవత్సరం పాటు చేసుకోకూడదట – అన్నాడు. ఎన్నడూ చూడని దూరపు బంధువు పోయినందుకు, వాడికిగాని, వాడి నాన్నకుగాని విచారం ఉందో లేదో మాకు తెలియలేదుగాని సుబ్బారాయుడు మాతో రాలేనందుకు మాకు చాలా విచారం కలిగింది. వాడు మినహా మేమందరం తిరుపతి బస్సులో వెళ్లి, అలిపిరి నుండి మెట్లెక్కి, వెయ్యి కాళ్ల మండపం గుండా స్వామి సన్నిధి చేరి, నీలాలు సమర్పించి, స్నానాలు చేసుకున్నాం. ఆ తర్వాత స్వామివారి ప్రసాదం – పొంగలి, దద్దోజనం, వడలు సుష్టుగా తిని, లడ్డూలు కొనుక్కుని, తిరుగు ప్రయాణం సాగించాం. జనం ఇప్పటి మాదిరిగా ఉండకపోయినా, జన సమ్మర్దం బాగానే ఉంది. అంతా ఒక గంటలో ముగించుకుని, మెట్లమీదుగా కొండదిగి సాయంత్రం నాలుగు గంటల బస్సులో నెల్లూరుకు చేరాం. రాత్రి దాదాపు పది గంటలైంది. ఆ రోజుల్లో ఆ 90 మైళ్లు ప్రయాణానికి అంత సమయం పట్టేది.

ఆ తర్వాత కొన్ని రోజులకు మా పరీక్షా ఫలితాలు రావడం, సుబ్బారాయుడుతో సహా అందరం పాస్ కావడం జరిగింది. ఆ తర్వాత కాలేజ్ చదువులు. ఎవరికి వారు ఎంచుకున్న పై చదువులు చదవడం, నేను అనూహ్యంగా ఎవరూ చదవని చిత్రలేఖనం కోర్సు అధ్యయనానికి సంకల్పించడం, మదరాసు స్కూల్ ఆఫ్ అవార్డ్సులో చేరడం జరిగింది. ఈ ఉపోద్ఘాతానికి ఒక కారణం ఉంది. నేను రాయబోయే విషయాలకు ఇది ఒక నాంది మాత్రమే.

నాకు చిన్నప్పటి నుండి పుస్తకాల చదవడం – ముఖ్యంగా కథలు, కథానికలు చదవడంలో చాలా ఆసక్తిగా ఉండేది. మా ఊర్లోని టౌన్‌హాల్‌లో వర్ధమాన సమాజం వారు నిర్వహించే ఒక గ్రంథాలయం ఉన్నది. అందులోని చాలా పుస్తకాలు, చిన్నప్పటి నుండే చదవడం ప్రారంభించాను. మధిర సుబ్బన్నగారి కాశీమజిలీ కథలు (12 భాగాలు) పానుగంటి వారి సాక్షి వ్యాసాలు, కొవ్వలి

నవలలు, కాశీరామేశ్వర మజిలీ కథలు, డిటెక్టివ్ నవలలు, తెలుగు, ఇంగ్లీషు నవలలు నేను, మా ఇంటిల్లిపాదీ చదివేవారం. ఈ వ్యాసంగం మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదివే రోజుల్లో కూడా కొనసాగించాను.

మద్రాస్‌లో చదివే రోజుల్లో మాకు ఫీల్డ్ ట్రిప్స్ ఉండేవి. ఏదో ఒక ప్రాంతానికి వెళ్లి, అక్కడ కూర్చొని, ప్రకృతి చిత్రాలు చిత్రీకరించడం జరిగేది. ఇందులో భాగంగా ఒకసారి అడయారులోని ఒక పురాతనమైన వందల ఊడలతో ఉండే మర్రిచెట్టు, దాని పరిసర ప్రాంతాలను చిత్రీకరించడానికి అక్కడికి వెళ్లాం. అది అనీబిసెంట్ సంస్థాపించిన థియోసాఫికల్ సొసైటీ ఆవరణలో ఉన్నది. ఆ సొసైటీకి సంబంధించిన ఒక గ్రంథాలయం కూడా అదే ఆవరణలో ఉంది. మా తాతగారు, మాతామహులు అల్లాడి మహాదేవ శాస్త్రి గారు ఈ గ్రంథాలయానికి వారి జీవిత కాలంలో కొంత కాలం క్యూరేటర్‌గా పనిచేశారు. గ్రంథాలయ నిర్వహణాధికారికి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. మహాదేవ శాస్త్రిగారితో నాకున్న బంధుత్వం తెలుసుకుని, నాకు వెంటనే మెంబర్‌షిప్ ఇచ్చి నన్ను ఆదరించారు. అప్పుడప్పుడు ఆ గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు తెచ్చుకుని చదివేవాడిని. దీనిలో భాగంగా మా తాతగారు రచించిన The Vedic Law of Marriage అన్న గ్రంథం చదివాను. ఈ పుస్తకం నన్ను బాగా ఆకర్షించింది.

అల్లాడి మహాదేవ శాస్త్రి గారు గొప్ప పండితులు. సంస్కృతం, ఆంగ్లం, తెలుగు, తమిళ భాషలలో నిష్ణాతుడు. వేద వేదాంగాలు, ఉపనిషత్తులు, పౌరాణిక సాహిత్యం విస్తృతంగా అధ్యయనం చేసినవారు. ఆదిశంకరుని భాష్యంతో కూడిన శ్రీమద్ భగవద్గీతను ఆంగ్లంలో రచించిన మేధావి. ఈ కృతి స్వామి వివేకానందుని ప్రశంసలను బడసినది. ఇదిగాక వీరు చాలా గ్రంథాలు రచించారు. అందులో ఒకటి The Vedic Law of Marriage. వేదకాలంనాటి సాంఘిక జీవన విధానం, వివాహ క్రతువులు, ఉచ్చరించే మంత్రాలు, వాటి అర్థాలు, ప్రస్తుతం వివాహ క్రతువులలో చేయవలసిన సంస్కరణలు, మొదలైనవాటి గురించి సుదీర్ఘంగా చర్చించారు. కానీ ఈ విషయాలు ప్రస్తుతం నా పరిధిలో లేవు. ఈ గ్రంథంలో వారు వ్రాసిన పీఠికలోని విషయాలు నన్ను బాగా ఆకర్షించాయి. వేదకాలంనాటి సాంఘిక జీవనం, స్త్రీపురుషుల గురుకుల విద్యాభ్యాసం, గురుకులాలలో వారు నేర్చుకునే విద్యావిధానం, స్త్రీ పురుషులలో అంతరాలు, హెచ్చుతగ్గులు లేక విద్యారాధన చేసే క్రమం యుక్తవయసులో వారి సొంత నిర్ణయాల ప్రకారంగా పరస్పర అంగీకారంతో జరిగే వివాహ క్రతువు. గురుకులంలో అన్ని విద్యలతో పాటు తమను తాము రక్షించుకునే విధంగా నేర్వవలసిన వ్యాయామ క్రీడలు (మార్షల్ ఆర్ట్స్) వీటి గురించి విశదంగా వారు పీఠికలో రాశారు.

ఈ గ్రంథం, ఇంకా మన పురాతన జీవన విధానం గురించిన ఇతర సాహిత్యం చదివిన తర్వాత నాకు కొన్ని అభిప్రాయాలు కలిగినవి.

అది వేదకాలం. నదీ పరివాహక ప్రదేశాలలో వెలసిన జనపదాలు. తమ ఊహకు అందని ఏదో ఒక మహా శక్తి ఉందని, అదే ఈ లోకాన్ని, ఇతర లోకాలను నడిపిస్తున్నదని, తాము సుఖసంతోషాలతో మనుగడ కొనసాగాలంటే దీనిని ప్రసన్నం చేసుకొనవలసి ఉన్నదని నమ్మిన కాలం. ప్రకృతి ప్రసాదించిన ఏదో ఒక వస్తువులో రాతిలోనో, చెట్టు చేమలలోనూ వారు నమ్మిన అతీత శక్తి నిక్షిప్తమై ఉందని, అటువంటి ప్రతిమకు ఒక ఆలయం నిర్మించి, అనునిత్యం దానిని ఆరాధించేవారు. ఈ ఆలయ ప్రాంగణంలోనే ఒక వటవృక్షమో లేక మరేదైనా ఒక వృక్షాని చుట్టూ అరుగు వేసుకొని ఆ వృక్ష ఛాయలో అనుదినము సమావేశమై చర్చించుకుని తాము తమకు అవసరమైన అందరి ఆమోదంతో చేపట్టవలసిన సమిష్టి కార్యక్రమాలను స్త్రీ పురుష భేదం లేకుండా చేపట్టేవారు. ఈ సమావేశాలలో అందరూ పాల్గొనవలసినదే. కార్యక్రమాలలో అందరూ చేయూతనివ్వవలసినదే. ఈ సమావేశాలలో ప్రతి దినం నిర్ణయించిన సమయంలో పాల్గొనవలసినదే. ఇది విస్మరించరాని కట్టడి. ఆ గ్రామవాసులలో ఏదైనా స్పర్ధలు, వివాదాలు తలెత్తినప్పుడు ఈ సమావేశాలలో క్షుణ్ణంగా చర్చించి పరిష్కరించుకునేవారు. ఇది వారు నమ్మిన దేవత సమక్షంలో జరిగిన నిర్ణయం కనుక దీనిని ఎవరూ అతిక్రమించేవారు కాదు.

గ్రామంలో దినమంతా సముదాయ సేవలో పాల్గొనవలసి వస్తే సొంత పనులకు సమయం ఉండదు

కదా! అందువలన సొంత పనులు చేసుకునేందుకు వీలుగా దినానికి రెండు మూడు గంటలు కేటాయించుకునేవారు. అనవసరంగా ఇతరులు వచ్చి అంతరాయాలు కలగకుండా కట్టడి జరిగేది. ఒకరినొకరు ఈ సమయంలో కలుసుకునే ప్రయత్నం చేయరు.

ఇంట్లో ఏదైనా అశుభం జరిగి ఇంటిల్లిపాది శోకసముద్రంలో ఉన్నప్పుడు వారి ఉపశమనార్థం వీరు గుడికి వెళ్ళవలసి నియమానికి సడలింపు ఉండేది. ఈ సంతాప దినాలు సాధారణంగా పది దినాలవరకు ఉండేవి. ఈ కాలంలో గ్రామస్తులు తమవంతు సానుభూతిని తెలియజేసేవారు. తమ సంతాపాన్ని ఈ పది దినాలు తెలిపే ప్రయత్నం చేయవచ్చు. దాని తర్వాత కుటుంబ సభ్యులు తమలో తాము చర్చించుకుని మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్ణయం తీసుకునేందుకు వీలుగా ఈ సానుభూతి ప్రక్రియకు నిరోధాన్ని విధించారు. ఈ సంతాప దినాలు ముగియగానే ఆ కుటుంబంలోని వారంతా యధావిధిగా గుడికి వచ్చి, దైవారాధన చేసి, సామూహిక కార్యక్రమాలలో పాల్గొనవలసిన ఉంది.

ఇక ఆ నాటి విద్యా విధానం. స్త్రీ పురుష భేదం లేకుండా ప్రతి వ్యక్తి బాల్యదశలోనే అంటే 7 సంవత్సరాలలోపే విద్యార్జనకు గురుకులాలకు వెళ్లేవారు. ఈ గురుకులాలు జనపదాలకు దూరంగా వనాలలో ఆశ్రమాల రూపంలో గురువు, గురుపత్ని వీరి ఆధ్వర్యంలో వారి శిక్షణలో జరిగేది. ఆడ మగ భేదం లేకుండా విద్యార్జనకు వచ్చినవారందరికీ గురువు ఉపనయనాది క్రతువులను నిర్వహించి, వారికి ఉపనయనధారణ గావించి, బ్రహ్మోపదేశంతో విద్యను ఆరంభించేవారు. ప్రతి రోజూ త్రికాలం సంధ్యావందనం చేసి గురుశిష్యులు ఇద్దరూ బోధనా కార్యక్రమానికి ఉపక్రమించేవారు. స్త్రీ పురుషులిద్దరూ ఉపనయనధారణకు అర్హులే. సూర్యదేవుని అంశమైన సవితా దేవునికి నివేదించి కార్యక్రమం మొదలుపెట్టేవారు. అప్పటికి కులాలుగా విభజన కాని కారణంగా విద్యార్జనకై వచ్చినవారందరూ అర్హులే. గురుశిష్యులు ఇద్దరూ కలిసి సవితా దేవునికి నివేదించి విద్యార్జనకు ఉపక్రమించేవారు. అప్పుడు ఉచ్చరించే ఈ మంత్రానికి మరేవిధమైన మహత్యం లేదు. దీనిని ఉచ్చరించే కొలదీ మహత్తు ద్విగుణీకృతం అవుతుంది అనడానికి అర్థమే లేదు. ఇది కాలం చెల్లిన ప్రక్రియ. ఇది ఉచ్చరించకుండానే ప్రస్తుతం విద్యాబోధన జరుగుతున్నది. ఈ గురుకులాల్లో గురువుల సంరక్షణలో కఠిన నియమ నిబంధనలకు లోబడి అన్ని విద్యలు అభ్యసించేవారు. విపత్కర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేందుకు వీలుగా బాలబాలికలు ఇరువురు వ్యాయామ క్రీడల్లో కూడా శిక్షణ పొందేవారు. బాల్యదశలో చేరినవారు ఈ శిక్షణ కార్యక్రమం ముగిసేందుకు కొన్ని సంవత్సరాలు పట్టేది. విద్యాభ్యాసం ముగిసిందని గురువులు నిర్ణయించిన దినం విద్యార్థులు తమ గురుదక్షిణను సమర్పించేవారు. ఈసరికి వారు యుక్తవయస్కులై ఇవి తమ భవితవ్యాన్ని తామే నిర్ణయించుకుంటారు. ఇందులో పెద్దల జోక్యం ఉండేది కాదు. ఆధ్యాత్మిక చింతన కలిగినవారు ఆ ఆశ్రమాన్ని ఎంచుకునేవారు. వైవాహిక జీవనానికి మొగ్గుచూపే యువతీ యువకులు అందుకుగాను నిర్దేశించుకున్న ప్రమాణాలకు పరస్పరం అంగీకారాన్ని తెలుపుకుని ప్రాణస్నేహితులులాగా ఆ ఆశ్రమ ధర్మానికి పూనుకునేవారు. ఇందులో పెద్దల ప్రమేయం ఉండేది కాదు. పురోహితులు కూడా అవసరం లేదు. ఏ విధమైన హంగూ ఆర్భాటాలూ లేకుండా ఆ క్రతువు జరిగేది. ఇద్దరూ కలసి అగ్నిని ప్రజ్వలింపజేసి దానిని చుట్టూ ఏడు అడుగులు ప్రదక్షిణ చేసి, పేలాలను అగ్నికి సమర్పించడంతో వారు భార్యాభర్తలవుతారు. తాళి లేదు కట్టేదే లేదు. ఈ క్రతువు ముగిసి మూడు నిద్రలు చేసి నాలుగవనాటినుండి వైవాహిక జీవితం మొదలు పెట్టేవారు. జీవితాంతం ప్రతి విషయంలోనూ స్నేహితులవలే పరస్పరం సంప్రదించుకుని తమ జీవితాలను సుఖమయం చేసుకునేవారు. వారికి కలిగిన సంతానం, బాలుడైనా బాలికైనా తమకులాగే గురుకులాలకు పంపుతారు.

ఇంతటి ఉదాత్తమైన ఆశయాలతో, ఆనందంతో విరాజిల్లిన అప్పటి వేదకాలం క్రమేణా విలువలను కోల్పోయి వృత్తులు కులాలై, చేసే వృత్తినిబట్టి వారి మధ్య అంతరాలు పెరిగి, కులవృత్తులు అభ్యాసనలో కఠినమైన గురుకుల విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పి, గురుకుల విద్యాభ్యాసాలు కొన్ని కులాలకే పరిమితమై సమాజం చిన్నాభిన్నమైనది. ఈ అంతరాలలో యుగాలు గడిచేకొద్దీ స్త్రీల స్థాయి అంచెలంచెలుగా అథమ స్థాయికి పతనమై,

బాల్యవివాహాలు, భ్రూణహత్యలుకు దిగజారింది. రామాయణ కాలం నాటికే స్త్రీల స్థాయి ఏ విధంగా పతనమైనదో స్త్రీలు తమను తాము కాపాడుకోలేని దీనస్థితిని గమనించినప్పుడు వేదకాలంనాటి సమాజం ఎంతటి ఉదాత్తమైన స్థితిలో ఉండేదో మనం ఊహించవచ్చు.

ఇకపోతే – ప్రతిదినం ఆలయానికి వచ్చి దైవదర్శనం చేసుకొని, ప్రజాహిత కార్యక్రమాలలో పాల్గొనవలసినన కట్టడికి ఇంట్లో విషాదం జరిగిన సమయాలలో సడలింపు ఇవ్వటం గురించి వివరించడం జరిగింది. ఇది కాలంచెల్లిన సంప్రదాయం. ఈ సడలింపు కాలక్రమేణా ప్రవక్తలు, ప్రవచనకారుల ప్రమేయంతో నిషిద్ధంగా మారినది. ఈ నియమాలు నిషిద్ధాలుగా మారి కాలక్రమేణా మూఢనమ్మకాలైనవి. విషాద సమయాలలో భగవత్ దర్శనానికి భగవంతుడే ఒప్పుకోడా? అన్నిటికీ అతీతుడైనవాడు భగవంతుడు అని ఒకవక్క శ్రీమద్భగవత్గీతను వల్లెవేసే ప్రవచనకారులే దేవునికి, వెళ్లే మార్గానికి మైలను అంటగట్టడం ఎంతవరకు సమంజసం? ఇలాగే తమ సొంత పనులు, ఇతరుల జోక్యం లేకుండా చేసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసుకున్న రాహు కాలానికి (ఏ ప్రవచనకారుడు నామకరణం చేశాడో తెలియదు) కాలం చెల్లినా ఇంకా ఈ సమయాలలో ఏ పనీ చేయకూడదా! ప్రయాణానికి రాహుకాలం అడ్డు వస్తుందేమో అని పెట్టా బేడా ముందరే పరస్థానంలో ఉంచితే ఎటువంటి అనర్థాలు జరగవా!

తిరిగి వేదకాలంనాటి విలువలను పునరుజ్జీవింప చేయడానికి ఏకైక సత్వర చర్య స్త్రీలు విద్యాధికులు కావడం. ప్రతి స్త్రీ ఉన్నత చదువులు చదవడం, దానితోపాటు వ్యాయామ క్రీడలలో కూడా సుశిక్షితులు కావలసి ఉంది. అణగారిన వర్గాలు, వారి సంతానం, ముఖ్యంగా బాలికలు విద్యను అభ్యసించ కలిగిన ప్రణాళికలను స్త్రీ సమాజాలే నెరవేర్చవలసిన ఉంది. పురుషులకు ఆ పని చేసే తీరిక లేదు కనుక. ఇక ఇటువంటి బృహత్కరమైన పనులకు స్త్రీలు సమాయత్తం అయ్యే ముందు వారు చేపట్టవలసిన కొన్ని సత్వర చర్యలు ఇక్కడ సూచిస్తున్నాను:

1. సాష్టాంగ నమస్కారాలకు అర్హులు ఈ కింద పేర్కొన్నవారు మాత్రమే. తల్లిదండ్రులు, గురువు, దైవంగా భావించే ప్రతిమలు. తల్లిదండ్రులతో సమానమైన అత్తమామలు. జీవించి ఉంటే తాతలు, అవ్వలు. వీరికి మినహా ప్రాణంతో ఉన్న ఏ ఇతరులు – పీఠాధిపతులు, ప్రవచన కారులు, ప్రవక్తలు, రాజకీయ నాయకులు, ఏ మానవమాత్రులు ఈ కోవలోకి రారు. అంతగా మీ భక్తిని వీరికి చాటదలుచుకుంటే, ఒక నమస్కారమో, అభివాదాలతోనో సరిపుచ్చుకోండి.
2. రెండు చేతులకు ఉన్న 10 వేళ్లకు (కొందరికి అదనంగా కూడా ఉండే ప్రమాదమున్నది) ఉంగరాలు వేసుకుని, చేతికి బంగారు కడియాలు, మెడనిండా ఆభరణాలు, కాలికి తొడుగులు తొడిగి, సిల్కు జరీ పట్టు వస్త్రాలతో కుట్టిన దుస్తులను ధరించి, మొహం నిండా కుంకుమ పూసుకుని, మెత్తని పరుపులు అమర్చిన సింహాసనాలలో జారిగిలపడి, ప్రవచనాలు చెప్పే ప్రవచనకారుల సభలకు వెళ్ళకండి. అంతగా సృష్టి రహస్యాలను గురించి తెలుసుకునేందుకు తృష్ణ ఉంటే బృహత్ సమాచారం పుస్తకాల రూపంలో నిక్షిప్తమై ఉన్నది. గ్రంథాలయాలకు వెళ్ళి చదవడం అలవాటు చేసుకోండి.
3. కాలంచెల్లిన నియమాలకు, మూఢనమ్మకాలకు స్వస్తి చెప్పండి. అన్నిటికీ అతీతుడైన దేవునికి మైల పేరుతో ఆరాధించకుండా విశ్రాంతి తీసుకోకండి. దుఃఖసమయాలలో మిమ్మల్ని ఆదరించే శక్తిగలవాడు దేవుడని నమ్మండి.
4. ఒకవేళ సరదా కోసం ప్రవచనకారుల సభలకు వెళితే స్త్రీలను కించపరిచే విధంగా వారు ప్రసంగాలు చేస్తే, దీనికి స్త్రీలే ముందంజ వేసి నిరసన తెలియజేయండి. నిజమైన విరాగులు ఈ విధంగా ఊళ్ళల్లో ఉండరని నమ్మండి. అటువంటివారికి మీ స్పృహ ఉండదని, మీ సందేహాల నివృత్తికి వారిని సంప్రదించడం వృధాయే అని నమ్మండి.

**నేను ఈ రచనను చేయడానికి ప్రేరేపణ మా తాతగారు అల్లాడి మహదేవశాస్త్రి గారి కృతి పూర్తి మకుటం:**
*The Vedic Law of Marriage Or Emancipation of Woman* - **దీనిని వారు 1908లో రచించారు.**

మామిడిపూడి కృష్ణమూర్తి
krishnamamidipudi@gmail.com




# నవంబర్ 2022 మిసిమి

## ఒక విశ్లేషణ సమీక్ష

– కోదూరు పుల్లారెడ్డి

*మన పత్రికలు ప్రతి నెలా వస్తుంటాయి. రీడర్స్ డైజెస్ట్ 50 ఏళ్లుగా చదువుతున్నాం. ఒక్కోసారి పాఠకుల ఉత్తరాలలో ముందు నెలల గురించి వచ్చిన వ్యాసాల గురించి రాస్తుంటారు. అవి మన దృష్టిని ఆకర్షించి వెనక పత్రికలు తిరగవేస్తుంటాం. అలాగే నవంబర్ –2022* ***మిసిమి*** *పత్రికలో ప్రచురించిన వ్యాసాలు ఎంతో శ్రద్ధగా చదివి, ఎంతో శ్రమ చేసి ఒక సమీక్ష రాసి పంపారు శ్రీ కోదూరు పుల్లారెడ్డి. ఇదొక గుర్తుగా ప్రచురిస్తున్నాం. నిజానికి ఆయన 20 పేజీలు సమీక్ష పంపారు. దానిని కుదించి ఇస్తున్నాం. – సం.*

1. **అనర్ఘ రత్నాలు** – పప్పు వేణుగోపాలరావు

వివిధ నాట్యకళా రీతులను సాధికారంగా వివరణ ఇస్తూ విమర్శించిన నృత్య భారతి గ్రంథ రచయిత వేణుగోపాలరావుగారు. ఈ చిన్న వ్యాసంలో నీచ మానవుని మృతశరీరాన్ని జంతువులు కూడా ముట్టవన్న సత్యాన్ని చెబుతారు. చాటువంటే ప్రియమైన మాటని, అందులో జనరంజకత్వం, వాస్తవికత, ఒక మాధుర్యముంటుందన్నాడు. అందుకు ఉదాహరణగా రామలింగడు ఒక ఒంటికంటి రాజు వర్ణన ఉదహరంగా ఇస్తాడు. ఆ రాజు భార్యతో కలిసి ఉంటే ముక్కంటి ఈశ్వరుడు, ఆమె లేకపోతే రాక్షస గురువు శుక్రాచార్యుడని (విష్ణువు వామనుని రూపంలో దానకర్ణుడైన బలిచక్రవర్తి వద్దకు వచ్చి మూడడుగుల నేల ప్రసాదించమని అర్థిస్తే అర్ఘ్యమివ్వడానికి రాజు కమండలంలో నీరు పోస్తుంటే శుక్రాచార్యుడు కమండలంలో దూరి నీరు బయటపడకుండా అడ్డపడడంతో రాజు అడ్డు తొలగించడానికి కమండలంలోని ఒక పుల్ల గుచ్చాడు. ఆ పుల్ల ఒక కంటికి గ్రుచ్చుకొని ఒంటికంటివాడయ్యాడు.) వ్యంగ్యం చెప్పాడు. శుక్రాచార్యునికి ఆ ఒక కన్ను కూడా లేకపోతే ధృతరాష్ట్రుడవుతాడని చమత్కరించాడు. నిజమే మరి!

నృత్యకళారీతులు, భరతనాట్యం, కథాకళి, యక్షగానం మొదలైనవి వివరిస్తూ ఆయన రచించిన గ్రంథం సామాన్యులకు కూడా అర్థమయ్యే గొప్ప గ్రంథం. ఆయనకు సంగీతం పరిచయం చేసినవారు సంగీతరావుగారని (పట్రాయని సీతారామశాస్త్రి కుమారుడు), ఒకానొక సందర్భంలో తెలిపారు. అది వారి సహృదయతకు తార్కాణం. సీతరామశాస్త్రులవారు ఘంటసాలవారికి గురువు కూడా.

2. **కాశీ చారిత్రక నగరం** – కిల్లాడ సత్యనారాయణ

**మిసిమి** లో ప్రచురణ పొందిన వీరి రచనలు చదివినవారికి వీరెంత గొప్ప పండితులో, చారిత్రక పరిశోధకులో తెలుస్తుంది. ఈ వ్యాసంలో కాశీ అంటే ప్రకాశించేదని, జ్ఞానోదయం కలిగించేదని, మోక్షప్రాప్తి కలిగించేదని అంటారు.

కాశీని పరిపాలించే ఆనాటి రాజును క్రీ.పూ. 1000 – 1200 సంవత్సరాల మధ్య దివోదాసు (రాహుల్ సాంకృత్యాయన్ దివోదాసు నవల రచించాడు) ఓడించి కాశీని పరిపాలించాడని, తర్వాత అతని మనుమని అలర్కరాజు ఓడించి కాశీరాజయ్యాడని, ఈ పరంపరలో కాశీ 72 రాజుల చేతులు మారిందన్నాడు.

గౌతమ బుద్ధుడు (క్రీ.పూ. 6వ శతాబ్దివాడు) జననమొందడానికి ముందు బ్రహ్మదత్తుడనే రాజు అతని వంశీకులు 100 మంది కాశీని పరిపాలించారన్నాడు. కాశీకి దగ్గరలోని సారనాథ్ బుద్ధుడు తన తొలి సందేశం (ధర్మచక్రం ప్రవర్తన) లోకానికి అందించాడని, మౌర్యసమ్రాట్ అశోక చక్రవర్తి క్రీ.పూ. 3వ శతాబ్దిలో సారనాథ్ స్తంభం నిర్మించారని, కాశీని పరిపాలించిన ఆఖరు కుషాన్ రాజు (క్రీ.శ. 176లో) మరణించిన తర్వాత కాశీకి స్వాతంత్ర్యం వచ్చిందని సోదాహరణంగా నిరూపించారు. సముద్రగుప్తుడు కాశీ రాజైన తర్వాత క్రీ.శ. 350లో దేశాశ్వమేథ యుద్ధం చేసినట్టు, రెండవ చంద్రగుప్తుని కాలంలో చైనా యాత్రికుడు హ్యూయెన్ ఛాంగ్ కాశీలో 300 బౌద్ధ విహారాలు, 100 దేవాలయాలుండేవని అందులో కాశీ విశ్వనాథ మందిరం ప్రముఖమైనదని వ్రాక్రుచ్చాడు. ఆదిశంకరాచార్యులవారు కాశీకి వచ్చి బ్రహ్మసూత్రాలు రచించాడని తెలిపారు.

క్రీ.శ. 15వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తానులు కాశీలోని దేవాలయాలను నేలమట్టం చేసి వాటిపై మసీదులు నిర్మించారన్నాడు క్రీ.శ. 14-17 శతాబ్దాల మధ్యకాలంలో రామానందుడు, కబీరు వల్లభాచార్యులు (ఈయన తెలుగుదేశం గోదావరి మండలవాసులు) వచ్చి కాశీ ప్రాంతాల స్థిరనివాసమేర్పరచుకున్నవారి సంతతి. ఈయన నిర్వచించిన పుష్టిమార్గం ప్రసిద్ధం), తులసీదాస్, రవిదాస్ (ఈయన చెప్పులు కుట్టుకొని జీవించేవాడు)వంటి ధర్మగురువులకు కాశీ కేంద్రంబిందువన్నాడు.

క్రీ.శ. 16వ శతాబ్దంలో కాశీ మొఘులుల పరిపాలనలోకి వచ్చింది. అక్బర్ తన హయాంలో బహుశ క్రీ.శ. 1585లో కావచ్చు విశ్వనాథ మందిరాన్ని పునర్నిర్మించాడు. మళ్లీ 1632లో షాజహాన్ 76 దేవాలయాలు కూల్చివేశాడు.

క్రీ.శ. 1666లో ఛత్రపతి శివాజీ మహరాజు ఔరంగజేబు ఖైదు నుండి తప్పించుకొని కాశీ చేరుకున్నాడు. క్రీ.శ. 1669లో కాశీవిశ్వనాథ మందిరాన్ని ధ్వంసం చేసి దానిపై 'జ్ఞానవాసి' మసీదును నిర్మించారు. ఇప్పుడీ విషయం న్యాయస్థానంలో విచారణ జరుగుతూ ఉంది.

కాశీనగరం చరిత్ర తెలుసుకోవాలంటే సామాన్యునికి సాధ్యపడే విషయం కాదు. పైన వ్రాసిందంతా సంగ్రహ చరిత్ర మాత్రమే. పూర్తిగా తెలుసుకోవాలంటే ఈ గొప్ప వ్యాసం జాగ్రత్తగా పఠించాల్సి ఉంటుంది. ఇది ప్రత్యక్షంగా శోధించి వివిధ గ్రంథాల నుండి సంగ్రహించి వ్రాసిన గొప్ప వ్యాసం.

3. **ఆలపాటి రవీంద్రనాథ్**

ఈయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవ అపారం. ఆయనను ఎన్నిసార్లు స్మరించుకుంటే తెలుగు సాహిత్యాన్ని మనం అంత గౌరవం చేసినవారమవుతాము. చైనా దేశపు కన్‌ఫ్యూషియస్ అనే తాత్వికుడు (క్రీ.పూ. 6వ శతాబ్దివాడు, బుద్ధుని సమకాలినుడు) అంటాడు- విజ్ఞానం సంపాదించుకోవడం గొప్ప కాదు, దాన్ని అందరికీ పంచిపెట్టటంలోనే గొప్పతనముందని. ఈ నిర్వచనం రవీంద్రనాథ్‌గారి వ్యక్తిత్వానికి, సరిగ్గా సరిపోతుంది. ఆయనను గురించి ఈ నవంబర్ 2022 ***మిసిమి*** మాసపత్రికలో ప్రచురణ పొందిన వ్యాసాలన్నీ ఈ సత్యాన్నే ఘోషిస్తాయి. ***మిసిమి*** పత్రిక వ్యవస్థాపకులు వీరే.

4. **గిరిజా కల్యాణం** - ఎమ్. పురుషోత్తమాచార్య

క్రీ.శ. 1967లో విడుదలైన రహస్యం చిత్రంలోనిదీ కూచిపూడి యక్షగానం. అద్భుతమైన మల్లాది రామకృష్ణశాస్త్రిగారి రచన, అందుకేమాత్రం తీసిపోని ఘంటసాల వారి సంగీత రూపకల్పనలో యక్షగానాన్ని అజరామరం చేశాయి.

ఉదాహరణకు రాగమాలికలో ఒక పాట పరిచయంలో ఆఖరైతే తరవాత అందుకొనే రాగం పంచమం నుండి అందుకోవడానికి సరైన రాగం ఎన్నుకోవాలి. పైగా మధురంగా కూడా ఉండాలి. ఘంటసాలవారు ఇందులో మోహన నాట, మధ్యమావతి (ఆదితాళం, కాంభోజ, అఠాణ, వసంత, రీతగౌళ, శహన, సరస్వతి, హిందోళం, సావేరి, ఆరభి, మధ్యమావతి, ఖండగతి) రాగాలు ప్రయోగించారు. ఇది ఘంటసాలవారి సంగీత వైభవం చాటుతుంది.

ఈ కూచిపూడి యక్షగానాన్ని ఆచార్యులవారు విశ్లేషించిన తీరు కదళీపాకంలా ఉంది.

ఈ చిత్రంలో మరో పాట - సాధించనౌనా జగాన పలు పంకాలతో బలవంతాలతో చెలుల స్వాంతాలు భూకాంతులైనా - సారంగ రాగంలో కూర్చిన గీతం సంగీతం చిప్పిలే గొప్ప పాట.

5. **బౌద్ధ ధర్మ సేవలో చెన్నూరు ఆంజనేయ రెడ్డి**

*– ముంగర జాషువ*

రిటైర్డ్ డి.జి.పి. చెన్నూరు ఆంజనేయరెడ్డిగారు, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నప్పుడు స్టాఫ్‌కు తదితరులకు చేసిన సేవలు అన్నీ ఇన్నీ కావు. టూరిజం ఆర్.టి.సి. డిపార్ట్‌మెంట్‌లో ఉన్నప్పుడు కూడా ఆయన అందించిన సేవలు లెక్కలేనన్ని. ఆయన పేరు చెబితే కూడా పోలీస్, టూరిజం, ఆర్.టి.సి. డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు చేతులెత్తి నమస్కరిస్తారు. జైన, బౌద్ధ ధర్మాలపై ఆయనకు ప్రగాఢ విశ్వాసముంది. డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రారంభించిన బౌద్ధ పునఃరాకృతి ఉద్యమం హృదయానికి హత్తుకుని రెడ్డిగారు నాగార్జున సాగర్‌లో బుద్ధవనం నిర్మింపజేశారు. అందువల్ల ఆయనను ఆంధ్ర అశోకుడు అంటారు. ఆయన కవి కాకపోయినా కవితా హృదయమున్నవారు. మంచి చదువరి. ఇంగ్లీషు తెలుగు భాషలలో చక్కని వ్యాసాలు వ్రాసియున్నారు. అందువల్ల ఆయన ఎన్నో మంచి పుస్తకాలు ప్రచురించారు. *బుద్ధభూమి* మాసపత్రికకు ప్రతి నెల రూ. 10,000/- ఇస్తారు. రెడ్డిగారు ఒక మహానది. రెండు రాష్ట్రాలలో ప్రవహించే జీవనదుల మధ్య ధర్మసూత్రాలను ప్రవహింపజేస్తూ ఉంటుంది ఆ మహానది, నిరంతరంగ గతిశీలత్వంతో అంటూ నిరాజనం పలుకుతారు రచయిత.

6. **విలియం బ్లేక్** – *తంగెడ విశ్వేశ్వర ప్రసాద్*

విలియం బ్లేక్ కవి, చిత్రకారుడు, ప్రింట్లు తయారు చేసేవాడు. ఆయన నవంబర్ 1757న సోహో, లండన్‌లో జన్మించి ఆగస్ట్ 1827న లండన్‌లోనే మరణించాడు. క్యాథరైను సోఫియ బాంతర్‌ను (క్రీ.శ. 1726-1831) ప్రేమించి ఆగస్ట్ 1782న వివాహమాడాడు. ఆమె ఒక తోటమాలి కుమార్తె. చదువు రాదు. ఆమెకు చదువు నేర్పించి, వ్రాయడం, చదవడం నేర్పించి తన వ్రాతప్రతులను కాపీ వ్రాయించేవాడు. ఒకసారి ఒక హత్యకేసులో బ్లేక్ జైలులో ఉండగా ఆయన సవతి కూతురు రోసా బెయిల్‌పై విడిపించింది. బ్లేక్ ఎప్పుడూ స్వప్న లోకంలో, ఊహాగానంలో మేడలు కడుతూ ఉంటాడు. ఇహలోకంలో జరిగేవాటిపై ఆయనకు స్పృహ ఉండేది కాదు. కానీ ఏమి జరిగినా కాదనేవాడు కాడు. ఆయన మంచి కవి. దాదాపు 139 కవితలు వ్రాశాడు. అవన్నీ ఉవ్వెత్తున ఎగిసిపడే తన ఊహాలోకంలో లేక స్వప్నంలో నుండి ఊడిపడినవే. అందులో ప్రశస్తమైనవి The Lamb, The Tyger, A Poison Tree, London, The Chimney Sweeper, Jerusalem, The Sick Rose, The Little Black Boy తాను రచించినవాటిలో ప్రథమ స్థానంలో ఉంటాయన్నారు. 'ఆవేశం కల్పించడం, పవిత్రమైన ఆలోచనలు కలిగించడం, చిత్రకళలకు ఆలంబనగా మేథోమథనం చేయగలగడం, చరిత్ర సృష్టించడం, ఉదాత్త పనులను ప్రేరేపించడం'లాంటి ప్రతీక భావాలకు ఇలాంటి కవిత ప్రాధాన్యం వహిస్తుందన్నాడు బ్లేక్. బ్లేక్ పైన క్రైస్తవ మత ప్రభావముందంటారు. దీనికి ఆయన తల్లి పెంపకం దోహదం చేసిందట. అయినా ఆయన చర్చికి విరోధిగానే జీవించాడు. బ్లేక్ రొమాంటిక్ కవి. ఇంగ్లీష్‌లో రొమాంటిసిజమ్ (భావుకత) కవితకు ఆద్యులు విలియం బ్లేక్. William Wordsworth and Samuel Taylor Coleridge కూడా రొమాంటిక్ కవులే. ఆయన భావాలెలా ఉంటాయో అర్థం చేసుకోవడానికి ఒక కవిత ఉదహరిస్తాను.

I am not come from mental flight
Nor my sword deep in mind
Till we have built Jerusalem
In England's green and Pleasant Land

ఆయన జీవిత కాలంలో ఆయన రచనలకే మాత్రం ప్రాధాన్యత లేదు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా దిక్కులేని చావు దరిచేరింది.

షేక్స్‌పియర్ తర్వాత అంత శక్తివంతంగా వాక్చిత్రాలలో కవితలల్లడం ఆయనకే సాధ్యమైందని తంగెడ విశ్వేశ్వర ప్రసాద్ గారు అంతిమ పలుకు పలికారు.

7. **విలియం బ్లేక్ – చిత్రకారుడు**

*– తంగెడ విశ్వేశ్వరప్రసాద్*

బ్లేక్ చిత్రకారునిగా రొమాంటిక్ యుగాన్ని ప్రభావితం చేసినవాడుగా ఇప్పుడు కీర్తింపబడుతున్నాడు. బ్లేక్ సమకాలీనులు ఆయనను పిచ్చివాడుగా తిరస్కరిస్తే తర్వాతి విమర్శకులు ఆయనను సృజనశీలిగా, వేదాంతిగా, మార్మికవాదిగా నమ్మిన విషయాలను నిర్భయంగా వ్యక్తీకరించిన ధైర్యశాలిగా ఆకాశానికెత్తారని నిబద్ధతగల

క్రిస్టియన్ అయినా బ్లేక్ ఇంగ్లాండ్ చర్చికి విరోధి అని వివరించాడు రచయిత. ఏడుగురి సంతానంలో బ్లేక్ మూడవవాడు. చదవడం, వ్రాయడం వచ్చేవరకే పాఠశాల విద్య నేర్చుకున్నాడు. బ్లేక్‌కు చిత్రకళనభ్యసించాలని ఇష్టంగా ఉండేది. ఆర్థిక శక్తి లేనందువల్ల తండ్రి ఆయనను చెక్కడపు పని నేర్చుకొమ్మని ఒక గురువు వద్ద చేర్చుతాడు. ఈ చెక్కడపు పనిలో సాధికారత సాధించాడని, 4వ ఏట కిటికీలో దేవుని రూపాన్ని చూసి భయపడ్డాడని కూడా రచయిత వివరించాడు. బ్లేక్ మంచి డిజైన్లు, బొమ్మలతో పుస్తకాలను వైవిధ్యభరితంగా అలంకరించేవాడు. బ్రతుకుతెరువు కోసం పాత, సమకాలీన పుస్తకాలకు బొమ్మలు వేశాడు. అవన్నీ ఆయన వ్యక్తిగతమైనవని, అసంగతమైనవనీ, అర్థం లేనివనీ ముద్రపడ్డాయని రచయిత అంటాడు. పోర్ట్రైట్లు, ప్రకృతిని చూచి ఎవరైనా కాపీచేసి చిత్రాలు గీస్తారు. అది గొప్పతనమేమీ కాదు. చిత్రానికి స్ఫూర్తి, ప్రేరణలు పునాది, ప్రాతిపదిక అని బ్లేక్ ప్రగాఢ విశ్వాసమంటాడు రచయిత. దాంటే డివైన్ కామెడీ కథా పుస్తకానికి వేసిన 20 చిత్రాలు వాటర్ కలర్స్‌తో వేసినవే. దేవతల కోపాన్ని, ఆనందాన్ని, సున్నితత్వాన్ని, విషాదాన్ని, భయం మొదలైన భావోద్రేకాలనీ ఆ చిత్రాలలో చూపించాడు.

బ్లేక్ దృష్టిలో స్వప్నాలు, అభిరుచులు విడదీయరాని అంశాలు! ఏ కవికైనా సృజన ప్రాణం. తపన, వ్యామోహం ఆవేశం అంతర్బుద్ధి ఆధ్యాత్మికతలతో ఎంతటి సృజననైనా సాధించవచ్చంటాడు. ఉన్న కొద్దిపాటి వనరులు, పరికరాలతోనే ఆశ్చర్యంకొలిపే నిర్దిష్టత, ఆత్మవిశ్వాసంతో స్వీయ నియంత్రణలో తన స్వప్న దృశ్యాలకు కవి ఎంచిన రూపాలే అతని చిత్రాలు. బ్లేక్ చిత్రించిన ముఖ్యచిత్రాలు:

1. Oberan, 2. The Great Red Dragon and the Woman Clothed with the Sun, 3. The Ancient of Days, 4. Newton, 5. The Parable of the Wise and Foolish Virgins, 6. The Night of Enitharmon's Joy, 7. Nebuchadnezzar (Babylonian king), 8. Albia Rose - Creator, 9. The Angels Hovering over The Body of Christ in the Sepulchre, 10. The Marriage of Heaven and Hell, 11. Satan arousing the rebel angels, 12. The Ghost of a Flea, 13. The Chimney Sweeper, 14. The body of abel మొదలగు వాటర్ కలర్స్ పెయింటింగ్స్ పైన పేర్కొన్న కొన్ని పుస్తకాలకు సంతరించాడు. John Ruskin ప్రసిద్ధ సాహిత్య విశ్లేషణకుడు బ్లేక్‌ను రెంబ్రాంట్ (క్రీ.శ. 1606–1669) అంతటి గొప్ప చిత్రకారునితో పోల్చాడు.

ఆగస్ట్ 1827 నాడు అవిశ్రాంతంగా పనిచేసి భార్యను పిలిచి 'అలాగే నిలబడు, నీ చిత్తరువు చిత్రిస్తానన్నాడు'. 'నువ్వే నా దేవతవని' ఆమె బొమ్మను పూర్తి చేసి ప్రార్థన గీతాలు, పాటలు పాడుతూ సాయంత్రం 6.00 గం॥లకు అనాయాసంగా మరణిస్తాడు. క్రీ.శ. 1831లో అతని భార్య కూడా భర్తలాగే ఆనందంగా ప్రార్థనా గీతాలు పాడుతూ చనిపోయింది. రచయిత విశ్వేశ్వరప్రసాద్‌గారు ఐరోపా చిత్రకళా ప్రపంచాన్ని చక్కగా చదివినవారు, విశ్లేషించిన చాలా కొద్దిమందిలో ఈయన అగ్రగణ్యులు. నేను రచించిన 'ఐరోపా శిల్ప చిత్రకళావైభవం' గ్రంథంలోని కొన్ని వ్యాసాలు ***మిసిమి*** లో ప్రచురణ పొందినప్పుడు ఆయన నాకు ఫోన్ చేసి ముఖ్యంగా తీషియన్ వ్యాసంలో విలువైన కొన్ని సూచనలు చేసియున్నారు. వారికి నా నమోవాకములు.

ఈ విలియం బ్లేక్ వ్యాసానికి అశ్వినీకుమార్‌గారి 'కవి కళాకారుడు: విలియం బ్లేక్' అనుబంధ వ్యాసం వన్నె తెస్తున్నది. ఇది ఒక రసరేఖ.

## 8. **జోసఫ్ మల్లార్డ్ విలియం టర్నర్**

*– తంగెడ విశ్వేశ్వరప్రసాద్*

విలియం టర్నర్ క్రీ.శ. 1775లో లండన్ కొవెంట్ గార్డెన్‌లో ఒక మురికివాడలో జన్మించాడు. అతని తండ్రి మంగలివాడు. అతని తల్లి పిచ్చాసుపత్రిలో మరణించింది. ఉన్న ఒక చెల్లెలు కూడా చిన్నప్పుడే గతించింది. అందువల్ల తండ్రి పెంపకంలో పెరిగాడు. టర్నర్ స్టూడియోలో 30 సం.లు కొడుకుకు సాయమందిస్తాడు. తండ్రి షాపు థేమ్స్ నదికి సమీపంలో ఉండేది.

టర్నర్ చిన్నతనం నుండీ చిత్రలేఖనంలో రాణించాడు. తను పెన్సిలుతో వేసిన డ్రాయింగులు మంగలిషాపు కిటికీలో ప్రదర్శించి 30 షిల్లింగులకు అమ్మేవాడు. ప్రాథమిక విద్యతో 14వ ఏటికే రాయల్ అకాడెమీ ఆర్ట్స్ క్లాసులకు హాజరు కావడానికి అర్హత సంపాదించాడు. బ్రిటీష్ కోటలో, ఎబీల పెయింటింగ్‌లు, చర్చీల బొమ్మలు వేసి చదువుకు కావలసిన డబ్బు

సంపాదించాడు. 18వ ఏటికే స్వంత స్టుడియో నిర్మించుకున్నాడు. 27వ ఏటనే రాయల్ అకాడెమీ సభ్యత్వం పొందిన పిన్న వయస్కుడు. దేశద్రిమ్మరిలా టర్నర్ రోజూ 25 మైళ్లు నడిచేవాడు. పుడమితల్లి అంటే ఇష్టం. సముద్రమంటే మరీ ఇష్టం. తుఫానులను సైతం లెక్క చేయకుండా బ్రిటీష్ తీర ప్రాంతమంతా దేశాల్లో తిరిగి అలలు, వాటి విన్యాస స్వభావం, మేఘాలు వాటి రూపురేఖలు బాగా తెలుసుకున్నాడు.

25 ఏండ్ల వయసులో ఇంటి పని మనిషి 'సారా దేన్ బీ' విధవరాలితో శారీరక సంబంధం పెట్టుకొని ఆ తర్వాత 16 ఏండ్ల హెన్‌బీతో జీవితాంతం సహజీవనం చేశాడు. టర్నర్ సముద్రం మీద పడి తిరుగుతూ ఉండే హెన్‌బీ అతని చిత్రాలు, డ్రాయింగులు కాపాడుతూ ఉండేది. టర్నరు మాత్రం ఐరోపా అంతటా పర్యటిస్తూ అలగా స్త్రీలతో తన శారీరక అవసరాలు తీర్చుకొనేవాడు. ఫలితంగా కలిగిన నలుగురు సంతానంలో ఎవరినీ తనవారిగా అంగీకరించలేదు. రాత్రి నిజాలు, సముద్రం మధ్యలో వేటాడుతున్న జాలరుల తైలవర్ణ చిత్రంతో (1796) రాయల్ అకాడెమీ ప్రశంసలందుకొన్నాడు. 30 సంవత్సరాలు ఆసరాగా ఉన్న తండ్రి క్రీ.శ. 1829లో మరణించడంతో కుంగిపోయాడు. 'విపరీతంగా బొమ్మలు చిత్రిస్తూ అంతకుమించి తెగ తాగుతూ, ఈస్టెండ్‌లోని చౌకబార్లలో గడిపేవాడు. ఇల్లు బొమ్మలతో సహా తడిసి శిథిలమైపోతుంది. జీవితమంతా కష్టపడి గీచిన కళాఖండాలు వానకు తడిచి ఎలుకలబారిన పడతాయి. ఇవి దాదాపు 25,000 తైలవర్ణ, నీలిరంగు చిత్రాలు. విశ్వాసంగ తనను నమ్ముకున్న ఇంటి మనిషిని కాదని నదీసమీపాన చెల్సియాలో పాత స్నేహితురాలితో గడుపుతాడు. క్రీ.శ. 1851లో చెల్సియాలో పళ్లూడిపోయి, గౌటు, అజీర్ణ వ్యాధులతో పాలు, నీరు కలిపిన మిశ్రమ చూసుకుంటూ చివరి శ్వాస వదిలాడు.

టర్నరు అణువణువునా ప్రకృతి కాంత ముఖాన్ని అధ్యయనం చేసి, శ్రద్ధగా రోజుల తరబడి సముద్రపు అలల విన్యాసాన్ని, సంవత్సరాల తరబడి తీర ప్రాంతంలో భూమిపై వచ్చే మార్పుల్నీ కొండల స్వభావాన్నీ వెలుతురు వాతావరణ ప్రభావాన్ని దాదాపు 20 సం.లు అధ్యయనం చేసి ల్యాండ్‌స్కేప్‌కు కావలసిన ముడిసరుకును సేకరించుకున్నాడు. ఫ్రాన్స్ ఆర్టిస్ట్ టర్నర్‌ను – శైలీ చమత్కృతి ఛిందరపు అభ్యాసం (అంటే తనకు ఇష్టం వచ్చినట్లు చిత్రించాడన్నమాట)కు ఆద్యుడంటారు. వేలకొలదీ డ్రాయింగులు, స్కెచ్‌లు, 2000 చిత్రాల సృష్టికర్త టర్నర్. ప్రకృతే అతని నమూనా. కాలిఫ్లవర్, ది షిప్ రెక్, నాకు సముద్రపుటలలు నౌకకులకేమి చేస్తాయో, తుఫానులు, ఓడలు మనుష్యులకేమీ చేస్తాయో తెలుసంటూ చిత్రం గీశాడు.

50 సం.లు ప్రకృతితో సహజీవనం చేసి వెలుతురు వాతావరణ ప్రభావాలకు చిత్రాల ద్వారా అమరత్వం కలిగించాడు. ది పవర్ ఆఫ్ లైట్ పేరు పొందాడు. నాకు తెలిసినది కాదు, నేను చూసినది మాత్రమే చిత్రిస్తానన్నాడు. కలైస్ పియర్ డచ్ బోట్సు ఇన్ దగేక, దన్స్నోస్టార్మ్ ద స్టేన్ షిప్, ద షిప్‌రెక్, ఫిషర్ మన్ ఎట్ సీ, బర్నింగ్ ఆఫ్ పార్లమెంటు మొదలైన టర్నర్ వర్ణ చిత్రాలు సాటిలేనివి.

టర్నర్ వీలునామా ప్రకారం స్టేట్ బ్రిటన్‌లో అతని చిత్రాలకొరకు ప్రత్యేకంగా గది కేటాయించబడి ఉంది. టర్నర్ పేర 1984లో అవార్డు, 2004లో విన్నర్ – న్యూటన్ వాటర్ కలర్ అవార్డు ప్రవేశపెట్టారు. 2014లో మిస్టర్ టర్నర్ పేరుతో ఆయన జీవిత చరిత్ర సినిమాగా వచ్చింది. 2020లో ఇంగ్లండు బ్యాంకు 20 పౌండ్ల నోటుమీద టర్నర్ బొమ్మ ముద్రించి గౌరవించింది. అతని చివరి మాటలు 'సన్ ఈస్ ది గాడ్'.

తంగెడ విశ్వేశ్వరప్రసాద్‌గారు రచించిన విలియం బ్లేక్, జోసఫ్ మల్లార్డ్, విలియం టర్నర్ గురించి క్లుప్తంగా వ్రాసిన వ్యాసాలు మరెవరూ ఇంత చక్కగా వివరించలేనంత గొప్పగా ఉన్నాయి. దానికి కారణం బహుశా తను వ్రాయవలసిన వ్యాసానికి విషయ సేకరణ, ముఖ్య సంఘటనలు ప్రోదిచేయడమనుకుంటాను. దీనికి సహాయకారి బహుశ ఆయన లండన్‌లో ఉండడమూ ఒక కారణం కావచ్చు. గమనించండి. 2020లో తీషియన్ పోట్రైట్ 20 డాలర్ల నోట్‌మీద ముద్రించారనడం ఆశ్చర్యంగొలుపుతుంది. వారికి నా నమోవాకాలు.

### 9. ఫిక్షన్ ఆవిష్కర్త డాన్ కిహోటీ

– ముక్తవరం పార్థసారథి

డాన్ గుంజో లా మాంకా గ్రంథ రచయిత మిగుల్ డి సెర్వాంటెస్ స్పెయిన్ దేశీయుడు. ఇది రెండు భాగాలుగా క్రీ.శ. 1605 ఒకటి 1615లో రెండవది ప్రచురించారు. ఇంగ్లీషు అనువాదాలు క్రీ.శ. 1612, 1620లలో

వచ్చాయి. ముక్తవరం పార్థసారథిగారు ఈ నియమాలను సెర్వాంటెస్ సమగ్రత ఎక్కడ కొనసాగింపు చెడకుండా రచించారు. ఆ మాటకొస్తే వారి రచనలన్నీ ఇలాగే ఉంటాయి. నిజం చెప్పాలంటే నేను కూడా చిన్న రచయితను కాబట్టి ఇంత పెద్ద ఫిక్షన్‌ను రచయిత జీవితాన్ని సంగ్రహించాలంటే నరాలు చిట్లుతాయి. పైగా ఆయన నా మాదిరే అనారోగ్యవంతుడు. ఆయన రచనలలో క్రొత్తగా విశ్లేషించడానికేమీ ఉండదు. ఆహ్లాదంగా చదువుకోవడమే. దానికి వారెంతైనా అభినందనీయులు. ఆయన Quixote ను కిహోటీ అన్న దానిపై కొంత చర్చ జరుపుదాము. Google Video లో Quixote ని కిహోటీ అని పలుమార్లు ఉచ్చరించాడొకాయన. అందువల్ల ఆ పదమే వాడుకున్నారు పార్థసారథిగారు.

Chamber, Oxford Learner Dictionary లలో Quixote కి ఇచ్చిన Pronunciation చూడండి.
Quixotsc: క్విక్‌సోటిక్ అని ఇచ్చారు Adj అన్నారు.
Don Quixote the Knight Errand
Extravegantly rommantic ideal shivalry

చెప్పవచ్చేదేమంటే x తో మొదలయ్యే ఏ పదానికి 'కి'తో పలకదు. ఆయన 'కిహోటీ' వాడినందువల్ల ఎవరికి ఇబ్బంది లేదు. కానీ ఇంగ్లీషు వారు ప్రచురించిన Chambers, Oxoford డిక్షనరీలలో adj కు Quixote అని Pronunciation చేశారు. Quixoteకు కిక్‌సోట్ అవుతుంది కదా! కాన 'Don Quixote'ను 'డాన్ కిక్‌సోటీ' అని ఉచ్చరించడంలో తప్పు ఏమీ లేదు. పైగా Quixote అంటే తెలివిమాలినవాడు, జోకర్, పిచ్చివాడన్న అర్థంలో కూడా వాడతారు. ఈ చర్చ మీకు నచ్చకపోతే నన్ను క్షమించండి.

### 10. స్పర్శరేఖ – భమిడిపాటి రామగోపాలం

– వి. రాజా రామమోహనరావు

భమిడిపాటి రామగోపాలంగారు నాకు చిరపరిచితులు. ఆయన ఆత్మకథలో తన పరిచయ రచయితల ఫోటోగ్రాఫ్‌లు వేశారు. అందులో నా చిత్రం కూడా ఉంది. భమిడిపాటి మంచి కథకుడు, సినిమాల విశ్లేషకుడు. ఆయన కథల సంపుటి ఇట్లు తమ విధేయుడు కథలంటే మోజుపడేవారు తప్పక పఠించవలసిన సంపుటి. ఇంకోటి సరదా కథలు. సినిమాల విశ్లేషణ పుస్తకాలు రెండు వ్రాశారు. ఒక్కొక్కదానిలో 116 చిత్రాల విశ్లేషణ ఉంది. సినీనట భానుమతిపై ఒక సాధికారమైన రచన వెలువడించారు. ఆయన నవలలు వ్రాసినట్టు నాకు తెలియదు. శ్రీ వి. రాజా రామమోహనరావుగారు, గొప్ప కథకుడు, నవలాకారుడు. ఆయన విశ్లేషించినదీ స్పర్శరేఖ. ఇందులో ఏదో విశేషముంటుంది. లేకపోతే ఆయన విశ్లేషించడు. అదేమిటో చూద్దాం రండి.

52 ఏళ్ల రంగారావు రిటైర్డ్ మేజర్. అయినా అవివాహితుడు. 35 ఏళ్ల గాయత్రి విధవ. ఒక కాలేజీ ప్రిన్సిపాలు. ఆమెకు చెల్లెలు, ఒక తమ్ముడు, ఆయన భార్య అందరూ తనతోపాటే ఉండేవారు. ఆ తమ్ముడు, భార్యతో కలిసి మద్రాసు వెళ్లి, తిరుగు ప్రయాణంలో రంగారావును చూచి చెల్లెలు లలితకు పెళ్లి చూపులకు ఆహ్వానించాడు. పెళ్లి చూపులకు వచ్చిన రంగారావు చూపు గాయత్రి మీద పడింది. లలిత విషయం ప్రక్కనపెట్టి అన్నాడు. గాయత్రి లలితకంటే పెద్దది. పెద్ద అమ్మాయికి పెళ్లి చేయకుండా చిన్నమ్మాయికి ఎలా చేస్తారని ప్రశ్నిస్తాడు. అందువల్ల గాయత్రిని పెళ్లి చేసుకుంటానన్నాడు. పెళ్లైన 2, 3 రోజుల తర్వాత ఎక్కడికైనా వెళ్దామనుకున్నారు. ఎక్కడో ఎందుకు, మా సొంతూరు విజయవాడలో నాకొక సొంత ఇల్లుంది. అందులో రమణమ్మ అనేవాళ్లు ఒక భాగంలో అద్దెకుంటున్నారు. మరో భాగం సొంతానికి ఉంచుకున్నాను. అక్కడికి వెళ్దామన్నాడు. సరే అనుకొని ముందు బృందావనం లాడ్జిలో దిగి అక్కడ లగేజ్ పెట్టి సొంత ఇంటికి వెళ్లారు. గాయత్రికి ఇల్లు నచ్చింది. లాడ్జికి వెళ్లి సామాన్లు తెమ్మని రంగారావును పంపించింది గాయత్రి. ఏకాంతంలో ఏమీ తోచక ఆ గదిలోనున్న ఒక ఆల్బమ్ ఉండేదాన్ని తిరగేసింది గాయత్రి – అందులో రంగారావు ఎంతమంది స్త్రీలతో గడిపాడో వాళ్ల పేరు, వాళ్లతో గడిపిన తేదీలతో సహా ఉన్నాయి. అందులో రమణమ్మ కూడా ఉంది. రాత్రి రంగారావు రమణమ్మ దగ్గరకు వెళ్తాడేమోనని గాయత్రి భయపడి ఆ రాత్రి రమణమ్మ దగ్గర పడుకొని గడిపింది. తరువాతి రోజు గాయత్రితో కలిసినప్పుడు ఆమెకు రక్తస్రావమైంది. ఊరు చేరుకోగానే రంగారావును గాయత్రిని తనకు తెలిసిన డాక్టరు శాంతి దగ్గరకు వెళ్తే పరీక్ష చేసి గర్భసంచి తీసేసింది. ఇక పిల్లలు పుట్టరని తెలిపింది. రంగారావుకు శాంతకు ముందే సంబంధమున్న విషయం ముందే తెలిసి గాయత్రి మానసికంగ క్రుంగిపోయి కోలుకోలేని జబ్బులోకి జారుకుంది. ఆమెను

జాగ్రత్తగా చూచుకోవడానికి శాంతతో రెండో కాపురం పెట్టి గాయత్రిని జాగ్రత్తగా చూచుకోవాలనుకున్నాడు. చూచుకున్నాడు కూడా. అకస్మాత్తుగా శాంత చనిపోయింది. గాయత్రి కూడా క్రుంగి క్రుంగి చనిపోయింది. ఆమె ఆస్థి అంతా రంగారావు అధీనంలోకి వచ్చింది. ఆ స్థితిలో లలితను పెళ్లి చేసుకొని హాయిగా ఉండవచ్చనుకున్నాడు. కానీ లలిత వేరేవాణ్ణి ప్రేమిచింది. మళ్లీ రంగారావుది గాలి బ్రతుకే అయింది. లలిత ప్రేమించింది ఎవరినో కాదు. రంగారావు అక్రమ సంతానాన్నే. అంతే! రంగారావనుకున్నాడు - నెనెవరికీ తగిలీ తగలని మనిషినేననే అంటే స్పర్శరేఖ.

భరాగో ఎప్పుడూ సరిక్రొత్తగా వ్రాయాలన్న సారవంతమైన మేధస్సుగలవాడు. హైదరాబాద్‌లో ఆయన పడిపోయిన కాళ్లకు గురవారెడ్డి డాక్టరుగారితో చికిత్స చేయించుకొనేటప్పుడు ఆయన దగ్గరకు (సికింద్రాబాదు) రోజు మార్చి రోజు ఆయన కోరికపై వెళ్లేవాడిని. తన సంభాషణా చాతుర్యంతో ముగ్ధుణ్ణి చేసేవాడు. ఎప్పుడైనా సాహిత్య చర్చ వస్తే ఆయన అనేవాడు 'ఏది వ్రాసినా ఇతరులకు భిన్నంగా చదువరులను ఆకర్షించేలా ఉండాలి' అని. ఆయన ఈ ఆదర్శం ఈ స్పర్శరేఖలో నాకు కనిపించలేదు.

### 11. డా. నారాయణతో మాటామంతీ

***విసిబి*** ఎడిటర్, అశ్వినీకుమార్ ఆయనను 48 ప్రశ్నలడిగి ఆయన జీవనయానాన్ని ఆయన నోట చెప్పించారు. విన్న తర్వాత శ్రీ నారాయణగారు పి.యు.సి. చదువుకొని గుంటూరు ఆయుర్వేద కళాశాలలో బి.ఎ.హెచ్.ఎమ్. చదవడానికి వెళ్లానన్నాడు. అక్కడ ఎ.ఐ.ఎస్.ఎఫ్. (ఆల్ ఇండియా స్టేట్‌మెంట్స్ ఫెడరెంట్స్)కు పరిచయమైనందువల్ల మార్క్స్ భావజాలాన్ని అర్థంచేసుకొనే అవకాశం కలిగింది. ఆ ప్రభావం రానురాను ప్రచురితమై బి.హెచ్.ఎమ్.ఎస్. చదువు మానేసి పూర్తిగ ఎ.ఐ.ఎస్.ఎఫ్. యాక్టివర్ అయిపోయాడు. కానీ పార్టీ నాయకులు తమ్మారెడ్డి భరద్వాజగారు బి.ఎ.ఎమ్.ఎస్. పూర్తి చేయాలని అనుల్లంఘనీయ ఆదేశంతో పూర్తి చేశాడు. కానీ రెండు పడవల మీద ప్రయాణం బి.ఎ.ఎమ్.ఎస్. ప్రాక్టీస్, సోషల్ సెమినార్ కుదరదనీ డాక్టరు ప్రాక్టీసుకు తిలోదకాలిచ్చారు. తను హైస్కూల్ చదువులో ఉండగా టి.బి. వచ్చిందని నగరి, చిత్తూరు జిల్లాలో ప్రముఖ ఆయుర్వేద డాక్టరు రామచంద్ర రాజుగారు తమ ఇంట్లో ఉంచుకొని చికిత్స చేసి ఆరోగ్యవంతుణ్ణి చేశారు. ఆయనకు సంతానం లేరు. తన తర్వాత ఆయన హాస్పిటల్ నేను చూసుకోవాలనే ఉద్దేశ్యంతో బి.ఎ.ఎమ్.ఎస్. చదవడమైంది. గుంటూరులో ఉండగ వామపక్ష భావాలకు ఆకర్షింపబడి నగరిలో హాస్పిటల్ బాధ్యతలు చేపట్టటం మానేశాను. ఇది తెలిసిన మా తలిదండ్రులు ఉగ్రులై ఇంటికి తీసుకెళ్లారు. వాళ్లకు తెలియకుండా దొంగచాటుగా మళ్లీ గుంటూరు చేరుకుని ఫుల్‌టైం సోషల్ వర్కర్‌గా మారిపోయాను.

1970లో వై. విజయకుమార్ మాస్టారితో పరిచయమైంది. ఆయన మేధావి. అక్కడ మార్క్సిస్ట్ అధ్యయనానికి బీజంపడి మెంబర్‌షిప్ తీసుకున్నాడు. తర్వాత నేను కలిసిన మార్క్స్ మేధావులు కృష్ణారావు, గిరిప్రసాద్‌గార్ల సభలకు వెళ్లేవాడనీ, వావిలాల గోపాలకృష్ణయ్య, ఎన్.జి. రంగాగార్ల సభలకు కూడా వెళ్లేవాడిని. అయినా నా యాక్టివిటీస్ మాత్రం ఎ.ఐ.ఎస్.ఎఫ్.కు సంబంధించినవే. 1972-73లో హైదరాబాద్ స్టేట్ సెక్రటరీ అయి 3 ఏండ్లు పనిచేసి తిరుపతికి వెళ్లాను. అక్కడ కూడా ఎ.ఐ.ఎస్.ఎఫ్. మొదలుపెట్టాను. మార్క్సిస్ట్ భావాలతో పరిచయమైన తొలి రోజుల్లో స్టాలిన్ బాబు, సుధాకర్‌రెడ్డి తదితరులు నాకు అన్ని విషయాలు సమగ్రంగా బోధించేవారు. పుచ్చలపల్లి సుందరయ్య (సుందరరామిరెడ్డి)గారిని ఆయన స్టేట్ సెక్రటరీగా ఉన్నప్పుడు చూచాను. తర్వాత వారితో పుంగనూరు నుండి కరువు యాత్రలో పాల్గొన్నాను.

సుధాకరరెడ్డిగారు మెంబర్ ఆఫ్ పార్లమెంటరీగా ఎన్నుకోబడిన నేను స్టేట్ సెక్రటరీ అయ్యాను.

నేను తిరుపతిలో ఉన్నప్పుడు వసుమతి అనే ఆవిడ ఎమ్.ఎస్‌సి. చదువుతుండేది. అక్కడ ఆమెతో పరియమైంది.

తర్వాత నాకు మార్క్సిజంపై అవగాహన కోసం నన్ను ఒక సంవత్సరం పాటు మాస్కోకు పంపించారు.

నోట్: మాస్కోలో కమ్యూనిస్టు భావజాలం ఇతర దేశాల విద్యార్థులకు ఒంటబట్టేలా బోధించడానికి మాస్కోలో 'Commune' అనే ఒక స్కూలు రష్యా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో నార్త్ కొరియా దేశపు హోచిమిన్, వంగర దేశపు విద్యార్థులు. తర్వాత వీరిద్దరు తమ దేశాలకు ప్రధానులయ్యారు. మన దేశపు ఎమ్.ఎన్.

రాయ్ ఈ కమ్యూన్‌లో ఒకసారి లెక్చర్ ఇచ్చాడట. వి.ఐ. లెనిన్‌ను బ్రతికుండగా చూచినది, మాట్లాడినది మన దేశం నుండి ఎమ్.ఎన్. రాయ్ ఒక్కడే. మాస్కో నుండి తిరిగి వచ్చిన తర్వాత శ్రీశైలంలో స్కూల్ నడుపుతున్న వసుమతిని 1985లో పెండ్లాడాను. తర్వాత ఆమె టీచరుగా ఉద్యోగంలో చేరింది. నాకు పార్టీ టైమర్ నెలకు రూ. 350/- ఇచ్చేవారు. నేను పార్టీ పనులలో చాలారోజులు బయటనే ఉండవలసి వచ్చేది. అప్పుడు ఆమే పిల్లలకు నా విషయం ఏమీ చెప్పకుండా పెంచేది. ఆమె నా సహధర్మచారి కాకుండా ఉంటే నాకింత పేరు వచ్చి ఉండేది కాదు. ఇప్పుడు కాపిటల్ వెర్సెస్ వర్కింగ్ క్లాస్ మొత్తం ఒకటే అయిపోయింది. అందుకుదాహరణ వర్కింగ్ మేనేజ్‌మెంట్ చేస్తున్న 'డెక్కన్ క్రానికల్ డైలీ' ఇప్పుడేమో కార్మిక వర్గం దోపిడీదారుగా మారిపోయింది. జీతాలు పెరిగాయి. కార్లు కొనే స్థితికి చేరుకున్నారు.

ఇప్పుడు కమ్యూనిజం ఎక్కడా లేకుండా పోయింది. రష్యా, చైనాలో కూడా. ప్రాసెస్‌లో ఈ కమ్యూనిజంను మోడిఫైడ్ సోషలిజం అంటారన్నారు. ఇప్పుడంతా వ్యాపారం అయిపోయింది. అభివృద్ధి చెందిన దేశాలవారు థర్డ్ వరల్డ్ నుండి వచ్చినవారితో పనిచేయించుకొనడం అలవాటుగా మారి, వీసాలు తెప్పించి మరీ సేవ చేయించుకుంటున్నారు.

కమ్యూనిస్టు పార్టీ కి సేవ చేసినవారికి వృద్ధాప్యంలో బాసటగా ఉండాలని ఒక హాస్పిటల్, ఒక హాస్టల్ ఉండాలని తీర్మానించారు. అందుకనుగుణంగా సి.ఆర్. ఫౌండేషన్ రూపుదిద్దుకుంది. ఫ్రీ అడ్మిషన్‌కు మొదటి అర్హులు కమ్యూనిస్టులు. వారి తర్వాత సామాజిక సేవ చేసినవారే నిజంగా కమ్యూనిస్టు పార్టీకి సేవ చేసినవారిని రమ్మంటే రారు. వారికి ఆత్మగౌరవం ఎక్కువ. కొందరు అమెరికాలో ఉంటూ బాగా సంపాదిస్తున్నారు. వారు ఇండియాలో పనిచేసిందంతా టౌన్‌లో అందువల్ల వారి తలిదండ్రులు కూడా ఆ వాతావరణానికి అలవడి ఉంటారు. అటువంటి పల్లె వాతావరణానికి ఇష్టపడరు. టౌన్‌లో వారి భద్రత చూచుకొనుటకెవరూ ముందుకు రారు. అందువల్ల అటువంటివారు డొనేషన్స్ కట్టి ఈ ఫౌండేషన్‌లో తమ తలిదండ్రులను చేర్పుతున్నారు. మొదట్లో మేమే వారి కోసం (పార్టీ సేవకులు) తిరిగాం. నేటికి మంచంలో పడున్నావు గంజినీళ్లు తాగుతున్నావు. రావయ్యా అంటే మా అమ్మ నాయనమ్మలను మేము పోషించుకోలేమా అని పిల్లలు అడ్డుకుంటున్నారు. కొంతమందికి అన్నీ ఉన్నా ఇంట్లో పిల్లలుండరు. ఇక్కడుంటే కాలక్షేపం జరుగుతుందనుకునే వారు కొందరు. ఇది నేను సి.ఆర్. ఫౌండేషన్ చైర్మన్‌గా ఉన్నప్పుడు గమనించింది."

ఆఖరిగా ఆయన సందేశం - "మీ జీవితం గురించే ఆలోచించకండి. చుట్టూ ఉన్న సామాజిక జీవితం గూర్చి ఆలోచించండి. ఎంతోమంది జీవనోపాధి లేక మలమల మాడిపోతున్నారు. వారందరి బాగుకోసం ఉపయోగపడే ఆలోచనలు చేయడంటూ నాకు ఇచ్చారు శ్రీ నారాయణ జీవనప్రయాణం (**మిసిమి** ప్రశ్నించినందువల్లనే బయటికి వచ్చిందన్నది నిర్వివాదాంశం)."

ఆయన జీవితమంతా శ్రమైక జీవులకై వెచ్చించారు. గృహలక్ష్మి మరణించిన తర్వాత కూడా అదే పనిలో ఉన్నారు.

ఇంత విలువైన వ్యాసాలు ప్రచురించిన **మిసిమి** సంపాదకులకు ధన్యవాదాలు - రచయితలకు అభివందనాలు.

కోడూరు పుల్లారెడ్డి
హైదరాబాద్. ఫోన్: 955 081 8495.

---

"... నేను 5th form చదివే రోజుల్లో, అంటే షుమారు 67 ఏళ్లక్రితం, ఒక పుస్తకం చదివాను, దాని పేరు, డాన్ క్విక్ సెట్.. బహుశ అప్పటి అనువాదకునికి స్పానిష్ ఉచ్చారణ తెలియక అట్లా రాసి ఉంటారు.. ఆ రోజుల్లోనే ఆ పుస్తకం చాలా ప్రభావం చూపింది... వద్దనకుండా ఒక మిత్రుడు వెంటపడి వస్తూ ఉండేవాడు. వాడిని శంకోపాంజ అని పిలిచేవాళ్ళం.. క్లాస్‌లో ఒక అమ్మాయిని డలసీనియా డళ్ టోబాకో రాజకుమారి అనేవాళ్ళం... జనవరి 2023 **మిసిమి** సంచికలో మీరు ప్రచురించిన వ్యాసం సెర్వాంటెస్ - డాన్ కిహోటీ చదువుతుంటే అవన్నీ జ్ఞాపకానికి వస్తున్నాయ్... ప్రతి నెల **మిసిమి** ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటాను.. చాలా చక్కటి పత్రిక. ఎన్నెన్నో కొత్త విషయాలు, విశేషాలు తెలుస్తూ ఉంటాయో.. ధన్యవాదములు..."

*- శేషగిరిరావు, హైదరాబాద్. ఫోన్: 798 919 9520*

# చదవండి...

- మిసిమి

**అంతర్దర్శనం:** డా. పూసపాటి శంకరరావు. "ఈ గ్రంథం వేదాలు, ఉపనిషత్తులు, శిల్పతత్త్వాల అపూర్వసారం. భారతీయ అంతర్నేత్రానికి ఈ గ్రంథం ఒక సంకేతం.




విద్యార్థులకు, పరిశోధకులకు, పండితులకు ఒకదారి దీపం ఈ గ్రంథం" అంటూ ప్రశంసించారు ఆచార్య తంగెడ కిషన్‌రావుగారు. "భారతీయ తాత్త్వికత సారాన్ని అందిస్తోంది ఈ గ్రంథం. శాస్త్రజ్ఞానానికి - వేదజ్ఞానానికి అభేదాన్ని వివరించే ప్రయత్నం ఫలవంతంగా చేశారు గ్రంథకర్త" అంటారు మండలి బుద్ధప్రసాద్‌గారు. హైందవ సంస్కృతి ఔన్నత్యాన్ని లోకోపకారమైన అనేక విషయాలు పొందుపరిచి, ఆధ్యాత్మిక, శాస్త్రజ్ఞాన, శిల్పాచార్యుల ప్రతిభ - యజ్ఞవేదికల్లో గణితాన్ని, విశ్వకర్మ తత్త్వాన్ని ఎన్నో పెక్కు విషయాలను అంతర్దర్శనంగా విపులీకరించిన తీరు ఎంతో ప్రశంసాపూర్వకమైనది. ఇంతవరకు ఎవ్వరూ చేయని ఇంతటి మహోత్కృషి డా. పూసపాటి శంకరరావు చేసిన తీరు ఎంతో కొనియాడదగినది. ఇంతటి మహద్గ్రంథాన్ని పూర్వ భారత ఉపరాష్ట్రపతి డా. ముప్పవరపు వెంకయ్యనాయుడుగారు ఆవిష్కరించారు.

*పేజీలు: 647, వెల: ₹ 550/-*

*ప్రతులకు: పూసపాటి జయలక్ష్మి, 103, అట్లాంటిక్ సిటీ అపార్ట్‌మెంట్స్, దీప్తిశ్రీ నగర్, మియాపూర్, హైదరాబాద్ - 49. ఫోన్: 040-40215873, 988 589 8297.*

**భారతీయ నాగరికత - సంస్కృతి - వారసత్వం ప్రథమ భాగం:**



వేదాంతం లక్ష్మీప్రసాదరావు. రెండు భాగాలుగా వచ్చిన ఈ గ్రంథం - ప్రథమ భాగం - 456 పుటలు - రెండవ భాగం - 814 పేజీలు - ఎంతటి కృషి - పట్టుదల లేకపోతే ఇంతటి పరిశోధన చేయగలరు? విషయానికి వస్తే శీర్షికలోనే సూచించినట్లు భారతీయ సంస్కృతి వారసత్వాన్ని పాఠకులకు గుర్తు చేయటమే. ".. మనం చరిత్రలోనే జీవిస్తాం - గతం నుంచే నేటి పరిణామాలు రూపుదిద్దుకుంటాయి. మనం ఏ సంస్కృతికి వారసులమో జ్ఞానంతో జీవించాలి - లేకపోతే ఆత్మద్రోహమే అవుతుంది. దురదృష్టవశాత్తు ఈ పవిత్ర భూమిని తుర్కులు - ఆంగ్లేయులు భ్రష్టు పట్టించారు. పాఠ్యపుస్తకాలలో వారి చరిత్ర ఎక్కించి వందల సంవత్సరాలు పైగా బోధించారు. జాతి మొత్తం అయిదువందల సంవత్సరాల స్థితిలోకి వెళ్లి పాశ్చాత్యనాగరికతే ఆధునికమని, గొప్పదని మన మేధావులకు మనోవైకల్యం దాపురించింది - అందుకు నేటి విషపూరిత రాజకీయాలు దోహదం చేస్తున్నాయి. ఎవరి ఎజెండా వారికుంది - నైతిక జీవనం నశించిపోయింది. చట్టం వేరు - నైతిక జీవనం వేరు - భారతీయ సంస్కృతి నైతిక జీవనాన్ని నేర్పింది - కానీ ఇప్పటి తరం చట్టపరంగా బ్రతికితే చాలు - అనే నిర్ణయానికి వచ్చారు. దాని పర్యవసానం ఇప్పుడు చట్టాన్ని కూడా లొంగదీసుకునే పనిలో ఉన్నారు. మన సాంస్కృతిక మూలాలు తెలుసుకోవాలి. వాటిని గౌరవించాలి. ఇప్పటి కాలానికి అనుగుణంగా ఆచరించాలి. వేదాంతం లక్ష్మీప్రసాద్‌గారు ప్రొఫెసరు కాదు - ఆచార్యులూ కాదు - ఆయనకున్న జిగీషతో అధ్యయనం చేసి ఈ సంపుటాలు ముద్రించి మహోపకారం చేశారు. కొని చదవండి. మీ వారసత్వాన్ని గుర్తించండి!

*మొదటి భాగం : పేజీలు: 456, వెల: ₹ 800/-*

*రెండవ భాగం : పేజీలు: 814, వెల: ₹ 800/-*

*ప్రతులకు: సాత్విక్ బుక్స్, వి.యల్. ప్రసాదరావు, 320, విజయనగర్‌కాలని, రిజర్వుబ్యాంకు కాలనీ, హైదరాబాద్. ఫోన్: 984 805 4288.*

మండలి ఫౌండేషన్ వారు ప్రచురించిన **(1) ఆంధ్ర భాషా వికాసం**, **(2) తెలుగు వెలుగు** (ఖండకావ్యం), **(3) తెలుగుతేజం** (ఖండకావ్యం), **(4) ఆంధ్ర యశోభూషణం**, **(5) అఖండ** పుస్తకాలు పరిచయానికి










వచ్చాయి. మండలి ఫౌండేషన్ – తెలుగు భాషా వికాసానికి ఎనలేని కృషి చేస్తున్నది – అందులో భాగంగానే పైన చెప్పిన పుస్తకాలు ప్రచురించి ప్రచారం చేస్తున్నారు. పూర్వ మంత్రివర్యులు, శాసన సభా ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్‌గారు ఈ ఫౌండేషన్‌కు అధిపతి. "తెలుగు సంస్కృతి భాషా పరిరక్షణలో ఖండకావ్యాల పాత్ర మరువలేనిది – రాయప్రోలు, విశ్వనాథ, జాషువా, తుమ్మల – దువ్వూరి ఇంకా ఎందరో మహానుభావులు వ్రాసిన ఖండకావ్యాలు తెలుగు జాతిలో వెలుగులు నింపిన అఖండ జ్యోతులు – వాటిలో దేశ చరిత్ర రాజవంశాలు – యుద్ధాలు – కవులూ, కళాకారులు, నీతి – ధర్మంలాంటి ఎన్నో విషయాలు ఆనాటి యువతరాన్ని ఉత్తేజపరిచి పోరాటాలకు సిద్ధ పరిచినాయి" అంటారు







శ్రీ బుద్ధప్రసాద్ – వీరి ఫౌండేషన్ తరఫున నెలరోజులు వ్యవధిలో నూట ఇరవై ఖండ కావ్యాలు – పోటీకి వచ్చాయంటే ఎంతటి ఉత్సాహం ఉన్నదో కవులలో – ఆలోచించాలి – అన్ని పుస్తకాలు – రూ. 20/– లేక రూ. 30/– కే ఇస్తున్నారు.

**(1) ఆంధ్ర భాషా వికాసం** - *పేజీలు: 40, వెల: ₹ 20/–*

**(2) తెలుగు వెలుగు** - *పేజీలు: 20, వెల: ₹ 61/–*

**(3) తెలుగుతేజం** - *పేజీలు: 34, వెల: ₹ 20/–*

**(4) ఆంధ్ర యశోభూషణం** - *పేజీలు: 38, వెల: ₹ 20/–*

**(5) అఖండ** - *పేజీలు: 50, వెల: ₹ 20/–*

*ప్రతులకు: మండలి ఫౌండేషన్, గాంధీ క్షేత్రం – అవనిగడ్డ – 521121. కృష్ణాజిల్లా.*

**అమృత భారతి:** 75 సంవత్సరాల స్వతంత్ర్య భారతంలో తెలుగువారి ప్రగతిని చాటిచెప్పే వ్యాస సంకలనం – ప్రపంచ తెలుగు రచయితల సమాఖ్య




తరఫున ప్రచురించారు. శ్రీయుతులు ముప్పవరపు వెంకయ్యానాయుడు, జస్టిస్ ఎన్.వి. రమణ ప్రభృతులు వ్రాసిన 20 వ్యాసాల సంకలనం ఇది – తప్పక అందరి దగ్గర ఉండదగినది – ప్రతి ఒక్కరూ చదవవలసినది.

*పేజీలు: 304, వెల: ₹ 300/– ప్రతులకు: విజేత బుక్స్, 24–14–45, 2వ అంతస్తు, సాయి రెసిడెన్సీ, కుందేటివారి స్ట్రీట్, బావాజీపేట, విజయవాడ–3. ఫోన్: 984 868 7652.*

**పుడమితల్లి నేస్తం:** గోటేటి లలితాశేఖర్. అనాదిగా వ్యవసాయమే మానవ నాగరికతకు మూలం,




శాస్త్రవిజ్ఞానంతో – శాస్త్రవేత్తలు అధిక దిగుబడి వచ్చే వరి వంగడాలను సృష్టించారు – ఫిలిప్పీన్స్ – థాయ్‌లాండ్ దేశాలలో ఎకరాకు వంద బస్తాలు పండించారు. అలాంటి కథే నెక్కంటి సుబ్బారావుది. అయ్యర్ 8 తో ఎకరాకు 45 బస్తాలు పండించి అప్పులు తీర్చుకున్న తీరు! ఇలాంటివే మరికొన్ని కథలతో లలితగారు ఈ 'పుడమితల్లి నేస్తం' కథాసంపుటి ప్రచురించారు.

*పేజీలు: 103, వెల: ₹ 100/– ప్రతులకు: అమరావతి పబ్లికేషన్స్, 4–21–81, చైతన్యపురి, సాయిబాబా రోడ్, గుంటూరు – 522 007. ఫోన్: 929 153 0714, ఫోన్: 040–23731620, 924 627 1620.*

**మహా చైతన్యం:** బత్తనపల్లి టి. మునిరత్నం రెడ్డి. 'మన సమస్యల ప్రతిబింబమే ఈ పుస్తకం' అంటారు




రచయిత. మానవీయ సంబంధాలు ఎలా నిలుపుకోవాలి, స్త్రీ–పురుష నైతిక ధర్మాల అవగాహన ఎలా ఉండాలి – రగిలే అగ్నిగుండం మనం బ్రతుకుతున్న సమాజం – దాన్ని ఎలా ఆర్పాలి – ఎన్నో విషయాలు చర్చించవలసినవి – తలుచుకోవటానికే భయపడుతున్న మనం – ఏ విధంగా సమస్యలను పరిష్కరించుకోవాలి – ఇవన్నీ చర్చించిన పుస్తకం ఇది. *పేజీలు: 278, వెల: ₹ 300/– ప్రతులకు: వంశీ బుక్‌స్టోర్స్, పాతపేట, పలమనేరు. పద్మజ బుక్ డిపో, తేరువీధి, పుంగనూరు.*

# మిసిమి

మాసపత్రిక

## మీరు చందాదారులుగా చేరండి　　బహుమతిగా పంపండి

*మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.*

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

**Scan QR to Pay**
Misimi Publication

## మిసిమి ప్రచురణలు


**నోబెల్ వ్యాసాలు**


**మిసిమి** పార్థసారథి వ్యాసాలు


**చిత్రకళా నీరాజనం**


**నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు**


**పురస్కార సాహిత్యం**


**వ్యాస మంజూష**


**సారస్వత వ్యాసాలు**


చార్లీ చాప్లిన్



**షెల్లీ జీవిత కథ**


దోసిట చినుకులు


**నృత్యభారతి**



పారిజాతం


**రజ్జు సర్పభ్రాంతి**


**బైరన్**


సిద్ధార్థ



సప్తపర్ణి

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.



**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**